ఇరవయవ జన్మదిన ప్రత్యేక సంచిక

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 20 సంచిక : 1 హైదరాబాద్ 242 జనవరి 2022 పేజీలు : 84 రు. 25

- రైతు ఉద్యమంపై నాలుగు వ్యాసాలు
- ఉత్తరాది రైతులకు కెసిఆర్ తాయిలాలు
- ఆంధ్రప్రదేశ్ రాజకీయాల దిగజారుడు
- దోవల్, రావత్, మిశ్రాల మాటలపై విమర్శ
- భారత అప్రజాస్వామిక చట్టాల చరిత్ర
- సామాజిక మార్పును విశ్లేషించడం ఎలా?
- జర్మనీ రాజకీయ పరిణామాలు

ఇరవయవ సంవత్సరంలో ప్రవేశిస్తున్న ..వీక్షణం

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు

2022 నూతన సంవత్సర శుభాకాంక్షలు

వీక్షణం జనవరి 2020 సంచికలో అచ్చయిన సి. వనజ వ్యాసం 'నిర్భయ నుంచి దిశ దాకా' లాడ్లీ మీడియా ప్రాంతీయ అవార్డు పొందిందని పాఠకులకు తెలుసు. అదే వ్యాసం, లాడ్లీ మీడియా జాతీయ అవార్డు కూడ పొందిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం - సం.

'Save Veekshanam' Campaign

వీక్షణంకు చేయూతనివ్వండి!

తెలుగు సమాజంలో రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణలో రెండు దశాబ్దాలుగా అసాధారణమైన కృషి చేస్తున్న మాసపత్రిక వీక్షణం ఆర్థిక పరిస్థితి ప్రమాదకరమైన స్థితికి చేరుకున్నది. కొవిడ్ లాక్ డౌన్ కు ముందు చందాల ద్వారా, పుస్తకాల అమ్మకాల ద్వారా, ప్రకటనల ద్వారా వచ్చిన ఆదాయానికి దాతల విరాళాలు జత కలిసి పత్రిక నడుస్తుండేది. ఏడాదిన్నరగా కొవిడ్‌తో జనజీవితమే సంక్షోభమయంగా ఉన్నందువల్ల చందాలు తగ్గిపోయాయి, పుస్తకాల అమ్మకాలు పూర్తిగా ఆగిపోయాయి, ప్రకటనలు రావడం లేదు. కేవలం దాతల విరాళాల మీదనే పత్రిక ఆధారపడవలసిన స్థితి వచ్చింది. ఏడాదిన్నరగా నెలకు యాభై వేల రూపాయల లోటుతో, అప్పులతో పత్రిక నడుస్తున్నది. ఇటువంటి స్థితిలో పత్రిక నడపలేమని నిర్వాహకులు భావిస్తున్నప్పటికీ, తెలుగు సమాజానికి ఇటువంటి ఆలోచనాస్ఫోరక పత్రిక చాల అవసరమని, ప్రస్తుత సంక్షోభ స్థితిలో ఆ అవసరం మరింత పెరుగుతున్నదని, పత్రికను ఎట్టి పరిస్థితిలోనూ ఆపగూడదని పాఠకులు, మిత్రులు, అభిమానులు కోరుతున్నారు. పందొమ్మిది సంవత్సరాలలో, 237 సంచికలలో, నాలుగున్నర వేల వ్యాసాలతో వీక్షణం ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ పరిణామాలెన్నిటినో విశ్లేషించి పాఠకుల అవగాహనలు పెరగడానికి తోడ్పడింది. ఆ మహత్తర కృషి ఆగిపోగూడదని మిత్రులు కోరుతున్నారు.

ఈ గడ్డు కాలాన్ని అధిగమించడానికి మరొకసారి మీదగ్గరికి రాక తప్పడం లేదు. మీరు ఇవ్వగలిగిన విరాళం ఎంతైనా సరే, వీక్షణం మనుగడకు అది ఉపయోగపడుతుంది. తెలుగు సమాజంలో ఒక అత్యవసరమైన ప్రయత్నానికి మీ వంతు చేయూత ఇవ్వండి. మీ వీలును బట్టి, మీ శక్తిని బట్టి మీ విరాళం ఎంత స్వల్పమైనా, ఎంత భూరి విరాళమైనా సరే. వీక్షణం మనుగడకు మీ చేయూతనివ్వండి. వీక్షణం చిరకాలం జీవించేందుకు తోడ్పడండి.

విరాళాలు పంపడానికి వివరాలు

వీక్షణం

చెక్/డిడి ద్వారా: వీక్షణం, జి1, మైత్రీ రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500029,
ఫోన్ : 73307 95849, ఇమెయిల్ : veekshanam2003@gmail.com,
www.veekshanam.wordpress.com

ఎలక్ట్రానిక్ ట్రాన్స్ ఫర్ ద్వారా:

Veekshanam,
Account No. 013911011002175,
Union Bank of India, Gagan Mahal Brach, Hyderabad.
IFSC Code: UBIN0801399

ఈ అకౌంట్ నంబర్‌తో ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్‌తో పాటు
గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల ద్వారా కూడా చెల్లించవచ్చు.

242 ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

జనవరి 2022
సంపుటి : 20
సంచిక : 01

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 7330795849
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : నవ్య ప్రింటర్స్
అంబర్‌పేట్, హైదరాబాద్.

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్–**013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **IFSC code NO:UBIN0801399** నెంబర్‌తో పాటు మీ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన బి. ప్రవీణ్, జనగాం – రు. 1,000; కందిమల్ల శివప్రసాద్, గుంటూరు – రు. 1,000; వై. రాజేశ్వరి, నెల్లూరు – రు. 10,000; ఎ. శ్రీనివాస్ రెడ్డి (డిటిఎఫ్), కరీంనగర్ – రు. 10,000; ఎస్.పి. మోహన్‌రావు, విజయవాడ – రు. 5,000; మిత్రులకు కృతజ్ఞతలు – సం.

అక్టోబర్ 2021 వీక్షణం పత్రికలో డా. రామనాథం గారి జీవితం, పౌరహక్కులకు ఆయన చేసిన త్యాగాన్ని గూర్చి ఎన్. నారాయణరావు గారి వ్యాసాన్ని చదివాను. నేను చిన్నతనంలో మా గ్రామానికి చెందిన డా. రామనాథం గారిని స్ఫూర్తిగా తీసుకొని నా ఉద్యోగ ధర్మంలో కూడా ఆయన లాగ సాదా సీదాగా వ్యవహరించే తత్వం పాటించాను.

మాది ఖమ్మం జిల్లా, మదిర తాలూకలోని ముష్టికుంట్ల గ్రామం. డా. రామనాథం గారిది ఉన్నత కుటుంబమే. వారి కుటుంబంలో నలుగురు అన్నదమ్ములలో రామనాథం గారు చిన్నతనం నుండి చదువులో చురుకైనవారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదివారు. మొదటి నుండి వామపక్ష భావజాలం కలిగిన వ్యక్తి. తెలంగాణ రైతాంగ పోరాటంలో మా గ్రామం విప్లవ కేంద్రంగా ఉండేది. ఆ సమయంలో చాలా మంది యువకులు రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. కృష్ణా జిల్లా సరిహద్దు గ్రామం కావడం వల్ల దళాలు రక్షణ తీసుకోవడానికి ఆంధ్రా ప్రాంతంలో నిర్వహించే క్యాంపులకు వెళ్లడానికి అనుకూలంగా ఉండేది.

డా. రామనాథం గారు ఎప్పుడైనా మా గ్రామంలోని ఆయన ఇంటికి వచ్చిన సందర్భంలో చంటి పిల్లలను తీసుకొని డాక్టర్ గారి వద్దకు వచ్చి క్యూలో ఉండేవారు. అందరికి ఫ్రీగా వైద్యంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చేవారు. నిజమైన ప్రజా డాక్టర్‌గా పేరు పొందారు. మా గ్రామంలో మొదటి డాక్టర్ రామనాథం గారు. వారి కుటుంబంలోని అన్నదమ్ములలో మూడవ వాడు. పిల్లలు లేనందున వారి తమ్ముని కుమారుణ్ని పెంచుకున్నారు.

1985 సెప్టెంబర్ 3న కాకరవాయి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రోజు సాయంత్రం ప్రాంతీయ వార్తలు వింటున్న సమయంలో వరంగల్‌లో డా. రామనాథం గారిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపినట్లు పిడుగు పాటు వార్త విన్నాను. ప్రజాసేవ చేయవలసిన వ్యక్తిని రాజ్యం పాశవికంగా హత్య గావించడంతో దిగ్భ్రాంతికి గురయ్యాను. కాకరవాయిలో డాక్టర్ గారి బంధువులు ఉంటే వాళ్లకు కూడా విషయాన్ని చెప్పాను. సి.ఐ. యాదగిరిరెడ్డి హత్యకు బదులు తీర్చుకొన్నట్లు పోలీస్ వర్గాలు ప్రచారం చేశాయి.

వరంగల్‌లోని జె.పి.యన్. రోడ్‌లో గల రామనాథం దవాఖానా ముందు నుంచి యాదగిరిరెడ్డి శవాన్ని ఊరేగిస్తూ పోలీసులు ర్యాలీ చేస్తున్న సమయంలో డాక్టర్ గారు పేషెంట్లను చూస్తూ ఆసుపత్రిలో ఉన్నారు. ఆ సమయంలో సివిల్ డ్రస్‌లో వచ్చిన పోలీసులు డాక్టర్ గారిని చంపి ర్యాలీలో కలిసి వెళ్లిపోయారు. మా సోదరుడు లక్ష్మీనారాయణ డాక్టరు గారి వద్ద కాంపౌండరుగా పనిచేస్తూ ఉండేవాడు. ఆ సమయంలో మా సోదరుడు ఒక ఇంట్లో ఇంజెక్షన్ చేయడానికి బయటకు వెళ్లినాడు. ఉన్నట్లయితే ఆయనను కూడా వచ్చిన వాళ్లు చంపేవాళ్లే.

మా గ్రామంలో ప్రజల కోసం పనిచేసి అమరులైనవారు ఇద్దరు. వారిలో మొదటి వారు కామ్రేడ్ జక్కా తిరుపతయ్య (పెదగోపన్న). 1969లో దేశవ్యాప్తంగా యువతరాన్ని నక్సల్‌బరీ పోరాటంలో గోదావరి లోయ రైతాంగ పోరాటంలో పాల్గొని పగిడేరులో పోలీస్ కాల్పుల్లో మరణించాడు. ఈ సందర్భంగా ఆయనను గుర్తుచేసుకుంటున్నాను.

రెండవ వ్యక్తి అమరుడు డా. రామనాథం గారు. హక్కుల ఉద్యమంలో ఒక మహోన్నత వ్యక్తిగా పేరు పొందినారు. వీరిద్దరికి నా విప్లవాభి వందనాలు. నా చిన్నతనం నుండి వీరిద్దరు నాకు స్ఫూర్తి. సామ్యవాద రాజ్యం రావాలంటే పోరాటం చేయక తప్పదు

– సి. బాబూరావు
ఖమ్మం

పత్రికలో వచ్చే అద్భుతమైన వ్యాసాలు సమాజంలో జరుగుతున్న సంఘటనలు వాటి వెనక శక్తుల పాత్రలు ప్రజాస్వామిక దృక్పథంతో వివరిస్తాయి. పెద్దఎత్తున బడా వ్యాపార వర్గాలూ తమ తమ ప్రయోజనాల కోసం కలబడుతున్న నేపథ్యంలో ఈ ప్రయోజన వాద శక్తుల మధ్య అనేక రకరకాల ఘర్షణలు వివాదాలుగా ముందుకొస్తున్నాయి. విభిన్న పెత్తందారీ శక్తుల సంఘర్షణలు చెప్పాల్సినట్టు చెప్పే పత్రిక వీక్షణం. ప్రజల ప్రయోజనాలతో సంబంధం లేని, ప్రజల సమస్యలు పట్టించుకోని కేంద్ర, రాష్ట్రాల పాలకులు తమ రాజకీయ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ఘర్షణ పడటం కనిపిస్తుంది. స్వార్థ రాజకీయ శక్తుల ప్రయోజనాలకే ప్రారంభమైన కొన్ని మీడియా సంస్థలు కేంద్ర, రాష్ట్రాలలో తమ తమ ప్రయోజనాల రీత్యా అటు ఇటు కొమ్ము కాస్తూ ప్రజల సమస్యల విషయంలో చూపాల్సిన శ్రద్ధ చూపట్లేదనీ, కేవలం బడా ప్రయోజన వాద శక్తుల వ్యవహారాలకే ప్రాముఖ్యత నివ్వడం కనిపించింది. పత్రికల నిండా ప్రతి రోజూ వరుసగా వచ్చిన సంఘటనలన్నీ కలిపి చూస్తే ఈ డ్రగ్స్ కేసుల విషయంలో రాజ్య యంత్రాంగాలు తాము వారు ఎంత పెత్తందారీ శక్తులైనా చట్టానికి పని చెప్తామనే భ్రమ కల్పించడానికి ఎత్తుకుంటే ప్రజల మౌలిక సమస్యలను ఒక పథకం ప్రకారం పక్కదోవ పట్టించే కోణమూ ఉంది. ఈ పెత్తందారీ శక్తుల వివాదం చుట్టూ వార్తలు, విశేషాలతో కొన్ని పత్రికలు, తమ పేజీలతో నింపుతూ పోతున్నాయి. దేశంలోని సినీ వ్యాపార శక్తుల సమర్థకులు రాష్ట్ర ప్రభుత్వాలలో తమ వంతు పాత్ర నిర్వహించి ప్రభుత్వంలో ప్రజల ప్రతినిధులా లేక వ్యాపార సినీ వర్గాల ప్రతినిధులా అనేట్టుగా తమ బండారం బైట పెట్టుకున్నారు. రాజ్య వ్యవస్థ యంత్రాంగంలో లాలూచీలు ఏవో అసలు కేసు ఏదో తెలియనంతగా సాగిన ఈ కేసు దేశంలోని ప్రభావశీల బడా సినీ పెత్తందారీ శక్తులైనా, మరో బడా వ్యాపార సంస్థలైనా నేరమయ కార్యకలాపాలలో యథేచ్ఛగా పాల్గొంటూ మొత్తం రాజ్య యంత్రాంగ, న్యాయ వ్యవస్థలను తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకోగలరనే

(మిగతా 39వ పేజీలో)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

అపసవ్యపు ఎన్నికలను ఇంకా అపహాస్యం చేసే చట్టం

భారత పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థ దానికదే ఒక వికృత వస్తువు. ఏడు దశాబ్దాల ఎన్నికల రాజకీయాలు దాన్ని మరింత అష్టావక్రంగా మార్చి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అనే మాటే అవమానపడే స్థాయికి దిగజార్చాయి. ఇప్పుడిక సంఘ్ పరివార్ పాలకులు డిసెంబర్ 20న ప్రవేశపెట్టిన ఎన్నికల చట్టాల (సవరణ) బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది, చట్టంగా మారడంతో దేశంలో ఎన్నికల వ్యవస్థ అర్థమే మారిపోనున్నది. వోటర్ గోప్యత అనే మౌలిక సూత్రం రద్దయిపోయి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నామమాత్రం అయిపోనున్నది. ఇప్పటివరకూ ఎన్నో సవరణలతో అమలులో ఉన్న ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950, 1951 అనే రెండు చట్టాలలో మౌలిక సవరణలు చేయడానికి ప్రస్తుత చట్టం ఉద్దేశిస్తున్నది. వీటిలో మొదటి చట్టం ఎన్నికల స్థానాల కేటాయింపు, నియోజకవర్గాల పరిధి, వోటర్ల అర్హతలు, వోటర్ల జాబితాల తయారీకి సంబంధించినది కాగా, రెండో చట్టం ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నేరాలు, ఎన్నికల వివాదాలకు సంబంధించినది. మొదటి చట్టం ప్రకారం వోటర్ గా నమోదు చేసుకోవడానికి పౌరులందరికీ అర్హత ఉండగా, ప్రస్తుతం చేసిన సవరణ ప్రకారం వోటర్‌గా నమోదు చేయించుకోవడానికీ, వోటర్ల జాబితాలో ఉన్న పేరు ధ్రువీకరించడానికీ, కొనసాగడానికీ ఆధార్ నంబర్ ను తప్పనిసరి చేస్తున్నది. గతంలో ఏడాదికి ఒకసారి మాత్రమే (జనవరి 1న) వోటర్ల నమోదు ప్రక్రియ ఉండగా, ప్రస్తుత సవరణ దాన్ని ఏడాదికి నాలుగు సార్లుగా మారుస్తున్నది. అలాగే ఎన్నికల నిర్వహణ సమయంలో వినియోగించే స్థలాలకు సంబంధించి, సైనిక కుటుంబాల నమోదుకు సంబంధించి 1951 చట్టానికి కూడ కొన్ని సాంకేతిక సవరణలు చేశారు.

ఆ సాంకేతిక సవరణలు ఎలా ఉన్నా, ఆధార్ నంబర్ ను తప్పనిసరి చేయడం చాల వివాదాస్పదమైనది, అభ్యంతరకరమైనది. డూప్లికేట్ వోటర్ల సమస్యను పరిష్కరించడానికే ఈ అనుసంధానాన్ని ప్రతిపాదిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నది గాని, అది కేవలం సాకు మాత్రమే. డూప్లికేట్ వోటర్ సమస్యను, రిగ్గింగ్ ను, వోటింగ్ అక్రమాలను సృష్టించి, పెంచి పోషిస్తున్నదే రాజకీయ పార్టీలు. ఆ సమస్యల పరిష్కారానికి అనుసరించవలసిన పద్ధతులు వేరు. వోటర్ కార్డ్ – ఆధార్ కార్డ్ అనుసంధానం వల్ల అర్హులైన వోటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడానికి, వోటర్ల జాబితాను ఇష్టారాజ్యంగా మార్చడానికి అవకాశం వస్తుంది. అధికారంలో ఉన్న ప్రభుత్వం గాని, అధికారులు గాని ఈ రెండిటి అనుసంధానాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రమాదం ఉంది. అటు ఆధార్ జాబితా గాని, ఇటు వోటర్ జాబితా గాని లోపభరితంగా ఉన్నాయి గనుక, రెండిటి అనుసంధానం మరింత గందరగోళానికి దారి తీస్తుంది. ప్రధానంగా వోటర్ గోప్యతను భంగపరుస్తుంది. రహస్య వోటింగ్ పద్ధతికి తూట్లు పొడిచి, ఏ వోటర్ ఎవరికి వోటు వేశారో తెలుసుకోవడానికి, ఎన్నికైన ప్రభుత్వాలు ఆ సమాచారాన్ని వాడుకుని తమకు వోటు వెయ్యని వారిమీద కక్ష సాధింపు జరపడానికి అవకాశం వస్తుంది. వోటర్ కార్డునూ ఆధార్ కార్డునూ అనుసంధానం చేయాలనే ప్రయత్నం మోడీ ప్రభుత్వ మొదటి విడతలోనే ఎన్నికల కమిషన్ ద్వారా ప్రారంభమై, సుప్రీంకోర్టు జోక్యం వల్ల కొన్ని నెలల్లోనే ఆగిపోయింది. అయితే సుప్రీంకోర్టు తీర్పు రాకముందే చాల రాష్ట్రాల్లో ఆ అనుసంధానం పని మొదలైపోయింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనే కనీసం 55 లక్షల మంది వోటర్ల పేర్లను ఆధార్ నంబర్ లేదనే సాకుతో తొలగించారని, 2018 ఎన్నికల మీద ఆ తొలగింపు ప్రభావం ఉందని విమర్శలున్నాయి. ఆ ఎన్నికల్లో చాల మందికి తమ పేరు వోటర్ జాబితా నుంచి తొలగించబడిందని పోలింగ్ బూత్ కు వెళ్లినప్పుడు గాని తెలియలేదు. అప్పటికప్పుడు వారు వోటు వేయదలచుకుంటే కూడ చేయగలిగింది లేదు. సుప్రీంకోర్టు తీర్పును పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ అదే అనుసంధానానికి ప్రయత్నించడం ఇటువంటి రాజకీయ ప్రయోజనాలు ఉన్నందువల్లనే. ఈ అనుసంధానంతో తలెత్తగల సమస్యల దృష్ట్యానైనా, సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యానైనా ప్రస్తుత సవరణ బిల్లు అభ్యంతరకరమైనది. కాని సంఘ్ పరివార్ శక్తుల దూకుడు వల్ల ఆ బిల్లు చట్టంగా కూడ మారిపోయింది.

అయితే ఈ ఎన్నికల చట్టాల సవరణల, "ఎన్నికల సంస్కరణల" సమస్య, కనబడుతున్న కారణాల కన్న, వివాదాల కన్న మరింత లోతైనది. అసలు దేశంలో పార్లమెంటరీ, ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికి లోకి రావడమే అపసవ్యమైన మార్గంలో వచ్చింది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం, ఒక మనిషికి ఒక వోటు, పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయవ్యవస్థ వంటి పార్లమెంటరీ వ్యవస్థలన్నీ యూరప్‌లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల ఫలితంగా, రెండు మూడు శతాబ్దాలు ఆ సమాజాలు కళపెళ ఉడికిన చరిత్ర నుంచి ఆవిర్భవించినవి. ఆ సమాజ మథనంలోంచి మనిషి వ్యక్తిగా రూపొందిన ఫలితంగా వ్యక్తి స్వేచ్ఛ, ఒక మనిషికి ఒక వోటు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అటువంటి సామాజిక సంచలనం ఏదీ లేకుండా భారత సమాజంలోకి బ్రిటిష్ వలసవాదం పార్లమెంటరీ సంస్థలను తీసుకొచ్చి, అంటుకట్టింది. ఈ అంటుకట్టిన మొక్క ఇక్కడి నేలలో పుట్టి, ఇక్కడి వాతావరణంలో ధక్కామొక్కీలు తిని ఎదిగి వచ్చినది కాదు. ఇది బోన్సాయి ప్రజాస్వామ్యం. కుండీలో మొక్క. ఇది పూలు పూయదు, కాయలు కాయదు. దీని ఆకుల మీద నీళ్లు చిలకరించి నిగనిగలాడేట్టు చేసినా, ప్లాస్టిక్ పూలు అలంకరించినా, కుక్కమూతి పిందెలనే కాయలని భ్రమింపజేసినా, ప్రజలకు దక్కేది ప్రజాస్వామ్య పాలనా ఫలితాలు కావు. ఐదేళ్లకొకసారి క్రమం తప్పకుండా ఎన్నికలు జరిపించినంత మాత్రాన, ఆ ఎన్నికల విధానానికి సవరణలు చేస్తున్నామని అతుకులూ మాట్లూ అలంకరణలూ చేసినంత మాత్రాన ఇది రూపంలో పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమే తప్ప, సారంలో ఈ దేశ ప్రజలకు అవసరమైన, ఈ దేశ ప్రజా ప్రయోజనాలను తీర్చే ప్రజాస్వామ్యం కాజాలదు. అందులోనూ అసలు ఎన్నికలు అనే ప్రహసనాన్ని కూడ అంగీకరించని, నిరంకుశ, మతోన్మాద, విద్వేష పాలనను కోరుకునే హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు పాలకులు ఎన్నికల వ్యవస్థను కనీసంగా కూడ సంస్కరించజాలరు. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనే ఆలోచనకే వాళ్లు వ్యతిరేకం. ఈ స్థితిలో ఇటు ఎన్నికల సంస్కరణల పేరు మీద సాగుతున్న ఈ బూటకాన్ని మాత్రమే కాక, అసలు ఎన్నికల, పార్లమెంటరీ ప్రజాస్వామ్య బూటకాన్ని కూడ ప్రజల్లో వివరించే బాధ్యత చేపట్టడమే బుద్ధిజీవుల కర్తవ్యం. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

తోడుదొంగల ఉల్లెక్కాల కొట్లాట!

అబ్బ, ఏం జోర్ దార్, షాన్ దార్ కొట్లాట అయితాంది. ఇటు గల్లీల్ల, అటు పట్నంల, అటెన్క ఢిల్లిల, యాడ జూశినా ఢిష్షుం ఢిష్షుం అని సీన్మల లెక్క కొట్లాట అయితాంది గద. అక్బార్లల్ల, టీవీల్లల్ల మస్తు దిట్టుకుంటాండ్రట గద. మా దెగ్గర అన్ని మతలబులు ఉన్నయి, ఇగ గిరఫ్తారు జేసుడే అని ఒగలు, ఇగ విద్దమే అని ఇంకొగలు, తొడ గొట్టెటోల్లు ఒగలు, రా సూస్కుందాం అనెటోల్లు ఇంకొగలు, తిట్లు సాపెన్లు మస్తుగ నడుత్తానయి గద. శాన పంచాతులల్ల జూశిన, గిదే కత. అసలు కొట్లాట ఎట్ల సురువయిందో కొట్లాడెటోల్లు మరిశిపోతరు, సూశెటోల్లకైతె గది ఒక సంబురమేనాయె, ఎందుకు గొట్టుకుంటాండ్లో ఎవలకు పడ్తది? వడ్లు గొంటరా కొనరా అని శిమాంట మొదలైందట గాదు పంచాతి. గిప్పుడు వడ్ల సంగతి ఎత్తెటోడె లేడు. పాపం రైతులు పిడాత సావబట్టిరి, ఎవడు గొంటడో రామశెంద్ర అని ఏడువబట్టిరి, మీ కొట్లాట అయితెమాయె గని మా వడ్లు గొనే సౌలత్ జూడుండ్రి బాంచెన్ అని తీరొక్క దేవుల్లకు మొక్కబట్టిరి. దున్నపోతుల కొట్లాటల ల్యాగదూడల కాళ్లిరిగినట్టు, పాపం అరిగోసలు పడి వడ్లు పండిచ్చిన రైతుల నడ్డి ఇరిగిపోబట్టె. వచ్చే ఏడు యాసంగిల ఏమైతే అదాయె గని, గిప్పుడు గొనవల్శినయి గుడ ఆగిపోవట్టె. అసలు గిది నిజంగ కొట్లాటేనా అని అనుమానం రాబట్టె. శిన్నప్పుడు మా బడి ముంగట పాములాడిచ్చెటోడు, ఇగొ ముంగిసకు పాముకు కొట్లాట పెడ్త, ముంగిసతోటి పాము బొండిగ కటిక్కుల కొరికిపిస్త అని బుడబుక్కలు గొట్టి మమ్ములను నిలబెట్టేటోడు. ఇగ జేస్తడా, అగ జేస్తడా అని మేం శాన సేపు గాడనే నిలబడెటోల్లం. బుట్టిల నుంచి పాము దియ్యడు, ముంగిసను ఇడిశిపెట్టడు. సూశి సూశి కాల్లు గుంజి, కడుపుల ఆకలై ఇంటికి ఉర్కుతుంటిమి. ఏమైందో ముంగిస ఎల్లిందో, పాము బొండిగ పిశికిందో అని మస్తు రంది ఉండె. తెల్లారి బోతె మల్ల గదే కత. గట్ల మాకెర్కయ్యేది గదంత ఉల్లెక్కాల కొట్లాటని. గిప్పుడు పువ్వు గుర్తోల్లకు దొరకు కొట్లాట గట్లనే ఉన్నది. మస్తు మస్తు ఎగురుతాండ్రు గని ఊదు గాల్త లేదు, పీరి లేస్త లేదు. నిలబడి నిలబడి సూశి సూశి యాష్టకొస్తాంది. మారె, ఇది కొట్లాటే గాదు, ఇదంత ఉల్లెక్కాల, నువ్వు కొట్టినట్టు జెయ్యి, నేను ఏడ్శినట్టు జేత్త అని ఇద్దరు పదులుకొనే నడిపిత్తాండ్లు ఈ ఆట అని పదుసుపోరలు అనబట్టిరి. ఇద్దరు తోడు దొంగలే అని ఏడేండ్ల ఇసాబ్ జెప్పబట్టిరి. దొర ఎన్నడన్న పువ్వు గుర్తోల్లకు అడ్డమొచ్చెనా, పువ్వు గుర్తోల్లు ఎన్నడన్న దొర మీద మాటలు గాకుండ శేతలకు దిగిరా అని అడగబట్టిరి. నివద్దె. ఏడేండ్లల్ల పువ్వు గుర్తోల్లను ఇరుకున బెట్టుటానికి దొరకు ఎన్నిసార్లు మోఖ దొరకలే, దొర ఒక్కసారన్న వాడుకున్నడా? మీదికెల్లి, ఉరికురికి వాల్లకు మద్దతిచ్చె. ఇగ పువ్వు గుర్తోల్లు గీడ తెలంగాన్ల దొర మీద బగ్గ మాట్లాడబట్టిరి గని ఢిల్లిల సప్పుడు జెయ్యకపాయిరి. గిప్పుడు ఆడ గుడ ఎగురబట్టిరి గని మాటలు కోటలు దాటుతానయి గని, అడుగులు కడ్పులు దాటుత లెవ్వాయె. ఈ ఉల్లెక్కాల కొట్లాట ఎంత బగ్గ జరిగితే అంత ఫాయిదా, అసలు తెలంగానోల్ల గోస ఇనబడకుండ బోతది. అబ్బ, ఏం ఇకుమతి!, తోడు దొంగలు గల్శి మస్తు ఉపాయం బన్నిండ్రులే... వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్


సినిమా పరిశ్రమకూ ప్రభుత్వానికీ ఘర్షణ


"...తన ఆర్థిక, సామాజిక బాధ్యతలను వదులుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న ప్రభుత్వం సినిమా టికెట్ల అమ్మకం వంటి తనకు పెద్దగా అవసరం లేని రంగంలోకి ప్రవేశించడం ఆశ్చర్యాలలోకెల్లా ఆశ్చర్యం....రాష్ట్రంలోని సినిమాహాళ్లన్నీ లీజ్ రూపంలో మూడు నాలుగు కుటుంబాల చేతుల్లోనే ఉన్నాయని, ఇక్కడ విపరీతమైన నల్లధనం పోగవుతున్నదని, ఈ చర్య దాన్ని అరికట్టడానికి ఉద్దేశించినది కావచ్చునని ఒక వాదన వినిపిస్తున్నది. అది వాస్తవమే అయినప్పటికీ, ఈ చర్య ద్వారా సాధించగలిగినదేమీ ఉండదు....అసలు ఇటువంటి విధానం ఎందుకు అనే దగ్గరి నుంచి దీనివల్ల ఏమి సాధించగలరు అనే వరకు అనేక అనుమానాలకు మాత్రం ఆస్కారం ఉంది" అని అప్పటికి వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల మీద అక్టోబర్ సంచికలో వ్యాఖ్యానించాం. మూడు నెలలు గడిచిన తర్వాత కూడ ఈ విషయంలో స్పష్టత రాలేదు సరిగదా, మొత్తంగా సినిమా పరిశ్రమకూ ప్రభుత్వానికీ మధ్య ఘర్షణ వాతావరణం మరింత పెరిగి, ఆంధ్రప్రదేశ్ లో సాగుతున్న అస్తవ్యస్త పాలన స్థితికి అద్దం పడుతున్నది. సినిమా టికెట్ల ధరల గురించి ప్రభుత్వ ఉత్తర్వులను సినిమా థియేటర్ యజమానులు న్యాయస్థానంలో సవాల్ చేయగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ జి.వో.ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. ఈ మధ్యలో రాష్ట్ర శాసనసభ ఆన్ లైన్ సినిమా టికెట్ల పద్ధతిపై రాష్ట్రప్రభుత్వ అజమాయిషీ గురించి ఒక చట్టమే చేసింది. సినిమా థియేటర్లు భారీ బడ్జెట్ సినిమా టికెట్లకు విపరీతమైన ధరలు పెడుతున్నాయని, ప్రేక్షకులను ఈ దోపిడీ నుంచి రక్షించడమే తమ ఉద్దేశమని ప్రభుత్వ పెద్దలు అంటున్నారు. సాధారణంగా క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకూ సెలవు రోజుల్లో, పండుగ రోజుల్లో సినిమాలు విడుదల చేసి, భారీగా రాబడి ఆశించే భారీ బడ్జెట్ సినిమా నిర్మాతలు కొత్త ప్రభుత్వాజ్ఞతో ఇబ్బందిలో పడ్డారు. హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు వారికి కాస్త ఊరట కలిగించవచ్చు గాని ప్రభుత్వం థియేటర్లను జప్తు చేయడం వంటి నిర్బంధ చర్యలు కూడ ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ సమాజంలో ఏకైక వినోదంగా సినిమాల పట్ల ఉన్న అభిమానం, సినిమానటుల పట్ల ఉన్న మోజు, సినిమారంగంపై కొన్ని కులాల, కొన్ని కుటుంబాల పెత్తనం, మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా థియేటర్ల లీజులో, యాజమాన్యంలో గుత్తాధిపత్యం, వేల కోట్ల రూపాయలు చేతులు మారుతున్న భారీ పరిశ్రమగా సినిమా నిర్మాణం వంటి అనేక కారణాల రీత్యా చర్చలతో, సంప్రదింపులతో సామరస్యంగా పరిష్కారం కావలసిన ఈ సమస్య చిలికి చిలికి గాలివాన అవుతున్నది. తప్పనిసరిగా సినిమా పరిశ్రమ పేరు మీద ప్రేక్షకులపై జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయవలసిందే. అయితే అది ఎక్కడ ఎట్లా ప్రారంభించడం ఉచితం అనే ప్రశ్న కీలకమైనది. సినిమా పరిశ్రమ ఒక కొసన నిర్మాణ వ్యవహారాలు ఉండగా, మరొక కొసన ప్రదర్శనా వ్యవహారాలు ఉంటాయి. ఇవి రెండూ పరస్పర సంబంధంలో ఉన్నవే అయినప్పటికీ, ప్రధానమైనది నిర్మాణమే. అక్కడ నటుల భారీ పారితోషికాలు, వాటికి లెక్కలేనితనం, నిర్మాణ బడ్జెట్లు పెరిగిపోవడం, సినిమా నిర్మాణంలో అక్రమ ధనం ప్రవేశం, కొన్ని కుటుంబాల గుత్తాధిపత్యం వంటి పరిణామాలు ఈ కళను పూర్తిగా వ్యాపారమయం చేశాయి. ప్రభుత్వ చర్యలు ఈ కొసన మొదలై, ఒక క్రమంలో ప్రదర్శన కొసకు చేరాలి. కాని ప్రస్తుతం ప్రభుత్వం భారీ పెట్టుబడిని ముట్టుకోకుండా, బహుశా మరే కారణాల కోసమో దాన్ని బెదిరింపులకు మాత్రం గురిచేస్తూ, ప్రదర్శన కొస మీద కొరడా ఝుళిపిస్తున్నది. ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి, జోక్యం చేసుకుని, సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని సాధించవలసిన బాధ్యత పౌరసమాజం పైనే ఉంది. వీ

చిలే అధ్యక్ష పీఠంపై వామపక్ష విద్యార్థి నేత

- ఎ. నర్సింహారెడ్డి

దక్షిణ అమెరికా పశ్చిమ ప్రాంతంలో ఉన్న చిలే దేశానికి 2021 డిసెంబర్ 19 ఓ చారిత్రాత్మక రోజు. చిలే అధ్యక్ష ఎన్నికల్లో మితవాద అధికార కూటమిపై వామపక్ష కూటమి అభ్యర్థి విద్యార్థి ఉద్యమ నేత ముప్పై ఐదేళ్ల గాబ్రియేల్ బోరిక్ పిన్న వయస్సులోనే చిలే అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన రోజు. నియంత జనరల్ పినోషెట్ 18 ఏళ్ల నిరంకుశ పాలన, తర్వాతి పాలన చేదు అనుభవాన్ని పాతిపెట్టాలని దృఢంగా నిశ్చయించుకున్న రాడికల్ విద్యార్థి ఉద్యమ నాయకుడు బోరిక్. 2011లో చిలే దక్షిణ ప్రాంతంలోని మగల్లాన్స్ ఏరియాలో జరిగిన విద్యార్థి ఉద్యమాలలో ఆయన ప్రముఖ నాయకుడుగా ఎదిగాడు. చిలే విశ్వవిద్యాలయంలో విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. దశాబ్ది కాలంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించాడు. 2017లో వామపక్ష పార్టీలతో కూడిన విశాల ఫ్రంట్‌ను ఏర్పాటు చేశాడు. 1973లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సామ్యవాది సాల్వెడార్ అయెండె ప్రభుత్వాన్ని అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతుతో జనరల్ పినోషెట్ సైనిక కుట్ర ద్వారా కూల్చివేసిన 48 ఏళ్లకు మళ్లీ ఒక ఉదారవాద సోషలిస్టు అధికారంలోకి రావడం మంచి పరిణామం. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం, ఇటీవల వచ్చిన కరోనా విపత్తును ఎదుర్కోవడంలో పినెరో ప్రభుత్వ వైఫల్యం ప్రజల్లో అసంతృప్తికి ఆజ్యం పోశాయి. ప్రపంచీకరణ విధానాలు పేదరికాన్ని, నిరుద్యోగాన్ని పెంచాయి. ఈ క్రమంలోనే 2018లో పినెరో ప్రభుత్వం పెంచిన మెట్రో చార్జీలను తగ్గించాలంటూ ఆరంభమైన ప్రజా ఉద్యమం రాజ్యాంగాన్ని తిరగ రాయాలన్న పోరాటంగా రూపు దాల్చింది. పినోషెట్ కాలంలో రూపొందించిన పెట్టుబడిదారీ అనుకూల రాజ్యాంగం స్థానంలో పేదల పక్షపాతిగా ఉండే రాజ్యాంగం కావాలని చిలే ప్రజలు కోరుకుంటున్నారు. పినోషెట్ నియంతృత్వ పాలనలో చిలే అల్లాడి పోయింది. అనంతరం ఎవరు అధికారంలోకి వచ్చినా అదే విధానాలతో శత కోటీశ్వర్లను సృష్టిస్తూ అసమానతలు పెంచారు. విద్య, వైద్యం ఖరీదయ్యాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగి సామాజిక భద్రత కరువైన స్థితిలో రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థల సమూలమైన మార్పులతో తప్ప తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులు మారవని వారు గుర్తించారు. ఆర్నెల్ల క్రితం రాజ్యాంగ రచనా పరిషత్ కోసం జరిగిన ఎన్నికల్లో ప్రజలు మితవాదులకు చోటివ్వలేదు. రాజ్యాంగ పరిషత్‌తో పాటు, గవర్నర్లు, కౌన్సిల్ సభ్యుల ఎంపికలో సైతంవారు మితవాదులను దూరం పెట్టి నూతన రాజ్యాంగం ఏ విధంగా ఉండాలని ఆశిస్తున్నారో ఎన్నికల్లో స్పష్టం చేశారు. చిలే అధ్యక్ష ఎన్నికల ఫలితాల అనంతరం బోరిక్ చేసిన తొలి ప్రసంగంలో పినోషెట్ ప్రవేశపెట్టిన పెట్టుబడిదారీ అనుకూల విధానాలను భూస్థాపితం చేసి, సామాజిక సంక్షేమ రాజ్యం స్థాపిస్తానని ప్రతిన బూనారు. కార్మికులకు, సామాన్యులకు పెన్షన్, ఆరోగ్య భద్రత పెంపు, పని గంటల తగ్గింపు, పౌర హక్కుల పరిరక్షణ, పర్యావరణ అనుకూల పెట్టుబడులకు పెద్ద పీట వేస్తానని హామీ ఇచ్చారు. మూలవాసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం, మహిళలకు సమాన పనికి సమాన వేతనం వంటివి తీసుకొస్తానని చెప్పారు. చిలే ప్రజలు ఎంచుకున్న మార్గం ప్రపంచ దేశాల, ప్రత్యేకించి లాటిన్ అమెరికా దేశాల ప్రజా ఉద్యమాలకు ప్రేరణనిస్తుంది. వీ







❖ **నాది దుఃఖం వీడని దేశం** – కవిత్వం – హనీఫ్ – ఆసిఫ్ ప్రచురణలు – 122 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: హనీఫ్, ఫోన్ : 9848254745, నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్, నవతెలంగాణ బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో




❖ **మౌనంగానే మాట్లాడుతున్న** – కవిత్వం – సియ్యార్కే – సిక్కోలు బుక్ ట్రస్ట్ ప్రచురణ – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు: సిక్కోలు బుక్ ట్రస్ట్, శ్రీకాకుళం – 532001, ఫోన్ : 9989265444



❖ **జీవన హిందోళం –** అవధాన శశాంక–ఆశు కవితాకేసరి – గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహశర్మ గారి జీవితం – అవధానం – డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి – ప్రసన్న శివానంద ప్రచురణలు – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 58, ప్రతులకు: ప్రసన్న శివానంద ప్రచురణలు, ప్లాట్ నెం. 20, ఇ.నెం. 6–242/6, ఎం.ఎన్. రెడ్డి నగర్, సుచిత్ర సర్కిల్ దగ్గర, కుత్బుల్లాపూర్ సికిందరాబాద్ – 500055, ఫోన్ : 9866917227




❖ **ధార** – సాహితీ వ్యాసాలు – డా. బన్న అయిలయ్య – నా నీ ప్రచురణలు – 222 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: శ్రీమతి. కె. విజయ, ఇ.నెం. 2–7–1261/1, రాజగృహం, విజయపాల్ కాలనీ, వడ్డెపల్లి, వరంగల్ – 506370, ఫోన్ : 96183 40431



❖ **జక్కులు** – దళిత నవల – డా. మంథని శంకర్ – ప్రాగ్మా పబ్లికేషన్స్ ప్రచురణలు – 188 పేజీలు, 1/8 డెమీ, రు. 299, ప్రతులకు: డా. మంథని శంకర్, లెక్చరర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ – 506001, ఫోన్ : 08374354873




❖ **గతించిన రోజులు** – ఎం.వి. రమణారెడ్డి ఆత్మకథ – మానవ వికాస వేదిక ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: మానవ వికాస వేదిక, ఫోన్ : 9010744999, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్




❖ **ఎనుములు మానవ సంబంధాలు** – కథలు – సడ్లపల్లె చిదంబరరెడ్డి – తపన సాహిత్య వేదిక ప్రచురణలు – 150 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: సి. కళానిధి, ఇ.నెం. 21–6–139, వెలుగు–చిగురు, టీచర్స్ కాలనీ, హిందుపురం – 515211, అనంతపురం, ఫోన్ : 9440073636



❖ **పచ్చికడుపు వాసన** – కవిత్వం – యార్లగడ్డ రాఘవేంద్రరావు – శ్రావ్య పబ్లికేషన్స్ ప్రచురణ – 166 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: వై. రాఘవేంద్రరావు, శ్రావ్య పబ్లికేషన్స్, బి–22, మధురానగర్, హైదరాబాద్ – 38, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **బుగులు** – తెలంగాణ కథ 2020 – సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, డా. వెల్దండి శ్రీధర్ – 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం ప్రచురణ – 148 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: సంగిశెట్టి శ్రీనివాస్, ఫ్లాట్ నెం. 212, నందనవనం అపార్ట్‌మెంట్, అత్తాపూర్, మెహదీపట్నం, హైదరాబాద్ – 500048, ఫోన్ : 9849220321



❖ **ఎవరికి వర్తిస్తే వారికి...** – భావ వ్యాకరణం – ప్రసేన్ – క్షమ ప్రచురణలు – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: క్షమ ప్రచురణలు, ఖమ్మం, ఫోన్ : 9848997241




❖ **జూకంటి జగన్నాథం కథలు** – నయనం ప్రచురణలు – 163 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: జూకంటి జగన్నాథం, ఇ.నెం. 6–5–101, విద్యానగర్, సిరిసిల్లా, కరీంనగర్ – 505301, ఫోన్ : 94410 78095, ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **నిదురపోని మెలకువ చెప్పిన కల** – పసునూరు శ్రీధర్‌బాబు – అక్షర్ మీడియాస్ ప్రచురణ – 130 పేజీలు, 1/4 క్రౌన్, రు. 300, ప్రతులకు: అక్షర్ మీడియాస్, 502, క్రాంతి ఎస్టేర్, 2బి ఈశ్వరిపురి కాలనీ, సైనిక్‌పురి, హైదరాబాద్ – 500094, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **డిసెంబర్ మూన్** – ఇతర కవితలు శ్రీకాంత్ – 283 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: శ్రీకాంత్, ఫోన్ : 9848666846, నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్ – 500027



❖ **మసి మెరువు మాదాసి బాణయ్య** – మాదాసి రామమూర్తి – అక్షర ఫౌండేషన్ ప్రచురణ – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: అక్షర ఫౌండేషన్, ఇ.నెం. 21–2–87/11/7/5, గవర్నమెంట్ ఫైర్ స్టేషన్ దగ్గర, మార్కండేయ కాలనీ, గోదావరిఖని, పెద్దపల్లి – 505209, ఫోన్: 9849986366



❖ **వ్యాస గవాక్షం** – సాహిత్య వ్యాసాలు – డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు – దర్పణం సాహిత్య వేదిక ప్రచురణ – 182 పేజీలు, 1/8 డెమీ, రు. 250, ప్రతులకు: డా. ఆర్. సూర్యప్రకాశ్ రావు, ఎఫ్2, ఓం రెసిడెన్సీ, ఉమనగర్, మేడ్చల్ – 501401, ఫోన్ : 94410 46839, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలల్లొ



❖ **కరెంట్ కథ** – నికోలస్ టెస్లా అద్భుత ఆవిష్కరణ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి, పాఠశాల సహాయోపాధ్యాయుడు (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లచ్చపేట్, మండలం: దుబ్బాక, జిల్లా: సిద్దిపేట్ – 502103, ఫోన్ : 7416988768

రైతాంగ ఉద్యమం - భారత దేశ కార్మికులు

***విభిన్న రంగాలలో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులు, శ్రమజీవులు సంఘటితమై కార్పొరేట్ పెట్టుబడిపై రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో తమ హక్కులకోసం పోరాడాలని అంటున్నారు* బి. ఎస్. రాజు**

ప్రస్తుత భారతదేశ రైతాంగాన్ని, కార్మిక, శ్రామిక శ్రేణులను మార్క్సిస్టు చట్రంలో ఇమడ్చడం, మార్క్సిస్టు కళ్లద్దాలతో చూడ ప్రయత్నించడం వృధా ప్రయాస. ఈ శ్రేణులు ఏవీ కూడా మార్క్సిస్టు పరిభాషలో నిర్వచించే వర్గాల కోవలోనికి రావు. అవి విడివిడి పొడిపొడి ఇసుక రాసులుగానే ఉన్నాయి. ఇంకా ఒక్కొక్క వర్గంగా గాని, లేక కొన్ని వర్గాలుగా గాని రూపొందలేదు.

కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్‌లు నిర్వచించినట్లు ఇక్కడ భారతదేశ శ్రామికులు, కార్మికులు వర్గాలుగా పేరుకుని లేరు. ఇక్కడి ప్రత్యేక దేశీయ పరిస్థితులు, సామాజిక నిర్మాణం, అందులోని అంతరాలు, కుల నిర్మాణాలు, ఫ్యూడల్ వ్యవస్థ బంధనాలు, విస్తృత గ్రామీణ వ్యవస్థ, ప్రజల మధ్య గళ్లు-గళ్లుగా పలు విభజనలు, అనేకానేక భాషలు, సాంస్కృతీ సాంప్రదాయాలు... ఇలా బహు సంక్లిష్టతలతో కూడుకున్న దేశం భారతదేశం.

ఇటువంటి సంక్లిష్ట వైవిధ్య వ్యత్యాస భరిత సమాజంలో కుల, మత, సాంప్రదాయక, కర్మ సిద్ధాంత బంధనాల్లో ఉన్న ఈ ప్రజారాసులు రెండు వర్గాలుగా సాంద్రీకరణ చెంది పెట్టుబడికి ఎదురు బదురు నిలబడి నువ్వో, నేనో తేల్చుకుందాం రమ్మని కత్తులుదూసే స్థితిలో లేవు. ఎంతటి సంఘటిత కార్మికశ్రేణి గాని, ఉద్యోగ, బుద్ధిజీవి శ్రేణులుగాని సాంప్రదాయ ఆలోచనా సరళికి, ఆర్థిక బేరసారాల పరిధికి మించి ఆలోచించే, వీటిని అధిగమించి పెట్టుబడిపై పోరాడి, ఓడించి పైచెయి సాధించే స్పృహ, చైతన్యం, త్యాగనిరతి, పోరాట పఠిమలు పెంపొందించుకునే దశకు ఎదగలేదు. అక్కడి వరకు పోవద్దు.

ఈ దేశానికంటూ ఓ రాజ్యాంగముంది. ఆ రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు దాటుతోంది. రాజ్యాంగం ద్వారా ఈ దేశ పౌరులకు సంక్రమించిన హక్కులు, వాక్ సభాస్వాతంత్రాలు, వెసులుబాట్లు అన్నీ ప్రభుత్వాలు కాలరాసి వేస్తుంటే నోరుమెదపని ప్రజారాసులు; తమ వనరులన్నింటినీ చాపచుట్టి ఆశ్రిత కుహనా వ్యాపారులకు అప్పనంగా అర్పితం చేస్తుంటే ప్రశ్నించని చదువరి జనం; లక్షల కోట్లు బ్యాంకుల నుండి ప్రజాధనాన్ని రుణాల పేర దోచుకుని ఒక్క రూపాయి కూడా తిరిగి చెల్లించక కబళించి వేసినా అభయహస్తమిచ్చి, ఆశీర్వదించి నెత్తికెక్కించుకుంటున్న ప్రభుత్వాలను ప్రశ్నించని, నిలదీయని శాంతమూర్త జనాన్ని ఏ వర్గంలో జమకట్టాలి? వారే వర్గాలకు చెందుతారు? కాశీ విశ్వేశ్వర వర్గమా? అయోధ్య రామయ్య వర్గమా? మధుర కృష్ణకన్నయ్య వర్గమా? వీటిలో ఏదైనా కావచ్చునేమో! లేక అన్నీ కావొచ్చునేమో గాని మర్క్స్-ఎంగెల్స్ మార్క్స్ శ్రామిక రైతాంగ వర్గమో, కార్మిక వర్గమో, లేక తిరుగుబాటు వర్గమో కాదు.

ఏ సమాజంలోనైనా మార్పు రావాలంటే ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తి, మేధోశ్రమల్లో పాల్గొనే ప్రజలు ఆ మార్పును ఘాఢంగా కోరుకోవాలి. ఆ మార్పు ఎటువంటిదై ఉండాలో వారు ఓ నిర్ణయానికి రావాలి. ఆ నిర్ణయంపై సంఘటితమవ్వాలి. కోరుకుంటున్న మార్పును సాధించుకోవడానికి కంకణబద్ధులవ్వాలి. తమ ప్రత్యర్థి శక్తిపై పోరాడడానికి గిరిగీసి నిలబడాలి. పోరాట విజయ సాధనకు అనువైన, తెలివైన వ్యూహం, ఎత్తుగడలతో సహా కావలసిన ఇతరేతర సంపత్తిని సమకూర్చు కోవాలి.

ఈ పని, ఈ పోరాటం, స్వాతంత్రానంతరం ఇన్నాళ్లకైనా భారత రైతాంగం మొదటిసారి చేపట్టింది. తన ప్రత్యర్థిపై మొదటి పోరాట ఘట్టాన్ని అమోఘంగా ఆవిష్కరించింది. దీక్షాదక్షతతో ప్రత్యర్థిపై పోరాడి తొలి విజయాన్ని సాధించింది. రాబోయే ప్రజా పోరాటాల సరంభానికి ఇది ఓ చిరు విజయారంభం; ప్రథమ సోపానం. ఈ ఆరంభంలోనే ఎన్నో విలువైన కోణాలున్నాయి. ఈ పోరాటంలో స్థానికత, ప్రాంతీయత, జాతీయత కలగలిసి ఉన్నాయి. వివిధ వేషధారణలు, భాషలు, ఆ భాషల యాసలు ఓకే హారంలో రంగు రాళ్లలా ఇందులో కూడుకున్నాయి. సమైక్యత, భావ సారూప్యత, క్రమ శిక్షణ, నిబద్ధత, సమిష్టి నాయకత్వం, ప్రజాస్వామిక చర్చా ప్రక్రియ, ఇలా ఎన్నో కోణాలున్నాయి.

ఈ ఉద్యమంలో ప్రధాన అంశం: రైతాంగం తన ఆయుధాన్ని కార్పొరేట్ పెట్టుబడిపై ఎక్కుపెట్టడం; రెండవ అంశం: దేశీయ ప్రజాపోరాట పద్ధతులను, సాంప్రదాయక ప్రజా పంచాయితీలను, సామూహిక ప్రజాస్వామ్యాన్ని, సమిష్టి నాయకత్వాన్ని, సిక్కు లంగర్ సేవా భావాలను సమ్మిళితంచేసి ఉద్యమాన్ని సంవత్సరకాలం నడపడం, మూడవ అంశం: ప్రభుత్వం ప్రయోగించిన అన్ని ఎత్తులను, జిత్తులను, పన్నాగాలను, అస్త్ర శస్త్రాలను తమ సమైక్య శాంతియుత పోరాటంతో చిత్తుచేసి దాని మెడలు వంచి విజయం సాధించడం. నిజానికి రైతులకు పూర్తిగా విజయం సిద్ధించిందని అనుకోలేం. ఇది రైతులకు విజయం సమకూరినదనే భ్రమకల్పించే ప్రభుత్వ ఎత్తుగడ వ్యవసాయ చట్టాల ఉపసంహరణ వెనుక ఆర్ఎస్ఎస్ చాణక్య నీతి ఉంది. పలు రాష్ట్రాల్లో శాసన సభల ఎన్నికలు కాషాయ కమల దళానికి గుబులు పుట్టిస్తున్న తరుణం తలుపుతట్టి హెచ్చరించడం, దేశ వ్యాపితంగా రైతాంగం సంఘటితపడే శంఖారావం చెవుల్లో మూరుమోగడం, ఇవన్నీ మోడీచేత ఆ ప్రకటన చేయించాయి. అయితే రైతులకు కూడా పోరాట విరామం అవసరం. ప్రభుత్వం గనుక మాట తప్పితే పోరాటాన్ని మరింత ఉధృతంగా, విస్తృతంగా నడిపించే అవకాశం రైతులకు ఏర్పడుతుంది. సాగు చట్టాలను వెనక్కు తీసుకున్నంత మాత్రాన వ్యవసాయ రంగంలోని మౌలిక సమస్యలైన భూమిహీనత, కౌలు సమస్యలు, కూలిరేట్లు, పని లభ్యత ఇవి సమసిపోయేనా? ఈ రైతాంగ ఉద్యమ చట్రంలో ఆ విషయాలు ఉన్నట్లు కనిపించదు. అది మరో తలంలో జరపాల్సిన మరో పోరాట ఘట్టం.

రైతాంగ నాయకుడు తికాయత్ ఈ తొలి పోరాట ఘట్టాన్ని

'రైతాంగ పోరాట శిక్షా పాఠశాల' అన్నాడు. రాబోయే రోజుల్లో చలి, వాన, వేసంగి.. ఈ మూడు కాలాల్లోనూ ఉద్యమాన్ని కఠోరతతో ఎలా నడుపుకోవాలో ఈ సంవత్సర బహిరంగ పాఠశాల మాకు నేర్పిందని, రైతుల ఉద్యమం ఇప్పటితో ముగిసేది కాదని, దేశమంతా విస్తరించే వరకు కొనసాగే సుదీర్ఘ పోరాటమని అన్నాడు. ఉద్యమ ప్రారంభ దినాలనుండే రైతులకు మన పోరాటం దీర్ఘకాలిక మైనదని, దానికి అందరూ సిద్ధపడి పోరాడాలని ఆయన చెబుతూ వచ్చాడు. ఇపుడు ఉద్యమ రైతులు ఇళ్లకు మళ్లుతున్నారంటే అది ఓ తాత్కాలిక విరామమేగాని, పోరాట విరమణ కాదని ఆయనేకాదు, యావత్ రైతాంగ నాయకత్వం, రైతాంగ శ్రేణులు శంఖమూది చెప్పారు.

దేశంలో కార్పొరేట్ పెట్టుబడిచేసే శ్రమ దోపిడీ, వనరుల దోపిడీ, సకల రంగాలపై దాని దురాక్రమణలను ఉత్తర భారత రైతాంగం గుర్తించి తన పోరాటాన్ని దానిపై ఎక్కుపెట్టింది. తమ పోరాటం కేవలం రైతులదే కాదని, సర్వజన సంక్షేమాన్ని కాంక్షించే ఉద్యమమని ప్రకటించింది. కార్పొరేట్ పెట్టుబడికి అమ్ముడుపోయిన ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించింది. దాని బూటకపు ముసుగులన్నిటినీ లాగి పడేసింది. ఇదే దృష్టితో పోరాడాల్సిన కార్మిక/శ్రామిక రాసులు నిశ్శబ్దంగా, నిస్సత్తువగా ఉండిపోవడం విచారకరం. అలా ఎందుకు ఉండిపోయారు?

ఈ వివరాల్లోకి వెళ్లే ముందు కార్పొరేట్ పెట్టుబడి గురించి కొంత మాట్లాడవలసిఉంది. ఈ పెట్టుబడిది తీరని ఆకలి. తిన్నకొలదీ దహించే ఆకలి. ఈ ఆకలి తీర్చుకోడానికి అది ఆక్రమణలకు తెగబడుతుంది. మనదేశంలో కార్పొరేట్ పెట్టుబడిలో ఇప్పుడు ఆశ్రిత పెట్టుబడి ప్రధాన భాగంగా ఎదిగింది. దేశంలో అన్ని ఉత్పత్తి రంగాలను ఈ ఆశ్రిత, కార్పొరేట్, ద్రవ్య పెట్టుబడి కబళించి వేస్తోంది. దీనికి దాసోహమైన పాలకులు కార్మికవర్గాన్ని పూర్తిగా నిర్వీర్యపరచి అచేతనం చేశారు. కార్పొరేట్, ఆశ్రిత పెట్టుబడులు దేశ వ్యవసాయ, గనుల రంగాలనే గాక, సకల ప్రభుత్వరంగ అంగాలను దూరాక్రమిస్తున్నాయి. వీటికి అనువుగా ఇప్పటి ప్రభుత్వం స్వాతంత్రకాలం నుండి అమలులో ఉన్న కార్మిక చట్టాలను కట్టకట్టి గంగలోకలిపి, కొత్త చట్టాలను సరళీకరణ పేరుతో కార్మికులకే గొప్ప మేలు చేస్తున్నట్లు, ముసుగేసి కన్నుగప్పి ప్రవేశపెట్టింది. అయినప్పటికీ కార్మికులు పెట్టుబడిపై పోరాటానికి దిగలేదు. కేవలం నూతన చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత సమ్మెలు కొన్ని చేసి సరిపెట్టుకున్నారు. ఇలా సరిపెట్టుకుని నిద్రావస్థలోకి జారుకోవడానికి మూలాలు వ్యవస్థ సృష్టించిన సమాజ నిర్మాణంలోనూ, పాలక దుర్నీతిలోనూ ఉంటాయి.

వాస్తవానికి ఆయా సమాజాల్లో ఒక్కో ప్రత్యేక చారిత్రిక సందర్భంలో వివిధ ప్రజాసమూహాలు ఒక్కో విధమైన విప్లవకర పాత్ర పోషిస్తాయి. ఒకప్పుడు విప్లవకర పాత్ర పోషించిన సమూహాలు ఎల్లప్పుడూ అదే పాత్ర పోషిస్తాయనో, లేక ఆ సమూహాలు ఎల్ల కాలం విప్లవాలకు స్థిర చిరునామాగా ఉంటాయనో సూత్రీకరించలేం!

ఐరోపాలో కార్మికవర్గం ప్రపంచ విప్లవానికి నాంది పలుకుతుందని భావిస్తే, తద్విరుద్ధంగా ప్రపంచ పరిణామాలు సంభవించాయి. ఐరోపా కార్మిక శ్రేణులు విప్లవ పోరాటాలను చాపచుట్టి బూర్జువా వర్గంతో రాజీ మార్గాన్ని ఎంచుకున్నాయి. ఇది తప్పో ఒప్పో తీర్పు చెప్పే వ్యవహారం నిలబడదు. ఐరోపా కార్మిక వర్గంతో పోలిస్తే అతితక్కువ స్థాయి విప్లవ చైతన్యం కల్గిఉన్నదనుకున్న రష్యా కార్మికవర్గం అనూహ్యంగా విప్లవ పతాకను ఎగరవేసి ప్రపంచ పరిణామాలను కొత్తమలుపు తిప్పింది.

చైనా, వియత్నాం వంటి దేశాల్లో రైతాంగ శ్రేణులు గొప్ప విప్లవకర పాత్రను పోషించి చరిత్రలో నూతన అధ్యాయాన్ని సృష్టించాయి. పెద్దగా చరిత్రకు ఎక్కలేదుగాని వియాత్నాం జాతి విమోచనోద్యమంలో అక్కడి ఆదివాసీ ప్రజా సమూహాల విప్లవ పోరాట భాగస్వామ్యం అనూహ్యమైనది. ఇప్పుడు మధ్యభారతంలో ఆదివాసులు తమ మనుగడకే ముప్పుగా వాటిల్లిన గనుల తవ్వకాలను ఆపేయమని 'జల్ జంగిల్ జమీన్' పై తమ హక్కును కాపాడుకునే పోరాటాలు చేస్తున్నారు. వారు ఆదివాసులు కాబట్టి పంజాబ్, హర్యానా రైతాంగంవలే పోరాడే వెసులుబాటు వారికి లేదు. ప్రభుత్వాలు వాళ్ల గొంతును బయటకు వినబడనీయడం లేదు. వాళ్ల ప్రాంతాల్లోనే వాళ్లను సాయుధ బలగాలను పంపి అణచివేస్తోంది.

ప్రపంచంలో ఏ దేశంలోనూ జరగనన్ని అద్భుత కార్మిక వర్గ పోరాటాలు అమెరికాలో జరిగాయి. అక్కడ జరిగిన సుదీర్ఘ కార్మికవర్గ పోరాటాల్లో 10వ వంతు కూడా.. విప్లవాలు విజయవంతమైన రష్యా, చైనా, వియత్నాముల్లో జరగలేదు. అయినప్పటికీ అమెరికాలో కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించలేక పోయింది.

ఇక మన దేశానికి వస్తే, బ్రిటిష్ వ్యతిరేక స్వతంత్ర పోరాటంలో ప్రధాన పాత్ర మధ్యతరగతిదే గాని శ్రామిక రైతాంగానిదీ కాదు, కార్మిక వర్గానిదీ కాదు. ఆ రెండు వర్గాలదీ సహాయక పాత్రే గాని, నిర్ణాయక పాత్ర కాదు. అందుకే సిద్ధించిన స్వాతంత్ర్యం ఈ ఇరు వర్గాలకు గుదిబండగా మారింది. ఉన్నత వర్గాలకు వరంగా మారింది. క్రింది వర్గాల పెనుగులాట ఎలా వుంటూ ఉందో చూస్తూనే ఉన్నాం.

మన దేశ కార్మికుల ఈ 'అజాగృత' దుస్థితికి పాలకులు ఎంత వరకు కారణభూతులో అంతకు మించి కార్మిక పక్షపాతులమని, వారి విముక్తి ప్రధాతలమని 100 ఏళ్లుగా చెప్పుకుంటూ వస్తున్న కమ్యూనిస్టు పార్టీలు అంతకు మించి కారణభూతులా? భారత కార్మిక, శ్రామిక శ్రేణుల దృష్టిని కార్పొరేట్ దోపిడీ పెట్టుబడిపై కేంద్రీకరించే అవగాహనను కల్పించడంలో, వారిని సంఘటిత పర్చి సంఘర్షణకు పురిగొల్పడంలో, ముందుండి నడిపించడంలో నిర్లక్ష్యత, నిరాశక్తత ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీలదేనని అనాలా? రొస్టునంతా వారి నెత్తినే గుమ్మరించి ఆనందించాలా? ఇది సబబేనా?

ఈ దేశంలో కార్మిక శ్రేణులు అచేతనావస్థలో ఉండిపోయిన స్థితిని వేలెత్తి చూపడంలో ఉపయోగమేమి లేదు. బతుకే భారమైన దీనావస్థలో ఉన్న కోట్లాది శ్రామికులు పూటగడవని స్థితిలో ఉన్నారు. వీరిలో ఎవరిని కదిలించినా అందరికందరు వాపోయేది ప్రభుత్వం మాపై దయచూపితే బాగుండు అని. వారున్న దుస్థితి మారాలంటే వారు పెట్టుబడిపై పోరాడి గెలవాల్సి ఉంటుందని వారికి ఎవరు చెప్పి మెప్పించాలి? వారిని అటువంటి సంఘర్షణకు, పోరాటానికి ఎవరు తర్ఫీదు నివ్వాలి? భద్ర జీవులు తమ భద్ర జీవన సౌకర్యాలను వొదులుకుని ఈ కోట్లాది శ్రామిక ప్రజారాసులను చైతన్యపర్చడానికి ఉపక్రమిస్తారా?

ఈ పనికి కంకణం కట్టుకున్న కమ్యూనిస్టులే ఆ కంకణాలను ఊడబీకి విసిరికొడితే, పెట్టుబడే అందరిని చిత్తుచిత్తుగా నుగ్గు నుగ్గు చేసెయ్యదా? కమ్యూనిస్టులు కూడా ప్రశ్న తిరగేసి వేయవచ్చు. మేం నూరేళ్ల నుండి ఈ పనిచేస్తూనే ఉన్నాం. చేసి చేసి అలసిపోయాం. మా త్యాగాలు ప్రజల ఆలోచనలో, చేతనలో, ఆచరణలో, గమనంలో మార్పు తీసుకురాలేనప్పుడు మేమింకెన్ని త్యాగాలు చెయ్యాలి? చేసి

సాగు చట్టాల రద్దు, వాటి అమలును నిలువరిస్తుందా?

రైతాంగ పోరాటానికి తలొగ్గి పాలకులు వ్యవసాయ చట్టాలను తాత్కాలికంగా రద్దుచేసినా, వాటి అమలును ఏమేరకు నిలువరిస్తుందోననే సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు **చుంచు శ్రీశైలం**

దేశంలో వ్యవసాయ భూమిని, దాని ఉత్పత్తులను, అవి ఆర్జించి పెట్టే లాభాలను మొత్తంగా భారతీయ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సొంతం చేసుకోవాలని పావులు కదిపిన పెట్టుబడితో దేశ రైతాంగం యుద్ధానికి తలపడి చిరస్మరణీయ విజయాన్ని సాధించింది. అవును, ఇది పెట్టుబడితో జరిగిన యుద్ధం. యుద్ధమే.. నిరాయుధులైన అన్నదాతలు, సాయుధులైన రాజ్యం మధ్య జరిగిన యుద్ధం. దేశ సరిహద్దుల్లో అనుసరించాల్సిన యుద్ధ వ్యూహాలు, మెళకువలన్నింటిని రైతు ఉద్యమంపై ప్రయోగించినప్పుడు అది యుద్ధం కాక ఇంకేమిటి? ఇది దేశానికి అన్నం పెట్టే రైతుల మీద మోడీ – షాలు చేసిన కర్కశ దాడి. అంబానీ, ఆదానీల వంటి గుత్త పెట్టుబడిదారులు రచించిన దండయాత్ర. అయితే ఈ యుద్ధ వ్యూహాలను ఎదిరించి, కర్కశ దాడులకు చలించకుండా గుండె నిబ్బరాన్ని ప్రదర్శించి గెలుపు తీరాలను చేరిన చరిత్ర ఇది. పాలకులు, వారి సోపతులైన కార్పొరేట్ల దండయాత్రను అంతర్జాతీయ, జాతీయ ప్రజా క్షేత్రంలో చిత్తు చేసి జరుపుకుంటున్న జైత్రయాత్ర, కిసాన్ విజయ యాత్ర. ఈ గెలుపును, దాని వెనుక దాగిన కఠోర శ్రమను జరిగిన సంఘటనలు, పరిణామాలన్నింటినీ చరిత్రలో నిక్షిప్తం చేయాల్సిన బాధ్యతను రచయితలు నిష్పక్షపాత ధోరణితో పూర్తి చేయాలి. చరిత్ర చెరిపేస్తే చెరిగిపోకపోవచ్చు, కానీ పాలక వర్గాల తొత్తులు నమోదు చేస్తే అది వక్రీకరణకు గురవుతుంది. కాలగమనంలో ప్రజల విజయాన్ని కాస్తా పాలకుల ఔదార్యంగా మార్చివేయవచ్చు. ఈ విషయాల పట్ల ఉద్యమకారులు, పరిశీలకులు, పరిశోధకులు, చరిత్రకారులు జాగ్రత్త వహించాలి.

దాదాపు సంవత్సర కాలంగా ఢిల్లీ సరిహద్దుల్లో రహదారులనే నివాసాలుగా మార్చుకున్న హలదారుల వీరోచిత పోరాటానికి మోడీ తలొగ్గాడు. ఘజిపూర్, సింఘు, టిక్రి, షాజహాన్పూర్ ప్రాంతాల్లో టెంట్లు, గుడారాలు, ట్రక్కులనే తాత్కాలిక నివాసాలుగా మార్చి, గ్రామాలనే సృష్టించుకున్న రైతాంగం సరికొత్త చరిత్ర సృష్టించింది. నవంబర్ 19న సిక్కుల పవిత్ర దినమైన గురునానక్ జయంతి రోజున ప్రధాని మోడీ దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ 3 వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నామని ప్రకటించాడు. ఇది ఆ చట్టాల మద్దతుదారులతో పాటు, వ్యతిరేకులనూ ఆశ్చర్యానికి గురిచేసింది. రద్దు వెనుక ఉన్న

లాభమేమిటి? అందుచేత మేము ఈ పనినుండి విరామాన్ని, విముక్తిని కోరుకోవడమే మేలేమో కదా? అని వారు తిరుగు ప్రశ్నను వేయవచ్చు. అలా ప్రశ్న సంధించడంలో తప్పు లేదు. అది సబబే కూడా.

కమ్యూనిస్టులు నిరాశచెంది తిరుగు ప్రశ్నలు వేసినా, దేశాన్ని పీడిస్తున్న సమస్యల నుండి దూరం జరగాలని అనుకున్నా వారాపని చేయలేదు. ఎందుకంటే వారి చైతన్యం వారికి నిర్దేశించే మార్గాన్ని, ఆచరణను, ఆలోచనలను తోసిరాజని వారు శూన్యంలోకి జారిపోలేరు. శ్రామిక జన జాగృతే వారి ఊపిరి. మార్పును ఏమోతాదులోనైనా ఆహ్వానించే విశాల హృదయం వారికి ఉంటుంది. చిరు మార్పు నుండి, పెను మార్పు నుండి విప్లవకర మార్పులు గొలుసు క్రమంలో వారు లింకులై ఉంటూనే ఉంటారు. వారి పయనం మార్పుల వెంబడి సాగుతూనే ఉంటుందిగాని పూర్తిగా ఆగిపోయే స్థితి ఉండదు. ఈ పయనంలో వారు శ్రామికులను తట్టిలేపుతూనే పెట్టుబడిపై పోరాటానికి వారిని సమాయత్తం చేస్తూనే ఉంటారు.

ఇప్పుడు వీరిముందు ఓ బృహత్ కార్యం, కర్తవ్యం, నిర్వహించాల్సిన బాధ్యత సవాళ్లుగా నిలబడి ఉన్నాయి. కోట్లాది భారతదేశ శ్రామికులు ఒక వర్గంగా రూపొందని సామాజిక స్థితి నుండి వారిని వర్గ శ్రేణులుగా కూడగట్టాల్సిన బాధ్యత మిగిలి ఉంది. శ్రామికులకు, కమ్యూనిస్టులకు మధ్య ఓ పెద్ద అగాధం ఏర్పడి ఉంది. కమ్యూనిస్టు నిర్వచనాలు ఎలా ఉన్నప్పటికీ క్షేత్ర స్థితిలో, ఈ దేశంలో శ్రామికులు, కార్మికులు ప్రధానంగా రైతాంగంతో, గ్రామ సీమలతో బొడ్డు తెంచుకుని బయటపడనివారే. ముందుగా కమ్యూనిస్టులు నిజ స్థితిని పరిగణనలోకి తీసుకొని రైతాంగ ఉద్యమ స్ఫూర్తి నుండి సారం రాబట్టి కార్మిక, శ్రామికోద్యమ పాఠశాలకు శ్రీకారం చుట్టాలి. దానికి కావలసిన సరంజామా, ఆలోచనా క్రమం మొదటి మెట్టుగా ఎంచుకుని అసంఘటిత, సంఘటిత, బుద్ధిజీవి శ్రేణులతో విస్తృతమైన చర్చలు చేపట్టి ఉమ్మడి ప్రణాళికతో కార్యాచరణకు దిగాలి. విడి విడి శ్రామిక శ్రేణుల ఆకాంక్షలను, సమస్యలను క్రోడీకరించి పోరాట ప్రణాళిక రచించుకోవాలి. ఈ క్రమంలో రైతాంగ పోరాటానికి సంపూర్ణ మద్దతునివ్వడమేగాక, వారితో సమైక్య పోరాట ఎజెండాను రూపొందించుకొని కార్పొరేట్ పెట్టుబడిపై, రాజ్యాంగ వ్యతిరేక ఫాసిస్టు నీతిపై సుదీర్ఘ పోరాటం చెయ్యాలి.

ప్రజా శ్రేణులన్నీ ఓ సందిగ్ధావస్థలో మనుగడ సాగిస్తున్న ఈ తరుణంలో రాజ్యాంగ కాపుదలకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు, మౌలిక హక్కుల పునః సాధనకు ప్రజాబాహుళ్యంలో సమ్మతి కూడగట్టడం, సంఘటితంగా పోరాడడమే ప్రథమ తక్షణ కర్తవ్యమౌతుంది. దీనికి రైతాంగ ఉద్యమం మార్గం ఓ ద్వారం తెరిచింది. తొలి మెట్టు ఎక్కడానికి ఊతమిచ్చింది. ఈ అవకాశాన్ని, ఊతాన్ని అందిపుచ్చుకుని కార్మిక శ్రామిక శ్రేణులు, పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, హక్కుల పరిరక్షణా సంఘాలు రైతాంగంతో ఐక్యమై తమ తమ సమస్యలను కలబోసుకుని ప్రభుత్వ కార్పొరేట్ దళారీ పాత్రను ఎండగట్టి ప్రజల ఆస్తిపాస్తులను కాపాడుకోవాలి. పెట్టుబడిపై ఓ నూతన పోరాట వెల్లువ సృష్టించాలి.

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు)

వీ

కారణాలు ఎంత బలమైనవైనా మోడీ మద్దతుదారుల దృష్టిలో ఆయన ప్రతిష్టను దిగజార్చేదే. ఈ ప్రకటన కోసం ఉత్తర భారత ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రైతులు, వారి కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేయాల్సి వచ్చింది. మరెన్నో నిర్బంధాలను, దాడులను ఎదుర్కొన్నారు. ఉద్యమకారులను పారదోలడానికి వారి మీద రకరకాల దాడులకు తెగబడ్డారు. భాష్పవాయు, వాటర్ క్యానన్ ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లు, లాఠీ దెబ్బలు, రాళ్ల దాడులు, కేసులు, అక్రమ నిర్బంధాలను భరించారు. సరిహద్దు యుద్ధ వ్యూహాలైన కందకాలు తవ్వడం, బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటుతో మోహరించడం, రోడ్లపై మేకులు దింపడం వంటి అనేక వ్యూహాలను చిత్తు చేయవలసి వచ్చింది. రైతులపై కర్రలతో దాడి చేసి తలలు పగలగొట్టండి అని ఒక కలెక్టర్, వారిపై దాడులు చేసిన వారికి బహుమానాలు ఇస్తానని ప్రకటించిన ఒక ముఖ్యమంత్రి వ్యాఖ్యల ద్వారా పాలకుల విద్వేషాన్ని చవి చూడాల్సి వచ్చింది.

కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రా తనయుడు ఆశిష్ మిశ్రా లఖింపూర్ ఖేరీలో శాంతియుత ర్యాలీలో ఉన్న రైతులను తన వాహన శ్రేణితో తొక్కించి ముగ్గురి ప్రాణాలు తీయడం విద్వేషానికి పరాకాష్ట. చేసిన హత్యలను ప్రమాదంగా చూపి, దోషులను కాపాడే ప్రయత్నం చేయడం ద్వారా హత్యను మించిన నేరాన్ని పాలకులు చేస్తున్నారు. ఇవి ఉద్దేశపూర్వక హత్యలే అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించి, హత్యానేరం సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినా, పార్లమెంట్ ను స్థంభింప చేసినా కేంద్రం హంతకుల పక్షమే వహిస్తుండడం మాటల్లో చెప్పలేని ఘోరం. ఇంకా స్థానికుల పేరుతో రౌడీలు, గుండాలను పంపి ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని చేసిన దాడులను రైతులు ఎదుర్కొన్నారు. ఇన్ని భౌతిక దాడులకు తోడు వ్యతిరేక ప్రచారాలు, తప్పుడు ఆరోపణలు, చీలిక కుట్రలు, రెచ్చగొట్టే ప్రయత్నాలను ఎన్నింటినో ఛేదించారు. మానసిక దాడులతో ధైర్యాన్ని, మనోస్థైర్యాన్ని దెబ్బదీసే దిగజారుడు తనాన్ని ప్రజల ముందు బహిర్గతం చేశారు. రైతులు నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్‌లో హింసాత్మక ఘటనలు సృష్టించి, శాంతిభద్రతల పేరుతో ఉద్యమాన్ని అణచివేతకు చేసిన ప్రయత్నాన్నీ తిప్పికొట్టారు. ఈ ఉద్యమాన్ని వేర్పాటు వాదులు నడిపిస్తున్నారని, వారంతా ఖలిస్తాన్ ఉగ్రవాదులని, దీని వెనుక కమ్యూనిస్టులు, నక్సలైట్లు, తీవ్రవాదులు ఉన్నారని, ఇది కేవలం ధనవంతులైన వ్యాపారుల నాటకం తప్ప రైతులే లేరని, చైనా, పాకిస్థాన్‌ల ఆర్థిక సహకారంతో నడుస్తున్న ప్రేరేపిత ఉద్యమమని పాలకులు, మోడీ భక్తులు, కాషాయ మూకలు, హిందూత్వ వాదులు, విష పుత్రికలు చిమ్మిన విషాన్ని సైతం జీర్ణించుకొని నిలబడాల్సి వచ్చింది. అన్నింటిని మించి వేర్వేరు కారణాలతో 750 మంది తమ సహచరులను కోల్పోవాల్సి వచ్చింది. సాక్షాత్తు దేశ ప్రధాని వీరంతా ఆందోళనా జీవులని, ఎప్పుడూ ఏవో ఆందోళనలు చేయకుండా బతకలేరంటూ అవమానించాడు. అవహేళన చేసిన నోటి నుండే క్షమాపణ చెప్పించుకొన్న చరిత్రను రైతులు సొంతం చేసుకున్నారు.

ఏది ఏమైనా రైతు ఉద్యమం ఎదుర్కొన్న దాడులు, సవాళ్లు, ఛేదించిన కుట్రలు ప్రజా ఉద్యమాలకు పాఠాలు. నిజానికి ఉద్యమంలో ఓడినా అది నేర్పే పాఠాలు ఎన్నో ఉంటాయి. కానీ, ఇది ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ప్రపంచంలోనే అత్యంత బలమైన శత్రు సమూహం చేతిలో గెలిచిన సందర్భం. ఈ ఉద్యమం సాధించిన చట్టాల రద్దు శాశ్వతమా కాదా పక్కన బెడితే పాలకుల మెడలు వంచడం ఎలాగో దారి చూపింది. ఉద్యమ శక్తుల మధ్య కొనసాగిన ఐక్యత, సుదీర్ఘకాలం కొనసాగించగలిగే ప్రణాళికా రచన, కుట్రల నెదుర్కోవడంలో సంయమనం, కార్యకర్తల నియంత్రణ, క్రమశిక్షణ, ప్రతికూలతలను కూడా అనుకూలతలుగా మార్చుకునే తెగింపు, ప్రజల, ఇతర సంఘాల మద్దతు, సంఘీభావం పొందడంలో చేసిన కృషి రాబోయే ప్రజాస్వామిక ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తాయి. అవే రైతాంగ ఉద్యమం ప్రజలకు సాధించిపెట్టిన ఫలాలు. పొందామనుకుంటున్న విజయం తాత్కాలికమైనా, ఈ ఫలాలు మాత్రం శాశ్వత విజయానికి పునాదులుగా నిలుస్తాయి.

ఇంతగా రైతు ఉద్యమంపై ద్వేషం వెళ్లగక్కి, తిరిగి గుర్తించాల్సిన అనివార్యత, క్షమాపణ చెప్పాల్సిన ఔదార్యం ఎందుకు కలిగింది?. రాష్ట్రాలతో పాటు కేంద్రంలోనూ అధికారానికి దూరం చేసే శక్తి సామర్థ్యాలను రైతాంగ ఉద్యమం సాధించిందని మోడీ ప్రభుత్వం పసిగట్టింది. రానున్న 5 రాష్ట్రాల ఎన్నికల్లో భా.జ.పా.ని ఓడిస్తామంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మోడీ – షా ద్వయానికి భయం పుట్టించింది. ఈ ఎన్నికలు, ఓటమి ప్రభావం కేంద్రంలోనూ అధికారాన్ని దూరం చేస్తాయన్న గ్రహింపు ఉంది.

2024 వరకైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్న రైతుల తెగింపు తెచ్చిన కలవరం కూడా ఉండవచ్చు. దేశ వ్యవసాయ రంగాన్ని సమూలంగా అంబానీ, ఆదానీల చేతిలో బంధించడానికి చట్టాలే అవసరం లేదని, ప్రత్యామ్నాయ మార్గాలలో కూడా సాధ్యమేననే బరితెగింపు ఉండవచ్చు. ఆ మార్గాలను అనుసరించడానికి మొదట అధికారాన్ని అంటిపెట్టుకోవడానికే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని పెట్టుబడికి, అధికారానికి మధ్య కుదిరిన అవగాహన కావచ్చు. వ్యవసాయ చట్టాల్లో పొందుపరచిన అంశాలను అమలు చేయాలంటే కాగితాల మీద అక్షరాలే (చట్టాలు) ఉండాల్సిన అవసరం లేదని, అవి లేకుండానే ఆచరిస్తామని పెట్టుబడిదారులకు హామీ ఇచ్చి ఉండవచ్చు. ప్రజా వ్యతిరేక, దోపిడీ విధానాలను అమలు చేయడానికి చట్టాలు ఖచ్చితంగా ఉండాల్సిన అవసరం లేదని ఎన్నో అనుభవాలు చెప్తున్నాయి. ప్రజా వ్యతిరేక విధానాల అమలుకు, వారి శ్రమను, వనరులను దోచిపెట్టడానికి ఏ చట్టాలు అవసరం లేదని, ప్రజలకు మంచి చేయడానికి, వారి హక్కులను కాపాడడానికి ఎన్ని చట్టాలున్నా అవి అమలు కావన్న విషయం కొత్తదేమి కాదు. అసలు రద్దైన చట్టాల్లో ఉన్న కాంట్రాక్టు వ్యవసాయం, నిత్యావసరాల అక్రమ నిల్వలు, ధాన్యం అమ్మకాల్లో రైతుల నిలువు దోపిడీ ఇప్పటికే జరుగుతూ ఉన్నాయి. కాకపోతే, చట్టాలు ఈ పనిని మరింత వేగంగా, తేలికగా, నిర్భయంగా, చట్టబద్ధంగా చేసుకపోతాయి.

చట్టాల రద్దు ప్రకటన తర్వాత రైతు ఉద్యమ నాయకత్వం స్పందించిన తీరు అభినందనీయం. చట్టాల రద్దు తమ డిమాండ్లలో ఒక ప్రధాన భాగం మాత్రమేనని పార్లమెంట్‌లో రద్దు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటుగా మిగిలిన అన్ని డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. కనీస మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలని, ఉద్యమ కాలంలో రైతులపై మోపిన అన్ని రకాల కేసులను ఎత్తివేయాలని, అమరులైన రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని, ఢిల్లీ చుట్టుపక్కల కాలుష్య నియంత్రణ చట్టం నుంచి

వ్యవసాయాన్ని, రైతులను మినహాయించాలనే డిమాండ్లను కేంద్రం ముందుంచారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మొదలైన రోజే చట్టాల రద్దు బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధ ప్రక్రియను పూర్తిచేశారు. మిగతా డిమాండ్ల పై పట్టుబట్టిన దరిమిలా ఎం.ఎస్.పి పై రైతు సంఘాలతో కలిపి, అధికారులు, మంత్రులతో కమిటీ ఏర్పాటు చేస్తామని, కేసులను పూర్తిగా ఎత్తేస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును తాత్కాలికంగా వాయిదా వేస్తామని, లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలతో రైతులు తాత్కాలిక నివాసాలను వదిలి, శాశ్వత నివాసాలకు చేరారు. సంవత్సర కాలంగా తమకు ఆశ్రయమిచ్చిన నేలకు, ఆతిథ్యమిచ్చిన స్థానికులకు, చివరికి పోలీసు అధికారులకు సైతం ప్రణమిల్లి భారంగా ఇళ్లకు తరలారు.

అయితే ఇంతటితో కథ సుఖాంతం అయిందనుకున్న భ్రమల్లో, ఏమరపాటులో రైతాంగం, ప్రజానీకం ఉంటే నష్టం తీవ్రంగా ఉండనుంది. కార్పొరేట్ వర్గం అదును కోసం వెనుకడుగేసిన సింహం లాంటిదన్న విషయం మరవరాదు. అది ఆకలిగొన్న సింహం. దేశ వ్యవసాయ రంగాన్ని బలి తీసుకోవడానికి వేటాడే పద్ధతులను మార్చుతుందే కానీ వేటను మాత్రం ఆపదన్న స్పష్టత ఖచ్చితంగా ఉండి తీరాల్సిందే. నవంబర్ 19 ప్రకటన సందర్భంగా చట్టాలు రైతులు బాగు కోసమే తెచ్చామని, కానీ ఆ విషయాన్ని కొందరు రైతులకు అవగాహనగావించడంలో విఫలమయ్యామన్న మోడీ వ్యాఖ్యలు దీనిని రూఢీ పరుస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగింది దోపిడీ ఆరాటానికి, బతుకు పోరాటానికి మధ్య కుదిరిన రాజీ మాత్రమేనన్న వాస్తవాన్ని గ్రహించాలి. ఆ గ్రహింపు మాత్రమే అసలు గమ్యాన్ని, అంతిమ లక్ష్యాన్ని గుర్తుచేస్తుంది. ఎంతకూ ఆకలి తీరని దోపిడీకి ఎన్నటికీ బలి కాకుండా, దానిని ఉచ్చులో బంధించడానికి అవసరమైన శక్తియుక్తులను ఈ ఉద్యమం సాధించిపెట్టింది. ఇదే రైతాంగ పోరాటం సాధించి పెట్టిన ఫలితం. కార్పొరేట్ల కబంధ హస్తాల నుండి పూర్తిగా తప్పించడమనే అసలు సిసలు లక్ష్య సాధనకు ఈ పోరాటం రహదారిని నిర్మించింది. మిగిలిన ప్రయాణం ఇప్పుడే మొదలు పెట్టవల్సి ఉంది. ఎందుకంటే రైతులు పంట పండించడంలో, పండిన పంటను అమ్ముకోవడంలో ప్రకృతి ప్రకోపాలకు తోడు వ్యాపారుల, దళారుల దోపిడీకి గురవుతున్నారు. అంటే పెనం మీద కాలుతున్న రైతులను పొయ్యిలోకి నెట్టే ప్రయత్నాలు మాత్రమే నిలుపుదల చేయబడ్డాయి. ఈ ప్రయత్నాలు ఇక ముందూ కొనసాగుతూనే ఉంటాయి. వాటిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడమే కాకుండా పెనం మీద నుండీ బయట పడేయాల్సిన కర్తవ్య నిర్వహణ మిగిలే ఉంది.

దోపిడీని కొనసాగించాలంటే ఆ విధానాలను రైతు మేలు కోసం చేపట్టే చర్యలుగా రైతులను, ప్రజలను నమ్మించాల్సి ఉంటుంది. ఈ పనిని ఆర్థికవేత్తల ముసుగులో మేధావులుగా ముద్ర వేసుకున్న వారికి అప్పగించి ప్రజల మెదళ్లపై దాడిచేసి, మేధో వశీకరణకు పాల్పడతారు. ఆ కోవకు చెందిన మేధావి భరత్ ఝున్ ఝున్ వాలా ఇప్పటికే ఆ ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు. ఒక ప్రముఖ తెలుగు దిన పత్రికకు రాసే వ్యాసాల్లో 'మద్దతు రద్దే రైతుకు మేలు' అంటూ కొత్త పాట పాడారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర(ఎం.ఎస్.పి.)ను రద్దుచేయాలని, దానితో పాటు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, విద్యుత్తు, నీరు, బీమా, ఎగుమతి సబ్సిడీలన్నింటిని రద్దు చేయాలని సూచించారు. వాటికి బదులుగా ప్రతీ రైతు ఖాతాలోకి లక్ష రూపాయలు నగదు బదిలీ చేయాలని ప్రపంచ బ్యాంకు మాటలను వల్లించారు. దీనివల్ల దేశంలో ఉన్న 3 కోట్ల మందికి ఏటా 3 లక్షల కోట్లు ఖర్చయితే, కేంద్ర, రాష్ట్రాలకు 6 కోట్లు మిగులుతాయని పొదుపు సూత్రం నేర్పుతున్నారు. రైతుకు ఎం.ఎస్.పి. రాకపోయినా కనీస ఆదాయంగా లక్ష రూపాయలు ప్రభుత్వమే ఇస్తుంది కాబట్టి ఇబ్బంది ఉండదంటూ పోషక జీవులను పరాన్న జీవులుగా మార్చే కుట్రకు బీజం వేస్తున్నాడు. వరి, గోధుమతో పాటు పండే ఇతర పంటలను కొనుగోలు, ఎగుమతులు చేయడానికి భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ)ని, భారత ట్రేడింగ్ కార్పొరేషన్ (టి.సి.ఐ)గా మార్చాలని హితవు చెప్పారు. రైతులు ఏ పంటలు పండించాలో ఈ సంస్థ కాంట్రాక్టు కుదుర్చుకుంటుందని దీని వల్ల రైతులు లాభాలు ఆర్జిస్తారని అరిగిపోయిన రికార్డును మళ్లీ వినిపిస్తున్నారు. అంటే రద్దైన చట్టాల్లో ఉన్న కాంట్రాక్టు వ్యవసాయం, నిత్యావసర వస్తువుల నిల్వ, పెట్టుబడిదారులకు ధాన్యం విక్రయం వంటి అన్ని అంశాలను టి.సి.ఐ. ఒక్కటే నిర్వహిస్తుందన్న మాట. అంటే కార్పొరేట్ కంపెనీలు తమ వ్యాపారాన్ని ఈ సంస్థ ద్వారా చేపట్టనున్నాయి. ఇది చట్టాల అమలు కంటే మరింత తెలివైన, ప్రమాదకరమైన పని. ఇది రద్దైన చట్టాల్లోని అంశాల దొడ్డి దారి అమలు తప్ప మరొకటి కాదు. ఈ కుట్రల పట్ల రైతాంగం, ప్రజానీకం జాగ్రత్త వహించాలి.

కాబట్టి చట్టాల రద్దు, అందులోని అంశాల రద్దును అడ్డుకోలేదని, వాటి అమలుకు అప్పుడే ప్రయత్నాలు మొదలయ్యాయని అర్థం చేసుకోవాలి. వీటిని నిలువరించడం చట్టాల రద్దును నిలువరించిన దాని కంటే కష్టమైనది. ఎందుకంటే కనిపించే శత్రువుతో పోరాడటం తేలికైన పని. దీనిని బట్టి కార్పొరేట్ – పాలక ద్వయం వ్యూహాత్మక ఓటమిని ప్రకటించుకున్నాయని స్పష్టమవుతోంది. ప్రతీకారేచ్ఛతో ప్రత్యామ్నాయ, పరోక్ష మార్గాల్లో మరింత బలంగా దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నాయని అర్థమవుతుంది. దీనిని తిప్పికొట్టడానికి రైతు ఉద్యమ ఫలాల భూమికగా విశాల జన రాశులను ఐక్యం చేయాలి. పౌరసత్వ సవరణ బిల్లుకు(సి.ఏ.ఏ) వ్యతిరేకంగా సాగిన షాహీన్ భాగ్ మహిళల పోరాటం చారిత్రక రైతు ఉద్యమానికి ప్రేరణనిస్తే, రైతు ఉద్యమ స్ఫూర్తి శాశ్వత విముక్తి ఉద్యమాలకు జీవం పోయాలి. ప్రజానుకూల నూతన చట్టాల రూపకల్పనకు చరమగీతం పాడి, చట్ట సవరణల ద్వారా ఉన్న చట్టాలలోని ప్రజానుకూలతలను తొలగించడమే ధ్యేయంగా చట్ట సభలు పనిచేస్తున్నాయి. కార్మిక చట్టాల సవరణ, పర్యావరణ చట్టాల సవరణ, అటవీ హక్కుల సంరక్షణ చట్టాల సవరణ, పారిశ్రామిక చట్టాల సవరణ, వివాహ – విడాకుల చట్ట సవరణ, నిత్యావసర సరుకుల అక్రమ నిల్వల రద్దు చట్ట సవరణ, పౌరసత్వ చట్ట సవరణ చివరికి రాజ్యాంగ పీఠిక సవరణలతో హిందూత్వ, దోపిడీ తత్వ విధానాలను జొప్పిస్తున్నాయి. ఈ క్రమంలో రైతు ఉద్యమ విజయం వెలుగులో చేయాల్సిన పోరాటం ఎంతో మిగిలి ఉందని, ఆ బాధ్యతలను కూడా మొదలుపెట్టాల్సిన సమయం ఇదేనని రైతు ఉద్యమం చాటి చెప్తుంది. అంటే అసలు పోరాటం ఇంకా మిగిలే ఉందని, దానికి కావాల్సిన పునాది మాత్రం రైతాంగ ఉద్యమం సిద్ధం చేసిందని గ్రహించాలి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

స్ఫూర్తినిచ్చిన రైతాంగ ఉద్యమం

ప్రజా ఆకాంక్షలను అణచివేస్తూ, మంద బలంతో ముందుకెళుతున్న పాలకులను నిలువరించి పోరాడే శక్తులకు రైతు ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని అంటున్నారు **డా. కొల్లా రాజమోహన్**

ఉక్కు సంకల్పంతో 2020 నవంబర్ 26 నుండి రైతులు చేస్తున్న చారిత్రాత్మక పోరాటానికి విజయం లభించింది. ఇది రైతుల విజయం. ప్రజలు పోరాడితే ఎంతటి ప్రభుత్వాలైనా దిగిరాక తప్పదని నిరూపించారు. పార్లమెంట్‌లో మెజారిటీ ఉందన్న అహంకారంతో రైతు వ్యతిరేక చట్టాలు చేస్తే సహించమని రైతులు నినదించారు. ఇది అహంకారానికి వ్యతిరేకంగా దృఢ సంకల్పంతో సాధించిన విజయం.

వ్యవసాయ చట్టాల రద్దు ప్రకటన ఉదారవాద దానికి పెద్ద ఎదురుదెబ్బ. విపరీతమైన వేగంతో నయా ఉదారవాదాన్ని పెంచి పోషిస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎదుర్కొన్న మొదటి ముఖ్యమైన ఎదురుదెబ్బ. మనం ఏమీ చేయలేం కదా, ప్రభుత్వం బలమైనది కదా, మొండిగా ఉన్నది కదా అంటున్నవారి మాటలను వమ్ము చేశారు. ప్రజలలో ఉన్న నిరాశ, నిస్పృహలను పటాపంచలు చేశారు. ప్రజల పోరాటాల ఫలితంగా, వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పలేదు. స్వయంగా ప్రధాన మంత్రి ప్రకటించవలసివచ్చింది. ఎట్టకేలకు 3 రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకోవాలన్న నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించింది.

ఉప ఎన్నికల్లో ప్రజలు చూపించిన శాంపిల్ దెబ్బకే పెట్రోల్, డీజిల్ రేట్లను కొద్దిగా తగ్గించారు. నిజంగా పోరాడితే ఆయిల్ ధరలు తగ్గడం పెద్ద కష్టం కాదు. ఎంతటి నీచ ప్రభుత్వాలు కూడా ప్రజల క్షమాగుణం మీద బతుకుతున్నాయి. ఎంతటి బలమైన ప్రభుత్వాలైనా ప్రజల తీర్పుకు తలొంచక తప్పదు.

అయితే ఇప్పటికి కూడా ప్రభుత్వం తన వైఫల్యాన్ని ఒప్పుకోవడం లేదు. చట్టాలు మంచివే కానీ, ప్రజలను ఒప్పించడంలో వైఫల్యం చెందామంటున్నారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో రాబోయే ఎన్నికల్లో చావుదెబ్బ తినబోతున్నామనే సర్వేల సంకేతాలు భాజపాకు మింగుడు పడలేదు. ఉత్తర భారతదేశంలో తీవ్రంగా ప్రజా వ్యతిరేకత రాజుకుంటుందని అర్ధమౌతున్నది. భారతదేశ అధికార పీఠానికి ఉత్తర భారతదేశం కీలకం. అక్కడనే నిప్పు రాజుకుంటుంది. ఎవరితోనైనా పెట్టుకో కానీ, రైతు కూలీలతో పెట్టుకుంటే నీకు పుట్టగతులుండవని భారత రైతులు చరిత్రను పునరావృత్తం చేస్తున్నారు.

ఈ నిర్ణయం వెనుక అపర చాణక్య నీతే కారణం అని కొంతమంది సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇది మాస్టర్ స్ట్రోక్ అనీ, ఈ దెబ్బతో రైతు ఉద్యమం ఖాళీ అనీ డబ్బా కొట్టుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లలో ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి రాజకీయ ఎత్తుగడగా తాత్కాలిక వెనుకడుగేనంటున్నారు. అవకాశవాదం తప్ప ఉద్యమ ప్రభావం కాదంటున్నారు.

చట్టాల రద్దు నిర్ణయాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) పెరుగుతున్న ఉద్యమ స్ఫూర్తి – తరుగుతున్న మత విద్వేషం. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో సెప్టెంబర్ 5న 10 లక్షల మంది ప్రజలతో భారీ సభ దిగ్విజయంగా జరిగింది. మహా పంచాయత్ పేరున రైతులు, కార్మికులు ఒకచోట గుమికూడి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరడం నూతన సామాజిక చైతన్యానికి దారితీసింది. ఇదే ముజఫర్‌నగర్‌లో 2013లో మతపరమైన అల్లర్లను భాజపా రెచ్చగొట్టింది. మత విద్వేషాలను పక్కనపెట్టి లౌకిక ఐక్యతను సాధించుతూ రైతులు ఉద్యమంలోకి రావడం ప్రభుత్వాన్ని కలవరపరుస్తున్నది.

2) సంవత్సరం పాటు సాగిన రైతుల పోరాటంలో 3 సార్లు భారత్ బంద్‌కు రైతు సంఘాలు పిలుపులనిచ్చాయి. సెప్టెంబర్ 27న భారత్ బంద్ పిలుపు అపూర్వ విజయాన్ని సాధించింది. దేశం నలుమూలల నుండి లక్షలాది మంది రైతులు, కార్మికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు, ఉద్యోగులు వీధుల్లోకి రావడమే భాజపాకు ప్రమాద సంకేతాలను ఇచ్చింది.

3) లఖింపూర్ ఖేరీలో భాజపా జరిపిన దారుణ మారణకాండ దేశ ప్రజలనందరినీ కదిలించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ మిశ్రా ఆదేశాలను అనుసరించి గుమికూడిన ప్రజలపై కారును తోలి నలుగురు రైతులను, ఒక జర్నలిస్టును చంపిన ఘటన యావద్భారత ప్రజలందరికీ కోపం తెప్పించింది. భాజపాను అప్రతిష్టపాలు చేసింది. అక్టోబర్ 15న దేశవ్యాప్తంగా బిజెపి అగ్రనేతల దిష్టి బొమ్మలను తగలెట్టారు. రైళ్లను ఆపేసి ఆందోళనలను నిర్వహించారు.

4) దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, ఆకలికేకల సూచికలు, అసమానతలు, అసంతృప్తి, ఆర్థిక సంక్షోభం, ఆందోళనలు భాజపా పతనానికి దారిచూపుతున్నాయి. మత విద్వేష ప్రచారం ఒక్కటే ప్రభుత్వాన్ని రక్షించేటట్లు లేదు. పాకిస్తాన్, చైనా వ్యతిరేక జాతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టే అవకాశాలు ప్రస్తుతం అందుబాటులో లేవు.

5) రైతు ఉద్యమ ఫొటోలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తూ, పాప్ స్టార్ రిహాన్నా 'మనం ఎందుకు దీని గురించి మాట్లాడుకోకూడదు' అంటూ ట్విట్టర్‌లోనూ గూగుల్‌లోనూ లేవనెత్తిన

ప్రశ్న ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతు తెచ్చింది. యువ పర్యావరణ వేత్త గ్రేటా థెన్ బర్గ్ రైతు ఉద్యమానికి ఎలా మద్దతు తెలపాలో సలహ ఇస్తూ "టూల్ కిట్" కార్యాచరణ ప్రణాళికను రూపొందించి షేర్ చేసింది. అందుకు ప్రతిఫలంగా నేరపూరిత కుట్ర, శత్రుత్వాన్ని ప్రోత్సహించారన్న ఆరోపణలతో ప్రభుత్వం ఆమెపై కేసు నమోదు చేసింది. కెనడా ప్రధానితో సహ, అమెరికాలోని 80 సంఘాలు, లాయర్ మీనాహారిస్, అంతర్జాతీయ మీడియా, సెలబ్రిటీలు సౌహార్ద్రతను వెలిబుచ్చారు. పెరుగుతున్న అంతర్జాతీయ మద్దతు భారత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది.

6) చివరగా రాబోయే ఎన్నికల్లో పరాజయం తప్పదని సర్వేలు సూచిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ నాయకత్వాన జరుగుతున్న నయా ఉదారవాదానికి తగిలిన ఎదురు దెబ్బ చాలా ప్రాముఖ్యత కలిగినటువంటిది. రైతులు దృఢ సంకల్పంతో, ధైర్యంతో చేసిన ఈ పోరాట విజయం వలన భారతీయ జనతా పార్టీ భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది. ఈ ఉద్యమంలో పాల్గొన్నటువంటి రైతు కార్యకర్తలకు ప్రజాదరణ, విశ్వసనీయత పెరిగింది.

అంతా తమ ప్రయోజకత్వం అని అంబానీ, అదానీల మధ్య మోడీ నిలబడి వ్యవసాయంలో కార్పొరేట్ సామ్రాజ్యాలను స్థాపించాలని చేస్తున్న ప్రయత్నానికి ఆదిలోనే గండిపడింది. కార్పొరేట్ వ్యవసాయ క్షేత్రాలను స్థాపించాలనే పేక మేడలను కూల్చిన ఘనత భారతదేశ రైతులకు చెందుతుంది. కార్పొరేట్ శక్తులకు నాయకత్వం వహిస్తున్న ప్రభుత్వంతో సంఘర్షించి రైతు ఉద్యమ చరిత్రను సృష్టించింది.

రాజకీయ కోణమా లేక రైతు ఉద్యమ ఉధృతా?

ప్రధాని తీసుకున్న నిర్ణయం వెనుక నూటికి నూరు పాళ్లు రాజకీయ కోణం ఉందని, రైతుల ఉద్యమ ఉధృతి కాదని కూడా కొంతమంది మేధావులు విశ్లేషిస్తున్నారు. మోడీ అపర చాణుక్య నీతితో వ్యూహాత్మకంగా వ్యవసాయ చట్టాల రద్దుపై కీలక నిర్ణయం తీసుకున్నారంటున్నారు.

ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లతో పాటు ఐదు రాష్ట్రాలలో కీలకమైన ఎన్నికలు జరగబోతున్నందున వ్యవసాయ చట్టాల రద్దు నిర్ణయం తీసుకున్నారని చెప్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయానికి కారణం అన్నదాతల ఉద్యమ ఉధృతి అన్న సంగతిని గుర్తించ నిరాకరిస్తున్నారు. భాజపా పార్టీ నాయకులు ప్రజలలోకి వెళ్లలేని పరిస్థితిని మర్చిపోతున్నారు. పట్టుదలతో ప్రాణత్యాగాలకు నిలబడ్డ రైతుల పోరాటాన్ని తక్కువచేయ చూస్తున్నారు. రైతు వ్యతిరేక విధానాలవల్లనే ప్రజలు భాజపాకు దూరమౌతున్నారనే సంగతిని విస్మరిస్తున్నారు. ప్రజలు పోరాటాలలో రాటుదేలి చైతన్యవంతులౌతున్నారు.

మొక్కవోని దీక్షతో సాగించిన రైతుల పోరాటం కొన్ని విలువైన గుణపాఠాలను నేర్చుకుంది. ఉద్యమాలు అలలు లాగానే కాకుండా నిశ్చల ప్రవాహంలాగా ఉధృతంగా కూడా సాగించవచ్చని అనుభవం నేర్పింది. ప్రజా పక్షం వహించడమే పార్టీల ఎజెండా కావాలని ఉద్యమం డిమాండ్ చేసింది. అందుకనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించింది. పార్టీల జెండాలు కాదు ఎజెండా ముఖ్యమని చెప్పింది. పదవులు, రాజ్యాధికారమే పరమావధిగా ఉన్న రాజకీయపక్షాలను ఉద్యమ వేదికలకు దూరంగా ఉంచవలసిన అవసరాన్ని తెలియచెప్పింది.

"అంతా తమ ప్రయోజకత్వం
తామే భువి కధినాధులమని,
స్థాపించిన సామ్రాజ్యాలూ,
నిర్మించిన కృత్రిమ చట్టాల్
ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేక మేడలై
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను.
చిరకాలం జరిగిన మోసం,
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు" – శ్రీశ్రీ

రైతు సంఘాలన్నీ ఏకమై కనీస మద్దతు ధర కోసం ఉద్యమ క్రమం

2018 నవంబర్‌లో 217 రైతు సంఘాలన్నీ ఏకమై ఐక్య పోరాటానికి పిలుపునిచ్చాయి. నవంబర్‌లో లక్షలాది మంది రైతులు ఢిల్లీ నగర వీధుల్లో కదంతొక్కారు. లక్షలాది మంది రైతులు అరుదైన ప్రదర్శన చేసి కనీస మద్దతు ధరకు చట్టబధతను కల్పించి, ఋణ విముక్తిని కల్పించమన్నారు. మరుసటి సంవత్సరం నవంబర్‌లో రైతు పార్లమెంట్‌ను నిర్వహించారు. కనీస మద్దతు ధరకు, ఋణ విముక్తికి ముసాయిదా చట్టాలను తయారు చేసి పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. ప్రధాన డిమాండ్లైన కనీస మద్దతు ధరను, ఋణ విముక్తి అంశాలను పక్కనపెట్టి 2020 జూన్ 5న మూడు సాగు చట్టాలు తీసుకొస్తున్నట్టు కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేసింది. అప్పటి నుండి రైతుకి న్యాయం చేయాలంటూ అన్నం పెట్టే అన్నదాతలు, రైతు సంఘాలు పంజాబ్‌లో గ్రామ గ్రామాన ఇంటింటికీ తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. ఐక్యంగా రోడ్డెక్కారు. రైలు పట్టాలపై పడుకున్నారు. సెప్టెంబర్ 17న గందరగోళ పరిస్థితుల మధ్య, విపక్షాల నిరసనల మధ్య లోక్‌సభలో భాజపాకి ఉన్న మెజారిటీతో ఆమోదం పొందింది. సెప్టెంబర్ 20న రాజ్య సభలో బిల్లులను ఆమోదించామని అప్రజాస్వామ్యంగా ప్రకటించుకున్నారు. కనీసం ఓటింగ్ జరపమన్న డిమాండ్‌ను కూడా అంగీకరించలేదు. నవంబర్ 26న రైతు సంఘాలన్నీ ఏకమై ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టారు. పశుబలంతో ఢిల్లీ సరిహద్దుల్లోనే ఆపిన ప్రభుత్వ బలగాలను ఎదిరించారు. రోడ్లపై కొట్టిన మేకులు, ముళ్ల కంచెలు రైతుల ప్రస్థానాన్ని ఆపలేకపోయాయి. నల్ల చట్టాలను రద్దుచేయాలని పట్టువదలకుండా ఉక్కు సంకల్పంతో ప్రభుత్వాన్ని వణికించారు.

ఎముకలు కొరికే చలిని, చండ్ర నిప్పులుకక్కే ఎండలను, భీకర వర్షాలను లెక్కచేయలేదు. దిగజారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా జయప్రదమైన బంధ్‌లు, సమ్మెలు ప్రభుత్వాన్ని అందోళనకు గురిచేశాయి. రాబోయే ఎన్నికలు మరింత భయాన్ని కలిగించాయి. ఘోరమైన కొవిడ్–19 వేవ్ కాలంలో కూడా నిరసనకారులు తమ గుడారాల్లోనే ఉన్నారు. టాక్టర్లనే నివాసాలుగా మార్చుకున్నారు. రోడ్ల పైనే వండుకొని తిన్నారు. సంవత్సరం రోజులుగా ఢిల్లీ సరిహద్దుల్లో బైఠాయించి నూతన తరహాలో చారిత్రక

ఉత్తరాది రైతులకు కెసిఆర్ తాయిలాలు

స్వరాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు పరిహారం చెల్లించకుండా, గత హామీలను నెరవేర్చకుండా పక్క రాష్ట్రాల్లో మరణించిన రైతులకు పరిహారమివ్వడమంటే ప్రజల్ని తప్పుదోవ పట్టించడమేనంటున్నారు **తండ సదానందం**

వ్యవసాయ సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రాణాలర్పించిన 700 మంది ఉత్తరాది రైతులకు సిఎం కెసిఆర్ 3 లక్షల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హర్యానా, పంజాబ్, యుపి రైతులకు పరిహారం అందించడం అభినందనీయమే, కానీ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేది ఎప్పుడు? రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టక ముందు ఆత్మహత్య చేసుకున్న రైతుల సంగతి ఎలా? వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోదా? గతంలో సాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దెప్పుడు? లాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అప్రజాస్వామికంగా ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన ముఖ్యమంత్రి.. మరికొంత కాలానికి హైకోర్టు జోక్యం, మొట్టికాయలతో ఉద్యమకారులు ధర్నా చౌక్‌ను సాధించుకున్న తర్వాత, అదే చోట స్వయంగా ముఖ్యమంత్రి ధర్నా చౌక్‌లో కూర్చొని వరి పంటను కేంద్రం కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహించడం ఆశ్చర్యకరం. కాకతాళీయంగా తెల్లవారే ప్రధాని మోడీ వ్యవసాయ సాగు చట్టాలను వెనక్కి తీసుకుంటామని, సంవత్సర కాలంగా రైతులను ఇబ్బంది పెట్టినందుకు క్షమించాలని వేడుకుంటూ శీతాకాలపు పార్లమెంట్ సమావేశాలల్లోనే వ్యవసాయ చట్టాల రద్దు బిల్లును ప్రవేశపెడతామని మొసలి కన్నీరు కార్చారు. ఈ విషయం ముఖ్యమంత్రికి సొమ్ము చేసుకునే అవకాశం కల్పించింది. మేము చేసిన ధర్నా ఫలితంగానే కేంద్రం దిగి వచ్చిందని, వెంటనే నల్ల చట్టాలను రద్దు చేయడానికి సిద్ధమైందని ప్రగల్భాలు పలుకుతూ ఉత్తరాది రైతులకు నష్టపరిహారం ప్రకటించడం యావత్ భారతదేశాన్ని, ముఖ్యంగా తెలంగాణ ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది.

గత సంవత్సరం సెప్టెంబర్ 2020లో రైతుల ప్రయోజనాలకు భిన్నంగా కార్పొరేట్, పెత్తందారులకు ఉపయోగపడే విధంగా మూడు వ్యవసాయ సాగు చట్టాలను తీసుకువచ్చినప్పుడు పార్లమెంట్లో సమర్థించిన ముఖ్యమంత్రి, సంవత్సర కాలంగా 40 రైతు సంఘాలు కలిసి ఉద్యమం చేస్తుంటే, అట్టి రైతు ఉద్యమకారులపై అక్రమ కేసులు పెడుతున్నప్పుడు, రోడ్లపై నడవనీయకుండా మేకులు కొట్టినప్పుడు, కందకాలు తవ్వినప్పుడు, అనేక హింసాత్మక చర్యలు చేపట్టినప్పుడు, రైతాంగ ఉద్యమంపై అమానవీయంగా భౌతిక దాడులకు సైతం దిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా ఏనాడూ స్పందించని ముఖ్యమంత్రి, సాగు చట్టాలను వ్యతిరేకించని ముఖ్యమంత్రి పార్లమెంట్లో సమర్థించి ఇవాళ ఆ ఉద్యమంలో పాల్గొని అమరులైన 700 మంది రైతులకు పరిహారం ఇస్తామనడం ద్వంద్వనీతికి నిదర్శనం, ఇది దగాకోరుతనం... దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాన్ని విస్తృతం చేయడానికి ఉద్యమ సంఘాల నాయకులు రాకేష్ తికాయత్ రాష్ట్రానికి వచ్చినప్పుడు మర్యాద పూర్వకంగా కలిసి సంఘీభావం తెలపని వ్యక్తి, ఉత్తరప్రదేశ్‌లో లఖింపూర్ ఖేరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు

పోరాటాన్ని నిర్మించారు. రైతుల మనోధైర్యాన్ని దెబ్బకొట్టి ప్రజలలో వారిని అభాసుపాలు చేయడానికి రకరకాల అసత్య ప్రచారాలను లేవదీశారు. స్థానికులను రెచ్చగొట్టారు. హింసను సృష్టించారు. ప్రభుత్వం ఆందోళనకారులను ఆందోళన జీవులనీ, పరాన్న జీవులనీ, ఖలిస్థానీ వాదులనీ, టెర్రరిస్టులనీ, దేశద్రోహులనీ పలు పేర్లతో నిందించింది. జనవరి 26 రిపబ్లిక్ డే రోజున రైతులు ట్రాక్టర్ల పెరేడ్‌ను విజయవంతంగా నిర్వహించారు. కొంతమంది ఎర్రకోటపై జెండాను ఎగరేశారు. లఖింపూర్ ఖేరీలో గత నెల 3న శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అన్నదాతలపై కేంద్రమంత్రి కుమారుడు కారును పోనిచ్చి రైతులను హత్య చేశాడు. నలుగురు రైతులు, ఒక జర్నలిస్టు హత్యకు అశిష్ మిశ్రా కారణమయ్యాడు.

ఏడు వందల అరవై మంది రైతులు ప్రాణాలను అర్పించి పోరాటం కొనసాగించారు. నల్ల చట్టాలను చట్టబద్ధంగా రద్దు చేసేంతవరకూ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేంతవరకూ తమ నిరసన కొనసాగుతుందని పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సంఘర్షణ సమితి ప్రకటించింది.

ఉదాహరణకు వరిధాన్యానికి కనీస మద్దతు ధర ఎంఎస్‌పి అమలు లేకపోవడంతో ఎకరానికి పదివేలకు పైగా నష్టపోతున్నారు. రైతు వరిధాన్యాన్ని 75 కిలోల బస్తాను రు. 1,000 – 1,200కి విక్రయించవలసి వస్తుంది. కనీస మద్దతు ధర క్వింటాలుకు రు. 1,960 అంటే 75 కేజీలో బస్తాకు రు. 1,470 రావాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత ఉంటే బస్తా ధాన్యాన్ని రు. 1,470 కన్నా తక్కువకు కొనడానికి చట్ట ప్రకారం వీలు లేదు. ఒక్క బస్తాకు రు. 300 నుండి రు. 400 నష్టపోతున్నాడు. ఎకరానికి సగటున 30 బస్తాలు దిగుబడి ఉంటుందనుకుంటే, 9,000 నుండి 12,000 వరకు నష్టపోతున్నాడు. ఢిల్లీలో రైతుల పోరాటంలో 2018 నుండీ ప్రధాన డిమాండ్ ఇదే. నల్ల చట్టాలు, చట్టాల రద్దు కోసం పోరాటం, పోలీసు కేసుల రద్దు, లఖింపూర్ ఖేరీలో హత్యలు, 760 మంది రైతుల మరణం – నష్టపరిహారం – అన్నీ ప్రభుత్వ రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల దుర్మార్గపు విధానాల ఫలితమేనని మరువరాదు. చట్టాలను రద్దు చేశారని సందడిలో పడి అసలు డిమాండ్లను వదలరాదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేవరకూ పోరాడుతూనే ఉండాలి. ఆ పోరాటంలో భాగం కావడం మనందరి కర్తవ్యం.

(రచయిత నల్లమడ రైతు సంఘం నాయకులు, గుంటూరు) వీ

ఉద్యమం చేస్తున్న రైతులపై అహంకారపూరితంగా కారు నడిపినప్పుడు అసువులు బాసిన రైతుల పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూ కనీసం సంతాపం ప్రకటించని వారు అమరులైన రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామనడం అపహాస్యమే...

ఉత్తరాది రైతులకు నష్ట పరిహారం సరే, రాష్ట్ర ప్రజల మాటేంటి?

రైతు బీమా పథకానికి ముందు 2014 జూన్ 2 నుండి 7000 మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రతిరోజు కనీసం ఇద్దరు నుండి నలుగురు వరకు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. అయితే పట్టాదారు పాస్ పుస్తకం, పోస్టుమార్టం రిపోర్టు లాంటి 13 రకాల డాక్యుమెంట్లను పరిశీలించి కేవలం 1600 మందివే ఆత్మహత్యలుగా గుర్తించింది. బాధిత కుటుంబాలు పోరాటాలు చేయగా 1350 మంది రైతు కుటుంబాలకు ఆరు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. ఇంకనూ 250 మంది ఏడు సంవత్సరాలకు పైగా సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి కూడా ఆరు లక్షల రూపాయల చొప్పున 15 కోట్లు ఇస్తామని జిఓ నెంబర్ 194 జారీ చేసింది. జిఓ 194 ప్రకారం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి 5 లక్షలు కుటుంబ పోషణకు, ఒక లక్ష వన్ టైం సెటిల్మెంట్ కింద అప్పులు చెల్లించడానికి పంపిణీ చేయాల్సి ఉంది. బాధిత కుటుంబాల్లో పిల్లలు ఉంటే వసతి గృహాల్లో చేర్పించి చదివించాలి. పింఛన్లు, ఇల్లు లేని వారికి ఇంటిని మంజూరు చేయడం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి. ఇంతవరకు ఇవేవీ అందించకుండా తీవ్ర జాప్యం చేస్తూ ఉండటం విసుగెత్తిన బాధిత కుటుంబాలు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే, బడ్జెట్ లేకనే నిధులు విడుదల చేయటం లేదని ప్రభుత్వం జవాబు ఇవ్వడం, ధనిక రాష్ట్రం తెలంగాణలో లక్షల కోట్ల బడ్జెట్ తో నడుస్తున్న ప్రభుత్వం కేవలం 15 కోట్లు లేవని చెప్పటం హాస్యాస్పదం.

రైతు ఆత్మహత్యలుగా ప్రభుత్వం గుర్తించిన కుటుంబాలకు సాయం అందించేందుకు ప్రోసిడింగ్ లెటర్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా లేఖలు అందించడంతో వెంటనే డబ్బులు ఖాతాలో పడతాయని ఆశించిన కుటుంబాలకు 7 ఏళ్లు గడిచినా ఇంతవరకు డబ్బులు జమ చేయలేదు. బాధిత కుటుంబాల వారు అధికారుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చివరికి వివిధ జిల్లాలకు చెందిన 84 మంది బాధిత రైతు కుటుంబాలు కోర్టును కూడా ఆశ్రయించాయి. 2018 తర్వాత ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రైతు బీమా పథకం కింద 5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని అందిస్తున్నారు. ధనిక రాష్ట్రమని ప్రకటించుకునే తెలంగాణలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు కేవలం 15 కోట్లు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం బాధాకరం. రైతాంగ ఉద్యమంలో అసువులు బాసిన ఏడు వందల మంది రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో ఎలాంటి అభ్యంతరం లేదు కానీ అర్హత కలిగిన వారిగా గుర్తించిన తెలంగాణ రైతు కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయాన్ని అందించాలి.

ఇంకా 5400 మంది రైతులకు మొండి చేయి...

ప్రకృతి వైపరీత్యాలు, కల్తీ విత్తనాలు, ప్రభుత్వాల విధానాల వల్ల సాగు వ్యయం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోయి అప్పుల బాధ భరించలేక, వాటిని చెల్లించే స్థితిలో లేక, తీవ్ర ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడి తమ అమూల్యమైన జీవితాలను తృణప్రాయంగా విడిచిపెట్టిన అన్నదాతల ఆత్మహత్యలను ప్రభుత్వం గుర్తించలేదు. కఠిన నిబంధనలు అమలు చేసి ఎఫ్ఐఆర్, పాస్ బుక్ పోస్టుమార్టం రిపోర్ట్, ఫోరెన్సిక్ రిపోర్ట్ లాంటి తదితర 13 రకాల డాక్యుమెంట్లను పరిశీలించి రకరకాల కొర్రీలు పెట్టి వేలాది మంది రైతులను ఆత్మహత్యల జాబితా నుంచి తొలగించి అన్యాయం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో చాలామంది కూతురు పెళ్లి, బిడ్డల చదువు కోసం, ఇంటి నిర్మాణం కోసం అప్పుల పాలైన వారు.. తండ్రి పేరు మీద భూమి ఉన్న వారు, ఎఫ్ఐఆర్లో తప్పులు దొర్లిన వారు, కౌలు నామా లేనివారు 7000 మందిలో కేవలం 1600 మందివి ఆత్మహత్యలుగా గుర్తించి మిగతా రైతులను అర్హులుగా గుర్తించలేదు.

ఏడేళ్లలో ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకున్న నిరుద్యోగుల కుటుంబాలను, తెలంగాణ కోసం తొలి, మలి దశలో ఆత్మబలిదానం చేసుకున్న 1569 మంది కుటుంబాలను గుర్తించకుండా, ఎవరి త్యాగాల పునాదుల మీద నిలబడ్డామో వారిని ఆదుకోకుండా, గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్రంలో చేసిన వాగ్దానాలు ఉద్యోగ నియామకాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, దళితులకు 3 ఎకరాల భూమి, రైతు రుణమాఫీ లాంటి హామీలను అమలు చేయకుండా దాటవేస్తూ, విద్యా వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మాటల గారడీతో కాలం వెళ్లదీస్తున్న ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వం కార్పొరేటు పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా, ప్రజల మధ్య అంతరాలు పెంపొందించే విధంగా, లక్షల కోట్ల సంపదను తమ అనుయాయులకు రాయితీల పేరిట దోచి పెడుతున్న, కార్మిక సంక్షేమానికి విరుద్ధంగా గతంలో ఉన్న చట్టాల స్థానంలో నూతన చట్టాలను తీసుకువచ్చిన,లోక్ సభలోకానీ, రాజ్యసభలో గానీ ప్రజా సంక్షేమ అభివృద్ధికి విరుద్ధంగా తీసుకువచ్చిన ఏ బిల్లు గురించి అయినా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పల్లెత్తు మాట మాట్లాడకుండా, ఇంతవరకు ఎటువంటి బిల్లులను వ్యతిరేకించకుండా అకస్మాత్తుగా పరిహారం ప్రకటించడం, స్వరాష్ట్ర ప్రజలకు మేలు చేయలేనివారు బయటి రాష్ట్రాల వారికి మేలు చేస్తామనడం హాస్యాస్పదమే అవుతుంది.

స్వరాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు హామీ ఇచ్చిన మేరకు పరిహారం చెల్లించకుండా ఉత్తరాది రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామనడం కన్నతల్లికి గాజులు కొనలేని వారు పినతల్లికి బంగారు గాజులు కొంటాను అన్న చందమే అవుతుంది... సొంత రాష్ట్రంలో ఇవ్వవలసినవి ఇవ్వకుండా పంజాబ్ రైతులకు మేలు చేస్తామనడం, చట్టాలను వ్యతిరేకించకుండా, మరణించిన అమరులకు నష్ట పరిహారం ఇస్తామనడం మతిభ్రమించిన పరిస్థితి. మాటలతో కాలం వెళ్లదీస్తూ, మాటల వరకే పరిమితమై, మాట తప్పను అవసరమైతే తల నరుక్కుంటా అని భీకర ప్రకటనలు చేస్తూ, అబద్ధాలను సైతం ఆత్మ

పూర్తికావస్తున్న ఇంకనూ మొదలవలేదు. నిజంగా దళితుల పట్ల ప్రేమ, దయ ఉంటే గతంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలి. కానీ వారి ఓట్లు లక్ష్యంగా ఎన్నికల్లో గెలుపొందడం కోసం మాత్రమే, బడ్జెట్లో చర్చించకుండా సమగ్రమైన విధివిధానాలతో నిధులు కేటాయించకుండ హడావుడిగా ప్రకటించిన ప్రతిష్టాత్మక పథకం అమలు చేయడంలో వెనుకంజ వేయడం మరోసారి దళితులను దగా చేయడమే.

రైతుబంధు, రుణమాఫీ పథకాలు

రైతే దేశానికి వెన్నుముక అని, రైతు సంక్షేమమే మా ధ్యేయమని రైతు సుభిక్షంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పలు మాటలు చెబుతూ ప్రతిష్టాత్మకంగా రైతు బంధు, రుణమాఫీ పథకాలను తమ మానస పుత్రికలుగా ప్రకటించి అమలు చేయడంలో కాలయాపన చేస్తుండడం రైతన్నలకు ఇబ్బందికరంగా మారింది. రైతు బంధు పథకం ఆడ రైతులను, కౌలు రైతులను, పోడు భూములు సాగు చేసే వారిని గుర్తించకపోవడంతో ఆ పథకం ఉద్దేశం నెరవేరడం లేదు. భూస్వాములకు మాత్రమే లబ్ధి చేకూరేలా, లక్షలాది రూపాయలు వారికి అందజేసేలా మాత్రమే ఉంది. ఆరుగాలం కష్టించి, పంటలు పండించే రైతులకు రైతుబంధు సాయం అందడం లేదు. అలాగే రుణమాఫీ పథకం కూడా క్షేత్రస్థాయిలో కష్టపడే రైతులకు లబ్ధి చేకూరడం లేదు. ఆ రుణమాఫీ పథకం కూడా సకాలంలో అందచేయకపోవడం వల్ల వడ్డీల చెల్లింపు వరకు మాత్రమే ఉపయోగపడుతుందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పలు పథకాలను ప్రకటించి, హామీలిచ్చి ఆరంభ శూరత్వం గా ప్రారంభించి అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుంది.

ప్రకటనలకే పరిమితం అయిన సైనిక కుటుంబాల పరిహారం

ప్రతికూల వాతావరణంలో, రక్తం గడ్డ కట్టుకుపోయే స్థితిలో, కుటుంబ బాంధవ్యాలను వదిలి, దేశ ప్రజల రక్షణ కోసం సరిహద్దు ప్రాంతాలలో శత్రువులతో పోరాడుతూ వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలను తమ వంతు బాధ్యతగా ఆదుకుంటామని ఇచ్చిన హామీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు నెరవేర్చలేదు. గత సంవత్సరం 2020 జూన్ 15న గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన పోరాటంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సూర్యాపేట వాసి కల్నల్ సంతోష్ బాబుతో పాటు 19 మంది జవాన్లు కూడా వీర మరణం పొందారు. ఈ సందర్భంగా సైనికుల కుటుంబాలకు అండగా నిలబడాలని తెలంగాణ ప్రభుత్వం తరపున కల్నల్ సంతోష్ బాబు కుటుంబానికి5 కోట్ల రూపాయల పరిహారం, ఆయన భార్యకు గ్రూప్ 1 ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అదే ఘర్షణలో మృతి చెందిన 19 మంది అమర జవాన్ల కుటుంబాలకు కూడా ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షల రూపాయల పరిహారాన్ని అందజేస్తామన్నారు. ఈ పరిహారాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ద్వారా జవాన్ల కుటుంబాలకు అందజేస్తామని, సంతోష్ బాబు కుటుంబానికి నాలుగు రోజుల వ్యవధిలోనే సూర్యాపేటలోని ఆయన నివాసానికి ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లి చెక్కును అందజేశారు. కానీ మిగిలిన 19 మంది సైనికుల కుటుంబాలకు పరిహారం ఇస్తామని చెప్పి 18 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు అందజేయలేదు. నిజానికి గత ఏడాది ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి ఒక్కో కుటుంబానికి 10 లక్షల చొప్పున చెక్కులను సిఎంఓ అధికారులు సిద్ధం చేసినను, అందచేయకుండా కాలయాపన చేయడంతో చెక్కుల మూడు నెలల గడువు ముగిసి, అవి చెల్లకుండా పోయాయి అని సకాలంలో పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం జరిగిందని అధికారులు అంటున్నారు.

ముగింపు

నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుదీర్ఘ పోరాటం, తెలంగాణ అమరవీరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన స్వరాష్ట్రం ఏర్పాటుతో ఆశించిన ఆశయాలు, ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీలు నీటి మూటలు అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సమితి రెండవ సారి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అసమర్థ విధానాలతో లక్షల కోట్లు అప్పు చేసినా ఏ ఒక్క ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి చేయని ముఖ్యమంత్రి అని, కమీషన్ల కోసం కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు క్రమబద్ధీకరణ హామీ, కెజి టు పిజి ఉచిత విద్య హామీ, దళితులకు 3 ఎకరాల భూమి అందజేస్తామని ఇచ్చిన హామీ, నిరుద్యోగ భృతి హామీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజల అభివృద్ధికి పాటుపడతామని అభివృద్ధి పనులను చేపట్టడానికి కాంట్రాక్టు టెండర్లన్ని ఆంధ్ర కంపెనీలకు ఇవ్వడం, ఏడేళ్లయినా అమరవీరుల స్థూపం నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం, దేశ భవిష్యత్తును, భవిష్యత్ సమాజాన్ని తయారు చేయవలసిన కీలక భూమికను పోషించే విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, అతి తక్కువ నిధులు కేటాయిస్తూ, ఓటు బ్యాంకు కోసం ఉచిత సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతనిస్తూ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తూ, అంకెల గారడీతో అభివృద్ధి సూచికలో అందలం ఎక్కిస్తూ ధనిక రాష్ట్రమని ప్రచారం చేస్తూ, దగాకోరు మాటల గారడీతో బుట్టలో పడవేస్తారు.

ప్రజలను కల్లబొల్లి మాటలతో నమ్మించడంలో తనకు తానే సాటి. కష్టాలు తీరినట్లేనని హామీలు కురిపిస్తాడు, బతుకులు బంగారుమయం అవుతాయని భ్రమలు కల్పిస్తాడు. కానీ ఈ హామీలు నెరవేర్చడానికి నిధులు లేవని జాప్యం చేయడం ప్రభుత్వ దివాలకోరుతనానికి నిదర్శనం. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రాష్ట్ర ఏర్పాటులో ప్రజలు ఆశించిన ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేర్చడానికి తక్షణ చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో అందించాల్సిన, నెరవేర్చవలసిన హామీలను ముందుగా నెరవేర్చి, అటు తరువాత తోటి వారి గురించి ఆలోచిస్తే బాగుంటుంది, అంతేకానీ స్వరాష్ట్రంలో హామీలను నెరవేర్చకుండా ఉత్తరాది రైతులకు నష్టపరిహారం ఇస్తామనడం కూటిలో రాయి తీయలేనివాడు ఏటిలో రాయి తీయడమే అవుతుంది.

(రచయిత టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబాబాద్) వీ

భారత అప్రజాస్వామిక చట్టాల చరిత్ర

***వలసవాదుల అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక చట్టాలను కొనసాగిస్తున్న దేశ పాలకవర్గాలు చట్టాలను ఉపయోగించీ, చట్టవ్యతిరేకంగానూ సాగిస్తున్న దమననీతి చరిత్రను వివరిస్తున్నారు* ఎన్ వేణుగోపాల్**

భారత శిక్షా స్మృతిలోని రాజద్రోహ నేరం అనే సెక్షన్ 124, 1967లో పార్లమెంటు ఆమోదించిన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్ – యుఎపిఎ) అనే ఒక దుర్మార్గమైన చట్టం ఇటీవల చాల ఎక్కువగా చర్చలోకి వస్తున్నాయి. వలసవాదులు ప్రవేశపెట్టిన రాజద్రోహ నేరం ఇంకా కొనసాగడమా అని స్వయంగా భారత సర్వోన్నత న్యాయస్థానపు ప్రధాన న్యాయమూర్తి గర్జించారు. ఆ గర్జన వెలువడి నెలలు గడిచిపోతున్నాయి గాని దాని ఫలితంగా జరగవలసిన పని మాత్రం అంగుళం కూడ కదలలేదు. ఇక యుఎపిఎ కింద వేలాది మంది మీద ఏడాపెడా కేసులు పెట్టడం, ఏళ్ల తరబడి బెయిల్ కూడ లేకుండా జైళ్లలో నిర్బంధించి ఉంచడం అతి మామూలుగా జరిగిపోతున్నాయి.

నిజానికి ఈ రెండూ ఇటీవల కాస్త ఎక్కువగా చర్చలోకి వచ్చాయి గాని, భారతదేశంలో అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక, అమానుష చట్టాలూ నిబంధనలూ ఎన్నో ఉన్నాయి. వాటి చరిత్ర సుదీర్ఘమైనది. ఏ వర్గ సమాజం లోనైనా పాలకవర్గాలు పాలితులను అదుపులో ఉంచడానికీ, ప్రశ్నించేవారి మీద నిర్బంధం అమలు చేయడానికీ ప్రయత్నిస్తాయి. అందుకోసం అనేక రకాలైన అణచివేత విధానాలను అమలు చేస్తాయి. అందుకోసమే చట్టాలనూ, న్యాయవ్యవస్థనూ వినియోగించడం కూడ సర్వసాధారణమే. తాము ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలమనీ, చట్టబద్ధ పాలనను అమలు చేస్తున్నామనీ చెప్పుకునే పాలకవర్గాలు కూడ అటువంటి అణచివేత చట్టాలనే ప్రవేశపెడతాయి గాని వాటికి మేలి ముసుగులు తొడుగుతాయి, సమాజాన్ని తప్పుడు చైతన్యంలో ముంచి, సమ్మతి తయారీ చేసి, సమాజం అంగీకరించే శత్రువును బూచిగా చూపి అణచివేత చట్టాలు తయారు చేస్తాయి. చట్టం ఎదుట అందరూ సమానమేనని ఆదర్శాలు వల్లిస్తూనే, ఆ చట్టాలను కొందరి మీద మాత్రమే ఎంచుకుని మరీ అమలు చేస్తుంటాయి. ఆ చట్టాలలో ఉద్దేశపూర్వకంగానే అస్పష్టత వదిలి, వాటిని ప్రకటిత లక్ష్యాల నుంచి దూరం జరిపి దుర్వినియోగం చేస్తుంటాయి. చట్టబద్ధంగానూ చట్టవ్యతిరేకంగానూ దారుణ దమనకాండను అమలు జరుపుతుంటాయి.

దేశ చరిత్రలో వందల సంవత్సరాల పాటు రాచరికమే రాజ్యమేలింది గనుక అప్పుడు చట్టం ఉండవలసిన అవసరమే రాలేదు. రాజు ఏది తలచుకుంటే అదే చట్టం. రాజు సర్వసాధారణంగా భూస్వామ్య ప్రయోజనాల కోసమైనా, వ్యక్తిగత ఇష్టాయిష్టాల ప్రకారమైనా మతాన్ని ఆశ్రయించడం జరిగేది. హిందూ మతాధిపత్యం అంటే మనుస్మృతి ఆధిపత్యమే గనుక అది విధించిన శిక్షాస్మృతే, ఇతర స్మృతులు ఆదేశించిన ధర్మమే, ప్రధానంగా వర్ణాశ్రమ ధర్మమే అధికార శిక్షాస్మృతిగా చలామణీ అయింది. ఒకే నేరానికి నేరస్తుడి పుట్టుకను బట్టి కొందరికి భయానకమైన శిక్షలూ, కొందరికి ఎటువంటి శిక్షలూ లేని అసమ న్యాయం అమలయింది. స్వధర్మాన్ని ఆచరించడం శ్రేయోదాయకమని, పరధర్మాన్ని ఆచరించడం భయానకమని చెప్పిన ఆదేశమే చట్టంగా అమలయింది. క్రమంగా పదో శతాబ్ది తర్వాతి కాలానికి కొన్ని ప్రాంతాలలో హిందూ మతం స్థానంలో ఇస్లాం రాజ్యాధికారానికి వచ్చినా మత ధర్మాన్ని, అసమానతను పాటించే న్యాయవ్యవస్థ పరిస్థితిలో పెద్ద మార్పు రాలేదు. భూస్వామ్య, రాచరిక న్యాయమే ప్రాచుర్యంలో ఉండింది.

బ్రిటిష్ వలస వాదులే, తమకు అప్పటికే ఏర్పడి ఉండిన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక అంగమైన న్యాయవ్యవస్థను, చట్టబద్ధ పాలన అనే భావనను భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలోనే పదిహేడో శతాబ్ది చివరిలో మొదలైన న్యాయవ్యవస్థ, మెకాలే అధ్యక్షతన 1835లో ఏర్పడిన లా కమిషన్ తో బలమైన నిర్మాణాన్ని సంతరించుకుంది. అప్పుడే మెకాలే తయారు చేసిన భారత శిక్షా స్మృతి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం తర్వాత 1860 నుంచి అమలు కావడం ప్రారంభమైంది.

ఆ భారత శిక్షా స్మృతే 1947 తర్వాత కూడా చిన్న చిన్న మార్పులతో కొనసాగింది. భారత ప్రజలను శత్రువులుగా భావిస్తూ తయారైన ఆ శిక్షా స్మృతిని, వలసవాద వ్యతిరేక ఉద్యమ కారులను శిక్షించడానికీ, జైళ్లలో నిర్బంధించి ఉంచడానికీ తయారైన ఆ శిక్షా స్మృతిని దాదాపు యథాతథంగా 1947 తర్వాత కూడా కొనసాగించారు. రౌలట్ చట్టాలకు, అప్రజాస్వామిక చట్టాలకు, ముందస్తు నిర్బంధాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు నడిపిన కాంగ్రెస్ పార్టీ, ఆ చట్టాల కింద తన నాయకులే వేలాది మంది నిర్బంధాలకు గురి కాగా, తాను అధికారంలోకి రాగానే ఆ చట్టాలను రద్దు చేస్తుందని, సవరిస్తుందని ఎవరైనా ఆశిస్తారు. కాని స్వయంగా ఆ నిర్బంధాలు అనుభవించిన జవహర్ లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిత్వంలో, ఆయన కుటుంబ పాలనలో అక్రమ చట్టాల కొనసాగింపు, కొత్త అక్రమ చట్టాల ప్రవేశం యథావిధిగా జరిగిపోయాయి.

ఆ అక్రమ చట్టాల గురించి చర్చించబోయే ముందు, అసలు ఆ చట్టాలకు చట్టబద్ధత ఇచ్చే రాజ్యాంగంలోనే ప్రవేశించిన అప్రజాస్వామికత గురించి కొంత తెలుసుకోవాలి. అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, మూడు సంవత్సరాలు చర్చించి, ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు వంటి ఉదాత్తమైన అంశాలతో తయారైన రాజ్యాంగం కొన్ని అప్రజాస్వామిక అంశాలకు కూడ అవకాశం కల్పించింది.

మొట్టమొదటగా, రాజ్యాంగంలో అద్భుతమైన ప్రాథమిక హక్కుల హామీ ప్రవేశపెట్టినప్పటికీ, ఆ హక్కుల హామీతో పాటే, ఆ హక్కుల మీద ఆంక్షలు విధించే అధికారం కూడ ప్రభుత్వానికి ఇచ్చారు. ఇప్పుడు అధికరణం 19గా ఉన్న వాక్సభా స్వాతంత్ర్యాల అధికరణం రాజ్యాంగ ముసాయిదాలో అధికరణం 13గా ఉండేది. దానిలో క్లాజు 1 భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ, సభలు, సమావేశాలు పెట్టుకునే స్వేచ్ఛ, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, ఎక్కడికైనా ప్రయాణించే స్వేచ్ఛ, ఎక్కడైనా స్థిరపడే స్వేచ్ఛ వంటివాటికి హామీ ఇస్తుండగా, దానిలోని క్లాజు 2 నుంచి క్లాజు 6 వరకు ఆ స్వేచ్ఛల మీద "సహేతుకమైన ఆంక్షలు విధించడానికి" రాజ్యానికి అధికారం ఉందని మెలిక పెట్టింది. ఆ అధికరణం మీద 1948 డిసెంబర్ 1, 2 తేదీల్లో చాల వివరమైన చర్చలు జరిగాయి. చాల మంది సభ్యులు ఈ క్లాజులను కొట్టివేయాలని వాదించారు. ఈ క్లాజులు ఉండడమంటే ఒకచేత్తో ఇస్తున్న హక్కులను రెండో చేత్తో లాగేయడమేనని అన్నారు. ఈ క్లాజులు వాక్సభా స్వాతంత్ర్యాలకు గొడ్డలిపెట్టు అనీ, అనుచితమనీ, నిన్నటిదాకా పరాయి ప్రభుత్వం చేసిన పనిని కొనసాగించడమేననీ అన్నారు. చాల తీవ్రమైన, విస్తారమైన చర్చ జరిగినప్పటికీ, పౌరహక్కులకు సంబంధించి మౌలికమైన భావనలెన్నో చర్చకు వచ్చినప్పటికీ, ఆ విమర్శలనూ, సవరణల ప్రతిపాదనలనూ తిరస్కరించి ఆ అధికరణాన్ని ఆమోదించారు.

అంటే పౌర, ప్రజాస్వామిక, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకూ అణచివేతకూ, అందుకోసం చేసిన చట్టాలకూ రాజ్యాంగ రచనలోనే, అధికరణం 13 క్లాజులు 2-6ల (ప్రస్తుతం అవి అధికరణం 19 క్లాజులు 2-6) తోనే పునాది పడింది. అయితే రాజ్యాంగ అధికరణం 19 లోని క్లాజులు 2-6, దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, రాజ్య భద్రత, సామాజిక శాంతి భద్రతలు, విదేశాలతో సంబంధాలు వంటి ప్రత్యేక సందర్భాలలో ప్రాథమిక హక్కులపై "సహేతుకమైన ఆంక్షలు విధించడానికి" ప్రభుత్వానికి అధికారం ఉందని చెపుతుండగా, ఆ ప్రత్యేక సందర్భాలు ఉన్నా లేకపోయినా, ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా నిర్హేతుకమైన ఆంక్షలు విధించడం, అసలు ఆంక్షలు విధించడం కూడ కాకుండా హక్కులను గుండుగుత్తగా రద్దు చేయడం జరుగుతున్నాయి.

అలాగే ప్రాథమిక హక్కులలో భాగంగా వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుకు హామీ ఇచ్చే అధికరణం 22 (రాజ్యాంగ నిర్ణయ సభ చర్చలలో అధికరణం 15ఎ) న్యాయసమీక్ష లేకుండా ఏ వ్యక్తినీ 24 గంటల కన్న ఎక్కువ సమయం నిర్బంధించే అధికారం పోలీసులకు లేదని హామీ ఇస్తుండగా, (3)(బి) మాత్రం ముందస్తు నిర్బంధ (ప్రివెంటివ్ డిటెన్షన్) చట్టాలకు ఈ సూత్రం వర్తించదని మెలిక పెట్టింది. 1949 సెప్టెంబర్ 15న ఈ మెలిక మీద జరిగిన చర్చలో ఇది పరాయి ప్రభుత్వ నిర్బంధ విధానానికి కొనసాగింపు అనీ, దీన్ని రాజ్యాంగంలో చేర్చగూడదనీ చాల మంది సభ్యులు వాదించారు. ఈ నిబంధ విధించే ముందు రచనా కమిటీ అధ్యక్షులు డా. బి ఆర్ అంబేడ్కర్ ఎన్నడైనా జైలు జీవితం అనుభవించారా అని ఒక సభ్యుడు నేరుగా అడిగారు. అప్పటికి తనకా అవకాశం రాలేదని ఆయన జవాబివ్వగా, "బ్రిటిష్ ప్రభుత్వం మీకు ఆ అవకాశం ఇవ్వలేదు గాని, ఇప్పుడీ నిబంధన ద్వారా మీకు ఆ అవకాశం వస్తుంది లెండి" అని ఆ సభ్యుడు వ్యాఖ్యానించారు.

నిజానికి ముందస్తు నిర్బంధ అనేది సహజ న్యాయానికి పూర్తిగా వ్యతిరేకమైనది. ఎవరినైనా నేరం చేసిన తర్వాత నిర్బంధించవచ్చు, ఆ నేరానికి విచారించవచ్చు. కాని అసలు నేరం జరగకుండానే ఒకరిని నేరం చేస్తారేమోననే అనుమానంతో నిర్బంధించడం, నేరం చేయాలనే ఆలోచన వారి మనసులో ఉందని ఊహించడం, ఏ నేరమూ జరగలేదు గనుక న్యాయస్థాన విచారణకు కూడ అవకాశం లేకపోవడం జరుగుతున్నదన్నమాట. అంటే ఏ నేరం చేయకుండానే, కేవలం పోలీసుల, ప్రభుత్వాధికారుల అనుమానం మీద మాత్రమే ఎవరినైనా అరెస్టు చేసి, విచారణ కూడ లేకుండా జైలు పాలు చేయడానికి అవకాశం వస్తుందన్నమాట. ఇది అమానుషం, అప్రజాస్వామికం, నిరంకుశం. నేరానికి నిస్సందేహమైన సాక్ష్యాధారాలతో కూడిన విచారణ జరగాలనీ, నేరం రుజువైతేనే శిక్ష విధించాలనీ, రుజువయ్యేవరకూ అనుమానితులు నిరపరాధులనే అనుకోవాలనీ భావించే సహజ న్యాయసూత్రాల నైతికతకు వ్యతిరేకం. అసలు శిక్ష కూడ దండన లాగ కాక, పరివర్తన కోసం ఉండాలని భావించే చోట నిరోధం పేరిట దండన అమలయ్యే తలకిందుల న్యాయం ఇది. కాని ఇది రాజ్యాంగబద్ధంగా మారిపోయింది. ప్రపంచంలో తనను తాను ప్రజాస్వామికమని చెప్పుకునే ఏ ఒక్క దేశమూ ఇలా కారణాలు చూపని ముందస్తు నిర్బంధాన్ని రాజ్యాంగంలో భాగం చెయ్యలేదు. అలా చేయడం భారత దేశపు ఘనత.

ఆ అధికరణాలు అలా ఉండగానే, రాజ్యాంగంలోని ఎమర్జెన్సీ ప్రత్యేక అధికారాలు అధ్యాయం 18 (అధికరణాలు 352 -360) లోని అధికరణం 358 మొత్తంగా ప్రాథమిక హక్కుల అధ్యాయాన్నే తాత్కాలికంగా ఉపసంహరించడానికి కూడ ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది. అసలు ఈ అధ్యాయంలోని అధికరణాలన్నీ కూడ దేశంలో ప్రజల హక్కులను మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కూడ కొల్లగొడుతూ, కేంద్ర ప్రభుత్వానికి సర్వాధికారాలు ఇస్తూ అత్యంత అప్రజాస్వామిక ప్రవర్తనకు అవకాశం ఇచ్చాయి. ఇందిరా గాంధీ 1975 జూన్ 25 నుంచి 1977 మార్చ్ 21 దాకా అమలు చేసిన చీకటిపాలన ఈ రాజ్యాంగ బద్ధ అధికారాన్ని వినియోగించుకుని సాగినదే. వీటిలో భాగమే దేశంలో భిన్నమైన రాజకీయ పక్షాలు రాష్ట్ర ప్రభుత్వాల అధికారంలో ఉన్నప్పుడు వాటిని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన పేరిట కేంద్ర ప్రభుత్వ పాలన సాగించడానికి అవకాశం ఇచ్చే దుర్మార్గమైన, సమాఖ్య స్వభావానికి వ్యతిరేకమైన అధికరణం 356.

ఒక్కమాటలో చెప్పాలంటే, "భారత ప్రజలమైన మాకు మేము ఇచ్చుకున్న రాజ్యాంగం"లోని ప్రాథమిక హక్కులు, వివిధ రాష్ట్రాలకు ఉండే సమాఖ్యరాజ్యపు హక్కులు అన్నీ కూడ ఆయాకాలాల్లో అధికారంలో ఉండే ప్రభుత్వాల, ఇంకా చెప్పాలంటే పార్టీల, నాయకుల దయా దాక్షిణ్యాల మీద మాత్రమే ఆధారపడి ఉండే స్థితికి రాజ్యాంగమే అవకాశం కల్పించింది.

ప్రాథమిక హక్కుల అధ్యాయాన్ని దాటి ముందుకు వెళితే, అద్భుతమైన ఆదేశిక సూత్రాల అధ్యాయం ఉంది. సంక్షేమ రాజ్యం, జీవన భద్రత, సామాజిక శ్రేయస్సుకు అనుకూలమైన, సంపద పోగుపడని ఆర్థిక వ్యవస్థ, సమాన పనికి సమాన వేతనం, అవమానకరమైన పనులు చేయడానికి ఒత్తిడిచేయని ఆర్థిక పరిస్థితులు, బాలకార్మిక వ్యవస్థ రద్దు, ఉచిత న్యాయ సహాయం, పని హక్కు, పద్నాలుగేళ్ల లోపు బాలలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య

వంటి ఎన్నో సమసమాజ ఆదర్శాలు ఉన్న అధ్యాయం అది. కాని ఇన్ని ఉదాత్త ఆదర్శాలు వల్లించి, ఇవి పాలనలో సాధించవలసిన లక్ష్యాలు మాత్రమేననీ, ఇవి అమలు చేయనందుకు పాలకులను న్యాయస్థానంలో నిలదీయడానికి వీలులేదనీ (ఆదేశిక సూత్రాల నాన్ జస్టిసియబిలిటీ) అక్కడే రాయడం అప్రజాస్వామికతకు నిదర్శనం.

ఇవన్నీ దేశ ప్రజలకూ, దేశంలోపలి పాలనకూ సంబంధించినవి కాగా, రాజ్యాంగ అప్రజాస్వామికతకు మరొక కొట్టవచ్చే సూచిక అధికరణం 1 లోనే ఉంది. భారతదేశం అంటే ఏమిటో నిర్వచిస్తూ, "సాధించబోయే ఇతర ప్రాంతాలు" అనే మాట ఉంది. రాజ్యాంగ ఆమోదం పొందిన 1949 నవంబర్ 26 నాటికి స్వదేశీ సంస్థానాలన్నీ భారతదేశంలో కలిసిపోయాయి. ఫ్రెంచ్ పాలనలో ఉన్న పుదుచ్చేరి, పోర్చుగీస్ పాలనలో ఉన్న గోవా వంటి చిన్న ప్రాంతాలు మినహా "సాధించబోయే ప్రాంతాలు" పెద్దగా ఏమీ లేవు. శాంతి అహింసలకు నిలయమైన దేశమనీ, ఏ పొరుగు దేశం మీదా దురాక్రమణ చేయని దేశమనీ గొప్పలు చెప్పుకునే భారత పాలకులు, ఇతర ప్రాంతాలను ఆక్రమించుకుంటే అవి భారతదేశంలో భాగమైపోతాయనే ఈ నిబంధనను రాసుకోవలసిన అవసరమే లేదు. కాని పొరుగుప్రాంతాల ఆక్రమణను ఈ నిబంధన రాజ్యాంగబద్ధం చేసింది. స్వతంత్ర రాజ్యమైన సిక్కిం ను 1975 ఏప్రిల్ లో ఆక్రమించుకుని దేశంలోని ఒక రాష్ట్రంగా మార్చివేయడం రాజ్యాంగంలోని ఈ అప్రజాస్వామిక అధికరణం ప్రకారమే జరిగింది.

రాజ్యాంగంలోని అప్రజాస్వామిక అంశాలు అలా ఉంచి, రాజ్యాంగ సవరణల ద్వారా, చట్టాల ద్వారా, చట్ట సవరణల ద్వారా ఎన్నెన్నో అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక, నిరంకుశ అధికారాలను భారత రాజ్యం సమకూర్చుకుంది. ప్రజల హక్కులను దుర్మార్గంగా కొల్లగొట్టింది.

మొట్టమొదటి రాజ్యాంగ సవరణను 1951 మే 10న అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అది జూన్ 18న చట్టంగా మారి అమలులోకి వచ్చింది. దాదాపు పది అధికరణాలలో మార్పులు చేసిన, రెండు అధికరణాలను కొత్తగా చేర్చిన ఈ సవరణ ద్వారా ఇంతకు ముందు చెప్పిన అధికరణం 19 లో "రాజ్య భద్రత, విదేశాలతో మైత్రీ సంబంధాలు, సామాజిక శాంతిభద్రతలు, మర్యాద, నైతికత వంటి ప్రయోజనాల కోసం, న్యాయవ్యవస్థ ధిక్కారం, పరువునష్టం, నేరానికి పురికొల్పడం వంటి వాటికి సంబంధించిన అవసరాల కోసం" ప్రాథమిక హక్కుల అమలుపై "సహేతుకమైన ఆంక్షలు విధించడానికి" ప్రభుత్వానికి అధికారం ఉందని చేర్చారు. ఈ న్యాయశాస్త్ర సంక్లిష్ట పదజాలాన్ని సులభంగా చెప్పాలంటే, రాజ్య భద్రత, శాంతి భద్రతలు అనే కారణాల బూచి చూపి ప్రాథమిక హక్కులపై కత్తెర విధించవచ్చు అని ఈ రాజ్యాంగ సవరణ నిర్దేశించిందన్నమాట. మొట్టమొదటి రాజ్యాంగ సవరణ ఉద్దేశం ప్రజల హక్కులను కొల్లగొట్టడానికి ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడమన్నమాట.

ఇక్కడ సందర్భవశాత్తూ ఇంకొక విచిత్రమైన విషయం గుర్తు చేసుకోవాలి. అమెరికాలో కూడ మొట్టమొదటి రాజ్యాంగ సవరణకు చాల ప్రాధాన్యత ఉంది. అమెరికన్ రాజ్యాంగానికి 1791లో జరిగిన మొట్టమొదటి సవరణ భావప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను, ప్రజలకు ఉన్న సమావేశ స్వేచ్ఛను, తమ ఫిర్యాదులను పరిష్కరించమని ప్రభుత్వాన్ని కోరే స్వేచ్ఛను నిషేధించడానికి, తగ్గించడానికి చట్టసభ ఎటువంటి చట్టాలూ చెయ్యదు అని. అంటే మొదటి అమెరికన్ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి కచ్చితంగా వ్యతిరేకమైన స్ఫూర్తితో భారత రాజ్యాంగ మొదటి సవరణ జరిగింది.

ఈ నేపథ్యంలోనే భారత అప్రజాస్వామిక చట్టాల చరిత్రను అధ్యయనం చేయాలి. దేశంలో కేంద్ర ప్రభుత్వానికైనా, రాష్ట్ర ప్రభుత్వాలకైనా అధికారం ఇచ్చేది, ఆ అధికారపు అవకాశాలనూ పరిమితులనూ నిర్దేశించేదీ రాజ్యాంగమే గనుక రాజ్యాంగంలో ఎంతమేరకు అప్రజాస్వామికత ఉందో ఆ అప్రజాస్వామికత గత ఏడు దశాబ్దాల పాలనలో ప్రతిబింబించింది.

ఈ చట్టాల చరిత్ర ఆశ్చర్యకరంగా రాజ్యాంగం అమలులోకి వచ్చి సరిగ్గా నెల తిరగకుండానే మొదలైంది. జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వస్తే, ఫిబ్రవరి 26న భారత ప్రభుత్వం ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని అమలు లోకి తెచ్చింది. జాతి భద్రతకూ రక్షణకూ ప్రమాదం ఏర్పరచగల వ్యక్తులను ముందస్తుగా నిర్బంధించడానికీ, కారణం చెప్పకుండానే మూడు నెలల నుంచి ఏడాది వరకూ ఆ నిర్బంధాన్ని కొనసాగించడానికీ ప్రభుత్వానికి ఈ చట్టం అధికారం ఇచ్చింది. జాతి భద్రత, రక్షణ అనే ఏ అర్థమైనా చెప్పగల అస్పష్ట మాటలు వాడి, ఈ అక్రమ చట్టాన్ని ఎవరి మీదనైనా ప్రయోగించడానికి అవకాశం మిగుల్చుకున్నారు. ఈ చట్టం కింద నిర్బంధం న్యాయస్థానం ముందుకు రాదు, హైకోర్టు న్యాయమూర్తి స్థాయి వ్యక్తులతో ఏర్పాటు చేసిన సలహా మండలి ముందు ఈ నిర్బంధం విచారణకు వస్తుంది. అప్పటికే జైలులో ఉన్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఎ కె గోపాలన్ ను ఈ చట్టం కింద మళ్లీ అరెస్టు చేస్తున్నట్టు మార్చ్ 1న ఆదేశాలు ఇచ్చారు. ఆయన ఆ ఆదేశాలను సవాల్ చేయగా సుప్రీం కోర్టు ఆ చట్టంలో ఒక నిబంధన చెల్లకపోయినా, మొత్తం చట్టం చెల్లుతుందని తీర్పు చెప్పింది. ఈ చట్టానికి 1969లో కాలం చెల్లిందని పాఠ్యపుస్తకాలు చెపుతాయి గాని, ఇప్పటికీ ఈ చట్టం కింద నిర్బంధాలు జరుగుతూనే ఉన్నాయి.

బహుశా 1969లో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం రద్దయినందువల్లనో, లేక అప్పటి రాజకీయ సందర్భం వల్లనో 1971లో భారత ప్రభుత్వం ఆంతరంగిక భద్రతా చట్టం (మేంటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ ఆక్ట్ – మీసా) అనే చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఇది కూడ జాతీయ భద్రతా నిర్వహణ ప్రయోజనాల కోసం, జాతీయ భద్రతకు భంగకరంగా ఉండబోతారని అనుమానించినవారిని నిర్బంధించడానికి ఉద్దేశించినదే. అంటే మరొక రకంగా ముందస్తు నిర్బంధ చట్టమే. అయితే ఈ చట్టాన్ని, ముఖ్యంగా జాతీయ భద్రత అనే పదబంధాన్ని ప్రభుత్వం, పోలీసులు ఇష్టారాజ్యంగా నిర్వచించారు. పాలకపక్షానికి వ్యతిరేక భావాలు ఉన్నవారిని, అప్పటికి ప్రారంభమైన నక్సల్బరీ విప్లవోద్యమ సానుభూతిపరులను, తమకు గిట్టనివారందరినీ మీసా కింద నిర్బంధించడం 1971 నుంచి విచ్చలవిడిగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ లో 1973లో విప్లవ రచయితలను (చెరబండరాజు, ఎంటి ఖాన్, వరవరరావు) ఈ మీసా చట్టం కిందనే అరెస్టు చేశారు. ఎమర్జెన్సీలో దేశ వ్యాప్తంగా ఒక లక్ష మందిని మీసా కిందనే నిర్బంధించారు. అలా ఎమర్జెన్సీలో మీసా కింద నిర్బంధించబడిన వారిలో కొందరు జనతాపార్టీ నాయకులై, 1977లో జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చేపట్టిన తర్వాత మీసాను రద్దు చేశారు.

విశ్వాసంగా బల్లగుద్ది చెబుతూ, ఢిల్లీలో ఒక మాట, హైదరాబాద్‌లో మరో మాట మాట్లాడుతూ, అక్కడ పాలాభిషేకాలు, సన్మానాలు చేయడం, హైదరాబాదులో కేంద్ర పాలకులపై అవాకులు చవాకులు మాట్లాడుతూ, అగ్గి రాజేస్తాం, ఇక కేంద్రంపై యుద్ధమే అంటూనే ఢిల్లీ నిర్ణయాలకు సానుకూలతను వ్యక్తం చేస్తూ ఒకవైపు, మరోవైపు ప్రజల దృష్టిని మరలుస్తూ, పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నిందలు వేస్తూ రాష్ట్ర ప్రజల సానుభూతిని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుండటం ముఖ్యమంత్రి గారి నైజం. గతంలో ఇచ్చిన వాగ్దానాలు మాటల వరకే పరిమితం అయ్యాయి, కానీ ఏనాడు ఆచరణలోకి రాలేదు. మాటలు కోటలు దాటుతాయి కాని చేతులు గుమ్మాలు దాటవు. కెసిఆర్ హామీలలో విశ్వసనీయత లేదు. గత ఏడు సంవత్సరాలుగా స్వయంగా ముఖ్యమంత్రి గారు వివిధ సభలలో, అసెంబ్లీలో, ఎన్నికల మేనిఫెస్టో సందర్భంలో ప్రకటించిన హామీలు ఏమేరకు అమలు అయ్యాయో, నెరవేరాయో మచ్చుకు కొన్నింటిని పరిశీలిద్దాం...

డబుల్ బెడ్ రూమ్స్ నిర్మాణం

2014లో 32 పేజీల, 2018లో పదహారు పేజీల ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి తెలంగాణ ప్రజలకు హామీల వర్షం కురిపించారు. ఇంట్లో ఆలుమగలు కాపురం చేయడం కష్టం. అల్లుడు, బిడ్డ వస్తే తలదాచుకునేది ఎలా? గత పాలకులు ఇరుకైన ఇళ్లను పేదలకు ఇచ్చారని, తెరాస అధికారంలోకి రాగానే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తామని రెండు దఫాల ఎన్నికలలో ఇచ్చిన హామీ ఇంతవరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. నేను వస్తే నాకు కోడిని కొయ్యాలి, కల్లు తేవాలే, దావత్ ఇవ్వాలి అని 2015 వరంగల్ సభలో హామీ ఇచ్చి ఆరున్నర సంవత్సరాలు పూర్తి గావస్తున్నప్పటికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వలేకపోయారు. 2014లో నిర్వహించిన సమగ్ర సర్వే ప్రకారం 26.31 లక్షల మంది ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్రంలో ఉన్నారని తెలిపిన ప్రభుత్వం, కనీస అవసరమైన ఇళ్లను నిర్మించి పేదలకు అందించడంలో విఫలమయ్యారు. పైగా కేంద్రం 2 లక్షల 11 వేల ఇండ్లను తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేస్తే అర్హత ఉన్న లబ్ధిదారుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించకుండా నిర్లక్ష్యం వహించడం ప్రజా ప్రగతికి నిరోధం....

దుబ్బాక, జిహెచ్ఎంసి ఎన్నికల్లో దెబ్బతిన్నా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు, నాగార్జునసాగర్ ఎన్నికలలో గెలవడానికి కారణం ముఖ్యమంత్రి హామీలు.. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక సందర్భంగా ఏప్రిల్ 14, 2021 హాలియా బహిరంగ సభలో అనేక హామీల వరాల జల్లు కురిపించారు. 2018 నవంబర్ 27న ఇదే హాలియాలో జరిగిన బహిరంగ సభలో కూడా అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా హామీల పర్వం కొనసాగింది. మొత్తం 134 గ్రామ పంచాయతీలకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుండి గ్రామానికి 20 లక్షల చొప్పున ఇస్తామని, ప్రతి మండలానికి 30 లక్షల చొప్పున, నేరేడుచర్ల మున్సిపాలిటీకి 15 కోట్లు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ 25 కోట్లు మంజూరు చేసి జిఓలు విడుదల చేసినను, నిధులు విడుదల చేయలేదు. అలాగే ఇరిగేషన్ భూముల సమస్య పరిష్కారం, ఇండ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇస్తామని, నందికొండలో డిగ్రీ కళాశాల, హాలియాలో షాదీఖానా, కబరిస్తాన్ నిర్మాణం ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పింఛను, ఇఎస్ఐ ఆసుపత్రి మంజూరు లాంటి హామీలు కురిపించి గెలుపొందిన తర్వాత వాటి ఊసెత్తక పోవడం ఏరు దాటే దాకా ఓడ మల్లయ్య ఏరు దాటాక బోడి మల్లయ్య చందమే....

ఉద్యోగ నియామకాలు

నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాధాన్యాలుగా రగిలిన తెలంగాణ ఉద్యమం 60 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్నను, ప్రజలు, విద్యార్థులు స్వప్నించిన స్వరాష్ట్ర ఏర్పాటుతో తమ ఆశయాలు ఫలించలేదని, ఉద్యోగ నియామకాలు ఆశించిన మేరకు లేవని ఆందోళనతో, వయసు భారమైపోతున్నా, ఉద్యోగాలు లభించడం లేదని నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడటం హృదయ విదారకం. ఉద్యమకాలంలో లక్షల ఉద్యోగాలు తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు దక్కుతాయని, ఇంటికో ఉద్యోగం లభిస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని డంకా భజాయించిన ప్రభుత్వం, అసెంబ్లీ సాక్షిగా ఎలాంటి హామీ ఇవ్వలేదని అబద్ధాలాడి దాటవేయడం ఇబ్బందికరం. ఏడేళ్ల కాలంలో ఒకే ఒక టిఆర్‌టి వేసి అందులో కొన్ని పోస్టులకు మాత్రమే అభ్యర్థులను నియమించి పూర్తిస్థాయిలో ప్రకటించిన పోస్టులను సైతం నింపక పోవడం వల్ల, పరీక్ష రాసి అర్హత సాధించిన, నియామక పత్రం అందకపోవడంతో నిరుద్యోగులు రాష్ట్ర కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతూ ఉండడం విధితమే. విద్యాశాఖలో ఉపాధ్యాయ ఖాళీలు 39093 ఉన్నప్పటికీ, వాటిని నింపకుండా నిర్లక్ష్యం చేయడంతో ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులు నిరాశా నిస్పృహలతో ఎదురుచూస్తున్నారు. ఇటీవల 80 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేస్తామని ప్రకటించిన ప్రకటనలు ఇంతవరకు ఆచరణలోకి రాలేదు.

దళితబంధు పథకం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత పాలకులు దళితులను నిర్లక్ష్యం చేశారని, వారి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించలేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి అందజేసి వారినీ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని ఇచ్చిన హామీని, దళితున్ని ముఖ్యమంత్రిగా చేస్తానని రాష్ట్ర అభివృద్ధి పట్ల, సంక్షేమం పట్ల నేను కాపలా కుక్కలాగా ఉండి తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతానని ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, హుజురాబాద్ ఎన్నికల లక్ష్యంగా దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టడం, రాష్ట్రంలో 119 నియోజక వర్గాలలో ఒక్కో నియోజక వర్గంలో 100 దళిత కుటుంబాల చొప్పున మొత్తం 11,900 కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని ఈ యేదాది ఆగస్టులో ప్రకటించింది. హుజురాబాద్ ఎన్నికల ముందు ఒక్కో నియోజకవర్గంలో వంద దళిత కుటుంబాలను ఎంపిక చేస్తామని చెప్పిన ప్రభుత్వం తర్వాత అన్ని దళిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని, ఈ ఏడాది నవంబర్ 4 నుంచి పథకాన్ని అమలు చేస్తామని చెప్పి డిసెంబర్

కాని 1980లో తిరిగి అధికారంలోకి రాగానే ఇందిరాగాంధీ జాతీయ భద్రతా చట్టం (నేషనల్ సెక్యూరిటీ ఆక్ట్ – నాసా) పేరుతో మీసా నిబంధనలతోనే మరొక ముందస్తు నిర్బంధ చట్టాన్ని ప్రవేశ పెట్టారు. ఈ చట్టం కింద దేశవ్యాప్తంగా ఎందరో కార్మిక నాయకులను, విప్లవోద్యమ నాయకులను, ప్రతిపక్ష నాయకులను కూడ నిర్బంధించారు.

ఖలిస్తాన్ ఉద్యమం, స్వర్ణదేవాలయం మీద సైనికదాడి, ఇందిరా గాంధీ హత్యల నేపథ్యంలో అధికారానికి వచ్చిన రాజీవ్ గాంధీ 1985లో తీవ్రవాద, విచ్ఛిన్నకర కార్యకలాపాల నిరోధ చట్టం (టెర్రరిస్ట్ అండ్ డిస్రప్టివ్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్ – టాడా) పేరుతో ఒక చట్టం తీసుకువచ్చారు. ఈ చట్టపు ప్రకటిత లక్ష్యం పంజాబ్ లో ఖలిస్తానీ తీవ్రవాదాన్ని అణచివేయడం కాగా, ఈ చట్టం అతి ఎక్కువ మంది మీద, విచ్చలవిడిగా ప్రయోగించబడినది మాత్రం గుజరాత్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడంలో భాగంగా పార్లమెంటులో ఈ చట్టాన్ని వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ, రాష్ట్రానికి వచ్చేసరికి ఈ చట్టాన్ని అతి ఎక్కువగా వాడి, తన 'ఆట, పాట, మాట బంద్' నిర్బంధకాలంలో వేలాది మంది మీద టాడా కేసులు పెట్టింది. ప్రకటిత లక్ష్యాన్ని పక్కన పెట్టి, దేశవ్యాప్తంగా విపరీతంగా దుర్వినియోగం అయినందువల్ల, వేలాది మంది నిరపరాధులు టాడా బాధితులు అయినందువల్ల దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన పెల్లుబికింది. దానితో ప్రభుత్వానికి ఈ చట్టాన్ని ఉపసంహరించక తప్పని స్థితి వచ్చింది. ఒక ప్రత్యేక చట్టంగా ఇది ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పొడిగింపుకు పార్లమెంటులో ఆమోదం పొందవలసి ఉండగా, 1993 పొడిగింపు తర్వాత, 1995లో పొడిగించకుండా అది సహజ మరణం పొందేలా చూశారు.

కాని ముందస్తు నిర్బంధ చట్టాలు, ప్రజల హక్కులను కాలరాచే క్రూర చట్టాలు లేకుండా కొద్ది సంవత్సరాలు గడపడం కూడ భారత పాలకవర్గాలకు కష్టం. పిడి చట్టం, మీసా, నాసా, టాడాలను మించిన క్రూరమైన చట్టాన్ని తెవాలని ఉవ్విళ్లూరుతున్న భారత పాలకవర్గాలకు 2001 సెప్టెంబర్ న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద దాడి ఒక అవకాశం ఇచ్చింది. ఆ దాడి తర్వాత తీవ్రవాదం మీద యుద్ధం పేరుతో, "మావైపు ఉండకపోతే తీవ్రవాదులవైపు ఉన్నట్టే" అని జార్జి బుష్ చేసిన ఉన్మాద ప్రేలాపనలతో గొంతు కలిపే భారతీయ జనతా పార్టీ అప్పుడు కేంద్ర ప్రభుత్వ అధికారంలో ఉంది. అమెరికా ప్రభుత్వం ప్రకటించిన తీవ్రవాద సంస్థల జాబితాను యథాతథంగా ఆమోదించి, తమ వంతు కూడ కలిపి, ప్రజా ఉద్యమాల మీద, ప్రజల మీద విరుచుకు పడడానికి తొందరపడుతున్న భాజపాకు 2001 డిసెంబర్ లో పార్లమెంటు మీద దాడి అనే అబద్ధపు బూచి ఉపయోగపడింది. మళ్లీ పార్లమెంటు సమావేశం అయ్యేదాకా కూడ ఆగకుండా వెంటనే ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం ఆర్డినెన్స్ (పోటో) పేరుతో ఆర్డినెన్స్ జారీ చేశారు. దాన్ని 2002 లో చట్టంగా (ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం ఆక్ట్ – పోటా) తీసుకువచ్చారు. ఇది కూడ ప్రకటిత లక్ష్యం మీద కాకుండా, ప్రకటిత లక్ష్యం మీద కన్న ఎక్కువగా ప్రజా ఉద్యమాల నాయకుల మీద, ప్రత్యామ్నాయ భావాల మీద ఎక్కుపెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ లో విప్లవ కవి రివేరాను పోటా కింద నిర్బంధించారు. ఈ చట్టం తయారైన దుర్మార్గ పద్ధతి వల్ల, విపరీతంగా జరిగిన దుర్వినియోగం వల్ల ఈ చట్టానికి కూడ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన చెలరేగింది. ఆ నిరసనను పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ తాము 2004 ఎన్నికల్లో అధికారానికి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్నికల వాగ్దానం చేశారు. 2004 మేలో జరిగిన ఎన్నికల్లో అధికారానికి వచ్చాక సెప్టెంబర్ లో పోటాను ఎత్తి వేశారు.

ఈ చట్టాలు కాక అప్పటికి గడిచిన యాభై సంవత్సరాలలో భారత ప్రభుత్వం ముందస్తు అరెస్టుకూ, కారణాలు చూపనక్కరలేని, న్యాయసమీక్షకు వెళ్లని నిర్బంధాలకూ, ప్రజల మీద విచ్చలవిడి కాల్పులకూ అవకాశమిచ్చే అనేక క్రూరచట్టాలను ప్రవేశపెట్టింది. డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ 1962, ఫారిన్ ఎక్స్ చేంజ్ కన్సర్వేషన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ ఆక్టివిటీస్ ఆక్ట్ (కాఫెపోసా) 1974, ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మేంటెనెన్స్ ఆఫ్ సప్లైస్ ఆఫ్ ఎసెన్షియల్ కమాడిటీస్ ఆక్ట్, 1980, ప్రివెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టెన్సెస్ ఆక్ట్ 1988, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం 1958 వంటి అనేక చట్టాలు అలా వచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టాలను చూసి కొంత, శాంతి భద్రతలు రాష్ట్ర జాబితాలో ఉన్నాయనే కారణంతో కొంత అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడ ఇటువంటి క్రూర చట్టాలను, ఇంతకన్న దారుణమైన చట్టాలను కూడ తమ తమ రాష్ట్రాలలో అమలులోకి తెచ్చాయి. ప్రస్తుతం ఎన్నో రాష్ట్రాలలో ఆయా రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన ప్రజా భద్రతా చట్టాలు, కల్లోలిత ప్రాంతాల చట్టాలు, పోలీసు చట్టాలు అమలులో ఉన్నాయి. మహారాష్ట్రలో మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్స్ ఆక్ట్ 1999, జమ్మూ కశ్మీర్ లో జమ్మూ కశ్మీర్ సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం వంటి చట్టాలు ఉన్నాయి.

వీటిలో కొన్ని చట్టాల పేర్లు, నిబంధనలు ఏదో అత్యవసర సామాజిక అవసరాన్ని తీర్చడానికి వచ్చిన భ్రమ కల్పిస్తాయి గాని ఏ ఒక్క చట్టమూ ఆ ప్రకటిత లక్ష్యాల దిశగా పనిచేయలేదు. రాజకీయ, వ్యాపార ప్రత్యర్థుల మీద కక్ష తీర్చుకోవడానికి, వేధించడానికి, మొత్తంగా సమాజంలో భయోత్పాతం సృష్టించడానికి మాత్రమే ఈ చట్టాలను అధికారంలో ఉన్నవారు వాడుకుంటున్నారు.

ఈ అన్ని నిరంకుశమైన చట్టాలలోకీ అత్యంత దుర్మార్గమైనది ప్రస్తుతం పాలకులు విపరీతంగా వాడుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (అన్ లా ఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్ – యుఎపిఎ). పిడి చట్టం, మీసా, నాసా, టాడా, పోటా వంటి చట్టాలకూ దీనికీ ఒక ప్రధానమైన తేడా ఉంది. అవన్నీ ప్రత్యేకమైన సందర్భం కోసం వచ్చిన చట్టాలు గనుక వాటికి నిర్ణీత కాలవ్యవధి ఉంటుంది. ఆ వ్యవధి పూర్తవగానే వాటిని మళ్లీ పొడిగించవలసి ఉంటుంది. లేకపోతే వాటికి కాలం చెల్లిపోతుంది. కాని యుఎపిఎ ఒక శాశ్వత చట్టం. దానికి కాలవ్యవధి లేదు. దాన్ని 1967లో ప్రవేశపెట్టారు. గడిచిన యాభై నాలుగు సంవత్సరాలలో దానికి ఆరుసార్లు సవరణలు చేసి దాని కోరలకు పదును పెట్టారు. ఆ సవరణల ద్వారా ఇది మీసా, టాడా, పోటాలలోని అత్యంత దుర్మార్గమైన నిబంధనలన్నిటినీ తనలో జీర్ణం చేసుకున్నది. 2004 లో పోటాను రద్దు చేసిన యుపిఎ ప్రభుత్వం, ఈ 1967 చట్టానికి 2008లో దారుణమైన సవరణలు చేసి, సమాజం మీదికి వదిలింది. అన్నిటికన్న ముఖ్యంగా ఇది చర్యను, ఘటనను, పనిని మాత్రమే కాక, మాటను, రచనను, భావ ప్రకటనను, ఆలోచనను, ఉద్దేశాన్ని

కూడ నేరంగా ప్రకటిస్తున్నది. ఈ చట్టం సంఘాలను నిషేధించి, వాటిని చట్టవ్యతిరేక సంస్థలుగా, తీవ్రవాద సంస్థలుగా ప్రకటిస్తున్నది. 2019 సవరణల తర్వాత ఈ చట్టం విడిగా వ్యక్తులను కూడ చట్టవ్యతిరేక వ్యక్తులుగా, తీవ్రవాదులుగా ముద్రవేసి జైలు పాలు చేయడానికి అవకాశం ఇస్తున్నది. అంటే రాజ్యాంగ అధికరణం 19లో హామీ ఇచ్చిన అన్ని ప్రాథమిక హక్కుల మీద ఉక్కుపాదం మోపుతున్నది.

అసలు ఈ చట్టం చట్టవ్యతిరేక, తీవ్రవాద కార్యకలాపాలకు ఇచ్చిన నిర్వచనమే అత్యంత దుర్మార్గమైనది. ఈ చట్టం ప్రకారం, "ఒక వ్యక్తి, సంస్థ తన చర్య ద్వారా, నోటిమాట లేదా రాత లేదా సైగలు లేదా దృశ్యరూపకంగా లేదా మరే విధంగానైనా భారత సార్వభౌమాధికారాన్ని, దేశ సమగ్రతను తప్పుపట్టినా, ప్రశ్నించినా, భంగపరిచినా, లేదా భంగపరిచే ఉద్దేశం ప్రకటించినా, దేశానికి వ్యతిరేకంగా అసంతృప్తి లేవనెత్తడానికి ప్రయత్నించినా, ఆ ఉద్దేశం ఉన్నా, దేశంలోని ఏదైనా ఒక భాగం విడిపోవాలనే ఆలోచనను సమర్థించినా, సమర్థించే ఉద్దేశం ఉన్నా అది చట్టవ్యతిరేక కార్యకలాపం" అవుతుంది.

ఈ నిర్వచనం లోని సువిశాల అర్థాన్ని బట్టి చూస్తే భారత భౌగోళిక అంశాల గురించి గాని, చరిత్ర గురించి గాని, పాలన గురించి గాని విద్యా సంబంధమైన చర్చలు, విశ్లేషణలు, వివాదాలు, అసలు ఆ విషయాలు మాట్లాడడమే చట్టవ్యతిరేక కార్యకలాపాలు అయిపోతాయి. భూగోళ శాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం వంటి పాఠ్యాంశాల పాఠ్య పుస్తకాల్లో చాలా భాగం చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అయిపోతాయి. వార్తా పత్రికల సంపాదకీయ పుటలు, రాజకీయ పత్రికా రచన సమస్తమూ చట్టవ్యతిరేక కార్యకలాపాలు అయిపోతాయి. అప్పుడిక పాలకులు, పోలీసులు ఆ రచనల్లో తమకు నచ్చని దాన్ని ఎంచుకుని, ఆ రచయిత మీద యుఎపిఎ కేసు నమోదు చేయడానికి వీలవుతుంది.

ఇదంతా రచనకు సంబంధించి కాగా, ఈ నిర్వచనంలో మాట, సైగ, దృశ్యరూపం అని కూడా చేర్చారు గనుక, మరే రూపంగానైనా అని భవిష్యత్తులో రానున్న సమాచార సాధనాలను కూడా చేర్చారు గనుక ఈ చట్టం దేశంలో ప్రతి ఒక్కరినీ నిందితులనూ నేరస్తులనూ చేయగలుగుతుంది. "సమర్థించినా, సమర్థించే ఉద్దేశం ఉన్నా" అనే మాటలు మరింత ప్రమాదకరమైనవి. ''చట్టవ్యతిరేకం'' అని నిర్వచించిన అభిప్రాయాలను వినడం, చదవడం, కొని ఇంట్లో పెట్టుకోవడం కూడా "సమర్థించడం" కిందికి రావచ్చు. చివరికి సోషల్ మీడియాలో ఆ అభిప్రాయాలకు లైక్ కొట్టడం, ఫార్వర్డ్ చేయడం కూడా "సమర్థించడం" కిందికి రావచ్చు. అంటే సంఘ్ పరివార్ పాలనలో సరిగ్గా జార్జి బుష్ అన్నట్టుగా సంఘ్ పరివార్ తో లేనివాళ్లందరినీ యుఎపిఎ నిందితులుగా, నేరస్తులుగా మార్చవచ్చు.

అయితే ఇంత దుర్మార్గమైన నిర్వచనాన్ని తయారు చేసినది సంఘ్ పరివార్ కాదు, అంతకు ముందే కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే సరిగ్గా టాడాలో ఇచ్చిన నిర్వచనాన్నే యుఎపిఎకు కలుపుతూ సవరణ తీసుకొచ్చారు.

ఆ నిరంకుశ, దుర్మార్గ నిర్వచనం అలా ఉండగా, ఆ నిర్వచనం ఆధారంగా ఒక వ్యక్తి మీద కేసు పెట్టి జైలుకు పంపితే కేసు విచారణ పూర్తయి, నిర్దోషిగా విడుదల అయ్యేవరకూ జైలులోనే నిర్బంధించి ఉంచడానికి కూడా ఈ చట్టం మార్గం సుగమం చేసింది.

సాధారణంగా భారత శిక్షా స్మృతి లోని ఏ సెక్షన్ కిందనైనా ఎవరి మీదనైనా నేరం ఆరోపించి అరెస్టు చేసి జైలుకు పంపితే 60 లేదా 90 రోజుల లోపల వారు ఏ నేరం చేశారో, ఆ నేరం చేశారనడానికి సాక్ష్యాధారాలేమిటో దర్యాప్తు పూర్తి చేసి, అభియోగపత్రం (చార్జిషీట్) న్యాయస్థానం ముందు పెట్టవలసి ఉంటుంది. అలా చార్జిషీట్ పెట్టకపోతే 61వ/91వ రోజున ఆ నిందితుడికి యథావిధిగా బెయిల్ మంజూరవుతుంది. దాన్ని డీఫాల్ట్ బెయిల్ అంటారు. కాని యుఎపిఎ ఈ కాల వ్యవధిని 180 రోజులకు పెంచింది. కాకపోతే 90 రోజులు గడవకముందే, తమ దర్యాప్తు ఆలస్యం అవుతున్నదని, కనుక మరొక 90 రోజుల వ్యవధి కావాలని పోలీసు దర్యాప్తు అధికారి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు లేఖ ఇవ్వాలని, ప్రాసిక్యూటర్ ఆ లేఖ సరిగ్గా ఉన్నదో లేదో పరిశీలించి న్యాయమూర్తికి ఇవ్వాలని, న్యాయమూర్తి పరిశీలించి అది ఆమోదయోగ్యమో కాదో తేల్చి గడువు పొడిగించాలని చట్టంలో రాశారు. ఈ "పరిశీలన" అనే దానికి వ్యవధి ఇవ్వకుండా, అపహాస్యం చేస్తూ, ప్రాసిక్యూటర్ ఆమోదం, న్యాయమూర్తి ఆమోదం క్షణాల్లో జరిగిపోతున్నాయి.

యుఎపిఎ కేసుల్లో నిందితులకు బెయిల్ నిబంధనలను మామూలుకంటె చాలా కఠినతరం చేశారు. మామూలుగా భారతదేశంలో అమలయ్యే న్యాయశాస్త్రంలో 'నేరం రుజువయ్యేవరకూ నిందితులు నిరపరాధులే' అనే సూత్రాన్ని, 'బెయిల్ సాధారణం, జైలు అసాధారణం' అనే సూత్రాన్ని ఈ చట్టం తలకిందులు చేసింది.

2008లో చేసిన సవరణ ప్రకారం పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాల మీద విచారణ జరపక ముందే ఆ సాక్ష్యాధారాలు సరైనవేనని భావించిన న్యాయస్థానం నిందితుడిని నేరస్తుడిగా భావించవచ్చు. ఇది సహజ న్యాయసూత్రానికి విరుద్ధం. ఎవరి మీదైనా పోలీసులు ఏ ఆరోపణైనా చేయవచ్చు, దానికి తగిన "సాక్ష్యాధారాలు" అని ఏవో సమర్పించవచ్చు. వాటిమీద కూలంకషమైన విచారణ జరిగి, "స్థిరపరచిన పద్ధతిలో" "సకారణమైన సందేహానికి తావు లేని రీతిలో" నిర్ధారణ జరిగితేనే నేరం రుజువు అయినట్టు అని న్యాయశాస్త్రం, భారత న్యాయవ్యవస్థ సంప్రదాయం ఇంతకాలమూ చెపుతున్నాయి. యుఎపిఎ దాన్ని తారుమారు చేసింది.

అలాగే, ఎవరి మీదనైనా నేరారోపణ జరిగినంత మాత్రాన ఆ ఆరోపణ మీద విచారణ పూర్తయి నిర్దోషిగా తేలేవరకూ జైలులో ఉంచాలనేది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. అసలు అరెస్టు చేసేదే న్యాయవిచారణకు అందుబాటులో ఉండడం కోసం మాత్రమే గనుక, అలా అందుబాటులో ఉంటారని నమ్మకం ఉంటే నిందితులను జైలులో ఉంచనక్కరలేదని న్యాయశాస్త్రం చెపుతుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి వి ఆర్ కృష్ణ అయ్యర్ 1977లో ఇచ్చిన ఒక చరిత్రాత్మకమైన తీర్పులో "బెయిల్ సాధారణం, జైలు అసాధారణం" అని ఒక న్యాయసూత్రాన్ని స్థాపించారు. నిందితులు న్యాయవిచారణను తప్పించుకునే అవకాశం, విదేశాలకు పారిపోయే అవకాశం, సాక్షులను బెదిరించి న్యాయవిచారణకు అవరోధాలు కల్పించే అవకాశం ఉన్నప్పుడు తప్ప మిగిలిన అన్ని సందర్భాలలోనూ బెయిల్ ఇచ్చి విడుదల చేయాలని తీర్పు చెప్పారు.

కానీ యుఎపిఎ లో సెక్షన్ 43 డి (5) అనే 2008 సవరణ ప్రకారం, నిందితులకు బెయిల్ మీద రెండు షరతులు విధించారు.

నిందితుల బెయిల్ దరఖాస్తు మీద అభిప్రాయం చెప్పే హక్కు ప్రాసిక్యూటర్ కు ఇవ్వాలనేది ఒక షరతు. కేస్ డైరీని, తన ముందున్న సమాచారాన్ని చూసి, నిందితులకు నేరంతో సంబంధం ఉన్నదని న్యాయస్థానం "ప్రాథమిక నిర్ధారణ"కు వస్తే బెయిల్ నిరాకరించ వచ్చునని రెండో షరతు.

నిజానికి ఇవి రెండూ హాస్యాస్పదమైన, అనవసరమైన, అనుచితమైన, క్రూరమైన షరతులు. మొదటి షరతు అయిన ప్రాసిక్యూటర్ అభిప్రాయం అనేది అర్థ రహితమైనది. భారత శిక్షా స్మృతి కింద, ఇతర చట్టాల కింద నమోదయ్యే ఏ కేసులోనైనా, నిందితులు బెయిల్ దరఖాస్తు పెట్టుకోగానే, తప్పనిసరిగా ప్రాసిక్యూటర్ తన అభ్యంతరాలు చెపుతూ కౌంటర్ వేస్తారు. ఏ బెయిల్ దరఖాస్తునూ ప్రాసిక్యూటర్లు యథాతథంగా ఆమోదించరు. అందువల్ల అసలు 'ప్రాసిక్యూటర్ అభిప్రాయం తెలుసుకోవాలి' అని ప్రత్యేకంగా చట్టంలో నిర్దేశించడమే అనవసరం, అర్థరహితం, హాస్యాస్పదం. నిజానికి మామూలు కేసుల్లో జరిగినట్టుగానే ప్రాసిక్యూటర్ అభిప్రాయం ఎలా ఉన్నప్పటికీ, కేసును బట్టి, న్యాయశాస్త్ర సూత్రాలను బట్టి న్యాయమూర్తి బెయిల్ ఇవ్వవచ్చు. కాని ఇక్కడ "ప్రాసిక్యూటర్ అభిప్రాయం చెప్పే అవకాశం ఇవ్వకుండా బెయిల్ ఇవ్వకూడదు" అని ప్రత్యేకంగా రాసేసరికి, దాన్ని ప్రాసిక్యూటర్ల అనుమతి లేకుండా బెయిల్ ఇవ్వగూడదు అని ప్రాసిక్యూటర్లు తప్పుడు అర్థం చెపుతున్నారు. చాల చోట్ల న్యాయమూర్తులు కూడా ఆ తప్పుడు వ్యాఖ్యానాన్ని ఆమోదిస్తున్నారు. ప్రాసిక్యూటర్లు ఎప్పటికీ అనుమతి ఇవ్వరు గనుక యుఎపిఎ కేసుల నిందితులకు ఎప్పటికీ బెయిల్ రాదు అనే దారుణ స్థితి నెలకొంది.

అలాగే, ప్రాథమికంగా (ప్రైమాఫసీ) నిందితులు నేరస్తులే అని న్యాయమూర్తి భావిస్తే బెయిల్ ఇవ్వకుండా ఉండవచ్చుననే రెండో షరతు పూర్తిగా తలకిందుల న్యాయం, క్రూరమైన న్యాయం. విచారణే జరగకుండా, పోలీసులు సాక్ష్యాధారాలు, చార్జిషీట్ సమర్పించకుండా, డిఫెన్స్ న్యాయవాదులు ఆ సాక్ష్యాధారాల మీద, చార్జిషీట్ మీద తమ వాదనలు వినిపించకుండా, సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా, ఒక్కమాటలో చెప్పాలంటే, "చట్టం నిర్దేశించిన పద్ధతుల ప్రకారం న్యాయ విచారణ" ఎంతమాత్రం జరగకుండా ఒకరు నేరస్తులో కాదో, ప్రాథమికంగా గాని, అంతిమంగా గాని తేల్చి చెప్పగల శక్తి న్యాయమూర్తికి ఎక్కడి నుంచి వస్తుంది? ఆ న్యాయమూర్తి చేతిలో అదృశ్యశక్తిగా మంత్రదండమో, దివ్యదృష్టో ఉంటుందని యుఎపిఎ రచయితలు భావించారా?

పోలీసుల, ప్రాసిక్యూటర్ల, న్యాయమూర్తుల ఇష్టాయిష్టాలు, ముందే ఏర్పడి ఉన్న అభిప్రాయ దురభిప్రాయాలు, భావజాలాలు, ప్రభుత్వాధికారంలో ఉన్నవారి ఒత్తిళ్లు యుఎపిఎ నిందితులకు బెయిల్ ఇవ్వడానికి అడ్డు పడవచ్చునని ఈ రెండు షరతుల అసలు అర్థం. దీన్ని భూస్వామ్య, రాచరిక అంతిమ తీర్పు పద్ధతి అంటారు గాని ఆధునిక ప్రజాస్వామిక పాలన అనీ, చట్టానికి లోబడిన పాలన అనీ, చట్టం ముందు అందరూ సమానులే అనే సూత్రాన్ని అమలు చేసే పాలన అనీ అనడానికి వీలు లేదు.

యుఎపిఎ నిందితుడు కావడం వల్ల బెయిల్ రాకుండా పదకొండు సంవత్సరాలు జైలులో గడిపి, చివరికి నిర్దోషిగా విడుదలైన కశ్మీరీ బషీర్ అహ్మద్ ఉన్నాడు. విచారణ ప్రారంభం కాకుండానే నాలుగేళ్లు, ఐదేళ్లు జైళ్లలో గడిపి, ఇంకా విచారణ కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఖైదీలున్నారు. విచారణ ప్రారంభం కాకుండానే జైలులోనే ఆరోగ్యం చెడిపోయి మరణానికి చేరువైన వాళ్లున్నారు. యుఎపిఎ కేసు కావడం వల్లనే బెయిల్ దొరకక, జైలులో అనారోగ్యంతో మరణించిన ఫాదర్ స్టాన్ స్వామి ఉన్నారు. అంటే యుఎపిఎ కేసులో నిందితులు కావడం అంటే విచారణ లేకుండానే, విచారణ పూర్తయి నిర్దోషిగా రుజువైనా ఈలోగానే న్యాయస్థానం విధించకుండానే యావజ్జీవ శిక్షో, మరణ శిక్షో అనుభవించడం అన్నమాట.

అసలు చట్టమే ఇంత దుర్మార్గంగా ఉండగా, అది లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల విషయంలోనూ, దాన్ని ఎడాపెడా వాడడంలోనూ చాల ఎక్కువ దుర్వినియోగం కూడా ఉంది. అసలు వినియోగమే నిరంకుశత్వం కాగా, దుర్వినియోగం మరింత నిరంకుశత్వానికి దారి తీస్తున్నది. నిజంగా ఇవాళ భారత సమాజంలో సంఘ్ పరివార్ శక్తులే నిజమైన చట్టవ్యతిరేకులుగా, తీవ్రవాదులుగా, హింసావాదులుగా, సమాజంలో విష విద్వేష బీజాలు నాటుతున్నవారుగా ఉండగా, ఈ చట్టాన్ని ప్రకటిత లక్ష్యాల ప్రకారమైతే సంఘ్ పరివార్ శక్తుల మీదనే ప్రయోగించాలి. కాని ఈ చట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు, కేసుల్లో నిందితులుగా చూపబడుతున్నవారు, జైళ్లలో ఏళ్ల తరబడి మగ్గుతున్నవారు పాలక పక్షానికి ప్రత్యర్థులు, భిన్నాభిప్రాయాలు ఉన్నవారు మాత్రమే. ఇందులో ముస్లింలు, విద్యార్థులు, ఆదివాసులు, విప్లవోద్యమ సానుభూతిపరులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు ఉన్నారు.

పౌరసత్వ సవరణ చట్టానికీ, జాతీయ పౌర పట్టికకూ వ్యతిరేకంగా ఉద్యమించిన సామాజిక కార్యకర్తల మీద, జామియా మిలియా, జెఎన్‌యు విద్యార్థులతో సహా ఎందరో విద్యార్థుల మీద యుఎపిఎ కేసులు బనాయించారు. సిఎఎ వ్యతిరేక ఆందోళనను అణచివేయడానికి ఈశాన్య ఢిల్లీలో తామే మత కల్లోలాలు సృష్టించి, బాధితుల మీదనే, బాధితులకు సహాయం చేసినవారి మీద యుఎపిఎ కేసులు బనాయించారు. భీమా కోరేగాం ఉత్సవాల సందర్భంగా అల్లర్లు సృష్టించిన హిందూ తీవ్రవాదులను వదిలి, ఆ సాకుతో దేశవ్యాప్తంగా హక్కుల కార్యకర్తల మీద, రచయితల మీద, జనమేధావుల మీద యుఎపిఎ కేసు బనాయించారు. ఉత్తరప్రదేశ్ లో దళిత బాలిక మీద జరిగిన సామూహిక అత్యాచారం వార్త వివరాలు సేకరించడానికి వెళ్తున్న జర్నలిస్టు సిద్దిఖ్ కప్పన్ మీద యుఎపిఎ కేసు మోపారు. త్రిపురలో జరిగిన మతకల్లోలాల విషయంలో నిజనిర్ధారణ చేయడానికి వెళ్లిన న్యాయవాదుల మీద, ఆ న్యాయవాదుల నివేదికను సోషల్ మీడియాలో పంచుకున్న సామాజిక కార్యకర్తల మీద యుఎపిఎ కేసు మోపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో దాదాపు మూడు వందల మంది ప్రజా సంఘాల నాయకుల మీద, కార్యకర్తల మీద యుఎపిఎ కేసు మోపారు. ఇలా ఈ అక్రమ చట్టపు వినియోగం, దుద్వినియోగం కథలు ఎంత చెప్పినా మిగిలిపోయేలా ఉన్నాయి.

యుఎపిఎ కు 2008 సవరణలతోపాటే అప్పటి కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఆక్ట్ అనే మరొక దుర్మార్గ చట్టాన్ని కూడ తీసుకువచ్చింది. చట్టవ్యతిరేక, తీవ్రవాద నేరాలు అనేక రాష్ట్రాల్లో

కార్పొరేట్ల పాద సేవలో కేంద్ర ప్రభుత్వం

కరోనా కాలంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలను రూపొందించి వారి జీవనోపాధి దెబ్బతీసి, కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అంటున్నారు కె. సూర్యం

కరోనా కల్లోలంలో మున్సిపల్ కార్మికులు దేశానికి గొప్ప సేవ చేశారని, గత సంవత్సరం దేశ ప్రధాని మోడీ మున్సిపల్ కార్మికుల పాదాలు కడిగారు. కాళ్లు కడిగిన మోడీ పొట్ట నింపే పని ఎందుకు చేయలేకపోయారు. కడుపు నింపడం చేయకపోయినా ఫర్వాలేదు. కానీ, కడుపులు కొట్టే పని చేయరాదు. కానీ కార్మికులందరినీ వీధుల పాలు చేయడానికి చర్యలకు దిగారు. ఉపాధి కోల్పోతున్న కార్మికుల గురించి కనీసమైన ఆలోచించలేదు. గత రెండేళ్ల కిందట లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కరువైంది. “కంచే చేను మేసినట్లు” ప్రభుత్వ రంగ సంస్థల్లోని కార్మికుల తొలగింపుకు పూనుకున్నారు. బిఎస్ఎన్ఎల్‌లో వాలంటరీ రిటైర్మెంట్ పేరుమీద వేలాది మందిని ఇంటికి పంపించారు. రైల్వేలో వేలాది మంది కార్మికులను తొలగించారు. దేశంలో 11 కోట్ల మంది వలస కార్మికులకు కరోనా కాలంలో ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదు. ఒక సాధారణ సినిమా యాక్టర్ సోను సూద్ కార్మికులకు అనేక వసతులు కల్పించారు. ఈ విశాల భారతదేశంలో, కోట్లాది సంపదకు అధిపతులైన కేంద్ర పాలకులు కనీస కంటితుడుపు చర్యగానైనా ఎందుకు చేపట్టలేదు.

దేశంలో 24 రకాలైన స్కీమ్ కార్మికులు ఉన్నారు. అందులో మధ్యాహ్న భోజనం, కెజిబివి, ఆశ, అంగన్వాడి, ఐకెపి, గోపాలమిత్ర, గురుకులాలు, సర్వశిక్ష అభియాన్ లాంటి వాటిలో పని చేస్తున్న కార్మికుల జీతభత్యాలు చెప్పడానికి సిగ్గుపడే విధంగా జీతాలు ఉన్నాయి. గౌరవ వేతనం అని 1000 రూపాయల నుండి పదివేల లోపు చెల్లించి అగౌరవపాలు చేస్తున్నారు. దేశ రాజ్యాంగం పట్ల అత్యంత గౌరవం ఉందని ప్రకటించిన మోడీ, షాలు రాజ్యాంగ హక్కులనన్నింటినీ ఎందుకు అమలు చేయడంలేదో జవాబు చెప్పాలి. సరిపడా ఆదాయం లేక, వస్తువులను కొనలేని పరిస్థితి వలన ఉత్పత్తులు పేరుకుపోయి అనేక పరిశ్రమలు మూతపడి పోతున్నాయి.

దేశంలో చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య 11 కోట్లకు చేరిందని సర్వేలు తెలుపుతున్నాయి. ఒకపక్క పరిశ్రమల మూతతో ఉపాధి కోల్పోయిన వాళ్లు, మరోపక్క నిరుద్యోగం వలన మరింత సంక్షోభానికి దారితీసింది. ఈ మధ్య కాలంలో పనులు కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, హోటల్స్, స్కూలు, ఆటో కార్మికులు, సినిమా హాల్స్, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్, స్వయం ఉపాధి కార్మికులు, షాపింగ్ మాల్స్ కార్మికులు ఉపాధి కోల్పోయి వీధుల పాలయ్యారు. వారందరూ దీనంగా తమ బతుకులు ఎప్పుడు బాగుపడతాయా అని ఎదురు చూస్తున్న దైన్యస్థితి నెలకొని ఉంది. కోట్లాది మంది ప్రజలకు, కార్మికులకు సరైన కూడు, గూడు, బట్ట అందక ఆకలి రాజ్యంగా మారే స్థితిని బాగుచేసే అవకాశం ఉంది. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో

జరుగుతున్నందువల్ల, వాటి దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపిస్తున్నదనీ, అందువల్ల ఒక జాతీయ దర్యాప్తు సంస్థ అవసరమనీ ఏర్పడిన ఈ సంస్థ దాని ప్రకటిత లక్ష్యాన్ని దాటి ప్రవర్తిస్తున్నది. హిట్లర్ జర్మనీలో తయారైన గెస్టపో అనే అమానుష పోలీసు యంత్రాంగం లాగ వ్యవహరిస్తున్నది. ఇది కేవలం దర్యాప్తు సంస్థ మాత్రమే అయినప్పటికీ, అనేక పాలనా యంత్రాంగాల మీద, చివరికి న్యాయవ్యవస్థ మీద కూడ ఒక సంఘ్ పరివార్ శాఖ లాగ అధికారం చలాయిస్తున్నది. యుఎపిఎ కేసులను తన పరిధిలోకి తీసుకోవచ్చుననే చట్టబద్ధ అవకాశాన్ని వాడుకుని దేశవ్యాప్తంగా తన నిరంకుశ అధికారాన్ని వ్యాపింపజేస్తున్నది. శాంతి భద్రతలు రాజ్యాంగపు రాష్ట్రాల జాబితాలో అంశాలుగా, రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉండవలసినవి కాగా, ఇప్పుడు దేశపు సమాఖ్య స్వభావానికి తూట్లు పొడుస్తూ ఎన్ ఐ ఎ అన్ని రాష్ట్రాలలోను, స్థానిక పోలీసులతో కూడ సంబంధం లేకుండా విరుచుకుపడుతున్నది. అనుమానితుల మీద సోదా జరపడానికి, వారికి చెందిన, అనుమానిత నేరంతో సంబంధం ఉన్న వస్తువులను మాత్రమే జప్తు చేయడానికి అధికారం ఉండగా, ఇళ్ల మీద పడి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి, ఇంట్లో ఉన్న అందరి వస్తువులు, పుస్తకాలు, పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు జప్తు చేసి తీసుకుపోతున్నది. తనకు చట్టం ఇవ్వని అధికారాన్ని కూడ చలాయిస్తున్నది. చట్టం ఇచ్చిన అధికారాలను కూడ దుర్వినియోగం చేస్తున్నది.

చర్యకు, ఘటనకు, నేరానికి శిక్ష ఉండడం, అది కూడ సహజ న్యాయసూత్రాలకు లోబడిన మేరకు శిక్ష ఉండడం ఆధునిక సమాజపు నీతి. కాని భారత పాలక వర్గాలు దాన్ని తలకిందులు చేసి, మాటను, రాతను, అభిప్రాయాన్ని కూడ నేరంగా పరిగణిస్తూ, న్యాయవిచారణా ప్రక్రియను తారుమారు చేస్తూ, ప్రక్రియనే శిక్షగా మారుస్తున్నాయి. చాల సందర్భాల్లో అసలు ప్రక్రియే జరగడానికి అవకాశం ఇవ్వకుండా శిక్షను అమలు చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఇది అనాగరిక, అమానుష, ఆధునికపూర్వ, దుర్మార్గ పద్ధతి. దీన్నిగుర్తించి, విశ్లేషించి, ప్రచారం చేసి, ఈ పద్ధతిని ప్రతిఘటించే, కూలదోసే చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడమే ఇవాళ ఆలోచనాపరుల బాధ్యత.

(విశాఖపట్నంలో కా. వై విజయకుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వహించిన సభలో 13 డిసెంబర్ 2021న చేసిన ప్రసంగం)

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

చేయలేరు. కనీసం ప్రభుత్వమే ఆమోదించిన ప్రణాళికలను, విధానాలను కూడా చేయలేని స్థితి నేడుంది.

డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా ప్రకారం ఒక కార్మికుడుకి కావలసిన అవసరాలు లెక్కించి కనీస వేతనాలను నిర్వహిస్తారు. అలాగే 15వ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) వినియోగదారుల ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) పరిగణలోకి తీసుకొని కనీస వేతనాలు నిర్వహించాలని, భారత సుప్రీంకోర్టు కూడా 'రాప్ టాక్ కేసు'లో కూడా ఈ తీర్పునిచ్చింది. దాని ప్రకారం నేడు కనీస వేతనం నెలకు 21,000 కన్నా తక్కువ ఉండరాదు. దీనిని మోడీ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడానికి పూనుకోవడం లేదు.

దేశం బాగా అంటే సెల్ ఫోన్లు, బుల్లెట్ రైల్లు, రాకెట్, అణుబాంబులు ప్రయోగించడం కాదు, సజీవమైన మనిషి తిండి కొరకు ఎదురుచూడని సమాజం ఉండాలి. అలాంటి సమాజాన్ని పాలకులు సృష్టించకుండా కాళ్లు కడిగితే కడుపు నిండదు. నిండడానికి కావాల్సిన ఆదాయాలు పెంచవలసిన అవసరం ఉంది. ఆ చర్యలను ప్రభుత్వం తీసుకోవాలి. దేశంలో సంపద, డబ్బు, వైద్య సౌకర్యాలు, గృహ వసతులు అనుభవించడానికి సౌకర్యాలు లేవని కాదు. వాటిని ప్రజలకు అందించే దాంట్లో పాలకులు లేరని చెప్పవచ్చు. ఫోటో కొరకు కార్మికులకు పాదాలు కడుగుతారు. నిజమైన, అసలైన పాదసేవ ఆదానీ, అంబానీ, మోడీ, విజయ్ మాల్యా తదితరులకు చేస్తున్నారు.

సామాన్య ప్రజలు వాడే గ్యాస్ బండ రేట్లు 400 నుండి 1000 దాకా పెంచారు. పెట్రోల్, డీజిల్ రేట్లు సెంచరీ దాటించి పారిశ్రామిక వర్గాలకు లాభాలని కట్టపెడుతున్నారు. ఒకనాడు "డీమానిటైజేషన్" (పెద్ద నోట్ల రద్దు) పేరుతో నల్లధనాన్ని వెలికి తీస్తాం అన్న మోడీ ఒక్క రూపాయి కూడా రాబట్టలేదు. కానీ పెద్ద నోట్ల రద్దు ప్రజల పాలిట ముప్పుగా మారింది, బ్యాంకుల చుట్టూ, రోడ్ల వెంబడి పడిగాపులు కాసిన సాధారణ ప్రజల కష్టాలు చెప్పనలవి కాదు. బ్యాంకుల ముందు ఎండల్లో క్యూ కట్టిన ప్రజలు విగతజీవులుగా మారిన ఘటనలు అనేకం. పెద్ద నోట్ల రద్దు పేదలకు కష్టాన్ని, ధనికులకు ధనార్జనను చేకూర్చింది.

ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురన్ ఇండియా రిచ్ లిస్ట్ 2021లో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019-20లో రూపాయలు 1.4 లక్షల కోట్లు ఉన్న ఆదానీ సంపద 2020-21లో రు. 5.66 లక్షల కోట్లకు చేరింది. ముఖేష్ ఆదాయం రోజుకు 1002 కోట్లు పెరిగింది. ఆ నివేదికలో గత ఏడాది భారత్‌లో 119 నగరాలలో కనీసం వెయ్యి కోట్ల సంపద గల వారు 1007 మంది సంపద 51 శాతం పెరిగింది. 2020-21 దేశంలో కుబేరుల సంఖ్య 258 పైకి చేరింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను ప్రమాదం. ఈ మధ్యకాలంలో 2021 సెప్టెంబర్ మాసంలో ఇన్ఫోసిస్ లాభం 5421 కోట్లు, విప్రో ఆదాయం 19667 కోట్లు, గత ఏడాది కన్నా విప్రో ఆదాయం 30 శాతం పెరిగి, లాభం 17 శాతం వచ్చింది.

దేశ ఆర్థిక వ్యవస్థకు నల్లధనం పెను సవాలుగా మారి దేశాన్ని నులిమివేస్తున్న స్థితి ఉంది. దేశ జిడిపి 1954లో 4.5 శాతం, 1980-83లో 18 నుంచి 21 శాతం, 2021 నాటికి దేశ జి.డి.పిలో సుమారు 62 శాతం నల్లధనం పెరిగి పోయిందని, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త వెల్లడించాడు. సుమారు 62 లక్షల కోట్లు ఇతర దేశాల్లో భారతీయులు అక్రమంగా నిల్వచేసిన నల్లధనం ఉందని సిబిఐ వెల్లడించింది. 2021 సెప్టెంబర్ నాటికి ఒకటిన్నర లక్షల కోట్ల డాలర్లకు నల్లధనం చేరిందని పేర్కొన్నారు. సంపద ఇబ్బడిముబ్బడిగా పోగు కావడం ప్రమాదం. దీని గురించి కార్ల్ మార్క్స్ ఇలా అన్నాడు. "సంపద ఒకవైపు పోగు పడ్డప్పుడు రెండోవైపు బానిసత్వం, పీడన, అలక్ష్యం, దౌర్జన్యం, మానసిక అశాంతి పోగు పడతాయి." సరిగ్గా నేడు దేశంలో అవే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

ప్రభుత్వం కార్మికులకు కష్టాలను తెచ్చిపెట్టింది. కార్పొరేట్‌లకు మాత్రమే ప్యాకేజీలనూ, వరాలనూ నిస్సిగ్గుగా ప్రసాదించింది. మరింతగా అప్పులు తెచ్చి కార్పొరేట్‌లకు కట్టబెట్టింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తాజాగా వెల్లడించిన విషయాలు దిగ్భ్రాంతికి గురిచేస్తాయి. 2016లో భారత్ జిడిపిలో 66.6 శాతం అప్పులు ఉండగా 2020 నాటికి 89.6 శాతానికి చేరాయి. 2021 సంవత్సరం గరిష్ఠస్థాయి 90.6 శాతంగా నమోదయింది.

సంపన్నులు, రాజకీయ నాయకులు, దేశాధి నేతలు, విదేశాల్లో రహస్యంగా దాచిన సొమ్ము వివరాలను గత పదేళ్ల కిందట పనామా పత్రాల ద్వారా వెల్లడయ్యాయి. దానిని పాలకులు చాప చుట్టారు. నేడు పండోరా పత్రాల్లో వెల్లడించిన విషయాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. మొన్ననే నిరుపేదనని, అప్పు కట్టలేమని దేవుని సాక్షిగా కోర్టులో ప్రమాణం చేసిన అనిల్ అంబానీ 18 దేశాల్లో పది వేల కోట్ల ఆస్తులు కొన్నాడని, అప్పు కట్టలేని మరో నిరుపేద నీరవ్ మోడీ 17 వేల కోట్లు కొల్లగొట్టి, అంతకన్నా అధికంగా విదేశాల్లో ఆస్తులు కొన్నాడని పండోరా పత్రాల్లో వెల్లడించారు. దీనిని కూడా పాలకుల మాయా మంత్రంతో కనబడకుండా చేస్తారు.

కార్పొరేట్లకు ప్యాకేజీలు ప్రకటించడమే కాకుండా, రైతుల చేతుల్లో ఉండే భూమిని కబళించడానికి మూడు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. కరోనా కల్లోలంలో చలి, ఎండా, వానా కాలంలో చెక్కు చెదరని దీక్షతో లక్షలాది మంది రైతాంగం ఢిల్లీ బార్డర్‌లో కూర్చున్నారు. ఒకనాడు పోరాడి సాధించుకున్న 44 చట్టాలనూ మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌గా కుదించడం అంటే, కార్మికులను కట్టు బానిసలుగా చేసే చర్య తప్ప మరోటి కాదు.

దేశానికి తలమానికం లాంటి అనేక ప్రభుత్వ రంగాలను రక్షణ, బ్యాంకింగ్, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే, విమాన, నౌకా యానాన్ని, విశాఖ ఉక్కు ప్రైవేట్ వాళ్లకు అప్పగించే చర్యలకు దిగింది. అందులో భాగంగానే మరో ముద్దు పేరుతో "ప్రైవేటీకరణ"కు మారుపేరుగా "మానిటైజేషన్" అంటే ఆస్తులు అమ్మకం. 50 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టి డబ్బు ఆర్జించాలని కేంద్రం భావించడం సిగ్గుచేటు అయిన విషయం. దేశ సంపదకు మూలమైన శ్రమ జీవులకు న్యాయంగా సంపద చేకూరాలి. భాగ్యవంతుల చేతుల్లో చిక్కిన భారతదేశాన్ని విముక్తి కల్పించడమే శ్రమజీవుల విముక్తి. కనుక కార్మిక వర్గం అటువైపుగా అడుగులు వేయాలి.

(రచయిత ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

దోవల్, రావత్, మిశ్రాల మాటలు-దేశ ప్రయాణం ఎటు?

దేశంలో అత్యున్నత పదవులలో, నిర్ణయాధికారంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఇటీవల చేసిన రాజ్యాంగ వ్యతిరేక ప్రకటనల నేపథ్యంలో రాజ్యాంగ స్ఫూర్తిని గుర్తు చేస్తున్నారు **అడ్మిరల్ ఎల్ రాందాస్**

గతవారం దేశమంతా జరుపుకున్న రాజ్యాంగ దినోత్సవానికి ఈ సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 'భారతదేశం అనే భావన', రాజ్యాంగం రెండూ ధ్వంసమైపోతున్న ప్రమాద తీవ్రతే ఆ ప్రత్యేకత.

నాకు 1949లో ఆ రోజు ఇంకా గుర్తుంది. పదిహేనేళ్ల కుర్రవాళ్లంగా మేం కొందరం డెహ్రాడూన్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ అకాడమీలో ఇంటర్ సర్వీసెస్ వింగ్‌లో అప్పుడే చేరాం. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన భారతదేశంలో యువతరానికి సాయుధ బలగాలలో చేరి దేశానికి సేవ చేసే అవకాశం వచ్చిన సందర్భం అది. అది చాల ఉత్సాహభరితమైన సమయం. ఆ సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడి, 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చినప్పుడు మేం చాల ఆదర్శాలతో, ఆశలతో నిండి ఉన్నాం. అవును, అప్పుడు మాలోలోపల మంటలు మండుతుండేవి. మన ప్రజలకు సేవ చేయాలనీ, మన గణతంత్ర రాజ్యాన్ని పరిరక్షించాలనీ, ప్రతి ఒక్కరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం దక్కేలా చూడాలనీ దృఢ సంకల్పం ఉండేది.

నలభై నాలుగు సంవత్సరాలు యూనిఫాంలో సేవ చేసి, భారత నౌకాదళ ప్రధానాధిపతిగా 1993 సెప్టెంబర్‌లో నేను పదవీ విరమణ పొందాను. అప్పటి నుంచీ కొంకణ్ ప్రాంతంలో ఒక పల్లెటూళ్లో నివసిస్తున్నాను. చిన్నపాటి వ్యవసాయం చేసుకుంటూ, అనేక రంగాల విషయాల మీద జోక్యం చేసుకుంటూ ప్రజా జీవితంలో ఉన్నాను. రైతుల సమస్యల మీద, మానవహక్కుల ఉల్లంఘనల మీద, దేశ సాయుధ బలగాలలో పెరుగుతున్న రాజకీయాల మీద గొంతెత్తుతున్నాను. అన్నిటికంటె ఎక్కువగా, మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడుల మీద, పెరిగిపోతున్న అసహనం మీద, మతోన్మాద విజృంభణ మీద మాట్లాడుతున్నాను. పౌరహక్కులను అణచివేయడం మాత్రమే కాక, రాజ్యాంగ స్ఫూర్తినే భంగపరిచే విధంగా అమలులోకి వస్తున్న క్రూర చట్టాల మీద మాట్లాడుతున్నాను.

ఈ అంశాల గురించి క్రియాశీలంగా ఉండడం పౌరులుగా మన బాధ్యత. మన ప్రజాస్వామ్యాన్ని చలనశీలంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే అది అత్యవసరమైనది. అలాగే మన రాజ్యాంగ ధర్మం అనేదేదైనా ఉంటే దానికి భిన్నంగా జరుగుతున్న వాటిని ఎత్తి చూపించడం కూడ పౌరులుగా మన బాధ్యత. ఇది యూనిఫాం ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసినవారందరికీ ప్రత్యేకంగా వర్తిస్తుంది. సమీక్షను తప్పించుకోవడానికీ, పారదర్శకత లేమిని సమర్థించుకోవడానికీ ఒక సాధనంగా చాల తరచుగా జాతీయ భద్రత అనే సాకును చూపెడుతున్న వాతావరణంలో మనం జీవిస్తున్నాం. జాతీయ భద్రత అనేది అన్నిటికన్న ఎక్కువగా ప్రతి రంగంలోనూ మానవ భద్రతను పట్టించుకోవాలి. మనం రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశామంటే, దాని అర్థం పౌరులలో ప్రతి ఒక్కరి హక్కులనూ, మంచి జీవనాన్నీ, గౌరవాన్నీ కాపాడతామని ప్రతిజ్ఞ చేసినట్టే.

"భారతదేశపు ప్రజలమైన మేము" అనే మాటలతో భారత రాజ్యాంగం ప్రారంభం కావడం కారణం లేకుండా జరగలేదు. అధికరణం 1తో దాన్ని కలిపి చదివినప్పుడు అది స్పష్టంగా, "ఇండియా, అంటే భారతదేశం, రాష్ట్రాల కలయికగా ఉంటుంది" అని చెప్పిందంటే దాని దార్శనికత, ఉద్దేశం నిస్సందేహమైనవి.

కాని, ఇటీవలి పరిణామాలు నన్ను తీవ్రంగా కలిచివేసి, నా అభిప్రాయాలు మీతో పంచుకొమ్మని ఒత్తిడి చేస్తున్నాయి. నేను ప్రత్యేకంగా ముగ్గురు ప్రధాన వ్యక్తుల, సంస్థల ఇటీవలి ప్రకటనలను ప్రస్తావిస్తున్నాను. అవి మన రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

1. జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు అజిత్ దోవల్ 2021 నవంబర్ 11న హైదరాబాద్‌లో పోలీస్ ట్రెయినింగ్ అకాడమీలో పోలీసు అధికారుల శిక్షణాంత కవాతును ఉద్దేశించి చేసిన ప్రసంగం.
2. సైనిక దళాల ప్రధానాధికారి బిపిన్ రావత్ 2021 నవంబర్ 10-11 తేదీల్లో టైమ్స్ నౌ గ్రూప్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేసిన సుప్రసిద్ధ వ్యాఖ్యలు.
3. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులు అరుణ్ మిశ్రా 2021 నవంబర్ 9న జాతీయ మానవ హక్కుల కమిషన్, అస్సాం రైఫిల్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన వార్షిక చర్చా వేదికకు ఎంచుకున్న అంశం.

ఈ మూడు సందర్భాలలో, ప్రతి ఒక్కదానిలోను, ప్రజలకు ప్రమాదకరమైన సందేశాలను అందించడం జరిగింది. వాటిని ప్రధాన స్రవంతి ప్రచార మాధ్యమాలు మరింత ఎక్కువ చేసి చూపాయి. ఈ సందేశాలు ఎక్కువ ఎడం లేకుండా వెంటవెంటనే వెలువడడం పూర్తిగా యాదృచ్ఛికం కాదు. ఈ బిందువుల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం, ప్రస్తుత స్థితిలో మన సున్నితమైన ప్రజాస్వామ్యానికి పర్యవసానాలను విశ్లేషించడం ఆలోచనాపరులైన పౌరులుగా మన బాధ్యత.

మనసులో ఈ ఆలోచనతోనే నేను ఈ కింది ఆందోళనలనూ, ప్రశ్నలనూ మీతో పంచుకుంటున్నాను.

జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు, అధికార కేంద్రాలకు చాల సన్నిహితమని భావించబడేవారిలో ఒకరు. నవంబర్ 11న హైదరాబాద్‌లో పోలీస్ అకాడమీలో శిక్షణలో ఉన్న ఐపిఎస్ అధికారుల శిక్షణాంత కవాతు సమయంలో మాట్లాడుతూ, ఆయన "యుద్ధపు కొత్త సరిహద్దు పౌరసమాజం" అని అన్నారని, ఈ యుద్ధాన్ని ఆయన "నాలుగో స్థాయి యుద్ధ తంత్రం"తో సమానం చేశారని వార్తలు వచ్చాయి. ఇప్పుడే శిక్షణ పూర్తి చేసుకున్న యువ పోలీసు అధికారులకు ఆయన బహిరంగంగా ''పౌర సమాజాన్ని మాయచేయవచ్చు, ఏమార్చవచ్చు, తిరగబడేలా చేయవచ్చు, చీలదీయవచ్చు, తద్వారా జాతి ప్రయోజనాలకు నష్టం కలిగించవచ్చు" అని చెప్పి, అటువంటి పౌరసమాజంతో వ్యవహరించడమే వారి బాధ్యత అని బోధించారు. ఆయన చెప్పకనే చెప్పినదేమంటే, ''ఎన్నికల ప్రక్రియ'' అత్యున్నతమైనదేమీ కాదని, అంతకన్న ముఖ్యమైనది చట్ట నిర్మాతలు తయారుచేసిన చట్టాలు మాత్రమేనని, వాటిని కఠినంగా అమలు చేయడమే పోలీసుల బాధ్యత అని.

ప్రశ్న: అంటే జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు ప్రజలను రాజ్యపు శత్రువుగా భావించమని పోలీసులను ప్రోత్సహిస్తున్నారా? భారత రాజ్యాంగం ప్రాతినిధ్యం వహించే విలువలన్నిటికీ ఇది ప్రత్యక్షంగా వ్యతిరేకం కాదా?

దాదాపు అదే సమయంలో, 'భారత్ @ 75 ఉత్సవాలు, భారత్ @ 100 రూపకల్పన' అనే అంశంపై టైమ్స్ న్యూస్ నెట్ వర్క్ శిఖరాగ్ర సమావేశంలో మాట్లాడుతూ, సైనిక దళాల ప్రధానాధికారి అన్నట్టుగా పత్రికల్లో వచ్చిన వార్తలు దిగ్భ్రాంతికరమైనవి. మూక దాడుల్లో ''చిత్రవధ'' చేయడం మంచి విషయమేనని తాననుకుంటున్నానని ఆయన అన్నారు. తీవ్రవాదులను పట్టి ఇవ్వడానికి, మూకదాడులు చేసి "కొట్టి చంపడానికి" ముందుకు వస్తూ, తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంలో పాల్గొంటున్నందుకు ఆయన జమ్మూ కశ్మీర్ ప్రజలను అభినందించారు. అంటే ఒక తుపాకి పట్టుకున్న వ్యక్తికి, 'తీవ్రవాది'గా, 'మిలిటెంట్' 'అనుమానించబడే' వ్యక్తికి వ్యతిరేకంగా పౌరులు ఏకపక్ష చర్యలు తీసుకోవడాన్ని దేశంలోకెల్లా అత్యంత సీనియర్ సైనికుడు సమర్థిస్తున్నాడన్నమాట. ఈ మాటను దేశంలో ఎక్కడైనా వర్తించేలా విస్తరించవచ్చు.

ప్రశ్న: యూనిఫాంలో ఉన్న ఆయన వంటి వ్యక్తులను శాసించే సైనిక, నౌకాదళ, వైమానిక దళ చట్టాలు ఉన్నాయని, ఎటువంటి పరిస్థితిలోనూ అక్కడికక్కడ న్యాయం చేసే పద్ధతిని మనం సిఫారసు చెయ్యడం గాని, ఆమోదించడం గాని చెయ్యగూడదని ఒక జనరల్‌కు గుర్తు చేయవలసి ఉంటుందా? భారత దేశపు అత్యంత వరిష్ట సైనికాధికారి అయిన ఆయన మీద ''హింసకు ప్రేరేపించిన'' నేరారోపణ చేయవచ్చునా?

దేశం మొత్తంలో మానవ హక్కులను ఎత్తిపట్టే, పరిరక్షించే బాధ్యతతో జాతీయ మానవ హక్కుల కమిషన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. పారిస్‌లో 1948 డిసెంబర్ 10న జరిగిన ఐక్యరాజ్యసమితి సాధారణ ప్రతినిధి సభ ఆమోదించిన 1948 అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన మీద భారత ప్రభుత్వం కూడ సంతకం చేసింది.

ప్రశ్న: కొన్ని సంవత్సరాలుగా జాతీయ మానవ హక్కుల కమిషన్ తన చర్చనీయాంశాల ఎంపికలో పెద్దగా ఆలోచనను ఉపయోగించడం లేదని మాటవరుసకు ఒప్పుకుందాం. కాని, 'తీవ్రవాదం, నక్సలిజం వంటి చెడుల మీద పోరాటంలో మానవ హక్కులు అవరోధంగా నిలుస్తాయా?' అనే సమస్యాత్మక చర్చనీయాంశానికి, సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన ప్రస్తుత కమిషన్ అధిపతి అధ్యక్షత వహించడం సమంజసమేనా? ఈ సమస్య మీద జాతీయ మానవ హక్కుల కమిషన్ వైఖరికి సంబంధించి ఈ చర్చనీయాంశం ఇబ్బందికరమైన ప్రశ్నలకు దారి తీయదా?

రాజ్యం పాత్ర, దాని భద్రతా యంత్రాంగం

ఇక్కడ చర్చించవలసిన మరింత తీవ్రమైన విషయం ఏమంటే, ఈ ప్రకటనలు అనుకోకుండా, అనాలోచితంగా, సంబంధం లేకుండా వెలువడినవా లేక ఇంకా విస్తృతమైన భావజాల లేదా రాజకీయ అవగాహనలో భాగమైనవా అనేది. ఇప్పటికే ఆ అవగాహనను మనం అంతకంతకూ ఎక్కువగా చర్యలలో చూస్తూనే ఉన్నాం.

కొందరు సీనియర్ సైనికాధికారులు, మాజీ ప్రభుత్వాధికారులు ఈ అవగాహనల మీద, అభిప్రాయాల మీద చర్చిస్తూ మంచి వాదనలతో కూడిన వ్యాసాలు ఇప్పటికే రాశారు. వాటిలో చాల ఎక్కువ అటు జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు అభిప్రాయాల పైనో, ఇటు సైనిక దళాల ప్రధానాధికారి అభిప్రాయాల పైనో చర్చించారు గాని, ఇద్దరి అభిప్రాయాలనూ కలిపి చర్చించినవారు తక్కువ.

నా అభిప్రాయంలో, ఈ మూడు ప్రకటనలను మాత్రమే కాదు, దేశంలో అత్యున్నత అధికార పీఠాల మీద ఉన్నవారి ఇతర చర్యలనూ, రాజకీయ నాయకుల చర్యలనూ కలిపి పరీక్షకు పెట్టవలసి ఉంది.

పైకి చూడడానికి వేరు వేరుగా, సంబంధం లేనట్టుగా ఉన్న ఈ బిందువులు నిజానికి ప్రస్తుత వాస్తవిక స్థితి గురించీ, మన ప్రజాస్వామ్యం గురించీ, పౌర హక్కుల గురించీ ఒక ప్రమాదకర దృశ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.

విపరీత ప్రచారం దొరుకుతున్న బహిరంగ సైనికేతర కార్యక్రమాలలో సీనియర్ సైనికాధికారులు పాల్గొనడం అనే ఆందోళనకరమైన ధోరణి ఇటీవల బాగా పెరిగిపోతున్నది. ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎక్స్ ప్రెస్ వే ప్రారంభోత్సవ సభలో, అటువంటి ఇతర ఉత్సవాల్లో సైనికాధికారులు పాల్గొన్న ఉదాహరణలున్నాయి. సైనికాధికారులు తెలిసో తెలియకో (?) రాజకీయ పార్టీల ప్రయోజనాలను నెరవేర్చే, ప్రోత్సహించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారా అనే ఇబ్బందికరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

2019లో మేం కొందరం ఎన్నికల ప్రధానాధికారికి రాసిన బహిరంగ లేఖలో సైనిక దళాల రాజకీయీకరణకు వ్యతిరేకంగా హెచ్చరికలు చేశాం. అటువంటి హెచ్చరిక చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ ధోరణి మరింత విచ్చలవిడిగా మారింది.

ఇటీవల పెచ్చరిల్లిన ధోరణులను గుదిగుచ్చి చెప్పాలంటే, ఎన్నో ఘటనలు, నిర్ణయాలు, నిందాపూర్వకమైన చర్యలు, సంభాషణలు అనంతంగా సాగిపోయాయి. నిరసన తెలుపుతున్న రైతులను 'ఆందోళనాజీవులు' అనీ, 'పరాన్నభుక్కులు' అనీ అనడం దగ్గరి నుంచి, బహిరంగంగా వారిని తీవ్రవాదులుగా, మావోయిస్టులుగా, ఖలిస్తానీ వేర్పాటువాదులుగా పరిగణించడం దాకా జరిగింది. కశ్మీర్ నుంచి ఈశాన్య రాష్ట్రాల దాకా మైనారిటీల మీద అమలయిన దారుణమైన వివక్ష, విద్వేష సందేశాల ప్రచారం, జర్నలిస్టుల మీద పెద్ద ఎత్తున అణచివేత, భిన్నాభిప్రాయాల అణచివేత సాగిపోతున్నాయి. ఈ చర్యలన్నీ కూడ అధికారంలో ఉన్న పార్టీలోని వేరు వేరు వనరుల నుంచి వేరు వేరు సందర్భాల్లో దేశమంతటా బైటపడ్డాయి.

వీటన్నిటినీ కలిపి చూస్తే, సైనిక బలగాలలో అత్యున్నత అధికారాలను కూడ నిర్వహించిన మాబోటి వారికి తీవ్రమైన ఆందోళన కలుగుతున్నది. ఈ చర్యలేవీ ప్రజాస్వామ్యానికి మంచివి కావు. శాంతి భద్రతలకు మంచివి కావు. మన వైవిధ్యభరితమైన, బహుళ సమాజంలో సామాజిక సమతుల్యాన్ని కాపాడడానికి మంచివి కావు. ఇంకా చెప్పాలంటే, ఈ చర్యలు కేవలం మన దేశ పౌరులలో, ప్రత్యేకంగా అత్యంత బలహీనంగా ఉన్నవారిలో భయాన్నీ, అభద్రతనూ పెంచడానికీ, వ్యాపింపజేయడానికీ మాత్రమే ఉపయోగపడతాయి. వాస్తవానికి రాజ్యాంగ ప్రతిజ్ఞల ప్రకారం ఇటువంటి చర్యలు జరగడానికి వీలు లేదు.

బాధ్యతాయుతమైన నాయకులు చేసిన ఇటువంటి ప్రకటనలను ఖండించి, నిలదీయకపోతే, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్న వారికి అత్యున్నత అధికారపీఠాల నుంచి ప్రత్యక్ష, పరోక్ష మద్దతు ఉన్నదని పెద్దఎత్తున ఉన్న అభిప్రాయానికి బలం చేకూర్చినట్టే అవుతుంది. అలాగే ప్రజాస్వామ్యానికి ఏర్పడుతున్న కొత్త ప్రమాణాలు ఇంకెంతమాత్రమూ అసమ్మతిని, భిన్నాభిప్రాయాన్ని సహించజాలవు.

రాజద్రోహం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ), జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ), ప్రజా భద్రతా చట్టం (పిఎస్ఎ), సిఎఎ, ఎన్ఆర్‌సి వంటి ఎన్నో అప్రజాస్వామిక, ప్రజా వ్యతిరేక చట్టాలను తక్షణమే సమీక్షించాలని, ప్రభుత్వ సంస్థల చేతుల్లో వాటి దుర్వినియోగాన్ని అరికట్టాలని దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది.

అన్ని ప్రభుత్వ సంస్థలు, న్యాయవ్యవస్థ మానవ హక్కులను కేంద్ర స్థానంలో పెట్టి, అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి రమణ అనేక సందర్భాలలో నొక్కి చెప్పారు. దేశవ్యాప్తంగా పోలీసు అధికారులకు మానవహక్కుల శిక్షణ ఇవ్వాలని కూడ ఆయన సూచించారు.

పౌరసమాజమే నిజమైన ప్రమాదమనీ, దానితో 'నిర్దాక్షిణ్యంగా' వ్యవహరించాలనీ శిక్షణలో ఉన్న పోలీసు అధికారులకు జాతీయ భద్రతా సలహాదారు ఉపన్యాసం ఇచ్చిన సందర్భానికీ ఈ న్యాయమూర్తి ఆదేశాలకూ చుక్కెదురు.

ఇప్పటికే "నిరసన తెలుపుతున్న రైతుల తలలు పగులగొట్టండి" అని పోలీసులకు ఆదేశాలు ఇచ్చిన సబ్ డివిజనల్ మెజిస్ట్రేటులను చూశాం. దేశంలో పోలీసు చిత్రహింసల మీద పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల వేదిక నేషనల్ క్యాంపెయిన్ అగెనెస్ట్ టార్చర్ ఇటీవల విడుదల చేసిన నివేదిక, సమాచారాన్ని రాబట్టడంలో, ఒప్పుదల ప్రకటనలు రాయించడంలో, కొన్నిసార్లు కేవలం సమాజంలోని పీడిత వర్గాల వారిని హింసించడంలో పోలీసులు చిత్ర హింసలను ఎంత ప్రధాన సాధనంగా వాడుతున్నారో చూపింది.

జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు, సైనిక దళాల ప్రధానాధికారి, జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులు తమ ప్రకటనల ద్వారా ఏమి చెప్పదలచారు అని ఇంకా సజీవంగా ఉన్న అత్యంత సీనియర్ సైనికాధికారిగా ప్రశ్నించడం నా బాధ్యత అనుకుంటున్నాను. ఈ దేశ ప్రజల హక్కులకు గౌరవమూ, రక్షణా దక్కుతుందని మరొకసారి హామీ ఇవ్వవలసిందిగా వారిని కోరుతున్నాను. రాజ్యాంగం హామీ ఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ గౌరవించబడుతుందనీ, ఏ ఒక్కరికీ, చివరికి పోలీసులకు, సైన్యానికి కూడ ఎటువంటి పరిస్థితులలోనూ తమ అదుపులో ఉన్న ఏ ఒక్క వ్యక్తి మీద చిత్రహింసలు అమలు చేయడానికి, కొట్టి చంపడానికి అధికారం, హక్కు లేదని, చట్ట ప్రకారం మినహా ప్రజల స్వేచ్ఛను భంగపరిచే హక్కు లేదని మరొకసారి హామీ ఇమ్మని కోరుతున్నాను.

భారతదేశపు ప్రజలమైన మేము సృష్టికర్తలుగా ఉండదలచాం. ఈ భూమిని, దాని వనరులను రూపొందించేవారిగా, యజమానులుగా ఉండదలిచాం. మా అందరికీ హామీ ఇవ్వబడిన హక్కులను, స్వేచ్ఛలను అందరమూ సమానంగా, సక్రమంగా అనుభవించేలా చూడాలని అనుకుంటున్నాం. ఆత్మాభిమానం గల, బాధ్యతాయుతులైన పౌరులుగా మా పని లేచి నిలబడడం, గుర్తింపు పొందడం. శాంతి భద్రతల యంత్రాంగాల పని వారికి ఇచ్చిన బాధ్యతల ఉల్లంఘనలను సాహసికంగా ఎదిరించడం, తమ విధినిర్వహణా నియమాలనూ ప్రవర్తననూ గౌరవించడం.

అంతేకాదు, భారతదేశపు ప్రజలమైన మాకు ఒక ముఖ్యమైన నేస్తంగా బలమైన, స్వతంత్రమైన న్యాయ వ్యవస్థ ఉండాలని కూడ మేం కోరుకుంటున్నాం. ఒక మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి మాటలను ఉటంకించాలంటే, "లేచి ధైర్యంగా నిలబడే, గొంతెత్తే, ఆత్మపరిశీలన చేసుకునే న్యాయవ్యవస్థ లేకపోతే, మన రాజ్యాంగం అనేది ప్రతి నవంబర్ 26న చర్చించుకునే మరొక కాగితపు ముక్క మాత్రమే అయిపోతుంది."

(ది వైర్‌లో నవంబర్ 30న వెలువడిన వ్యాసానికి అనువాదం)

(రచయిత భారత నౌకాదళ మాజీ ప్రధానాధికారి) వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల దిగజారుడు

పార్లమెంట్, అసెంబ్లీలను రాజకీయ నాయకులు ప్రజల సమస్యలు చర్చించడం కోసం కాకుండా, తమ స్వార్థ ప్రయోజనాలకు, కక్ష సాధింపులకు, బూతులకు వాడుకుంటున్నరని అంటున్నారు **పోటు రంగారావు**

చంద్రబాబు కన్నీటి పర్యంతపు మీడియా దృశ్యం తెలుగునాట నేడు తీవ్ర చర్చనీయాంశమైంది. వివాద, విషాదాస్పదం కూడా అయ్యింది. ఇలా మాట్లాడవచ్చా? ఈ పరిభాషతో కుటుంబ మహిళలను లాక్కురావచ్చా? నిన్నేం జరిగింది. నేడేం జరుగుతుంది. నిన్న మీరేం మాట్లాడారు. నేడు మేం మాట్లాడుతున్నాం. ఇదంతా రొంపి రొంపిగా, కంపు కంపుగా వాదనలు, వివాదాలు జరుగుతున్నాయి.

నిజమే. ఈ భాష చీత్కారమైనది. సంస్కారయుతమైన భాష ఉండగా, చమత్కారంతో అభినయించే అవకాశముండగా వీధి రౌడీ భాష జీవితాల్లోకి, జీవితాల్లోంచి రాజకీయాల్లోకి, అటు నుంచి అసెంబ్లీలలోకి ఎలా వచ్చింది? అతిపెద్ద లీడర్లు సైతం బజారు భాష ఎందుకు మాట్లాడుతున్నారు?

వెధవ, సన్నాసి, లంగా, అరేయ్ నాకొడకా, ఒక అబ్బకు అమ్మకు పుట్టావా లాంటి పదజాలాలు అతి సాధారణంగా వాడుతున్నారు. ప్రధాన ఎన్నికల రాజకీయ పక్షాలు టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్, టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ భాషను ఎవరికి వారు స్వంతం చేసుకుంటున్నారు.

తాము అన్నప్పుడు వచ్చే చప్పట్లతో ఆత్మానందం పొందుతున్నారు. ఎదుటి వాడి నుంచి వచ్చినపుడు నొచ్చుకుంటున్నారు. ఇటీవల ఇది శృతిమించింది. ఆ దృశ్యమే 'ధీరువు' అనుకున్న చంద్రబాబు కంట వచ్చిన 'భీరువు' దృశ్యాలు.

బూర్జువా వర్గం, సాంప్రదాయ ప్రజాస్వామిక వర్గం అసెంబ్లీ, పార్లమెంట్లను పరమ పవిత్రంగా భావిస్తారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరమోన్నతంగా చెప్పుతారు. రాజకీయ, శాసన వ్యవస్థలను, న్యాయ వ్యవస్థలను బ్యురాక్రసీని గొప్పగా పొగుడుతారు. ప్రపంచంలో అతిగొప్ప ప్రజాస్వామ్యానికి ఇవి నిలువుటద్దాలని, వీటికి తోడు ఫోర్త్ ఎస్టేట్‌గా చెప్పుకునే మీడియా వ్యవస్థని గొప్పగా పొగుడుతారు.

నేడు ఇవన్నీ ఒక్కొక్కటిగా చీడపట్టి పోయాయి. ముసుగుల్ని చింపివేసుకుంటూ డబ్బుకు లోకం దాసోహం అవుతున్నాయి. కార్పొరేట్ వర్గాలకు ఎర్ర తివాచీ పరుస్తున్నాయి. నీతి వాక్యాలూ, గొప్ప స్తోత్రాలు ఎన్ని చెప్పినా ఇవన్నీ అవినీతి కంపులో నిండా మునిగి వీలున్నంత మేరకు సామాన్యునికి దూరంగా జరిగి పోతున్నాయి. ఆర్థిక సామ్రాజ్యాధిపతులకూ, వారి దళారులకూ నీడలా మారిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్తులనూ, సంపదలనూ కొల్లగొట్టి క్రోనీ క్యాపిటలిస్టులకు ఇవి నేడు సాష్టాంగపడుతున్నాయి.

సామాన్యుడు, ప్రజాస్వామిక వాది ప్రశ్నిస్తే నేరస్తుడవుతున్నాడు. దేశద్రోహిగా ముద్ర వేయబడుతున్నాడు. ఉపా చట్టాలు, రాజద్రోహ నేరాలు వీరి మెడపై వేలాడుతున్నాయి. జైలో, చావో తేల్చుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ బూర్జువా ప్రజాస్వామ్యం సారాంశంలో నియంతృత్వమే అంటాడు. మహోపాధ్యాయుడు మార్క్స్, ప్రజా ఉద్యమంపై ఎక్కుపెట్టబడే ఒక్కొక్క అణచివేత యంత్రాంగాలుగా ఇవి ఉంటాయి. ఉన్నాయి. ఎటొచ్చి వారిలో వారికి రాజకీయ కలహాలు జరిగినప్పుడు ఇవి భస్మాసురిడి హస్తంలాగా వారిపైనే పెట్టబడతాయి. ఈ చంద్రబాబు, జగన్, కెసిఆర్, మోడీ ఇత్యాది నేతలంతా ఒకే గూటి పక్షులు. వీరిలో వీరికి ఆర్థిక విధానాలలో వ్యత్యాసం లేదు. రాజకీయ, సైద్ధాంతిక విభేదాలూ లేవు. వీరి పార్టీలో జంప్ జిలానీలకు గోడలు అడ్డేరావు.

కానీ, రాజకీయాలలో వీరి మధ్య వైరుధ్యం, వైషమ్యం కనపడుతున్నది. మోడీ మతాన్నీ, జాతీయతనూ, ముస్లింలపై ద్వేషాన్నీ పుచ్చుకున్నాడు. కెసిఆర్ తెలంగాణ వాదం జెండా అందుకున్నాడు. చంద్రబాబు స్వర్ణాంధ్రప్రదేశ్‌ను, హైటెక్కు విధానాలను అవలంభించాడు. ఇక జగన్ మైనార్టీ కార్డును, చంద్రబాబు వ్యతిరేకతను పుణికి పుచ్చుకున్నాడు. ఇక చారిత్రక కాంగ్రెస్ పాత విలువలకు, కొత్త వలువలు తొడుగుతూ ముందుకు సాగాలని యత్నిస్తున్నది. వీరి మధ్య, విధానాల మీద పోటీ లేదు. ఆచరణ మీదా లేదు. కార్పొరేట్ వర్గాలు, ఉత్పత్తి ఆధారిత పారిశ్రామిక వర్గాలు వీరి మధ్య పోటికి మూలాధారాలుగా ఉన్నాయి. మార్కెట్ పోకడలు, దానిని ఆధునీకరించడం, దాని మీద ఆధిపత్యం కోసం అవి పోటీ పడుతున్నాయి. వారు ఒక్కొక్కరిని ఒక్కొక్కరు చెలిమి చేసుకుంటున్నారు. ఈ చెలిమి బలిమిగా మారింది. ఇందులో నుంచి వారి నెచ్చెలులకు అధికారం కావాలి. ఆ అధికారం వీరి మార్కెట్ మాయాజాలానికి గొడుగవ్వాలి. శ్రామిక వర్గమో, ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక ఆర్థిక విధానమో ప్రత్యామ్నాయంగా లేని ఈ కాలంలో ఆర్థిక శక్తుల విభజనే పాలక వర్గాల విభజనగా మారుతుంది. మారింది. ఓటు బ్యాంకు కోసం ప్రజాకర్షక పథకాలు, డబ్బు ఎర, ఎదుటివాడిని పలచన చేయడం పోటాపోటీగా జరుగుతున్నది.

ఆర్థిక శక్తుల విభజన, పాలక వర్గాల విభజన కోసం అవినీతి డబ్బు, అనార్కీ క్యాపిటల్ అంటే జూదగొండి డబ్బు, కోకొల్లలుగా రాజకీయ ఎన్నికల చదరంగంలోకి వచ్చి పడింది.

దానిని కొనడం, అమ్మడం తప్ప ఏ విలువలూ తెలియదు. ఎంతటి వాడినయినా గంపకింద కమ్మేస్తున్నారు. ఈ ప్రయాణంలో అరాకొరా తప్ప రాజకీయాలలో ప్రజా ప్రతినిధులుగా సేవాతత్పరులకూ, విలువలు గల అధినేతలకూ ప్రాతినిధ్యం లేదు. అడ్డదారుల్లో, దొడ్డిదారుల్లో, రియల్ ఎస్టేట్, కాంట్రాక్టరింగ్, జూదగొండి వ్యాపారాలలో వందల, వేల కోట్లు సంపాదించిన గణాధిపతులు నేతలుగా రాజకీయ రంగంలోకి వచ్చారు. ఎన్నికలలో గెలిచే అభ్యర్థి కోసం పార్టీలు పోటీ పడే పరిస్థితి. అంటే బాగా డబ్బు పెట్టగల వారిని వెతికి అభ్యర్థిగా పెట్టే పరిస్థితి వచ్చింది. అందుకే ఓటు కింత

రేటు, సీటు కింత ధర వచ్చేసింది. బడా వ్యాపారవర్గం చేతికి ఎన్నికల తంత్రంగా, మంత్రాంగం వచ్చిన నేపథ్యంలో లాభాల కోసం, కొల్లకొట్టడం కోసం వ్యాపార సామ్రాజ్యాలు చేసే పని అంతా ఎన్నికల వ్యవస్థలోకి వచ్చింది.

ప్రజలను పాజిటివ్‌గా ఆకర్షించుకునే రోజులు, పరిస్థితి మసక బారింది. అందుకే సెంటిమెంట్లు, బూతుపురాణాలూ, భాగోతాలూ, హైటెక్ హంగామా, హైటెక్ రిగ్గింగ్, జంపింగ్లు అన్నీ రాజకీయాలలోకి వచ్చాయి. ఎన్నికలు, అధికారం ప్రజాస్వామ్యయుతంగా లేవు. జూదంగా, వేలంగానే మారింది. అధికార యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం అంతా వారి కనుసన్నల్లో మెలిగే ఆధునిక గుమస్తాగిరిగా మారింది. అందుకే అధికారమున్నోడిదే అంతా సాగింపు. ఫలితంగానే అధికారం కోసం సర్వశక్తివంతులూ, టక్కుటమార గజకర్ణ గోకర్ణ విలుకాండ్లు శక్తి అంతా కూడదీసుకొని కుస్తీ పట్టూ, పాట్లు పడుతున్నారు.

ఇటీవల సినిమాలలో అపరిచితుడు, గజినీ, చంద్రముఖి సినిమాలు హిట్ కొట్టాయి. ఇవన్నీ సైకో హీరో సినిమాలు. ఈ ధోరణి సినిమాలలో ట్రెండ్‌గా వచ్చింది. గతంలోనే మంచి వాడు స్థానానికి కిరాతకుడు, భార్యాభర్తల స్థానంలోకి కిరాయి మొగుడు లాంటి సినిమాలు వచ్చాయి. కిల్లర్, పోకిరి ఇవన్నీ సినిమా పేర్లుగా వచ్చి హిట్ కొట్టాయి. అంటే హీరోయిజంకు అర్థం మారింది. స్వీకరించే తీరూ మారింది. ఒక మోనాటిమీని ప్రక్కకు నెట్టి అనార్కిజం సినిమా రంగంలోకి వచ్చింది.

ఈ అనార్కిజమే, సైకోయిజమే రాజకీయాలలోకి వచ్చింది. జూదగొండి పెట్టుబడి సినిమా ట్రెండ్‌ను మార్చినట్లే, రాజకీయ పోకడలనూ మార్చింది. రాజకీయాలలో ఇంతకు ముందే చెప్పినట్లు పై నుంచి దిగివచ్చే నాయకులు, వారి కల్చరూ వచ్చింది.

అందుకే భాష మారింది. విమర్శ పద్ధతి మారింది. ముందు కాంగ్రెస్‌ను బిజెపి, అంతకు ముందు జనతాదళ్ అవినీతి కుంభకోణాల పార్టీగా తూర్పార బట్టారు. కుంభకోణాలను వెలికి తీశారు. ఆ తరువాత బిజెపి దానిని మించి పోయింది. స్కాములూ, స్కీములూ అంతకంటే ఎక్కువగానే జరిగాయి. ఆనాడు ఒక్క భోఫోర్స్. కానీ ఈనాడు రాఫెల్స్ దగ్గర నుంచి అంబానీ, ఆదానీ కొల్లగొట్టడం, దేశాన్ని కుళ్ళగొట్టడం దాకా భారీ స్కాములే జరుగుతున్నాయి. డీమానిటైజేషనూ, జడ్జీల నియామకం నుంచి పిఎస్‌యు (పబ్లిక్ సెక్టార్ యూనిట్స్)ల అమ్మకం దాకా అన్నిటినీ కార్పొరేట్లకు దారాదత్తం చేశారు. కాంగ్రెస్‌ను మించి మతాన్ని, బూటకపు దేశభక్తి నినాదాన్ని వినియోగించుకొని దేశంలో మైనార్టీ, మెజార్టీ విభజన తెచ్చింది. పాత బూర్జువా ప్రజాస్వామిక విలువల సౌధాల్ని ఒక్కొక్కదాన్ని ధ్వంసం చేస్తూ వస్తున్నారు. దేశంలోని ఫ్యూడజాన్ని, ఫెడరిలిజాన్ని పాతర వేసి 'ఒకే దేశం – ఒకే చట్టం' నినాదాలను తెచ్చారు. అటు అమెరికాను, ఇటు అంబానీ, ఆదానీలను వెంటవేసుకొని వారి దారినే పోతున్నాడు. ప్రశ్నించే ప్రతివాడినీ దేశద్రోహిగా చిత్రించుతున్నారు. విద్రోహి భాష తప్ప, మనిషి భాషను, ప్రజాస్వామిక భావనను పక్కకు పెట్టేశారు.

ఆ కోవలోనే కెసిఆర్ సన్నాసులు, దద్దమ్మలు, వలసవాదులు అంటూ తెలంగాణ పేరుతో తిట్లు తిట్టి ఆత్మానందం పొందాడు. పొందుతున్నాడు. నయా నిజాం పోకడను సైతం తెలంగాణ మాటున సమర్థించుకుంటున్నాడు.

ఇక తెలంగాణ రాజకీయాలలో కెసిఆర్ పోకడకు ధీటుగా ధర్మపురి అరవింద్, బండి సంజయ్, రేవంత్ రెడ్డి, తీన్మార్ మల్లన్నలు వచ్చారు. అతని కంటే ఘనులు అనిపించుకున్నారు. బజారు భాషను టివిల్లోకీ, వేదికల మీదకూ పోటీపడి తెస్తున్నారు. ప్రస్తుతం వీరిదే మార్కెట్. సభ్యతగా మాట్లాడిన వారు చేతకాని వారికింద లెక్క ఈ తోవలోనే ఎ.పి.లో జగన్ గ్యాంగు బరితెగించింది. చంద్రబాబు అహంకారం మీద దెబ్బకొడుతూ ఆయన శిష్యులుగానే ఎదిగిన నానీ, వంశీ, రోజా, అంబటి ఇత్యాధి గుంపును చంద్రబాబు మీదకు వదిలాడు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు అనుచరులు అచ్చెంనాయుడు, బొండా ఉమ, రాజేంద్రప్రసాద్ తదితరులు జగన్‌ను, వారి బృందాన్ని జైలు జైలు అంటూ వేధించారు. అసెంబ్లీలోకి రోజాను అడుగు పెట్టనీయలేదు. ఆ సైకలాజికల్ వార్‌లో చంద్రబాబు అహం మీద జగన్ ముఠా ప్రణాళికాబద్ధంగానే దెబ్బకొట్టింది. ఫలితంగానే 40 సంవత్సరాలు రాజకీయ ఇండస్ట్రీలో తిరుగులేని వాడిననుకొన్న, చంద్రబాబు కన్నీటి పర్యంతం కావాల్సి వచ్చింది. నిన్నటి చంద్రబాబు పాలనలో జగన్ ముఠా కార్చిన కన్నీరు, నేడు చంద్రబాబు కార్చిన కన్నీరు పగలు, సెగలు, ప్రతీకార జ్వాలలతో వచ్చినదే.

ఈ ప్రతీకారాలూ, పగల సెగలూ ప్రజాక్షేమం కోసమో, రాష్ట్రం కోసమో కాదు. ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలనే ఉరుకులాట. ఆ ఆటలో ప్రజా సంక్షేమం ఏముంది? నిన్న నీవు చేశావు? ఈ రోజు నేను చేశాను? అనుకోవడం తప్ప. కక్షలూ, కార్పాణ్యాలూ నెర వేర్చుకోవడం తప్ప.

భారత ప్రజాస్వామ్యం, చట్ట సభలు, రాజకీయరంగం డొల్లతనాన్ని, నిర్దిష్ట సమాజపు అరాచక పోకడలకు ఇవి నిదర్శనాలు. దేశంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. కేంద్రం రాష్ట్రాలను ఆటాడిస్తుంది. రాష్ట్రాలలో స్థానిక సంస్థలను నీరుకారుస్తున్నారు. అధికారంలో ఉన్న వాడు, ప్రతిపక్షంలో ఉన్నవాడిని వేటాడుతున్నాడు. ఆటలు ఆడుకుంటున్నాడు. ఈ సమాజ హితాన్ని కోరేవారు, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగాలని కోరుకునేవారు ఈ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాలి. లేకపోతే వీధి రౌడీయిజమే, మాఫియాయిజమే చట్టపు చుట్టంగా, చట్టబద్ధ ఆలంబనగా మారుతుంది. దీనికి వ్యతిరేకంగా పోరాడాలి.

కమ్యూనిస్టు ఉద్యమం మీద కూడా దీని నీలినీడలు ఎంతో కొంత పరచుకున్నాయి. ఇవి బలమైన ప్రత్యామ్నాయాన్ని, ఆర్థిక, రాజకీయ కోణాల్ని ఇవ్వలేని స్థితిలో ఉన్నాయి. పార్లమెంటరిజం, అతివాదం, అవకాశవాదం, అనార్కిజం ఏదో మేరకు సంస్థలలో వేళ్లూనుకున్నాయి. ఫలితంగానే సిద్ధాంత, రాజకీయ వైరుధ్యాలతో పోరాడి, మెరుగైన దానిని సాధించేబదులు నిందలు, అపనిందలు, ముద్రలు వేసుకుంటున్నారు. ఇవి కమ్యూనిస్టు చైతన్యాన్ని, నిర్మాణాన్ని, పోరాటాన్ని మరింత నీరు కార్చి దెబ్బతినే స్థితి ఏర్పడింది.

బూర్జువా పార్లమెంటరిజంలోని అరాచకాన్ని, నిరంకుశాన్ని ప్రజాస్వామికవాదులు, కమ్యూనిస్టులు ఎదిరించి పోరాడాలి. ప్రత్యామ్నాయ ప్రజాసంస్కృతిని చూయించే కృషి జరగాలి. వ్యవస్థ స్థితిని అర్థం చేసుకొని సరైన దిశలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పోరాటాన్ని ఎక్కుపెట్టాలి. ఆ దిశలో సాగకుంటే భవిష్యత్తు మరింత అంధకారమే.

ఆలోపుగా చంద్రబాబు కన్నీళ్లనూ, జగన్ బాబు జైలు కేకల్ని రోజా నవ్వుల్ని, కెసిఆర్ బూతుల్ని, బండి, ధర్మపురిల వెక్కిరింపుల మాటల్ని సమాజం వినోదంగా చూడాల్సి ఉంటుంది. వారి బూతులకూ, రాజకీయాలకూ సంబంధంలేని మహిళల్ని కించపరిచే హీన సంస్కృతిని సైతం సమర్థింపు, వ్యతిరేకతల క్రీడలో భాగం కావాల్సిందే.

(రచయిత న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి) వీ

ఉత్తరప్రదేశ్‌లో మరో ఖైర్లాంజి

దేశంలో పాలకుల అండతో అధికారులు, అగ్రకులస్తులు దళితులపై మానవ సమాజం సిగ్గుపడేలా హత్యలు, అత్యాచారాలు చేస్తూ వారి జీవించే హక్కును హరిస్తున్నారని అంటున్నారు **నక్కా నారాయణ రావు**

2006 సెప్టెంబర్ 29 మహారాష్ట్రలోని బండార జిల్లా జార్ఖండ్ గ్రామంలోని దళిత (మహర్) కుటుంబాలపై మరాఠ, కున్బీ కులాలకు చెందిన మతతత్వ వాదులు దాడిచేసి తల్లి కూతుళ్లపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరంతా ఎడ్లబండిపై ఊరేగింపు చేసి హత్య చేశారు. ఈ దారుణ హత్యా ఉదంతం ఘటన బయటి ప్రపంచానికి తెలియడానికి నెలపైనే పట్టింది. కాని న్యాయం జరగలేదు.

2012 జూన్ 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేట మారణకాండ కొనసాగింది. మచ్చలవలస రిజర్వాయర్ ముంపు భూములపై దళితులు ఉండడాన్ని సహించలేక దళితులపై కాపులు దాడిచేసి తొమ్మిదేళ్లు గడిచి 'ఇంకెక్కడి న్యాయం' అన్న చందంగా తయారయ్యింది.

2021 నవంబర్ 25న ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ జిల్లా ఫాఫామావు తాలుకా గోహరి గ్రామంలో ఫూల్‌చంద్ దళిత కుటుంబం మొత్తాన్ని క్రూరాతి క్రూరంగా హత్యచేశారు. ఈ ఘటన గురించిన అతి చిన్న వార్త కొన్ని రోజుల తర్వాత వెలుగు చూసింది.

పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ ఇలాహబాద్ జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ నవంబర్ 27న గోహరి గ్రామానికి వెళ్లి నిజ నిర్ధారణ చేసింది. ఆ నిజనిర్ధారణ బృందంలో ఆనంద్ మాలవీయ, గాయత్రీ గంగూలి, సోనీ ఆజాద్, అంకేష్ మాద్దేశియా, మనిష్ సిన్హాలు ఉన్నారు. వీరితోపాటు ఆలిండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ నాయకురాలు స్వాతి గంగూలీ, కిరణ్ గుప్తలు ఉన్నారు. నిజనిర్ధారణ బృందం సభ్యులు సంఘటన స్థలానికి వెళ్లినప్పుడు అక్కడ పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు గుమిగూడి ఉన్నారు. వారిలో మృతిచెందిన ఫూల్‌చంద్ కుటుంబానికి సంబంధించిన నలుగురు అన్నదమ్ములు వారి భార్యలతో మాట్లాడిన తర్వాతనే వాస్తవాలను ప్రజలకు చెప్పారు.

ప్రయాగ్ రాజ్ జిల్లా, పోరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోహరి గ్రామంలో సుమారు 16 వేల జనాభా ఉంటుంది. ఈ గ్రామంలో దళితులతో పాటు ప్రధానంగా అగ్రవర్ణాలకు చెందిన పటేల్, ఠాకూర్, కుమార్ భుజవా, మౌర్య మొదలైన కులాల వాళ్లు ఉన్నారు. దళితవాడకు దూరంగా, రోడుకు దగ్గరగా అగ్రవర్ణాలు నివసించే ప్రాంతంలో కేవలం రెండు దళిత కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. అందులో ఒక దళిత కుటుంబం మృతుడు ఫూల్ చందుకు సంబంధించినది. ఆయన నలుగురు అన్నదమ్ములు దీప్‌చంద్, లాల్‌చంద్, భరత్, కిషన్ చంగ్ల కుటుంబం. వీరిలో అందరి కంటే పెద్దవాడు దీప్‌చంద్ వారి అత్తమామల ఊరిలో ఉంటున్నాడు. ఫూల్‌చంద్ ఇల్లు రోడ్డు పక్కనే ఉంటుంది. ఫూల్‌చంద్ ఆయన భార్య, ఇద్దరు పిల్లలు కొడుకు మూగ, చెవిటియే కాకుండా నడవలేని వికలాంగుడు. ఫూల్‌చంద్ ఇంటికి ఎడమవైపున ఖాళీ భూమి ఉన్నది. కుడి పక్కన ఒక పడిపోయిన గోడ ఉన్నది. ఇంటి వెనుక ఒక ఇటుకల బట్టి ఇంటి ముందు రోడ్డు ఉన్నది.

సంఘటనకు సంబంధించిన వివరాలు

25 నవంబర్ 2021న ఉదయం సందీప్ కుమార్ అనే ఆయన ఫూల్‌చంద్ ఇంటి వైపు వెళ్లాడు. అయితే ఫూల్‌చంద్ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. కొంత అనుమానం వచ్చి చూస్తే ఇంట్లో ఎవరూ కనపడలేదు. ఇదే విషయాన్ని కొంత దూరంలో ఉన్న తమ్ముడు కిషన్‌చంద్‌కు సమాచారం ఇచ్చాడు. కిషన్‌చంద్ సీమా సురక్షా బల్ అనే కేంద్ర ప్రభుత్వ అంతర్గత భద్రతా సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పుడు సెలవుపై ఇంటికి వచ్చాడు. కిషన్‌చంద్ వాళ్ల అన్న ఇంట్లోకి వెళ్లి చూస్తే ఫూల్‌చంద్ (50), వదిన మీను (45) చనిపోయి పడి ఉన్నారు. వాళ్ల పక్కన వారి కుమారుడు శివ (10) లోపటి రూములో కూతురు స్వప్న (17) తాళ్ల మంచంలో పడి ఉన్నది. స్వప్న ఒంటి మీద ఎటువంటి బట్టలు లేకుండా నగ్నంగా ఉంది. వాళ్ల అమ్మ ఒంటి మీద బట్టలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీన్నిబట్టి తల్లి కూతుర్లపై అత్యాచారం చేసి చంపేశారని అర్థమవుతుంది. స్వప్న చేతులు కాళ్లు తాళ్లతో బంధించి ఉన్నట్లు గాయాలు కనబడ్డాయి. అంతేకాకుండా స్వప్న స్థనాలు కోసి వేసి ఉన్నాయి. శివ పురుషాంగం కూడా తెగ్గోశారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన తర్వాత

మా నిజనిర్ధారణ బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించినప్పుడు ఫూల్‌చంద్ ఇల్లు మట్టి గోడలతో కట్టిన ఒక పూరిగుడిసె. కప్పు జమ్ము గడ్డితో కప్పి, పాలిథిన్ కవర్ కప్పారు. లోపలికి వెళ్లి పరిశీలిస్తే ఒక తాళ్ల మంచం ఉన్నది. దాని కింద చాలా రక్తం పారిన మరకలు ఉన్నాయి. అదేవిధంగా రక్తంతో తడిసిన చీరలు, బట్టలు కనిపించాయి. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వండిన కూరగాయలు పారబోసి ఉన్నాయి. ఆ కూరగాయల పక్కనే సర్జికల్ గ్లాసులు చెల్లాచెదురుగా పడి ఉన్న మాస్కులు కనిపించాయి. ఆ ఇంటి వెనక ఇటుక బట్టి ఉన్నది. ఒక పడిపోయిన గోడ దగ్గర మనుషులు దుమికి పోయినట్లు ఆనవాళ్లు కనిపించాయి. ఆ ఇంటిని పరిశీలించిన తర్వాత ఫూల్‌చంద్ ఆర్థిక పరిస్థితి ఏమీ బాగా లేదని కడుబీదరికంలో ఉన్నాడని తెలుస్తోంది. ఆ ఇంటి లోపల కేవలం ఒకే ఒక్క కుట్టుమిషన్, రెండు కంటైనర్లు తప్పితే మిగతా వస్తువులు రోజూ ఉపయోగించేవి మాత్రమే ఉన్నాయి.

అగ్రవర్ణ ఠాకూర్లతో వివాదం – పోలీసుల వైఖరి

మృతుడు పూల్‌చంద్ తమ్ముడు లాల్‌చంద్ ద్వారా ఈ కింది విషయాలు తెలిశాయి. 2019 సెప్టెంబర్ 2న ఆ గ్రామ ఠాకూర్ కులానికి చెందిన కన్హా ఠాకూర్ పశువులు పూల్‌చంద్ కుటుంబ ఉమ్మడి పంట చేనులో పడి మేస్తున్నాయి. ఈ భూమిని 12 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిపై ఠాకూర్ కన్నుపడింది. అందుకే అంతకు ముందు కూడా చాలాసార్లు వాళ్ల పశువులు పూల్‌చంద్ పంట చేనులో వదిలేసి చాలా నష్టం చేశారు. ఈ విషయంలో పూల్‌చంద్ వాళ్ల అమ్మ కన్హా ఠాకూర్ వాళ్ల ఇంటికి వెళ్లి ప్రశ్నించింది. దళితులయిన మీరు మమ్ములనే ఎదురు ప్రశ్నిస్తారా అని కన్హా ఠాకూర్ మరి కొంతమంది కలిసి కట్టెలు, రాడ్లు తీసుకొని పూల్‌చంద్ కుటుంబంపై 2019 సెప్టెంబర్ 5న దాడిచేసి కొట్టారు. కులం పేరుతో దూషించారు. ఇక ముందు వచ్చి మమ్ములను అడిగితే మీ ఇండ్లను పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ దాడిలో పూల్‌చంద్ మూడవ తమ్ముడు లాల్‌చంద్ గొంతుకు గాయం అయింది. ఆ దాడిపై పూల్‌చంద్ కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. మాపైనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారా అని కన్హా ఠాకూర్ మరుసటి రోజు తన అనుచరులతో కలిసి వచ్చి దాడిచేసి చంపడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో వారు తప్పించుకుని పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. దళిత బాధితులు మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అందులో ఎస్‌సి, ఎస్‌టి సెక్షన్ కింద కేసు పెట్టినప్పటికీ నేర విచారణ చేయలేదు. నిందితులను అరెస్టు చేయలేదు. చార్జిషీటు వేయలేదు. పోలీసులు చాలా నిర్లక్ష్యంగా నిందితుల పక్షపాతంగా వ్యవహరించారు.

పోలీసుల అండతో కన్హా ఠాకూర్ ఆయన బంధువు బబ్లు సింగ్‌లు అప్పుడప్పుడు వచ్చి పూల్‌చంద్ కుటుంబాన్ని బెదిరించి పోయేవారు. “మా ఆస్తులు పోయినా సరే మిమ్ములను ఎట్టి పరిస్థితుల్లో వదలిపెట్టం చంపేస్తాం” అంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. కిషన్‌చంద్ భార్య పూజ చెప్పిన వివరాల ప్రకారం హెడ్ కానిస్టేబుల్ సుశీల్ కుమార్ సింగ్, సూరేంద్ర సింగ్, రామ్ కేవల్ పటేల్ లాంటి పోలీసు అధికారులు కన్హా ఠాకూర్, బబ్లు సింగ్‌లు ఇంటికి తరచుగా వచ్చి మందు మాంసాలతో విందు పార్టీలు చేసుకునేవారు. హెడ్ కానిస్టేబుల్ సుశీల్ కుమార్ సింగ్, బబ్లు సింగ్‌కు దగ్గరి బంధువు అవుతారు. ఒకరోజు పోలీసులు వచ్చి కన్హా ఠాకూర్‌తో రాజీ ఒప్పందం కుదుర్చుకోవాలని పూల్‌చంద్ కుటుంబంపై ఒత్తిడి చేస్తే వారు ఒప్పుకోలేదు.

2020 సంవత్సరంలో హెూలీ పండుగ రోజు పోలీసులు వచ్చి పూల్‌చంద్ కుటుంబంలోని మహిళల అందరి పేర్లు రాసుకునిపోయారు. ఆ తర్వాత మరొకరోజు వచ్చి పేర్లు రాసుకపోయినా మహిళలు అందరినీ పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. మీరు పండుగ రోజుల్లో శాంతి భద్రతల సమస్య సృష్టించి ఊరిలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టారని మీ మీద కేసులు పెడుతున్నామని చెప్పి మీకు జామిన్ ఇవ్వకుండా వదలమని అన్నారు. దానితో వారు ఎలాగోలాగా జామిన్ సంతకాలు పెట్టించి వారి మహిళలను విడిపించుకున్నారు. ఇలా చాలాసార్లు ఠాకూర్లు పోలీసులు కలిసి మమ్ములను బెదిరించారు. మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఠాకూర్లపై కేసులు పెట్టలేదు.

2021 సెప్టెంబర్‌లో ఒకసారి పూల్‌చంద్ భార్య, కూతురు ఇంటిముందు కూర్చుని ఉన్నారు. అప్పుడు కన్హా ఠాకూర్, బబ్లు సింగ్, వారి మనుషులు వచ్చి వాళ్లపై దాడిచేసి, ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ ధ్వంసం చేశారు. ఈ విషయంలో కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఎటువంటి కేసు నమోదు చేయలేదు. మళ్లీ మళ్లీ పోలీస్ స్టేషన్ వెళ్లి అడగడంతో కన్హా ఠాకూర్ ఆయన కుటుంబ సభ్యులపై వారం రోజుల తర్వాత కేసులు నమోదు చేశారు. కానీ ఈసారి కన్హా ఠాకూర్ ఇచ్చిన ఫిర్యాదుతో దళిత బాధితుల పైనే అక్రమ కేసులు బనాయించారు. ఈసారి కూడా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోని ఫలితంగా, నిందితులకు మద్దతుగా ఉన్నందుకు పూల్‌చంద్ కుటుంబం పరిస్థితి దినదినగండంగా మారిపోయింది.

పోలీసు అధికారులు చట్టం, న్యాయం ప్రకారం నడుచుకోక పోవడమే కాకుండా అగ్రకుల ఠాకూర్ వైపు నిలబడ్డారు. దానితో మరింత రెచ్చిపోయిన అగ్రకుల ఠాకూర్లు ఈసారి మొత్తం కుటుంబాన్ని హత్యచేశారు. దళిత బాధితులుగా మా ప్రాణాలకు హాని ఉన్నది. వాళ్లు మమ్ములను బతకనివ్వరని, చంపేస్తారని ఎన్నిసార్లు చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని, పోలీసుల నిర్లక్ష్యం, నిందితుల పక్షపాతం వల్లనే ఈరోజు ఇంతటి దారుణ మారణకాండ చోటు చేసుకుందని వాళ్లు వాపోయారు. ఊరిలో ఉన్న మిగతా వారు ఠాకూర్ భూముల్లో కూలి పనులు చేసే వారని, కాని మేము మాత్రం ఎప్పుడు వెళ్లేవాళ్లం కాదని స్వతంత్రంగా మా భూమిలో మేము సాగు చేసుకొని బతకడాన్ని సహించలేని కోపం కసి కూడా మాపై ఉన్నదని బాధితులు పేర్కొన్నారు.

పోలీసుల కథనం

పూల్‌చంద్ కుటుంబంపై జరిగిన దాడిపై ఎఫ్ఐఆర్ చేశాం. నేర విచారణ జరుగుతున్నది. ఈ సంఘటన గురించి మీడియాలో బాగా ప్రచారం అయింది. పవన్ కుమార్ అనే దళిత యువకుణ్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాము. పూల్‌చంద్ కూతురు స్వప్నతో ప్రేమ్ కుమార్ ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. అమ్మాయి ఆయన ప్రేమను నిరాకరించింది అనే కక్షతోనే ఈ ఘోరానికి పాల్పడ్డాడనే అనుమానాలు మాకు ఉన్నాయి. ఎందుకంటే యువకుని ఇంట్లో రక్తంతో తడిచిన టీషర్టు మేము స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఉత్తరప్రదేశ్ బిజెపి యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం ఠాకూర్‌లను రక్షించడానికి గోహరి హత్యకాండను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నదని తెలిసిపోతుంది. ఉత్తరప్రదేశ్‌లో పోలీసు అధికారుల అండతోనే దళితులపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ అగ్రకుల మనువాదులు అధికారంలోకి రావడంతో రాజ్యాంగాన్ని పక్కన బెట్టి మనుస్మృతిని రాజ్యాంగంగా అమలు చేస్తున్నారు. మను చట్టం ప్రకారం దళిత బాధితుల రహస్య అంగాలను కోసి వేస్తున్నారు. అగ్రకులాల చేతిలో రాజ్య యంత్రాంగం ఉండడంతో దళితులకు జీవించే హక్కు ప్రమాదంలో పడిపోయిందని ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న దారుణ మారణకాండలు తెలియజేస్తున్నాయి.

ఈ ఘటనపై ఝార్ఖండ్, లక్ష్మింపేట, గోహిం హత్య, అత్యాచారాలలో ప్రజాస్వామ్య దేశంలో దళితులకు 'జీవించే హక్కు' లేకుండా చేస్తున్న విధానాలపై, సుప్రీంకోర్టు స్పందించాల్సిందిగా కోరుతూ, అణిచివేత నుండి ఉద్యమాలు పుడతాయి, దళిత నాయకత్వాల ద్రోహాన్ని విడగొట్టుతూ దేశంలో ఒక బలమైన దళిత ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది.

(రచయిత ప్రధాన కార్యదర్శి, పౌర హక్కుల సంఘం) వీ

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం దుర్వినియోగం

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని అడ్డం పెట్టుకొని సామాన్య ప్రజలపై సైన్యం సాగిస్తున్న దురాగతాలకు పరిష్కారం ఆ చట్టాన్ని రద్దుచేయడమే అంటున్నారు **చిమ్మె. జాన్ బర్నబాస్**

భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలలో ప్రజలను అణచివేయడానికి, భారత రాజ్యాంగం ఇచ్చిన పౌర, ప్రాథమిక హక్కులను కాలరాయడానికి సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం 1958 తయారు చేయబడింది, అమలులోకి వచ్చింది. అటు చైనా, బంగ్లాదేశ్, బర్మా దేశాల సరిహద్దు రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాలు ఇతర దేశాల నుంచి ప్రజలు భారతదేశంలోకి ప్రవేశిస్తూ, ఇక్కడి ప్రజల సంస్కృతీ, సాంప్రదాయాలతో మమేకమవుతూ జీవిస్తూ, రాకపోకలు సాగించేవారు. కానీ ఈ చట్టం వచ్చిన తర్వాత పూర్తిగా ఈ రాష్ట్రాలన్నింటిలోనూ కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తూ, మొత్తం కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాలతో నిండిపోయింది. ఎక్కువగా కొండలు, గుట్టలుగా ఉండే రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాలలో దాదాపుగా ప్రతి రోడ్డు మలుపులోనూ సాయుధ చెక్ పోస్టలతో ప్రతి వాహనం తనిఖీ చేయబడుతుంది. కేంద్ర ప్రభుత్వ అధికారులకు మాత్రమే మినహాయింపు ఉంటుంది.

ఒక్క మణిపూర్ రాష్ట్రంలోనే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హెగ్డే ఆధ్వర్యంలో ఇచ్చిన కమిటీ రిపోర్ట్ ప్రకారం 1528 బూటకపు ఎన్‌కౌంటర్, పోలీస్ హత్యలు జరిగాయనేది నివేదిక సారాంశం. ఈ రిపోర్ట్ 2013లో విడుదల చేయబడింది. కొన్ని సంవత్సరాలు హిరోం షర్మిల అనే మహిళ నిరాహార దీక్ష చేయడంతో కేంద్ర ప్రభుత్వం సుంప్రీకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని వేసి, కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం 1958 పేరు మీద కేంద్ర ప్రభుత్వ పోలీసులు చేసిన దారుణ మారణకాండలపై నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది.

వాస్తవానికి బయటి దేశాల నుంచి వచ్చే వ్యక్తులను కట్టడి చేయడానికీ, వారిని నిరంతరం అనుమానిస్తూ, నిఘా ఏర్పాటు చేసి, వారిని పంపించి వేయడానికి ఉపయోగించాల్సిన చట్టం ఇప్పుడు కేవలం మన భారతీయులైన ప్రజలనే నిరంతరం హింసిస్తూ, చంపేస్తూ, పైశాచిక ఆనందం పొందే విధంగా ప్రయోగించబడుతూ ఉంది. ఇటీవల కాలంలో త్రిపుర రాష్ట్రంలో ఈ చట్టాన్ని కొంత మేరకు సడలించారు, అంటే ప్రయోగించడం తగ్గించారు. మేఘాలయలో కూడా ప్రయత్నిస్తూ ఉన్నారు.

2021 డిసెంబర్ 4న నాగాలాండ్ రాష్ట్రంలో ఒకేసారి 14 మంది కార్మికులను కాల్చి చంపిన ఘటన చాలా కలిచివేసింది. దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒక బొగ్గు గనిలో పని పూర్తిచేసుకొని తమ వాహనంలో సాయంత్రం ఇళ్లకు పోయే కార్మికులను వాహనం ఆపి, తీవ్రవాదులుగా అనుమానించి చంపామని చెబుతోంది. వాస్తవానికి వాహనం ఆపమనగా డ్రైవర్ ఆపలేదనీ, ఆ కోపంతోనే వాహనం పైన కాల్పులు జరిపీ అందరినీ ఒకేసారి చంపివేశారు ఈ కేంద్ర ప్రభుత్వ పోలీసులు. చంపివేసిన తర్వాత మామూలుగా అల్లే కథలనే ప్రచారం చేసుకుంటున్నారు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు, హోం మంత్రి అమిత్ షా. ఈ ఘోరంపై ఆయా గ్రామాల ప్రజలు కేంద్ర సైనిక బలగాలపై తీవ్రమైన ఆక్రోశంతో వారి వాహనాలన్నింటినీ అంటించివేయగా, ప్రజలను భయభ్రాంతులను చేయడానికి పోలీసులు మళ్లీ కాల్పులు జరుపగా మరికొంత మంది చేనిపోయారు.

సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం ప్రకారం తమకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవచ్చుంటూ, లేని అధికారాలను కూడా తాము అనుభవిస్తూ, సామాన్య ప్రజలను కాల్చి చంపడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. దీనిపై ఆదేశించిన 'కోర్ ఆఫ్ ఎంక్వైరీ' కూడా సాయుధ బలగాలకు అనుకూలమైన నివేదికనే ఇస్తారు. భారత పార్లమెంట్ చేసిన ఏ చట్టమైనా రాజ్యాంగ హక్కులను కాలరాయ రాదు. అది రాజ్యాంగ విలువలకూ, రాజ్యాంగ పరిమితులకూ లోబడే పనిచేయవలసి ఉంటుంది.

ఇక్కడ సాయుధులైన పోలీసులు లేదా సైనికులు సామాన్య ప్రజలను దొంగలుగా, లేదా ద్రోహులుగా లేదా విదేశీ చొరబాటుదారులుగా చూస్తూ ఉన్నారు, ప్రకటిస్తున్నారు. అయినప్పటికీ కూడా చట్టం ప్రకారం వారిని కోర్టులో ప్రవేశపెట్టాలి. కోర్టు పద్ధతుల ప్రకారం విచారణ జరుపబడి, వారికి శిక్ష విధింపబడే విధంగా చేయాలి కానీ, కాల్చి చంపే అధికారం ఎవ్వరికీ లేదు. ఇది రాజ్యాంగం, క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ రెండూ చెబుతున్న విషయాలైనప్పటికీ పోలీసులు, సైన్యం ఏ కోశాన పట్టించుకోవడం లేదు, పాటించడం లేదు. ఇది పూర్తిగా అమానవీయం, ఆందోళనకరం, అప్రజాస్వామికం.

దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి నాగాలాండ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న హార్న్‌బిల్ వేడుకను బహిష్కరించి, నల్ల జెండాలతో నిరసనలు తెలపాలంటూ అనేక సంస్థలు, గిరిజన సంఘాలు పిలుపునిచ్చాయి. మయన్మార్‌తో అంతర్జాతీయ సరిహద్దు పంచుకున్న ఈ ప్రాంతంలో 'నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ – కంప్లాంగ్' వర్గంకు చెందిన తీవ్రవాదుల గుంపు సంచరిస్తున్నట్లుగా ఇంటెలిజెన్స్ విభాగం సమాచారం ఇచ్చినందున గాలింపు చర్యలలో

భాగంగా సైన్యం చెక్ పోస్ట్‌లలో వాహనం తనిఖీలలో నిలుపుదల చేయకుండా, వారిని లెక్కలోకి తీసుకోకుండా ముందుకు తీసుకొని పోయిన నేరానికి సైన్యం కాల్పులకు అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

నిజంగానే వాహనం ఆపనంత మాత్రాన సామాన్య ప్రజలకు, తీవ్రవాదులకు తేడా తెలియని పరిస్థితులలో భారతదేశ సైనికులు ఉన్నారనేది విచారించాల్సిన విషయం లేదా వారి అహం దెబ్బతిని కాల్పులు జరిపారా అనేది నిర్వివాదాంశం. అయినప్పటికీ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తప్పుచేస్తూ దొరికిపోయినట్లు సైన్యం చర్యలను సమర్థిస్తూ మాట్లాడుతూ, తెలిసే చేసినట్లు తప్పును అంగీకరించినట్లుగా పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. దుర్మార్గాన్ని అంగీకరిస్తున్నట్లు అంతా చట్టబద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా జరిగినట్లుగా చెప్పడం కేంద్ర ప్రభుత్వం సైనిక చర్యను వెనకేసుకొచ్చినట్లే.

సైన్యం చేతిలో ఆయుధం, దానిని ఏ విధంగా ప్రయోగించినా ప్రశ్నించ వీలులేని అధికారాలతో ఎఎఫ్ఎస్‌పిఎ చట్టం ఉండడం చేత అనుమానాల ఆధారంతో ఎదుటివారి ప్రాణాలను తీయడం చాలా సులభం. నిజంగా వాహనంలో తీవ్రవాదులే ఉంటే తమ ప్రాణ రక్షణ కోసం కాల్పులు జరుపకుండా, సైన్యం చేతిలో ఒట్టిగానే ప్రాణాలు విడిచిపెట్టి ఉంటారా అనే దానికి సైన్యం వద్ద సమాధానం లేదు. నిజంగా తీవ్రవాదులై అయి ఉండి ఉంటే కనీసం ఒక్క సైనికుడి ప్రాణమైనా పోయి ఉండేది కదా? వీటన్నింటిపై సైన్యం వద్ద కానీ, కేంద్ర ప్రభుత్వం వద్ద కానీ సరియైన సమాధానం లేదు. ఎందుకనగా నిజంగా కావాలనే వారు నేరం చేశారు కాబట్టి. అంతే కాకుండా సైన్యం చేసిన పెద్ద నేరాన్ని సమర్థించడం కేంద్రం చేస్తున్న మరో పెద్ద నేరం. ఒక తప్పును సమర్థించుకోవడానికి ఇంకో తప్పు చేసినట్లుంది కేంద్ర ప్రభుత్వ ప్రకటన సారాంశం.

భారత రాజ్యాంగాన్ని ఏమాత్రం గౌరవించినట్లు లేదు. సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని తాత్కాలికంగానైనా రద్దుచేసినట్లు ప్రకటించలేదు. అప్పుడైనా నాగాలాండ్ సామాన్య పౌరులలో కొంత ఉపశమనం లభించేది. కనీసం కేంద్ర ప్రభుత్వం ఆ ప్రకటన కూడా చేయకపోవడం చేత అక్కడి ప్రజలు మరింత ఆగ్రహంతో ఉన్నారు. మొత్తం సంఘటనపై దర్యాప్తు, విచారణలూ జరిగిన సంఘటనలో దోషులను పట్టుకోవడంలో శ్రద్ధ చూపేదాని కన్నా, కేసును ఏదో ఒక విధంగా ముగించాలనే తాపత్రయంతోనే చేస్తారు. పైగా సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం 1958 ఎలాగూ వారికి అన్ని రక్షణలూ కల్పిస్తున్నది కాబట్టి నామ మాత్రమైన విచారణ తప్ప, దోషులను పట్టుకొనే విచారణ జరగదనేది నిర్వివాదాంశం.

దోషులు ప్రత్యక్షంగా కనబడుతుంటే విచారణ అనే ప్రక్రియ లేకుండా నేరాన్ని నిర్ధారించి, శిక్షను ప్రకటించమే తరువాయిగా ఉండాలి తప్ప విచారణ పేరుతో కాలయాపన అనేది జరిగిన సంఘటనను కప్పిపుచ్చడమే అవుతుంది. పూర్తిగా ఏకపక్షంగా విచారణ జరపడం అనేది 'విచారణ' చట్టానికే మచ్చ. సాయుధ బలగాలు ప్రత్యేకాధికారాల చట్టం ఇచ్చిన అధికారంతోనే సైన్యం ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారించవు.

ఈ చట్టం ఇచ్చిన ప్రత్యేకాధికారాల వల్లనే సైన్యం ఈ హత్యలకు పాల్పడుతున్నదనేది అందరికీ తెలిసిన సత్యం. అయితే కేంద్ర ప్రభుత్వ వైఖరి మాత్రం ఈ సంఘటనను ఖండించే వారిని, సైన్యం పట్ల గౌరవం లేని వారిగానూ, దేశభక్తి లేనివారిగానూ చిత్రీకరిస్తోంది. ఇంకా కొంత ముందడుగేసి దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి అటు తీవ్రవాదులతోనూ, ఇటు విదేశీ చొరబాటుదార్ల తోనూ పోరాడుతున్న సైనికుల పట్ల గౌరవం లేదన్నట్లుగా సంఘటనపై పోరాడే ప్రజలపై బిజెపి నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇది దివాళాకోరు రాజకీయం తప్ప మరొకటి కాదు. ఎఎఫ్ఎస్‌పిఎ పేరు మీద సైన్యం సామాన్య ప్రజలపై చేస్తున్న అకృత్యాలు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు చాలా మట్టుకు బయటకు రావడం లేదు. నూటికి 90 శాతం కప్పిపుచ్చబడుతున్నాయి.

కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ సైన్యం వైఖరిలో మార్పు రావడం లేదు. ప్రజల హక్కులను నిరంతరం కాలరాస్తూ, ప్రజలపై పెత్తనం, అధికారం చేలాయించాలనే తాపత్రయం ఉన్న 'సైన్యం' అధికారాలను ఎఎఫ్ఎస్‌పిఎ చట్టం ఇస్తున్నది కనుక ఈశాన్య రాష్ట్రాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు పోరాడుతున్న డిమాండ్ ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నదే కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు క్షమాపణలు చెబుతూ ఈ చట్టాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాలి. లేనిచో మరింత ఆందోళనలతో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు చట్టం రద్దయ్యే వరకూ పోరాడుతారు. వీరికి ప్రజాస్వామ్య శక్తులన్నీ దేశ వ్యాప్తంగా మద్దతు పలుకుతున్నాయి. ప్రజాస్వామ్య పోరాటం విజయవంతం అవుతుంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

పాత్రికేయుడు వినోద్ దువా కన్నుమూత

సీనియర్ పాత్రికేయుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత వినోద్ దువా(67) కన్నుమూశారు. ఈ ఏడాది ప్రారంభంలో కొవిడ్-19న బారిన పడి అప్పటి నుంచి ఐసియులో చికిత్స పొందుతున్నారు. తీవ్రమైన కాలేయ సమస్యతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 4న మరణించారు. హిందీ టివి జర్నలిజంలో ప్రముఖుడిగా పేరు గడించారు. యువ మంచ్ యువ్ జన్, జవాన్ తరంగ్, ఆప్ కే లియే వంటి అనేక ప్రదర్శనల్లో భాగమయ్యారు. దూరదర్శన్, ఎన్‌డిటివిల్లో పనిచేసిన దువా పాత్రికేయ రంగంలో చేసిన నిస్వార్థ సేవలకు గాను జర్నలిజంలో రామ్‌నాథ్ గోయెంకా పురస్కారం అందుకున్న తొలి ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయుడు. నలుపు తెలుపు టివిలు వచ్చిన తొలిరోజుల్లోనే దూరదర్శన్‌లో వృత్తి జీవితాన్ని ప్రారంభించి, సప్తవర్ణాల డిజిటల్ యుగంలోనూ తనదైన ముద్ర వేశారు.

ప్రాణాలు హరిస్తున్న ప్రత్యేకాధికారాల చట్టం

ఒక ప్రాంతంలో సుదీర్ఘకాలం పాటు సైన్యానికిచ్చిన ప్రత్యేక అధికారాల చట్టం ప్రజలను రక్షించడం కన్నా వారి ప్రాణాలనే హరిస్తుందంటే అది పాలకుల వైఫల్యమేనని అంటున్నారు **చెరుకు సింహాద్రి**

ఈశాన్య భారతం మరోమారు రక్తసిక్తమైంది. అమాయక నాగా ప్రజల రక్తంతో తూరుపు కొండలు ఎరుపెక్కాయి. చల్లని మంచుకొండలు పచ్చని అడవి వెచ్చని నెత్తురుతో తడిసి గుండెలు బాదుకున్నాయి. నాగాలోయలు ఆర్తనాదాలతో ప్రతిధ్వనించాయి. తుపాకులకు, తూటాలకు ఎప్పటిలాగే ప్రభుత్వం పొరపాటు దుప్పటి కప్పింది. ఆలీవ్ దుస్తులకు మట్టి అంటకుండా చట్టం రక్షణ కవచాన్ని గట్టిగా తొడిగింది. రాలిన అమాయక ప్రాణాలను ఎక్స్ గ్రేషియా శవపేటికలో భద్రంగా కప్పెట్టింది. సానుభూతి ప్రకటనతో నిరసనలపై "సిట్"(0గ్)వేసింది ఈ సంఘటన యావద్దేశాన్ని మరొక మారు ఉలిక్కిపడేలా చేసింది. ప్రజల మాన ప్రాణాలకు రక్షణగా నిలవాల్సిన రక్షణ దళాలే ప్రజల పాలిట భక్షకులుగా నిలిచి భారత చరిత్రలో మరొక విషాదకర పేజీ రచనకు పూనుకున్నాయి. సాయుధులై శత్రువు నుండి స్వదేశీయుల ప్రాణాలను కాపాడాల్సిన సైన్యం అత్యంత దుర్మార్గంగా తానే శత్రువుగా మారి ప్రజల ప్రాణాలని హరించడం యావత్ ప్రపంచమే నివ్వెరపోయేలా చేసింది. ఇటీవల ఈశాన్య రాష్ట్రమైన నాగాలాండ్‌లో జరిగిన సాయుధ దళాల చేత, ప్రజల కాల్చివేత సంఘటన వెనుక అసలేం జరిగింది? ఒక చేతిలో చట్టం, మరొక చేతిలో ఆయుధంతో మానవహక్కుల ఉల్లంఘనకు ఉపక్రమించడంలోని ఆంతర్యం ఏమిటి? ప్రజల సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు ఏమిటి? ప్రత్యేక అధికారాల చట్టం ప్రజా హక్కుల హననానికి ఎట్లా దారి తీసిందో ఆ చట్టం ఆవశ్యకతపై పెల్లుబికుతున్న, ప్రస్తుత పరిణామాలను ప్రజా ఉద్యమాల అవసరాన్ని గుర్తించాల్సిన సందర్భాన్ని పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అసలేం జరిగింది?

నాగాలాండ్ రాష్ట్రంలోని మోన్ జిల్లాలోని తిరు, ఓటింగ్ గ్రామానికి చెందిన కార్మికులు సమీపంలోని బొగ్గు గనుల్లో పని చేయడం తిరిగి అదే బొగ్గు గనికి చెందిన వాహనంలో ఇంటికి రావడం ప్రతి రోజు జరుగుతుంది. రోజు మాదిరిగానే సంఘటన జరిగిన డిసెంబర్ 4న కొందరు కార్మికులు బొగ్గు గనిలో పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి చేరుకుంటుండగా, దారిలో భద్రతాదళాలు వారిపై కాల్పులు జరపడం జరిగింది. నిర్దాక్షిణ్యంగా సైన్యం జరిపిన హింసా కాండకు బలైపోయిన తమవారి ఆచూకీ కోసం, వెళ్లిన ప్రజలు సైన్యమే తమ బంధువులను కాల్చి చంపిందని అన్యాయాన్ని ప్రశ్నించి ప్రతిఘటించిన సందర్భంలో రెచ్చిపోయిన సైన్యం మరొక మారు కాల్పులకు తెగబడడం జరిగింది. సైన్యం జరిపిన ఈ మారణకాండలో 14 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. దిగ్భ్రాంతి చెందిన నాగా ప్రజలు, ఈశాన్య రాష్ట్రాల ప్రజలతో పాటు యావత్ దేశం నలుమూలల నుండి భారత సైన్యం ప్రజా హననంపై నిరసనలు వెల్లువెత్తాయి. సైన్యం అధికారంపై రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగానే సైన్యం తప్పించుకోవడానికి పాత పాటనే పాడింది. కార్మికుల వాహనాన్ని తనిఖీ చేయకుండానే, అందులో నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ ఉగ్రవాద సంస్థకు సంబంధించిన ముఠా సభ్యులు ఉన్నారన్న సమాచారం ఉందని అందుకే కాల్పులు జరిగినట్లు చెప్పింది. ఇది నిజం కాదు.

నిజానికి ఆ సంఘటనలో కాల్పులకు గురై గాయపడిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఆ వాహనంలో ప్రయాణిస్తున్నది బొగ్గుగని కార్మికులే. తిరుగుబాటుదారులు కాదు. వారి చేతుల్లో పనిముట్లు, భోజన కారియర్లు తప్ప వారి వద్ద ఆయుధాలు ఉండే అవకాశం లేదు. ఒకవేళ సైన్యం వారిని తిరుగుబాటుదారులుగా భావించినా, ఆ వాహనం ఆపకుండా వేగంగా వెళుతున్నా, సైన్యం వాహనాన్ని ఆపే ప్రయత్నంలో టైర్లు కాల్చి ఆపి ఉండవచ్చు. కానీ సైన్యం ఆ పని చేయలేదు. అంటే సైన్యానికి చంపే ఉద్దేశ్యం తప్ప మరొకటి లేదని అర్థమవుతుంది. ఇంటెలిజెన్స్ పేరు చెప్పి తప్పించుకోజూసే సైన్యం ఆలోచన వెనుక ప్రస్ఫుటంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి ఇటీవల అస్సాంలో జరిగిన అస్సాం రైఫిల్స్ దళానికి చెందిన కమాండింగ్ అధికారి కుటుంబం తీవ్రవాదుల చేతిలో మందు పాతరకు బలి కావడమయితే, మరొకటి తమ చేతిలో భారత ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక అధికారాల చట్టం. తమ సైన్యాధికారి మృతికి రగిలిపోయిన సైనిక దళాలు ప్రతీకారేచ్ఛతో సామాన్య ప్రజలను పొట్టన పెట్టుకున్నదన్నదే వాస్తవం. ఈ అరాచక రాక్షస చట్టం సాయుధులైన సైన్యానికి రక్షణ కవచంగా ఉండడమే ప్రధానం కాగా, దీని వెనుక ఉన్న కారణాలు వాస్తవాలు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాగాలాండ్ చారిత్రక నేపథ్యం

స్వతంత్ర భారతావనికి ముందు 1826లో బ్రిటిష్ సామ్రాజ్య పాలిత ప్రాంతమైన అస్సాంలోని ఒక రాజరిక పాలనా సంస్థానమే నాగాహిల్స్. ఈ ప్రాంతంలోని లోయలు, మైదాన ప్రాంతాలు రాజరిక పాలనలో ఉండేవి. కొండ ప్రాంతాలు గిరిజన తెగలు అయిన నాగా మొదలైన వారి ఆధీనంలో స్వయం ప్రతిపత్తిని కలిగి ఉండేవి. ఈ నాగ తెగల భాష సంస్కృతి సాంప్రదాయాలు అస్సామీల కంటే భిన్నమైనవి, కనుక తమ అస్తిత్వాన్ని కాపాడుకునే దిశలో తమ ప్రత్యేక ప్రతిపత్తి కొరకు నాటినుండి పోరాడుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే 1881లో నాగా హిల్స్ బ్రిటిష్ ఇండియాలో భాగమైనాయి. ఈ నేపథ్యంలో నాగ తెగలన్నీ కలిసి 1918లో నాగా క్లబ్‌గా అవతరించాయి. ఈ క్లబ్ ఆధ్వర్యంలో 1927లో వచ్చిన సైమన్ కమిషన్‌ను కూడా వ్యతిరేకించారు. అనంతర కాలంలో 1946లో

నాగా తెగల నాయకుడైన ఎజడ్ పిజో ఆధ్వర్యంలో నాగా నేషనల్ కౌన్సిల్ ఏర్పడింది. చివరికి 1947 ఆగస్టు 14న నాగా హిల్స్ ప్రాంతాన్ని స్వతంత్ర రాజ్యంగా నాగా నేషనల్ కౌన్సిల్ ప్రకటించుకుంది. కానీ, బ్రిటిష్ ప్రభుత్వం తన పాలన నుండి మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న నాగా తెగల ప్రాంతాన్ని భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన రెండు సంవత్సరాల తర్వాత 1949లో భారతదేశంలో విలీనం చేయడం జరిగింది. నాగాలు మాత్రం పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ స్వయం పాలనా కాంక్షను విడనాడకుండా పోరాడుతూ వస్తున్నారు. ప్రధానంగా భారతదేశంలో విలీనం కావడాన్ని అక్కడి గిరిజన తెగలు విభేదించాయి. అక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేర్చడానికి కొన్ని నాగా తెగల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయి. ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ తమ ఉనికిని చాటుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న ఎన్ఎన్సి ఆ ప్రాంతంలో స్వయంప్రతిపత్తి పై స్వయంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసింది.

1951లో జరిపిన స్వయం ప్రజాభిప్రాయ సేకరణలో 99 శాతం నాగా ప్రజలు నాగా సార్వభౌమాధికారానికి మద్దతు తెలియజేశారు. దీంతో ఏ జెడ్ ఫిజో 1952లో అండర్ గ్రౌండ్ నాగా ఫెడరల్ గవర్నమెంట్ పేరుతో ప్రభుత్వాన్ని, నాగా ఫెడరల్ ఆర్మీ పేరుతో సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. స్వయం ప్రతిపత్తి కోరుతూ, ఎన్ఎఫ్జి ఆధ్వర్యంలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను అదుపులో ఉంచి శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి 1955లో భారత ప్రభుత్వం తమ సైన్యాన్ని పంపడం జరిగింది. నాగాలు స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా ప్రకటించాలని ఏకైక డిమాండ్తో తమ ఉద్యమాన్ని కొనసాగించడం జరిగింది. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి భారత ప్రభుత్వం 1957 వరకు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఆ ప్రాంతాన్ని కల్లోల ప్రాంతంగా ప్రకటించింది. అంతేగాక స్వతంత్రానికి ముందు 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బెంగాల్ ప్రాంతంలో చెలరేగిన స్వాతంత్ర ఉద్యమాన్ని అణచడానికి నాటి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయోగించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల ఆర్డినెన్స్ను స్ఫూర్తిగా తీసుకొని 1958లో భారత పార్లమెంట్ ద్వారా సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రూపొందించి నాగాల ఉద్యమాన్ని అణిచి వేయడానికి పూనుకుంది. అయినప్పటికీ నాగాల ఆకాంక్ష చావలేదు. అనేక పోరాటాల తర్వాత ఆ ప్రాంత ప్రజల కోసం పోరాడుతున్న నాగా నేషనల్ కౌన్సిల్తో పాటు, నాగా పీపుల్ కన్వెన్షన్ వంటి మరికొన్ని సంస్థలతో చర్చలు జరిపి నాటి ప్రధాని నెహ్రూ 16 పాయింట్ ఫార్ములా అగ్రిమెంట్తో అస్సాంలోని ఒక జిల్లాగా ఉన్న వివిధ ప్రాంతాలను జాతులను కలిపి నాగాలాండ్ పేరుతో 1963 డిసెంబర్ 1న ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించడం జరిగింది. అయితే కేవలం నాగా జాతి ప్రజల స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా గుర్తించక పోవడాన్ని వ్యతిరేకించిన నాగా నేషనల్ కౌన్సిల్ తమ పోరాటాన్ని ఇప్పటివరకు కొనసాగిస్తూనే ఉంది. 1975 అక్కడ మిగిలిన పోరాట సంస్థలతో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. కానీ కౌన్సిల్ స్వయం ప్రతిపత్తి కోసం తన పంథాని సాయధ రూపంలో కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం దానిని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ఇదే సమయంలో సరిహద్దు ప్రాంతమైన ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం నాగాలాండ్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ అస్సాం వంటి ప్రాంతాల్లో దేశ రక్షణ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేత కొరకు సైన్యానికి ప్రత్యేక అధికారాల చట్టాన్ని పట్టం కట్టింది.

ప్రత్యేక అధికారాల చట్టం ఏం చెబుతోంది?

1958లో భారత ప్రభుత్వం పార్లమెంటు ద్వారా రూపొందించిన చట్టాల్లో అత్యంత దుర్మార్గమైన చట్టంగా సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం నిలిచింది. ఎఎఫ్ఎస్పిఎ సెక్షన్ 3 ప్రకారం కుల, మత, వర్గ, జాతి, భాష, ప్రాంతీయ విద్వేషాల కారణంగా గొడవలు చెలరేగినప్పుడు లేదా జరుగుతాయని భావించినప్పుడు ఆ ప్రాంతాన్ని కల్లోల ప్రాంతంగా భావించవచ్చు. ఆ ప్రకటన కనీసం మూడు నెలల నుండి అత్యధికంగా ఆరు నెలల వరకు అమలులో ఉంటుంది. ఈ సమయంలో సైన్యాన్ని తత్సంబందిత ప్రాంతానికి పంపడం జరుగుతుంది. అక్కడ సైన్యం చేతిలోకి అధికారాలు దఖలు చేయబడతాయి. వాటి ప్రకారం ఐదుగురి కన్నా మించి గుమిగూడ కూడదు హెచ్చరికలతో కూడిన లేదా హెచ్చరికలు లేకుండా కాల్పులు జరుపవచ్చు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అనుమానించిన వారిని అరెస్టు చేయడం నిర్బంధించడం కాల్పులు జరిపే అధికారం సైనిక బలగాలకు అప్పచెప్పడం జరిగింది. ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా వాహనాలు గృహాలు తనికీ చేసే అధికారం కలిగి ఉంటాయి. వీటన్నిటితో పాటు సైనిక బలగాల చర్యలపై ప్రాసిక్యూట్ చేసే అధికారం కూడా న్యాయ స్థానాలకు లేకుండా విశేషాధికారాలు సైన్యానికి కట్టబెట్టడం జరిగింది. కాగా ఈ చట్టం రూపొందించింది మొదలు దేశంలో ప్రజలు జీవించే హక్కును సహితం కాలరాసే దిశగా అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. మొదటిసారిగా అస్సాం, మణిపూర్లో అమలుచేసింది. 1983లో రెండవసారి ఖలిస్తాన్ ఉద్యమ సమయంలో పంజాబ్, చండీఘర్లో 1990లో జమ్మూ కశ్మీర్లో అమలు జరిగింది.

చట్టం దుర్మార్గాలు

సైనిక దళాలకు దఖలు పడిన అవాంచనీయమైన ఈ చట్టం వల్ల దేశ సరిహద్దు ప్రాంతాల ప్రజలు స్వదేశంలోనే పరాయిలుగా, అనుమానితులుగా బిక్కుబిక్కుమంటూ జీవితం గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. చట్టంలో ఉన్న అవకాశాలను తమకు అనుకూలంగా మలుచుకుని సైన్యం విశృంఖలంగా వ్యవహరిస్తుంది. అత్యాచారాలకు, హత్యలకు తెగబడుతోంది. ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. జరిగిన అన్యాయాలపై న్యాయ విచారణకు కూడా నోచుకోని అమానవీయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ దుస్థితిని అనేకమార్లు ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ప్రపంచ దృష్టికి తెచ్చారు. 2004లో మణిపూర్లో సాయుధ బలగాల చేతిలో మనోరమ అత్యాచారం తర్వాత అస్సాం రైఫిల్స్ ప్రధాన కార్యాలయం ముందు మహిళలు జరిపిన నగ్న ప్రదర్శన సైన్యం దాష్టికానికి తీవ్ర నిరసన రూపంగా ప్రపంచం సిగ్గుపడింది. మాలూమ్ ఊచకోత తర్వాత ఇరోమ్ షర్మిల దాదాపు దశాబ్దంన్నర నిరాహార దీక్ష ఈ చట్టంలోని దుర్మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ఈ చట్టం చేతిలో ఉండటం వల్ల విచక్షణారహితంగా వ్యవహరిస్తున్న సైన్యం ఆగడాలకు మహిళలు, సామాన్య ప్రజలు బలవుతున్నారు. ప్రధానంగా సరిహద్దు ప్రాంతాలలోని గ్రామాల ప్రజలు భారతదేశ అంతర్గత భాగస్వాము లేదా అన్న అనుమానం కలుగుతుంది. సైన్యం జరుపుతున్న హత్యాకాండపై భారతదేశంలో మీడియా గానీ, ఇతర పౌరసమాజం స్పందించాల్సినంతగా స్పందించక పోవడం కూడా విషాదమే. అందుకు

ప్రభుత్వాలు దేశ భక్తిని, సరిహద్దు భద్రతను తిరుగుబాటుదారులను సాకుగా చూపడమే ప్రచారంగా ప్రభావితమవుతుంది. కనుక చట్టం ముసుగులో సాగుతున్న దుర్మార్గాలను, మానవ హక్కుల విధ్వంసాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉధృతమైన ఉమ్మడి పోరాటాలు

ఇటీవల జరిగిన నాగాలాండ్ సైనిక చర్యను ఈశాన్య ప్రాంతాలతో పాటు ప్రజాస్వామికవాదులు, ప్రజాహిత మేధావులు ఖండించడంతో పాటు స్థానికంగా ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరే ఉద్యమానికి మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో నాగాలాండ్, మణిపూర్, అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం చట్టాన్ని సమీక్షించి రద్దు చేయాలని నినదించడం ఆహ్వానించదగ్గ పరిణామమే ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించలేని పాలన దేనికని, ఈ దేశంలో నివసించే ప్రజలకు దేశమే శత్రువుగా వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయం అని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి వేదిక ద్వారా ఇటువంటి చట్టాల నడ్డి విరవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముగింపు

దేశ సరిహద్దు రక్షణ పేరుతో, కల్లోలిత ప్రాంతాలలో శాంతి స్థాపన పేరుతో, తీవ్రవాద గ్రూపుల ఏరివేత పేరుతో, సైన్యానికి అందించిన ప్రత్యేక అధికారాల చట్టం సాయుధ దళాలకు తిరుగులేని ఆయుధమైంది. ప్రశ్నించే సాహసం చేయలేని అసహాయ స్థితికి ప్రజలను నెట్టి వేస్తుంది. ఈ చట్టం అమలులో ఉన్న ప్రాంతాల్లో మానవ హక్కుల ఉల్లంఘన నిస్సిగ్గుగా జరిగిపోతోంది. ఈ చట్టం ద్వారా సాయుధ బలగాల విచక్షణారహిత ప్రవర్తనను ప్రాసిక్యూట్ చేయాల్సిందేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడినా దిక్కు లేదు. నిజానికి సుదీర్ఘకాలం ఒక ప్రాంతంలో ఈ చట్టం అమలులో ఉంది అంటే, అక్కడ పాలకవర్గాలు విఫలమయ్యాయని అర్థం. దేశంలో ఉన్న ఇంటలిజెన్స్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది అని చెప్పాల్సి ఉంటుంది. అత్యంత ఉన్నత స్థాయిలో సమాచార అప్రమత్తత కలిగి ఉండాల్సిన వ్యవస్థ, సైన్యం ఊహించిన, ఊహించని సమస్యలను పసిగాట్టాల్సి ఉంటుంది. ఇలాంటి సంఘటనలలో ఇంటలిజెన్స్ వ్యవస్థకు తెలియదంటే అది సైన్యం నిర్లక్ష్యంగా, కక్ష్యపూరితంగా వ్యవహరిస్తుందని భావించాలి. ఇదే నిజమైతే సాయధ బలగాలు పొరుగు దేశాల్లో మాదిరిగా, ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై కూడా దాడి చేసినా ఆశ్చర్యపడాల్సిందేమీ ఉండదు. కనుక దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్రిటిష్ పాలకుల ఆలోచనలతో రూపొందించిన పాతకాలపు చట్టాలను రద్దుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్య స్వతంత్ర భారతావని అని భావిస్తున్న దేశంలో ప్రజాహిత చట్టాలకే ప్రాణం పోయాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రజల సంరక్షణ కోసమే కంకణబద్ధులై కదం తొక్కాల్సిన సైన్యానికి, ప్రత్యేక అధికారాల చట్టం కోరలను కత్తిరించాల్సి ఉంది. ఇప్పటికి జరిగిన అన్యాయం చాలు. ఇకనైనా మేల్కొనాలి. దేశంలో ప్రజల హక్కులకు భంగం కలిగించే ప్రతి నల్ల చట్టాలకు ఉక్కు సంకెళ్లు బిగించాల్సిందే. ఇందు కోసం ప్రజల సంఘటిత ప్రజాస్వామిక పోరాటాలే శరణ్యం.

(రచయిత ఉపాధ్యాయుడు, డిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్)

(...4వ పేజీ తరువాయి)

వాస్తవాన్ని మనకు చూపారు. నేర నియంత్రణ వ్యవస్థే నేరమయం అయిన దృశ్యాన్నీ, దాని డొల్లతనాన్నే కాకుండా, వారు నేరస్థులను నేరాలతో సంబంధం లేని వారుగా, అసలైన ఏ నేరమూ చేయని వారిని నేరస్థులుగా చూపుతూ ఏది చేయాలనుకుంటే అది చేయగలరని కూడా ఈ కేసు వ్యవహారాలు చూపించాయి.

పిల్లలు దుర్వ్యసనాల పాలబడటం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నత వల్ల జరుగుతుందనడం చూస్తే దేశాన్ని పాలిస్తున్న అత్యంత చట్ట వ్యతిరేక నేరమయ ఆర్థిక వ్యవహారాలతో తమ వ్యాపార ప్రయోజనాలకే పనిచేసే చాలా వ్యాపార సంస్థలు కూడా ఉమ్మడి కుటుంబాల నుంచి వచ్చి ఉంటారు. అసలు భారతదేశ చట్టాలలోనే ఉమ్మడి హిందూ కుటుంబ వ్యాపార సంస్థ నిబంధనలు పొందు పరిచి ఉన్నాయి. వాటికి చట్టపరమైన ఆమోదమూ ఉంది. ఈ 'ఉమ్మడి కుటుంబ' వ్యాపారవేత్తలే దళారీ పెట్టుబడిదారులుగా 'ఎదిగి' ఉన్నారు. ఎన్నికైన వారిని తమ తాబేదారులుగా మార్చుకునే ఈ బడా వ్యాపారవేత్తలు కూడా ఉమ్మడి కుటుంబాల వారే. ఉమ్మడి కుటుంబమే అసలు దుర్మార్గమైన నీచమైన స్వార్థాలకు పాదు వేసే వ్యవస్థ. పిల్లలకు తొలి బోధకులైన తల్లిదండ్రులే నికృష్ట, స్వార్థ, డబ్బు ఆర్జనకు తెగబడి వ్యాపార కార్యకలాపాలలో మునిగి తేలుతుండగా, ఈ నీచ స్వార్థ వ్యాపార ప్రయోజనాలను కళ్లారా చూసే పిల్లలు అంతకంటే ఎక్కువ నీచ స్వార్థ ప్రయోజనాల ఆర్థిక వ్యవహారాలకూ, విశృంఖల జీవితాలకూ అలవాటుపడతారు. జనరల్‌గా చూస్తే తాతలూ, తండ్రులూ కలిసి ఒక చోట నివసించిన సందర్భాలలో స్వార్థ ఆర్థిక వ్యాపార కార్యకలాపాల కుటుంబాలలో బైటికి వెళ్లి తమ అరాచక కృత్యాలు జరిపేవారు. కొన్నేళ్ల కింద సామాజిక దోపిడీ, స్త్రీల దోపిడీలకు కేంద్రంగా నిలిచి సామాజిక వ్యవస్థలో అన్ని రకాల స్వార్థ చింతనలకు కేంద్రమైన "కుటుంబం" గొప్పదని చెప్పడం రచయిత లోపలి ఆ కాలానికి సంబంధించిన చారిత్రక భౌతిక ఆర్థిక సామాజిక పరిస్థితులూ, వాటి దుర్మార్గమైన ధోరణుల పట్ల అపరిపక్వత చూపిస్తుంది.

– షేక్ అహ్మద్

సూర్యాపేట

చైనాలో సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంబంధించిన విషయాల గురించి వీక్షణంలో సి.ఎస్.ఆర్. ప్రసాద్ గారి రచనలు (సెప్టెంబర్, డిసెంబర్ 2021), ఎం. సజయగారి వ్యాసం (నవంబర్ 2021) – ఈ మూడు కొంచెం పెద్ద వ్యాసాలే అయినా వివిధ అంశాలను వివరంగా చర్చించాయి. ఈ విషయంలో లోతైన, భిన్నమైన అవగాహనకు, చర్చకు అవకాశం కల్పించిన సంపాదకులను అభినందించాలి. కృతజ్ఞత చెప్పే బదులు లింగమూర్తి గారొక విచిత్రమైన లేఖ రాశారు. ఆయా అంశాలపై సాగుతున్న చర్చనలా ఉంచి, లేఖ రూపంలో సంపాదకులపై దాడి కూడా నా ఉద్దేశంలో ముఖ్యమైనది. ఎందుకంటే వ్యాసంలో చర్చించిన కొన్ని పిడివాద ధోరణులకు ప్రతిబింబం ఈ లేఖ. విషయం తక్కువ, నిందలెక్కువ ఉన్న లేఖ ఇది.

నా ప్రతిస్పందనలను కొన్నిటిని క్లుప్తంగా తెలియపరుస్తున్నాను. వీక్షణంలో సీరియస్ వ్యాసాలను పదేళ్లకు పైగా చదువుతున్నానని, కాగా సజయ గారి ఈ "హాస్యాస్పద వ్యాసం తనని కడుపుబ్బ నవ్వించిందని" చెప్తూ, దాన్ని ప్రచురించటం గురించి "మీ అభిరుచిని అభినందించాలని" వ్యంగ్యంగా రాశారు. ఇది సవ్యంగా లేదు. ఆయన పదేళ్లకు పైగా ఎంత 'శ్రద్ధగా' చదువుతున్నారో బైట పెట్టుకున్నారు.

"వీక్షణంలో లోగడ (2018 జూన్, అక్టోబర్, డిసెంబర్, 2019 ఫిబ్రవరి మొ.) పలువురు చేసిన విమర్శలలో ఎత్తిచూపిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని తమ వాదన వినిపిస్తే సబబుగా ఉంటుంది. అది పద్ధతి కూడా. "ప్రసాద్ వంటి సీనియర్లు, రాజకీయ తరగతులు చెప్పేవారు, అంతకన్నా ముఖ్యంగా సీరియస్ పాఠకులు ఈ విషయాలను జాగ్రత్తగా, ఓపిగ్గా తిరిగి పరిశీలించడం అవసరం. ఇది ప్రసాద్ గారి వ్యాసంపై చర్చే కాదు. చైనా

ప్రబల శక్తిగా ఉన్న నేటి ప్రపంచంలో పెనుమార్పుల అధ్యయనానికి పురికొల్పటానికి," అని సజయగారు రాశారు. సంపాదకులు వివిధ అంశాలతో, చర్చతో కూడిన పై వ్యాసాలన్నిటినీ ప్రచురించారు. ఆ సీరియస్ వైఖరిని, విజ్ఞతను హర్షించే బదులు తమ అసహనాన్నీ, అవివేకాన్నీ ప్రదర్శించి, "ఇటువంటి చౌకబారు, నవ్వులాట అభిప్రాయాలకు చోటు కల్పించవల్సిన అవసరం వీక్షణంకు ఏమి వచ్చిందో నాకు అర్థం కాలేదని" ప్రశ్నించటం విడ్డూరం. ప్రపంచ వ్యాప్తంగా 160 దేశాల నుంచి 500 మంది రాజకీయ పార్టీల నాయకులు – కమ్యూనిస్టులే కాక ఇతరులూ – 10 వేల మంది ప్రతినిధులు గత జూలై 6 నాడు చైనాలో జరిగిన సదస్సులో పాల్గొని, చైనా ప్రగతిని, వారి సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను హర్షించారు. ఇది ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనదిగా పరిశీలకులు – గిట్టనివారు కూడా అభివర్ణించారు. అలాంటి విషయంపై చర్చ హాస్యాస్పదంగా, నవ్వులాటలా కన్పడటం మౌలిక లోపాన్నే చూపెడుతున్నది.

ఈ విషయాలపై "నాకు తెల్సిన మేరకు" అంటూ కొన్ని అంశాలను నమ్రతగా రాసి, "మరింత విస్తృతమైన చర్చ" అవసరమని, సంపాదకులు దానికై కృషి చేయాలని ప్రసాద్ గారు విజ్ఞతతో తన వ్యాసం ముగించారు. ఓపిగ్గా తిరిగి పరిశీలించడం అవసరం అని మంత్లీ రివ్యూ కూడా భావించింది. కాగా అలాంటి విషయాల్ని ఇది ఏదో కొద్ది ఎంఎల్ పార్టీల మధ్య వ్యవహారం అన్నట్టుగా లింగమూర్తి చిత్రించడమే అన్నిటికన్నా హాస్యాస్పదం! ఇలాంటి వాటిని "సైద్ధాంతిక చర్చ పేరుతో అచ్చువేస్తారా" అని వీక్షణంని ఎదురు ప్రశ్నించారు. కళ్లు మూసుకుని పాలు తాగే పిల్లి అంటూ ఆయన రాసిన మాటలు తనకే వర్తిస్తాయని గ్రహించలేకపోయారు.

"కోటీశ్వరులను సభ్యులుగా చేర్చుకోవచ్చునన్న పార్టీ" కమ్యూనిస్టు పార్టీయా అని చైనా పార్టీని లింగమూర్తి ఆక్షేపించారు. ఇది బావిలో కప్ప వైఖరే తప్ప మరేమీ కాదు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లోనే ఆద్యులైన ఎంగెల్స్ అలాంటి కోటీశ్వరుడేనని, మార్క్సుకి జీవితాంతం ఆయన రాజకీయంగానే కాక, ఆర్థికంగా అండగా ఉండి కాపాడారనీ గుర్తుచేసుకోవాలి. జపాన్, ఫ్రాన్స్ లాంటి దేశాలకు వెళ్లి చదువుకొన్న మరో కులీనుడైన చౌఎన్‌లై చైనా పార్టీకి, మావోకు కుడి భుజంగాను, చైనాకు పాతికేళ్ల పాటు "జీవితాంతం" ప్రధాని గాను ఉన్నారని మరిచిపోకూడదు. మార్క్స్, లెనిన్, మావో కూడా కార్మికవర్గ కుటుంబాల నుంచి రాలేదని తెల్సిందే. విప్లవ నాయకులు హాయిగా ఉన్నారని ఇక్కడి పోలీసులు కూడా చెప్తుంటారు. ఇలాంటి కారణాలు చూపెట్టి, కమ్యూనిస్టు పార్టీలు "కులీన" – ఎలైట్ వర్గాల నాయకత్వంలో ఉంటాయనీ, వారు పీడిత వర్గాలను తప్పుదారి పట్టిస్తుంటారనీ బూర్జువా వర్గాలవారు శ్రామిక వర్గాలను దగా చేస్తుంటారు. ఏ వర్గంలో పుట్టారని కాక ఏ వర్గ రాజకీయాల కోసం నిలబడ్డారన్నది కీలకం. పీడిత వర్గాల్లో పుట్టి జీవితాంతం పాలకవర్గాలకు సేవ చేసినవారు కోకొల్లలు. లింగమూర్తే కాదు, వర్గపోరాట భావనను నేలబారుగా అర్థం చేసుకొనే పిడివాదంతోనే అనేకులు ఇలాంటి వాదనలతో విప్లవకారులను, చైనాని కూడా నిందిస్తుంటారు. ఎంతో దూరం ఎందుకు? కులీన బూర్జువా కుటుంబంలో పుట్టి, దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీ నాయకుడిగా ఉండి ఎదిగిన, ఇటీవలిదాకా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న కోబడ్ గాంధీ వంటివారు మనదేశంలోనే ఉన్నారని లింగమూర్తి గారు గుర్తు పెట్టుకోవాలి. కోటీశ్వరులు సభ్యులైనంత మాత్రాన ఏ కమ్యూనిస్టు పార్టీ కమ్యూనిస్టు పార్టీ కాకుండా పోదు.

ఈ చర్చ చైనా గురించి, ఇక్కడి పార్టీల గురించి లింగమూర్తి లాగా అర్థం లేకుండా ఏవేవో మాట్లాడటానికి కాదు. "చైనా ఎదురులేని నేతగా జీ జిన్ పింగ్" అన్న తమ సంపాదకీయ వ్యాసంలో అలాంటి వాదనలే చేశారు ఎ.నర్సింహారెడ్డి గారు. ' చైనాలో మూడు సార్లు అధ్యక్ష పదవి అవకాశం ఎవరికీ దక్కలేదని' రాశారు! నేటి జిన్ పింగ్‌గే కాదు... చౌతో పాటు మావో కూడా మూడు సార్లేమిటి, "జీవితాంతం" పార్టీ నాయకులే. అంతేకాక పాతికేళ్ల పాటు ఆ ఇద్దరూ – లెనిన్ స్టాలిన్ కూడా "జీవితాంతం" దేశాధినేతలే.

అలాంటి సేవలకు వారిని కీర్తిస్తున్నాం. నేడు సామ్రాజ్యవాద మీడియా ప్రభావంతో అదే నేరమని కొందరు అభిశంసిస్తున్నారు!

వ్యాసాన్ని ఎలా చదివారోకానీ... మంత్లీ రివ్యూ మద్దతు దేనికి, అదేమన్నా ప్రామాణికమా? అని లింగమూర్తి ప్రశ్నించారు." ఆ పత్రికదే ప్రమాణం కాదు కానీ – చాలా మంది విమర్శకులు అలాంటి వాదనల ఆధారంగానే రాస్తూ వచ్చారు కనుక 'వీక్షణం' రచయితలు, పాఠకులు ఈ ప్రత్యేక సంచికను పరిశీలించడం అవసరం. స్వయంగా మంత్లీ రివ్యూ పునరాలోచనే గమనార్హమైన ఒక ముఖ్యవిషయం" అని సజయ ముందే రాశారు. రచయిత పైనా, సంపాదకుల పైనా రాళ్లు వేసే తొందర్లో ఇవేమీ లింగమూర్తి గారికి కన్పించలేదు. చైనా విషయంలో మంత్లీ రివ్యూ అవగాహనలో వచ్చిన మార్పును కొంత ఉదహరించారు కానీ, సజయ గారి వ్యాసంలో అదే మొత్తం విషయం కాదు. వాస్తవాల ఆధారంగా సరైన వైఖరి తీసుకోవాలని చెప్పారు. ఈ సమస్య విషయంలో చైనా – విమర్శకులు విస్మరిస్తున్న కొన్ని ముఖ్య విషయాలను తెలియపరిచారు.

ఇక ఈ విషయంలో లోతైన, భిన్నమైన అవగాహనకు, చర్చకు అవకాశం కల్పించిన వీక్షణం సంపాదకులను వెటకరించడానికి లింగమూర్తి గారు ఎంచుకున్న భూమి ఆకారం గురించిన సామ్యం కూడా సరైంది కాదు. సజయ గారి వ్యాసం "భూమి బల్లపరుపు"గా ఉందని చెప్పే వ్యాసం కాదు. అది ఖచ్చితంగా ఎలా ఉందో సరిగా, శాస్త్రీయంగా చూడాలని చేసిన విజ్ఞప్తి. అలాగే చైనా కమ్యూనిస్టు పార్టీపై లింగమూర్తి గారి వంటివారి అవగాహన "భూమి గోళాకారం"లో ఉంది అనేటటువంటిదీ, వాస్తవికమైనదీ, శాస్త్రీయమైనదీ కాదు. చైనా విషయంలో వాస్తవాలతో పొసగని ఇటువంటివారి అభిప్రాయాలను తిరుగులేని, శాస్త్రీయమైన సత్యాలుగా ప్రచారం చేయడం పాలకవర్గాలకే ప్రయోజనకరం. శాస్త్రవిజ్ఞాన పురోగతి ద్వారా ముందుకు వస్తున్న నూతన ఆవిష్కరణలతో ఇంతకు ముందు తిరుగులేని సత్యాలుగా భావింపబడిన అనేక సిద్ధాంతాల గురించి పునరాలోచించవలసిన సందర్భాలను కూడా చూస్తున్నాము. (ఉదా. న్యూటన్ సిద్ధాంతాలు వగైరా). భూమి గోళాకారంలో ఉందని మనకి ప్రాథమిక పాఠశాలలో బోధిస్తారు. కానీ విజ్ఞానశాస్త్రం మరింత అభివృద్ధి చెందిన తరువాత, భూమి క్రమబద్ధమైన గోళాకారంలో ఉండదని, ధృవాల వద్ద, భూమధ్య రేఖ వద్ద దాని ఆకారంలో, కొలతలలో తేడాలు ఉన్నాయని వగైరా విషయాలతో భూమి ఆకారాన్ని ఖచ్చితంగా అంచనా వేస్తున్నారని లింగమూర్తి గారికి కూడా తెలిసే ఉంటుంది. తనకు నచ్చిన, సందర్భానికి సముచితం కాని సామ్యం తోచిందే తడవుగా వాడేసి, వీక్షణం వారిపై, రచయితపై, ఒక విప్లవ సంస్థపై దుమ్మెత్తిపోయడం నిష్ప్రయోజనం.

"స్టాలిన్–మావోల 1930–80ల కాలంతోను, ఐరన్ – బ్యాంబూ కర్టెన్ల కాలంతోను పోలిస్తే, గ్లోబలైజేషన్, టెక్నలాజికల్, ఐటి–నెట్–ఏఐ విప్లవాల తర్వాత మహా వరదలా వచ్చిన, వస్తున్న మార్పులు అపూర్వం, అనూహ్యం, టెక్స్ట్ పుస్తకాలకు అతీతమైనవి. డెంగ్, తర్వాతి మూడు తరాల నాయకత్వాలు వీటన్నిటినీ తట్టుకోవడమే కాక, ముందు వరుసకు దూసుకురావడం చైనా విజయమే కాదు, 'సోషలిజం – ప్రాథమిక పాఠాల' యుగం దాటి, సోషలిస్టు ప్రపంచ వ్యూహంలోనే కొత్త అనుభవాలు, కొత్త ప్రయోగాలు ఇవన్నీ. మంత్లీ రివ్యూ వీటినే చైనాలో 'మూడవ విప్లవం'గా అభివర్ణించింది"– అని సజయ గారు రాసినవి లోతుగా తరచి చూడాల్సిన అక్షరసత్యాలు.

భారత కమ్యూనిస్టు ఉద్యమం శతాబ్ది సందర్భంగా మనదేశంలో కమ్యూనిస్టుల, విప్లవకారుల సాఫల్య వైఫల్యాలను బేరీజు వేసుకోవాల్సింది చాలా ఉంది. పదేపదే తప్పుదారి పట్టిన, డజన్లకొద్దీ గ్రూపులుగా చీలిపోయిన ఇక్కడివారు నూరేళ్లు నిలదొక్కుకుని, 9 కోట్ల మంది సభ్యులతో ముందుకు సాగుతున్న పార్టీపై చర్చను నవ్వులాటలా భావించడం, దీనిపై చర్చకు వీలు కల్పించిన వీక్షణంని 'ఏమి అవసరం వచ్చిందో' అని తూలనాడడం బాధ్యతారహితం.

– ఎస్. ఆలోచన
సామాజిక కార్యకర్త.

పెరిగిన సంపద - తరగని పేదరికం

సరళీకృత ఆర్థిక విధానాల అమలు ఫలితంగా దేశంలో పేదల జీవితాలు పూర్తిగా దిగజారాయని, ఒక్క శాతం ఉన్న సంపన్న వర్గాలు ప్రపంచ కుబేరులతో పోటీపడుతున్నారని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ నేపథ్యంలో సరళీకృత ఆర్థిక విధానాలు శరవేగంగా ఊపందుకున్నాయి. ఒక వైపు అభివృద్ధి పేరుతో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మొదలుకొని బయోటెక్నాలజీ, కృత్రిమ మేథో, కంప్యూటర్ రంగాలు వేగంగా దూసుకుపోతున్నాయి. ఈ తరుణంలో మరో వైపు ఇతర వర్ధమాన దేశాలతో పాటు భారతదేశంలో కూడా ఆర్థిక వ్యత్యాసాలు తీవ్ర స్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. ఆర్థిక అసమానతలను తీవ్రంగా పెంచే ఈ సంస్కరణల ప్రభావం వలన దేశంలో రాత్రికి రాత్రే కుబేరులు అపర కుబేరులుగా, పేదవాడు మరింత పేదవాడుగా మారిపోతున్నాడు.

ఇటీవల ప్రకటించిన ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం 1951 నాటికి మన దేశం జాతీయ ఆదాయంలో ఒక శాతం మంది అగ్రశ్రేణి సంపన్నుల వాటా, నలభై శాతం మంది దిగువ శ్రేణి జనాభా వాటాతో సమానంగా ఉండేది. ఆశ్చర్యంగా ఇవాళ చూస్తే దానికి భిన్నంగా దిగువన ఏకంగా అరవై ఏడు (67) శాతం మంది వాటా అంతా కలిస్తే కానీ, ఒక శాతం మంది అగ్రశ్రేణి సంపన్నుల వాటాకు సమానమైంది. ఏడున్నర దశాబ్దాల కాలంలో మూడొంతుల దేశ సంపద ఒక శాతం పిడికెడు మంది అగ్రశ్రేణి సంపన్నుల ఖాతాల్లో కేంద్రీకృతమైంది. పోనీ, 1961 నుంచి అందుబాటులో ఉన్న జాతీయ సంపద లెక్కల్ని బట్టి చూసినా, ఎంతో అసమానత స్పష్టమవుతుంది. అప్పట్లో దేశ జాతీయ సంపదలో ఒక శాతం సంపన్నులదీ, 50 శాతం నిరుపేదలదీ సమాన వాటా ఉండేది. అరవై ఏళ్ల దేశ పురోగతి తర్వాత ఇప్పుడు దిగువన ఉన్న 90 శాతం మంది భాగం కలిస్తే కానీ, పైనున్న ఒక్క శాతం సంపన్నుల వాటాకు సరితూగడం లేదు.

స్వతంత్ర భారతంలో దార్శనికత లేని అసమర్థ పాలకుల విధానాలకు పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అద్దం పడుతున్నాయి. నిస్సిగ్గుగా పాలకులు ఈ ఆర్థిక అసమానతలు తగ్గించే చర్యలు చేపట్టక పోగా 2050 నాటికి భారత్ ప్రపంచంలోనే రెండో శక్తివంతమైన దేశంగా వృద్ధి చెందనుందని జోష్యం చెబుతున్నారు. సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు రూపుమాపకుండా మెజారిటీ ప్రజలకు ఉపయోగపడని సంపద ఎంత వృద్ధి చెందినా అది గణాంకాల వృద్ధే కానీ మానవాభివృద్ధి కాదని ఐక్య రాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్ డిపి) పేర్కొంది. కార్పొరేట్లకు లాభం చేసే ఆర్థిక విధానాల మూలంగా సంపన్న ఇండియాకు, పేదరిక భారత్ మధ్య గీత చెరిగి పోవడమనేది సమీపంలో కన్పించడం లేదు. నిజానికి నేడు భారతదేశంలో పేద ప్రజలు తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయారు. వారు కనీస అవసరాలతో పాటుగా చిన్న చిన్న ఆశలు, ఆకాంక్షలు సైతం నెరవేర్చుకోలేని దుస్థితిలో ఆర్థికంగా చాలా కిందికి వెళ్లిపోయారు.

దేశంలో వేగంగా పెరుగుతున్న శతకోటీశ్వరుల సంపద

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజలచే ఎన్నుకోబడిన నాయకులు జవహర్ లాల్ నెహ్రూ అనుసరించిన సామ్యవాదం మొదలు ఇందిరా గాంధీ మార్కెట్ సంస్కరణల ప్రగతి పథం, రాజీవ్ గాంధీ ప్రైవేటీకరణ, పి.వి. నరసింహారావు-మన్‌మోహన్ సింగ్‌ల ఆర్థిక సంస్కరణల అనంతరం కొనసాగుతున్న పాలక వర్గ దోపిడీ, పీడనలను మరింత తీవ్రతరం చేశాయి. దేశాన్ని సామ్రాజ్యవాద రథచక్రాలకు మరింతగా కట్టివేశాయి. ఈ దేశ వనరులను దేశదేశాల సంపన్నులకు భోజ్యంగా మార్చాయి. ఈ దేశ శ్రామికులను, పీడితులను మరింత దారిద్ర్యంలోకి, పీడనలోకి నెట్టాయి. ఆర్థిక సంస్కరణల ఫలితంగా, దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో గణనీయ వృద్ధి వచ్చినా, దిగువనున్న 50 శాతం బీదవర్గాల భారతీయులకు ఒరిగిందేమీ లేదు. కేవలం శతకోటీశ్వర్ల సంపద మాత్రం రెట్టింపు అయింది.

ద ఇండియా ఫోరం వారి నివేదిక ప్రకారం, భారతదేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల్లో పేదరికంతో పాటు అధిక జనాభా, నిరుద్యోగం, అనారోగ్యం, ఆహార అభద్రత లాంటివి అనాదిగా వెంటాడుతూనే ఉన్నాయి. ఈ సమస్యలన్నింటికీ మూలం ఆర్థిక అసమానతలు. ఇది దేశాభివృద్ధికి ప్రతిబంధకంగా నిలుస్తుంది. చాలా సహజంగా ఆదాయ, సంపదల వ్యత్యాసాలు ఉన్న సమాజంలో అసంతృప్తులు, అశాంతి పెరుగుతాయి. ప్రపంచ బ్యాంక్ 2020 నివేదిక ప్రకారం, 82 శాతం ప్రపంచ సంపద ఒక శాతం జనాభా చెంతనే ఉండగా, దాదాపు సగం జనాభా (370 కోట్లు) పేదరికంలో మగ్గుతున్నారని నివేదిక నిగ్గు తేల్చింది. దీనిని బట్టి ప్రపంచంలో పెరిగే అశాంతిని అంచనా వేయవచ్చు.

విచారకరమైన విషయమేమంటే కఠినమైన కరోనా సంక్షోభం సమయంలో కూడా భారతదేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 102 నుంచి 140కి పెరిగింది. అమెరికా, చైనా తర్వాత శత కోటీశ్వరులు అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ రికార్డుకెక్కింది. ఇప్పటికైనా పాలకులు అత్యంత కుబేరులకు కొమ్ముకాయకుండా, వారి సంపద నుంచి అధిక అనువంశిక పన్నులను విధించాలి.

బహుకోణాల పేదరిక సూచిక

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అన్నార్తుల జీవితాలతో నిరంతరం మృత్యు క్రీడలాడుతున్న నిశ్శబ్ద హంతకి పేదరికం. ఇది హింసకు అత్యంత హీన రూపం. ఆధునిక సమాజ పరిణామంలో ఇప్పటికి నెలకొన్న బానిసత్వం, వర్ణ వివక్ష వంద శాతం పాలకుల నిర్మితమే. వీటి కవల పిల్లలు ఆకలి, పేదరికం.

నేటి వర్గ సమాజంలో ఆకలి విడిగా ఉండదు. ఇది దశాబ్దాలుగా పాలకుల నిరంకుశ విధానాల ఫలితంగా వర్ధిల్లుతుంది. ఈ నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి అనుబంధ సంస్థ యుఎన్‌డిపి 1990 నుంచి ఏటా ప్రపంచ దేశాల ప్రగతి కొలమానంగా మానవ అభివృద్ధి సూచీని ఉపయోగిస్తుంది.

మానవ అభివృద్ధి సూచిక రూపకల్పనలో స్థూలంగా జీవన ప్రమాణాలు, ఆరోగ్యం, విద్య అనబడే అంశాలున్నాయి. ఇందులో ప్రధానంగా పోషకాహారం, బాల కౌమార దశ మరణాల రేటు, మాతా శిశు రక్షణ, పాఠశాల విద్యా సంవత్సరాలు, పాఠశాల హాజరు, వంట ఇంధనం, పారిశుధ్యం, తాగు నీరు, విద్యుత్తు, గృహ వసతి, ఆస్తులు, బ్యాంక్ ఖాతాలు అనబడే 12 సూచికల దత్తాంశాల ఆధారంగా మానవాభివృద్ధి సూచీని రూపొందిస్తారు. ఈ ర్యాంక్ ఆధారంగా వివిధ దేశాలు నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్‌ను ప్రకటిస్తాయి.

తాజాగా భారతదేశంలో 'ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్'తో పాటు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' రూపొందించిన మార్గనిర్దేశకాల ప్రకారం నీతి అయోగ్ నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్‌ను విడుదలచేసింది. ఇది బహుకోణాల పేదరిక సూచిక దేశంలోని పేదరికం మొత్తం చిత్రాన్ని ప్రదర్శిస్తుంది. ప్రాంతాలు – రాష్ట్రం లేదా జిల్లాలు, నిర్దిష్ట రంగాలు వంటి ఆసక్తి ఉన్న రంగాల సన్నిహిత, మరింత లోతైన విశ్లేషణలను తెలియ చేస్తుంది. ప్రభుత్వ నిర్దేశిత విధానాల రూపకల్పన కొరకు ఈ బహుకోణాల పేదరిక సూచీని పర్యవేక్షించి దేశంలో ఎవరూ వెనుకబడిపోకుండా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టుటకు కృషి చేయాలి. కానీ దశాబ్దాలుగా ఆ మేరకు చర్యలు లేవనేది ఈ నివేదికల ద్వారా బహిర్గతమైంది.

బహుకోణాల పేదరిక సూచిలో భారతదేశం స్థానం

ప్రపంచ వ్యాప్తంగా బహుకోణాల పేదరిక సూచిక బహుళ అంశాల ప్రాతిపదికగా పేదరికాన్ని కొలుస్తుంది. జాతీయ బహుకోణాల పేదరిక సూచి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే బేస్‌లైన్ నివేదికపై ఆధారపడి ఉంటుంది. ఇది తలసరి వినియోగ వ్యయ దత్తాంశ ఆధారంగా పేదరిక గణాంకాలను గణనం చేస్తుంది. గ్లోబల్, పేదరిక సూచి ప్రకారం భారతదేశం 109 దేశాలలో 66వ స్థానంలో ఉంది. అయినప్పటికీ పాలకులు భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతున్నామని చెపుతున్న మాటలు అసత్యమని తేలిపోయింది. పెరుగుతున్న పేదరికాన్ని నిర్మూలించకుండా అభివృద్ధిని సాధించడం అసాధ్యమని పాలకులు ఇకనైనా గుర్తించాలి.

భారతదేశంలో రాష్ట్రాల వారిగా పేదరికం శాతం

దశాబ్దాల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ పేదరిక నిర్మూలన సాధ్యం కాలేదు. ప్రభుత్వాలు ఎన్ని మారిన శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాలతో పోటీపడి అభివృద్ధిలో పరుగులు పెడుతున్నా సామాన్యుల బతుకులు మాత్రం మారడం లేదు. దేశాన్ని దశాబ్దాలుగా పరిపాలించిన పార్టీలు దేశ సంపదను దోచుకొని విదేశాలకు తరలించడం స్విస్ బ్యాంకులో వేలకోట్ల నల్లధనాన్ని దాచిన నాయకులు మళ్లీ ప్రజల్లోకి వచ్చి దేశానికి సేవ చేశామని ప్రగల్భాలు పలుకుతున్నారు. గత పాలకుల శాపమే నేటికీ పేదరికం వేదిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఆరోపిస్తుంది. పేదరిక నిర్మూలనకై ఏ విధంగా ముందుకు పోవాలని కేంద్రానికి ఇప్పటికి ఒక స్పష్టత లేదు. రాజకీయ లబ్దికోసం పేదరిక నిర్మూలనకై ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఆచరణలోకి తీసుకు రాలేకపోయారు. ఒక వేళా కొన్ని వచ్చినా నిజమైన అర్హులకు చేరడం లేదు. ఫలితంగా నేడు పేదరిక సూచికలో బీహార్ (51.91శాతం), ఝార్ఖండ్ (42.16 శాతం), యుపి (37.79శాతం), యంపి (36.65 శాతం), మేఘాలయ (32.67 శాతం), అసోం (32.67 శాతం), చత్తీస్‌గఢ్ (29.91 శాతం), రాజస్థాన్ (29.46 శాతం), ఒడిసా (29.35 శాతం), నాగాలాండ్ (25.23 శాతం), అరుణాచల్ ప్రదేశ్ (24.27 శాతం), పశ్చిమబెంగాల్ (21.43 శాతం), గుజరాత్ (18.60 శాతం), మణిపూర్ (17.89 శాతం), ఉత్తరాఖండ్ (17.72 శాతం), త్రిపుర (16.65 శాతం), మహారాష్ట్ర (14.85 శాతం), తెలంగాణ (13.74 శాతం) కర్నాటక (13.16 శాతం), ఆంధ్రప్రదేశ్ (12.31శాతం), హర్యానా (12.28 శాతం), మిజోరాం (9.80 శాతం), పంజాబ్ (5.59 శాతం), తమిళనాడు (4.89 శాతం), సిక్కిం (3.82 శాతం), గోవా (3.76 శాతం), కేరళ (0.71 శాతం) చోటు దక్కించుకున్నాయి. సూచిక ఆధారంగా అతి తక్కువ పేదరికంలో 7 రాష్ట్రాలు, తక్కువ పేదరికంలో 10 రాష్ట్రాలు, మధ్యస్థ పేదరికంలో 7 రాష్ట్రాలు, ఎక్కువ పేదరికంలో 3 రాష్ట్రాలు, అతి ఎక్కువ పేదరికంలో ఒక్క బీహార్ రాష్ట్రం నిలిచాయని నీతి ఆయోగ్ వర్గీకరించింది.

కేంద్రపాలిత ప్రాంతాల్లో పేదరిక సూచి

కేంద్రపాలిత ప్రాంతాల్లో దాద్రానగర్ హవేలిలో 27.36 శాతం, జమ్మూ కశ్మీర్ లడక్‌లో 12.58 శాతంతో అధిక పేదరికం ఉండగా దయ్యూ డామన్‌లో 6.82 శాతం, చండీఘర్‌లో 5.97 శాతం, ఢిల్లీలో 4.79 శాతం, అండమాన్ నికోబార్‌లో 4.30 శాతం, లక్ష్యద్వీప్‌లో 1.82 శాతం, పుదుచ్చేరిలో 1.72 శాతం పేదరికం నమోదైందని తేలింది.

పేదరిక స్థాయి అత్యధికంగా బీహార్‌లో ఉంది. తర్వాత ఝార్ఖండ్, ఉత్తర ప్రదేశ్ బహుకోణాలంగా పేదలు ఉన్నారు. కేరళ అత్యల్ప జనాభా పేదరిక స్థాయిలను నమోదు చేసుకుంది. తర్వాత స్థానాలు పుదుచ్చేరి, లక్ష్యద్వీప్, గోవా, సిక్కిం ఉన్నాయి. పోషకాహార లోపం ఉన్న వ్యక్తులు ప్రధానంగా ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తర్వాత అత్యధిక పోషకాహార లోపం ఉన్నవారు బీహార్‌లో ఉండటం గమనార్హం. రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక సమానత్వం, సమాన అవకాశాల కల్పన, సంపద సమానంగా పంపిణీ కావడం లాంటి హక్కులు నేటికీ కాగితాల్లోనే దాగి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలతో పాటు అవకాశాల్లో అసమానతలు దేశ సమాఖ్య స్ఫూర్తి పునాదులను బలహీనపరుస్తున్నాయి.

ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి సామాజిక వర్గాలే పేదలు

ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 139 కోట్ల మంది పేదరికంలో కూరుకుపోగా అందులో 22.7 కోట్ల మంది భారత్‌లోనే ఉన్నారని నివేదిక తెలిపింది. భారతదేశంలో కొనసాగుతున్న కుల సమస్య కారణంగా ప్రతి ఆరుగురు పేదల్లో ఐదుగురు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి సామాజిక వర్గాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. పౌష్టికాహారం కోసం, ఆకలి సమస్యను తీర్చుకోవటానికి పోరాడుతున్న ప్రజలు భారత్‌లోనే అత్యధికంగా ఉన్నారు. విద్య అందుబాటులో లేనివారు, కుల, మత వివక్షను ఎదుర్కొనేవారు ఈ దేశంలోనే అత్యధికంగా ఉన్నారని నివేదిక స్పష్టం చేసింది. అత్యధిక మంది శత కోటీశ్వరులు

(బిలియనీర్లు) ఉన్న మూడో అతిపెద్ద దేశం భారత్. ఇదే తరహాలో భిన్న, అత్యధిక సామాజిక వర్గాలు ఉన్న ఈ దేశంలో మరోవైపు దశాబ్దాలుగా అసమానతలు తీవ్రస్థాయిలో పేరుకొని ఉన్నాయి. అందువల్లే కరోనా సంక్షోభం తర్వాత పేదరికం మరింత పెరిగి 60 శాతానికి చేరుకుంది. అయినా ప్రభుత్వం వాస్తవాలను గ్రహించక ప్రపంచానికి భారత ప్రతిష్టను పెంచి చూపే విఫల ప్రయత్నం చేస్తుంది.

పారదర్శకంగా లేని ప్రభుత్వ గణాంకాలు

పేదరికం, అసమానతలు, లింగ అసమానతలపై భారత ప్రభుత్వం విడుదల చేసే సమాచారం, గణాంకాలు పారదర్శకంగా లేవు. ముఖ్యంగా అసమానతలపై గత మూడేండ్లుగా విడుదల చేస్తున్న సమాచారం లోపభూయిష్టంగా ఉంది. భారత్‌లో లింగ అసమానతలు కూడా తీవ్ర స్థాయిలో ఉన్నాయి. మహిళా కార్మికుల ఆదాయం కేవలం 18 శాతానికి పరిమితమైంది. ఆసియాలో సగటు ఆదాయం కన్నా ఇది తక్కువ. అసమానతలన్నింటికీ ప్రధాన కారణం 1985 తర్వాత వచ్చిన ఆర్థిక సంస్కరణలే. పాలకులు ఎంచుకున్న ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు ధనికులు, కార్పొరేట్లకు భారీ ఎత్తున ఆదాయాన్ని సమకూర్చింది. సంపద పోగేసుకోవడానికి అవకాశాలు కల్పించింది. దిగువ, మధ్య తరగతి, పేదల కుటుంబాల్లో మాత్రం ఎలాంటి మార్పును తీసుకురాలేదు. మరింత పేదలుగా మార్చింది. దేశంలో అసమానతల్ని కరోనా సంక్షోభం మరింత పెంచిందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' నివేదిక (మార్చ్, 2021) కూడా తెలిపింది. అదనంగా మరో 7.5 కోట్ల మంది పేదరికంలోకి కూరుకుపోయారని, మధ్య తరగతి ప్రజల్లో 3.2 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నది. అయితే భారత్‌లో పాలకుల కనుసన్నలలోని ప్రధాన మీడియా ఏదీ కూడా ఈ విషయాల్ని ప్రస్తావించటం లేదు. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటే పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి కానీ అది జరగడం లేదని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు.

పేదరిక నిర్మూలనలో విఫలమైన ప్రభుత్వ కార్యక్రమాలు

పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిపాదిత పథకాల లక్ష్యం అన్ని కోణాల్లో పేదరికంలో నివసిస్తున్న వారి నిష్పత్తిని కనీసం సగానికి తగ్గించడం. దాని కోసమే జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-గ్రామీన్, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రధాన మంత్రి సహజ్ బిజిలీ హర్ ఘర్ యోజన (సౌభాగ్య) ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లాంటి పథకాలు ప్రవేశపెట్టిన లక్ష్య సాధనలో విఫలమై ప్రభుత్వం పారదర్శకతకు దూరమైంది. నూటికి 70 శాతమున్న పేదల పట్ల, పాలితుల పట్ల చిత్తశుద్ధి లేని పాలకవర్గాలు అధికార పీఠమెక్కినంత కాలం పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందనుకోవడం అత్యాశే అవుతుంది. అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదరికాన్ని వేగంగా నిర్మూలిస్తున్నామని చేసే ప్రకటనలకు అభివృద్ధి ఫలాలు అందుకోవడం మధ్య అంతరాన్ని గుర్తించాలి.

ప్రభుత్వం సంక్షేమం కోసం ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 15 పైసలు మాత్రమే లక్షిత లబ్ధిదారులకు చేరుతున్నాయని, మిగతా 85 పైసలు అవినీతిపరుల కైంకర్యం అవుతున్నాయని 1985లో స్వయంగా అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఒడిశాలోని కలహండి కరువు పీడిత ప్రాంతాల పర్యటనలో చెప్పిన మాటలు నేటికీ నిజమౌతుండడం విచారకరం. అవినీతిని సమూలంగా తొలగించగలిగే చిత్తశుద్ధి గల పాలకులు ఉంటే వారు ప్రవేశపెట్టిన పథకాలు, ప్రణాళికల వల్ల దేశంలో పేదరికం పూర్తిగా అదృశ్యమౌతుంది. కానీ పేదరికాన్ని అంచనా వేయడానికి వచ్చిన ప్రతినిధులను దారి మళ్లించి ఉన్నత శ్రేణి ప్రజలు నివాసముండే ప్రాంతాలకు తీసుకెళ్లడం. పట్టణాల్లోని బిచ్చగాళ్లను వేరే ప్రాంతాలకు తరలించడం, మురికి వాడల్లో జనం కన్పించకుండా పరదాలు కుట్టడం, పేద ప్రజలు నివాసముండే గోడలకు రంగులు వేయడం లాంటి చౌకబారు, తాత్కాలిక కార్యక్రమాలతో పేదరిక నిర్మూలన జరగదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండి రాబోయే కాలంలో ఆరోగ్య, పర్యావరణ, ఆర్థిక, ఆహార భద్రతా లాంటి బహుళ సంక్షోభాలను అధిగమించే సామర్థ్యాన్ని పెంచుకునే ప్రణాళికలు రచించుకోవాలి.

ముగింపు

గ్లోబల్ బహుకోణాల పేదరిక సూచిక అనుసరించి భారతదేశం స్థానాన్ని మెరుగుపరచడం కోసం సమగ్ర సంస్కరణల కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. లక్ష్యాన్ని చేరుకోవడానికి వాస్తవాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అమలులో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమిస్తూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే తప్ప అమలు చేయలేని నిస్సహాయ స్థితి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయకూడదు. ఐతే ప్రభుత్వం ప్రజల నుంచి తిరుగుబాటు రాకుండా ఉండడానికి ఉచితంగా ఆహారం, విద్య, వైద్యం లాంటి అవకాశాలను కల్పిస్తారని ఇటీవల పలు అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. అంటే క్రమంగా మనిషిని ఉత్పత్తి నుంచీ, శ్రమ నుంచీ బయటకులాగి నిర్వీర్యం చేయాలనీ, మొత్తంగా ఉత్పాదక రంగంనుంచి మనిషిని విడదీయాలని చూస్తున్నారు. ఇది మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మారుస్తోంది. అయితే మరొక అభిప్రాయం కూడా బలంగా వినిపిస్తోంది. దేశ సంపదలో, అభివృద్ధిలో భాగస్వాములు కాకుండా ఉన్న 70 శాతం మంది పేద జనాభా ప్రభుత్వాల మీద తిరుగుబాటు చేస్తారనే అభిప్రాయం కూడా ఉంది. ప్రపంచ చరిత్రలో ఇటువంటి అనుభవాలు అనేకం ఉన్నాయి. ఒకనాడు అత్యంత ధనిక దేశమైన రోమన్ సామ్రాజ్యం ఆర్థిక అసమానతలు పెరిగి ప్రజల ఆకలి మంటలకు భస్మమై పోయిన ఉదంతాలను ప్రభుత్వాలు మరిచిపోగూడదు. ఇటువంటి పరిస్థితుల్లో సోషలిజం, సామాజిక న్యాయం కోసం ఉవ్వెత్తున ఉద్యమాలు ఊపిరి పోసుకుంటాయి. అసమానతల అంతానికి ప్రజాపోరాటాలు వెల్లువెత్తుతాయి. ఆర్థిక సామాజిక అంతరాలూ, దోపిడీ, అవినీతి, వివక్షతలతో కూడిన ఈ సమాజంలో మార్పు కోసం మూకుమ్మడిగా ప్రజలు తిరగబడే రోజొకటొస్తుంది. అక్కడక్కడ విసిరివేయబడినట్టుగా ఉన్న ఉద్యమాలు ఒక్కుమ్మడిగా మారినప్పుడు వర్గ సమాజం పునాదులు కదులుతాయనేది చారిత్రక సత్యం.

ఇటీవల దేశంలో అమలైన ఆర్థిక విధానాలు, కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని చిన్నాభిన్నం చేశాయి. జీవనోపాధితో పాటు ప్రజల హక్కులు, అసమాన ఆర్థిక వ్యవస్థ, అప్రజాస్వామ్యంపై పోరాడాల్సిన సమయం వచ్చింది. పాలక వర్గాలు ఎంచుకున్న కార్పొరేట్ అనుకూల విధానాలు దేశానికి తీరని హాని చేస్తున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రభుత్వ విధానాలు దారుణంగా విఫలమయ్యాయి. కనుక ఈ దేశంలో పనిచేసే హక్కు, జీవించే హక్కును పరిరక్షించాలని, ఆర్థిక అసమానతలకు పేదరికానికి మూలం ఈ దేశంలో లభించని విద్య వైద్యమే కారణమవుతుంది. కావున అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం వంటివి విధిగా

మతం మత్తులో రాజ్యాలు

దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లి హేతువాదుల్ని, ప్రజాస్వామిక వాదుల్ని, దళితుల్ని, మైనారిటీలను వేధించడంతో రాజ్యమేలుతోందని, దీన్ని సమసమాజ లక్ష్యంతో ఎదిరించాలంటున్నారు **సంగిరెడ్డి హనుమంత రెడ్డి**

మత్తు, మాదక పదార్థాల ప్రభావం సేవించిన వారిపై కొంత సేపే ఉంటుంది. మత దుష్ప్రభావం వారసులపై, సమాజంపై కొనసాగుతుంది. మత మత్తీయులు కళ్లుతెరవకపోతే చచ్చేవరకు, మత్తు మోతాదు, మత్తీయుల స్థాయిని బట్టి మరణించిన తర్వాత కూడా సామాజిక విచ్ఛిత్తి జరుగుతుంది. మతం రాజ్యాన్ని ఆవహిస్తే, పాలకులు మత ఛాందసులైతే సౌజన్య పక్షపాతం (ఔనంటే ఔను, కాదంటే కాదనే స్వభావం) తో మత్తు సర్వ వ్యాపితమవుతుంది. దేశం సర్వ నాశనమవుతుంది.

మత రాజ్యాలు: డొనాల్డ్ ట్రంప్ అమెరికా భగవత్ రాజ్య సిద్ధాంతి. పాలనలో క్రైస్తవ మతవాదాన్ని ప్రవేశపెట్టారు. భగవత్పాలనలు ఇస్లామిక్ మూఢత్వ, క్రైస్తవ రాజ్యాధికార, హిందూ జాతీయవాద మత శాసనాలే. మత పాలకులు ఉహాకల్పిత పురాణాలకు ఆధిపత్య భావజాల విశ్వాసకులే. భారత్, బంగ్లాదేశ్, మాల్దీవులలో లౌకికవాద రచయితలను, సామాజిక కార్యకర్తలను చంపారు. భారత్‌లో హిందుత్వ ఛాందసులు హేతువాది కల్బుర్గి, సామాజిక కార్యకర్త గోవింద్ పన్సారే, మూఢ విశ్వాసాల వ్యతిరేక ఉద్యమ కార్యకర్త నరేంద్ర దభోల్కర్, సామాజిక పాత్రికేయులు గౌరీ లంకేశ్, రంజన్ రాజదేవ్, సాయిరెడ్డి, జగేంద్ర సింఘ్ మొదలగు వారిని హత్య చేశారు. పాలక నిశ్శబ్ద సంస్కృతి హంతకులను సమర్థించింది. బంగ్లాదేశ్ భౌతిక శాస్త్రవేత్త, నాస్తికవాది ముహమ్మద్ జాఫర్‌ను ఇస్లాం శత్రువని ముద్రవేసి చంపేశారు. సౌదీ అరేబియా, పాకిస్తాన్, ఇరాన్, ఈజిప్ట్, సిప్రస్, బంగ్లాదేశ్‌లలో మతాన్ని అవమానించారని, తిరస్కరించారని నిందించి లెక్కలేనంత మంది మానవతావాదులను, హేతువాదులను, లౌకిక వాదులను జైళ్లలో హింసించి చంపారు. సౌదీ అరేబియా, భారత్,మలేషియా, ఈజిప్టులలో పాలకులు, ప్రభుత్వాధికారులే హేతువాదులపై హింస, హత్యలను ప్రోత్సహిస్తున్నారు. భౌతికవాదం అవినీతిమయమని, నాస్తికత్వాన్ని తిరస్కరించాలని, మానవతావాదులకు, లౌకికవాదులకు రక్షణ అక్కరలేదని మత బోధకులు ప్రభుత్వాలకు బోధిస్తున్నారు. నిజానికి జగద్రక్షకున్ని పూజించేవారిని ఆయనే "రక్షిస్తాడు". వారికి మానవ రక్షణ అక్కరలేదు. కాని బాబాలకు, "దేవదూతలకు" ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నాయి. సౌదీ అరేబియా నాస్తికులను, హేతువాదులను ఉగ్రవాదులని నిర్వచించే చట్టాలు చేసింది. ఇవి విమర్శనాత్మక స్వతంత్ర ఆలోచనలను ఉగ్రవాద నేరాలుగా పరిగణిస్తున్నాయని హూమన్ రైట్స్ వాచ్ ఉప నిర్దేశకులు జో స్టాక్ చెప్పారు. భాజపా పాలక వర్గాలు జాతీయవాదాన్ని, నకిలీ దేశభక్తిని ప్రచారం చేస్తున్నాయి. మానవత్వం, హిందూ మతం, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక సమస్యల గురించి మాట్లాడితే మనోభావాలను దెబ్బతీశారని, మతమార్పిళ్లకు ప్రయత్నిస్తున్నారని నిందించి కోర్టులకు ఈడ్చి ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ తాత్వికత సామాజిక, రాజకీయ, ఆర్థిక పురోగతిని పునర్నిర్వచిస్తున్నది. హైందవవాదాన్ని అనివార్యంగా ప్రజల మీద రుద్దుతున్నది.

బలప్రయోగ మత స్వీకరణ నుండి, మత నిరాకరణ, మత విసర్జన, మత విమర్శలకు చట్టాలు రక్షణ కల్పించాయని 'అంతర్జాతీయ మానవతావాద, నైతిక సంఘం' న్యాయవాద బృంద నిర్దేశకురాలు ఎలిజబెత్ ఓకేసీ ధృవీకరించారు. "రాజ్యాలే అసహన, అసహ్య సంస్కృతిని అలవర్చుకున్నాయి. పాలకులే పరమతస్తులపై, మతవిశ్వాసం లేనివారిపై హత్యలను ప్రేరేపిస్తున్నారు. హంతకులను రక్షిస్తున్నారు. ఈ విచిత్ర పరిస్థితుల్లో పాలకవర్గాల మత ప్రచార వ్యాఖ్యానాలు అభ్యంతరకరం, అపాయకరం." అని ఆమె అన్నారు. అంతర్జాతీయ వేదికలు ఈ సమస్యను అర్థంచేసుకోడానికి ఇంకెంత మంది బలికావాలని ఆమె ఐక్యరాజ్య సమితిలో ప్రశ్నించారు. అంతర్జాతీయ సమూహాలు నిశ్శబ్దంగా ఉన్నంతకాలం మైనారిటీల, మత విశ్వాసరహితుల హక్కులను మెజారిటీ మతస్తులు కాలరాస్తూనే ఉంటారని మానవ హక్కుల సమితిని హెచ్చరించారు. మత స్వేచ్ఛా హక్కు మతంనుండి స్వేచ్ఛను పరిరక్షిస్తుందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నివేదకులు డాక్టర్ అహ్మద్ షహీద్ వర్గీకరించారు.

విద్యలో మతం: మత ప్రాతిపదికన విద్యా విధానాన్ని, పాఠ్యాంశాలను నిర్ణయించరాదు. ఈదురాలోచన మత సంస్థలకు మేలు చేయవచ్చు. కాని మత వైవిధ్య లౌకిక ప్రజాస్వామ్య దేశంలో తీవ్రనకారాత్మక సమస్యలకు కారణమవుతాయి. "స్వీడిష్ పాఠశాలల్లో మత ప్రభావాలకు చోటు లేదు. ఆర్థిక, సామాజిక నేపథ్యాలతో, లింగ, మత భావనలతో సంబంధం, ప్రమేయం లేకుండా పిల్లలందరికీ చదువు చెప్పాలి. విద్యాలయాల్లో ఉపాధ్యాయుల పాలన సాగాలి.

అమలు చేయాలని వివిధ రాజకీయ పార్టీలను నిలదీయాల్సిన అవసరముంది. లేబర్ కోడ్‌లను రద్దుచేసి అనేక రంగాలలో ఉన్న కాంట్రాక్ట్, స్కీం వర్కర్ల ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేయాలి. ఈ క్రమంలో కనీస ఆర్థిక అసమానతలు సాధించడానికి కృషి చేసేలా ప్రభుత్వాల్ని నిగ్గదీసి అడగాలి. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అనుసరించి ప్రజలందరికీ సమాన పనికి సమాన వేతనం అందజేయాలి. తద్వారా ఆకలి, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు అనివార్యంగా అడుగులు వేసే దిశగా ముందుకుసాగాలి. లేని పక్షంలో పైన పేర్కొన్నట్లు విడివిడిగా సమస్యలతో నలిగిపోతున్న సమూహాలన్నీ ఉమ్మడి ఉద్యమాలను నిర్మించినప్పుడే ప్రభుత్వాలు ప్రజల బాట పడుతాయని అనడంలో ఎటువంటి సందేహం లేదు.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

మతాధికారుల అధికారం కాదు.” ఇది స్వీడిష్ ప్రభుత్వ నినాదం. ఫ్రాన్స్‌లో లౌకిక విద్యకు సుదీర్ఘ సంప్రదాయముంది. ఫ్రాన్స్ పాఠశాలల్లో 6-16 ఏళ్ల వయస్సు విద్యార్థులకు పౌర జ్ఞానాన్ని బోధిస్తారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల సంస్కృతితో పాటు పౌరుల హక్కులు, బాధ్యతలను అర్థంచేసుకోవడం దీని ఉద్దేశం. లౌకికత్వం ఎవరికీ వ్యతిరేకంకాదు, అది అందరికీ రక్షణ కల్పిస్తుందనిఫ్రాన్స్ స్త్రీల హక్కుల మంత్రి నజత్ వల్లౌద్ బెల్కెమ్ అన్నారు. పూర్వ ప్రధాని థెరెసా మే బ్రిటన్ బళ్లలో100 శాతం మత ప్రాతిపదికన విద్యార్థుల ప్రవేశానికి అనుమతించారు. పాఠశాలలను సంపూర్ణ క్యాథలిక్ విద్యాలయాలుగా మార్చాలని బ్రిటిష్ ప్రభుత్వ ఆలోచన. అన్ని మతాలకూ వర్తించే ఈ నియమం సంపూర్ణ ముస్లిం, యూదు బళ్లకు కూడా దారితీయగలదు. గుజరాత్ పాఠశాలల్లో దశాబ్దాల క్రితమే హిందుత్వ పాఠ్యాంశాలను రుద్దారు. హిందూ విద్యార్థులకు కాషాయ, ముస్లిం విద్యార్థులకు ఆకుపచ్చ యూనిఫాంలు అమలు చేశారు. ఇప్పుడు దేశమంతా హైందవ సాంప్రదాయ బద్ధంగా పాఠ్య పుస్తకాలను మార్చారు. ఇది సమాజాన్ని శిశు దశ నుండే విభజించడం.

లౌకికత్వం: లౌకికత్వం నమ్మకాల మీద కాక చర్యల మీద ఆధారపడుతుంది. నరకంలో మనిషిని కాలుస్తారంటే లెక్కచేయదు. పేదల గుడిసెలను కూల్చడాన్ని అడ్డుకుంటుంది. ఇహాన్ని, భౌతికాన్ని నమ్ముతుంది. స్వర్గ సుఖాలకు ప్రలోభపడదు. లౌకిక ప్రజాస్వామ్యంలో చట్టం ముందు, చట్టసభల్లో ప్రజలందరూ సమానులే. మత, రాజకీయ అనుబంధాలు అనుకూల, ప్రతికూలతలకు ప్రాతిపదికలు కారాదు. ఇతర ప్రజల పౌర, మానవ హక్కులు, బాధ్యతలే మత విశ్వాసకులకు, నాస్తికులకు కూడా ఉంటాయి. ఏ మతానికీ విశేష అధికారాలు, స్థానాలు ఉండవు. విజయవంతమైన ప్రజాస్వామ్య పాలనకు లౌకికత్వమే కీలకం. రాజ్యాన్ని, మతాన్ని వేరుచేసే లౌకిక ప్రజాస్వామ్యం కోసం, పార్లమెంటులో బిషప్ బల్లను తొలగించమని ఇంగ్లండ్‌లో వందేండ్లకు పైగా పోరాడారు. లౌకికవాదం, మానవ హక్కులు వాటంతటవే రావు. పోరాడి సాధించుకోవాలి. ప్రపంచ వ్యాపితంగా ఎన్నడూ లేనివిధంగా లౌకికవాద సూత్రాలు అపాయంలో పడ్డాయి. మత పాలనలో స్వేచ్ఛ ప్రమాదంలో పడుతుంది. లౌకికవాదం మత స్వాతంత్ర్యాన్ని కాపాడుతుంది. అన్ని మతాలవారు, విశ్వాసరహితులు లౌకికత్వాన్ని ప్రధాన సహజీవన సూత్రంగా పరిగణించాలి. మతానికి మత్తెక్కరాదు. ఉన్మాదంగా మారరాదు. మతం చట్టానికి ఉన్నతం, అతీతం కాదు. ఏ మతమూ ప్రత్యేకతలను కోరరాదు. “మతవాదులకూ సామాన్య లక్షణాలు, అభిరుచులు ఉంటాయి. విశ్వాసరహితులు మతగురువుల, మతఛాందసుల బెదిరింపులు, వేధింపులను ఎదిరిస్తారు.” అని ఆంగ్లో అమెరికన్ రచయిత, విమర్శకుడు క్రిస్టఫర్ ఎరిక్ హిచన్స్ వివరించారు. మతోన్మాదుల బుజ్జగింపు భవిష్యత్తును అంధకారం చేస్తుంది. ఛాందసవాదం మత ఘర్షణలను ప్రోత్సహించి ప్రశాంత జీవితాన్ని దూరంచేస్తుంది. మతఛాందసత్వానికి, లౌకికస్వేచ్ఛకు మధ్య పెరిగిన ఘర్షణలే సమకాలీన సమాజాల సమస్యలు. సమాజంలో అంతర్భాగమైన మత, సాంస్కృతిక వైవిధ్యాలను కాపాడుకోవాలి. మత స్వేచ్ఛ ముసుగులో మతఛాందసులు మతోన్మాదాన్ని సమర్థించు కుంటున్నారు. వివక్షతకు, దురుపయోగానికి, సిద్ధాంత రాహిత్యానికి, ప్రశ్న, ఆలోచన, విమర్శకుల అణచివేతకు, ఇతరుల జీవితాల నియంత్రణకు, జంతువుల అనవసర హింసకు, జ్ఞానాన్ని నిరోధించి పిల్లల అవకాశాలను అడ్డుకోడానికి మత స్వేచ్ఛ అనుమతి కాదు. ప్రతి ఒక్కరికి మానసిక స్వేచ్ఛానందాన్ని పంచేది నిజమైన మత స్వేచ్ఛ. ఈ భావనను రాజ్యం పరిరక్షించాలి.

భారత్‌లో మత మత్తు: భారత హిందుత్వ పాలనలోప్రతి విషయంలో బెదిరింపులు, హింస, హత్యలు పెరిగాయి. పద్మావతి చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్లను కాల్చివేయమని బ్రిటన్ హిందూ నాయకులకు చెప్పాము. కత్తుల నుండి ఎ. కె. 47 వంటి ఆధునిక ఆయుధాలను ఉపయోగించడంలో మా సంఘ్ సభ్యులందరికీ శిక్షణ ఇచ్చాము. ” అని రాజపుత్ కర్ణిసేన నాయకుడు సుఖ్‌దేవ్ సింఘ్ బ్రిటిష్ చిత్ర పరిశ్రమకు తెలిపారు. విదేశాల్లో కూడా సంఘ పరివార ప్రతినాయకులున్నారు. నేటి రాజకీయ రణ క్షేత్రంలో ప్రధాన పోటీ ఉదారవాద లౌకిక రూపకల్పనకు, హిందుత్వ ఉదారరహిత అలౌకిక ఊహాచిత్రానికి మధ్య సాగుతోంది. ఏకీకరణవాదం, వైవిధ్యం, సహనం శతాబ్దాల నాగరికతకు మూలాలని యదార్థవాదం నొక్కిచెపుతుంది. విజయవంతమైన ఆధునిక, ప్రగతిశీల, సంపన్న దేశ నిర్మాణానికి వీటి కొనసాగింపు అవసరమని సూచిస్తుంది. హిందుత్వం పురాణాల ఊహాగాథల్లో జీవిస్తుంది. హింసావాదం, కయ్యానికి కాలుదువ్వే కుహనా జాతీయవాదం, దయలేని బలమైన జాతివాద పెట్టుబడిదారీ విధానాల మేలుకలయికతో దేశాన్ని నిర్మించాలని హిందుత్వం కోరుకుంటోంది. మెజారిటీ మతాధిపత్య వేర్పాటువాదం, అతిశయ విదేశీవాదం, సాంస్కృతిక జాతీయవాదాలతో హిందుత్వ దేశాన్ని ఏర్పాటు చేయాలని ఉవ్విళ్లూరుతున్నది.

చినుకులు పడగానే జీవసమాధి కప్పలు కుప్పలుగా జలాశయాల్లో నిండినట్లు భారత్‌లో భగవత్ ప్రతినిధులు రాజ్యాధిపతులు కాగానే తాత్కాలిక, సామాజిక, వృత్తి భక్తులందరూ అసలు ఆధ్యాత్మిక భక్తులుగా అవతారాలు మార్చారు. పత్రికల్లో వ్యాసకర్తలుగా, టివి రచ్చల్లో అరాచకులుగా, సామాజిక మాధ్యమ హరిశ్చంద్రుల్లా చలిచీమల్లా పుట్టుకొచ్చారు. పత్రికల్లో, టివిల్లో భక్తి కార్యక్రమాలు, మూఢనమ్మకాల ప్రచారాలు పెరిగాయి. జనాలను మత్తుల్లో ముంచడానికి, స్వలాభానికి, రారాజు దృష్టిని ఆకట్టుకోడానికి సామ్రాట్టుల చర్యలను అనుకరించారు. కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు యజ్ఞయాగాలు చేశారు. కొండెక్కి కొండంత కానుకలర్పించారు. పుష్కరాలను, హిందూ పండుగలను ప్రభుత్వ వేడుకలుగా నిర్వహించారు. ప్రారంభాలు, సంకల్పాలు శాస్త్రోక్తంగా ఆడంబరీకరించారు. మెజారిటీ మతమౌఢ్యాన్ని మైనారిటీ ఛాందసం అనుసరిస్తున్నది.

అంతర్జాతీయ మానవతావాద నివేదిక: స్వేచ్ఛా సమాజంలో మత విషయాల స్వేచ్ఛా ఆలోచనలు అనివార్య మూల సూత్రాలు. చరిత్రలో మత ఛాందసాన్ని ప్రశ్నించినవారు కార్యకారణ సంబంధాల అభివృద్ధికి, సహనానికి, మానవ ప్రగతికి, సుస్థిర భవిష్యత్తుకు కారకులయ్యారు. మానవతావాదులు, హేతువాదులు, మతరహితులపై వివక్షత, హింసవేధింపులపై అంతర్జాతీయ మానవతావాద, నైతిక సంఘం (ఐ.హెచ్.ఇ.యు.) ప్రపంచ వ్యాపిత సర్వే నిర్వహించి 2017 సంవత్సర ఆలోచన స్వేచ్ఛా నివేదికను సమర్పించింది. ప్రపంచ వ్యాపితంగా హేతువాదుల హత్యలు, హింస, వేధింపులు పెరుగుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. అందులో భారత్‌ను వ్యవస్థీకృత వివక్షతా దేశంగా ప్రకటించింది. మత సమస్యలపై స్వేచ్ఛా ఆలోచనలు ప్రపంచ స్థాయిలో తిరోగమనంలో ఉన్నాయని నివేదించింది. మత రహితులపై హింస, వేధింపులు పెరుగుతున్నాయి. ప్రపంచంలో 85 దేశాలు మత అవిశ్వాసకులపై తీవ్ర వివక్ష వహిస్తున్నాయి. వీటిలో 30 దేశాలు తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛపై నియంతృత్వం, మత నిబంధనల ప్రకారం మతాధికారులు చట్టాలు

చేయడం, బళ్లలో మత సిద్ధాంతాల అమలు, మతరాహిత్య భావనల తీవ్ర పరిగణన, మూఢ విశ్వాసాలతో మతరాహిత్యాన్ని విరోధించడం, లౌకికవాదం చట్టవ్యతిరేకమని సూచించడం ఈ ఉల్లంఘనలలో కొన్ని. ముస్లిం జనాభా ఎక్కువగానున్న లేదా ముస్లిం ప్రధాన ప్రాంతాలయిన ముస్లిందేశాలు ఈ ఉల్లంఘనల దేశాల జాబితాలో ప్రథమ స్థానాలలో ఉంటాయి. కొన్ని రాజ్యాలు మతరహితుల వేధింపులను సమర్థిస్తాయి. అధికార మత తాత్విక వ్యతిరేకుల హత్యలను శిక్షలనుండి మినహాయిస్తాయి. 22 దేశాలు మతం మార్చుకున్నవారిని శిక్షిస్తాయి. 12 దేశాలు మత మార్పిళ్లకు మరణశిక్ష విధిస్తాయి. కొన్ని దేశాల్లో దైవదూషణ కారాగారశిక్ష విధించదగ్గ నేరం. ప్రభుత్వ పాఠశాలల్లో మతాంతీకరణకు పాల్పడతారు. మత సిద్ధాంత ప్రాతిపదికన చట్టాలు చేస్తారు. మత న్యాయస్థానాలు వ్యక్తిగత, కుటుంబ జీవితాలను నియంత్రిస్తాయి. భారత్, పాకిస్తాన్, మలేషియా, మాల్దీవులు, మౌరిటాలియా, సౌదీ అరేబియా, సూడాన్‌లలో స్వేచ్ఛావాదులు, హేతువాదులు, లౌకికవాదులపై దాడులు, వేధింపులు, హింసాత్మక చర్యలు, హత్యలు కొత్త ధోరణులలో పెరిగినట్లు 2017లో గుర్తించారు. క్రియాశీల కార్యకర్తలు మాయమయ్యారు. దైవదూషణ ఆరోపణలతో కొందరు శిక్షించబడ్డారు. "మతాన్ని విమర్శిస్తే తమపై దాడిచేస్తారని, చంపుతారని ప్రజల భయం. చట్టవిరుద్ధంగా చాలా హత్యలు జరిగాయి. హంతకులను పాలకులు రక్షించారు. మత నిర్లక్ష్యాన్ని నేరంగా పరిగణించి, శిక్షించే దేశాలను అంతర్జాతీయ వేదికలు కూడా ఉపేక్షిస్తున్నాయి." అని ఐ.హెచ్.ఇ.యు. అధ్యక్షులు ఆండ్రూ కాప్సన్ వాపోయారు. "ప్రపంచ తీరుపై అభిప్రాయ వ్యక్తీకరణకు ఎవరినీ వేధించరాదు. ఆలోచన, భావప్రకటన స్వేచ్ఛలు మానవ హక్కులలో భాగం. ఒక మతాన్ని నమ్మినందుకో, నమ్మనందుకో చంపుతామని బెదిరించే హక్కు ఎవరికీ, ఏ ప్రభుత్వానికీ లేదు. మత భావనల విమర్శనాత్మక ఆలోచనకు శిక్షించడం, ఏళ్ల తరబడి జైళ్లలో కుక్కడం, జీవిత భాగస్వామి, పిల్లలనుండి వేరుచేయడం అమానవీయ చర్యలు." అని జైలు శిక్షకు గురిచేయబడ్డ సౌదీ హేతువాది రైఫ్ బదావి భార్య ఇన్సాఫ్ హైదర్ వ్యాఖ్యానించారు.

మత సామరస్యం: రాజకీయ పాలనకు, సామాజిక జీవితానికి మధ్య కొనసాగిన సత్సంబంధాలే భారతీయ సమాజ నాగరికతల ప్రత్యేకతలు. పూర్వ పాలకులు ఈ విభజన రేఖను విజ్ఞతతో గౌరవించారు. సామాజిక క్రమాన్ని ఛిన్నాభిన్నం చేయలేదు. ముస్లిం పాలకులు కూడా ఈ రాజకీయ జ్ఞానాన్ని సంపాదించుకున్నారు. అందుకే ఆరు శతాబ్దాల ఇస్లాం పాలన తర్వాత కూడా హైందవ ప్రాధాన్యత నిలబడింది. మత దురభిమానాలను, మూఢనమ్మకాలను అణచివేయకుండా లొంగిపోయే రాజకీయ పార్టీ నిజమైన లౌకిక పార్టీ కాజాలదు. ఆ పార్టీతో లౌకిక రాజ్య స్థాపన, మనుగడ సాధ్యం కాదు. నేటి వరకూ మన పాలక పార్టీలన్నీ హిందూ దృక్పథంతోనే పాలించాయి. అందుకే భారత సమాజం అలౌకికంగా తయారయింది. అల్జీరియా, ఇండియా, ఇజ్రాయిల్‌లు విదేశీ పాలన నుండి స్వాతంత్ర్యం పొందాయి. తొలి రోజుల్లో అవి లౌకిక మార్గాలనే అనుసరించాయి. క్రమేణా మత ప్రతీఘాత శక్తులకు లొంగి తిరోగమించాయి. నాటి స్వాతంత్ర్యోద్యమ నాయకులు, మేధావులు ఊహించినట్లుగా లేవు. వాటి రాజకీయ, నైతిక, సాంస్కృతికతలు, జనజీవనం దేశ నిర్మాతలు ఆశించిన దిశల్లో పయనించక దిగజారిపోయాయి. భిన్న మతాలున్న ఈ దేశాల పాలనా విధానం, సమయసారిణిల సారూప్యత గమనించదగ్గవి. మత విశ్వాసాలు, వాటి తీవ్ర ప్రతిరూపాలు అణగదొక్కబడ్డవారి అవసరాలను తీర్చవు. మతఛాందసాలు, వాటి ఉపాంగాల నుండి ఉద్యమకారులు విముక్తి పొందనంతకాలం ఏ విముక్తి ఉద్యమం పీడిత వర్గాలను ఉద్ధరించజాలదు. మతం, పాలకులు, కార్పొరేట్ల కలనేతగా మారిని నేటి పాలన సంకుచిత, మెజారిటీ మతాధిపత్య, జాతి దురహంకారంగా తయారయింది. ప్రజా భావనలు భౌతికశక్తిగా మారుతాయని మార్క్సిస్టు సూత్రం. ప్రజలను ఆవహిస్తున్న హిందుత్వం ఈ సూత్రక్రమంలో వినాశక భౌతికశక్తిగా మారుతుందేమో!

లోగుట్టు: అధికారదాహంతో తపించేవారికి ఎప్పుడూ సమస్యల సుడిగుండాలు, అగ్నిగోళాలుండాలి. శాశ్వత పరిష్కారం జోలికిపోరు. ఫాసిజానికి మతమైనారిటీ పెరగరాదు. ఇంకా మైనారిటీగా మారాలి. అందుకే సంఘీయులు హిందువులు పెరగాలంటారు. హిందూ స్త్రీలు ఐదేసి మందిని కనాలంటారు. ఎప్పుడూ ఉనికిలోలేని అఖండ భారత్ సాధిస్తామంటారు. పాక్ తో సహా ముస్లిం దేశాలు భారత్‌లో కలిస్తే ముస్లింల బలం పెరుగుతుంది. వీళ్ల మాట నెగ్గదు.

ప్రత్యామ్నాయాలు: రాజకీయాలు అధికారానికే కాక సామాజిక చైతన్యానికీ ఉపయోగపడాలి. జాతీయోద్యమంలో వలసవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడారు. కానీ మతాలకు, కులాలకు వ్యతిరేకంగా జన సమీకరణ జరగలేదు. పోరాటాలు సాగలేదు. నేటికీ కొనసాగుతున్న కులమత తత్వాలకు గాంధీ, రాజేంద్ర ప్రసాద్, పటేళ్ల హిందుత్వ ధోరణులు కారణం. విత్తుకు తేమ తగిలితే మొక్క మొలిచినట్లు రాజ్య ప్రోత్సాహంతో మతోన్మాదం విజృంభిస్తుంది. నేటి సంఘ్ పాలనలో హిందుత్వ ప్రాబల్యం నేటి భారత విషాదం. పెట్టుబడిదారీ పార్టీలు అధికారానికే పాకులాడతాయి. ప్రత్యామ్నాయ పక్షాలు రాజకీయ, సామాజిక చైతన్యం కోసం పాటుపడతాయి. వివిధ దేశాల మతాల ప్రజల మధ్య ఐక్యత పెరగాలి. ఖండాంతర సాంస్కృతిక సఖ్యత నేటి ప్రాపంచిక అవసరం. ఆధునికతలు, సాంకేతికతలు మత సామరస్యానికి, మానవాళి అభివృద్ధికి, మానవత్వ వికాసానికి ఉపయోగపడాలి. ప్రపంచ మానవతావాదులు, లౌకికవాదులు, హేతువాదులు ఏకమవ్వాలి. అంతర్జాతీయ సహకారాన్ని, సంఘీభావాన్ని కూడగట్టుకోవాలి. మానవతా విలువల ప్రచారానికి, ఆచరణకు, హక్కుల అమలుకు, ఉనికికి, జీవించడానికి సూత్రబద్ధ ప్రజా ఉద్యమాలను నిర్మించాలి.

ముగింపు: నేటి భారత రాజకీయ ప్రాంగణంలో మదపుటేనుగు దూరింది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానం, అమెరికా అనుకూల విధానాలు, మతాంధకారం, ఆధిపత్య కుల పెత్తనం, తప్పుడు భావజాలం, ప్రజాస్వామ్య, రాజ్యాంగాల ధిక్కారం, అహంకారం, నిరంకుశత్వందాని అవయవాలు. ఒక్కొక్క అంగాన్ని చూసి దాని రూపాన్ని అంచనా వేయరాదు. సమగ్ర శరీరాన్ని తిలకించాలి. అపసవ్య అపహాస్య పరిష్కారాలు పనిచేయవు. ప్రత్యామ్నాయ పక్షాలు గాంధీ ఆధ్యాత్మిక రాజకీయ సంతులన మార్గాన్ని, వివేకానందుని సామాజిక తాత్విక వివేకాన్ని, అంబేద్కర్ అభిజాత్య సామాజిక న్యాయాన్ని, మార్క్స్ మానవత్వ మానసిక విప్లవ తాత్వికతను అనుసరించాలి. అనుకరించాలి. బహుముఖంగా, బహిరంగంగా, జన బాహుళ్యంతో సమసమాజ క్రూర లక్ష్యోద్దేశంతో ఉద్యమించాలి. అప్పుడే మత తిమిరం తిరోగమించగలదు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారం సిద్ధించగలదు.

(రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి) వీ

సామాజిక మార్పును విశ్లేషించడం ఎలా?

***సామాజిక మార్పులను అర్థం చేసుకోవడంలో మార్క్సిస్టు చారిత్రక భౌతికవాద దృక్పథం ఎలా మార్గదర్శకంగా ఉంటుందో వివరిస్తున్నారు* కృష్ణా భరద్వాజ్**

(వీక్షణం 2009 ఏప్రిల్, మే, జూన్ సంచికలలో ప్రచురించిన ఈ వ్యాసపు ప్రాధాన్యత దృష్ట్యా ఈ ప్రత్యేక సంచికలో పునర్ముద్రిస్తున్నాం. - సం.)

ఈ రజతోత్సవ ప్రత్యేక ఉపన్యాసాలు ఇవ్వవలసిందిగా నన్ను ఆహ్వానించి మైసూర్ విశ్వవిద్యాలయం నాకు గౌరవం ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఇక్కడ నన్ను మాట్లాడమని ప్రతిపాదించిన అంశం 'సమాజ పునర్నిర్మాణంలో జ్ఞానం పాత్ర' ప్రస్తుత ఉదాత్త సందర్భానికి సరిపోతుంది. ఇంత గంభీరమైన, లోతైన విషయం మీద మాట్లాడమని వచ్చిన ఆహ్వానాన్ని అంగీకరిస్తున్నప్పుడు నాకు నా పరిమితులు స్పష్టంగా తెలుసు. జ్ఞాన విజ్ఞానాల మీద ఆలోచనలు చేసే తత్వవేత్తల ప్రత్యేక బృందంతో నాకేమీ సంబంధం లేదు. అలాగే నేను సామాజిక ఆచరణలో ఉండి, అనుభవం ద్వారా కఠినమైన శిక్షణను పొందే కార్యకర్తనూ కాను. అయినా ఈ విషయం మీద మాట్లాడడానికి నేనెందుకు సాహసించానంటే, దీన్ని ఒప్పుకోకపోవడమంటే ఒక తప్పుడు అవగాహనను బలపరచినట్టే అవుతుంది. పరిశోధకులెవరైనా తమకు తెలిసినా తెలియకపోయినా తమ విద్యా కృషిని మొత్తాన్ని ఏదో ఒక సంవిధానపు పునాదిమీద, తాత్విక పునాది మీద మాత్రమే కొనసాగిస్తారనే ఆలోచనను పక్కన పెట్టడమే అవుతుంది. తాత్విక సమస్యలను తత్వశాస్త్ర నిపుణులకే వదిలేయాలని, 'ఆచరణాత్మక' వైఖరిని మాత్రమే పరిశోధకులు చేపట్టాలని కొందరు పండితులు అంటూ ఉంటారు. అట్లాగే ప్రతి విషయంలోనూ 'మౌలిక అంశాల' పట్ల శ్రద్ధ వహించడం నిర్దిష్టమైన, నిర్మాణాత్మకమైన, సృజనాత్మకమైన పనికి ఆటంకమవుతుందనీ, లేదా అవసరం లేదనీ అనే పండితులు కూడా ఉన్నారు. మొత్తం మీద అందరూ కలిసి తేల్చిందేమంటే సంవిధానానికి సంబంధించిన సమస్యలను చర్చించే పనిని జీవిత చరమాంకంలో, చేయవలసిన పనులన్నీ అయిపోయాక, ఒంటరిగా వృద్ధాప్యంలో కాలయాపన కోసం చేయవలసిందే అని. కాని ఫ్రెంచ్ నాటకకర్త మోలియర్ నాటకంలో ఒక పాత్ర అన్నట్టు 'తెలిసినా తెలియక పోయినా ప్రతి మనిషీ వచనంలోనే మాట్లాడతాడు'. తాత్విక అవగాహనలు కూడా ప్రతి పరిశోధనలోకి ప్రవేశిస్తాయి. వాటిని బయటికి గుర్తించవచ్చు, గుర్తించకుండా ఉండవచ్చు. గతకాలంలో పోగుపడిన జ్ఞానం మీద ఆధారపడిన, లేదా దానిని అభివృద్ధి చేయడానికి ఆకాంక్షిస్తున్న సైద్ధాంతిక పరిశోధన ఏదైనా తనను తాను సిద్ధాంతం నుంచి దూరం చేసుకోజాలదు. కనీసం లోలోపలనైనా అసలు అంగీకార యోగ్యమైన జ్ఞానం అంటే ఏమిటి? దాని పునాది ఏమిటి? దాన్ని సముపార్జించే ప్రక్రియ ఏమిటి? దాన్ని అంగీకరించ డానికో, తిరస్కరించడానికో ఆధారాలేమిటి? అనే విషయాల గురించిన సిద్ధాంతమైనా ఉండవలసి ఉంటుంది.

సామాజిక శాస్త్రాల మౌలిక కర్తవ్యం జరుగుతున్న సామాజిక మార్పును అర్థం చేసుకోవడమూ, ఆ ప్రక్రియను వ్యాఖ్యానించడమూ అని చాలా మంది అంగీకరిస్తారు. ఆ ప్రక్రియను ప్రభావితం చేయడానికి ఆ జ్ఞానాన్ని వాడుకోవడం కూడా అవసరమని కొందరు భావిస్తారు. అటువంటప్పుడు ఆ సిద్ధాంత వేత్త ఎంత ఎత్తైన ఏకాంత దంత ప్రాకారం మీద కూర్చుని ఉన్నప్పటికీ, అతని వాదనా పద్ధతి ఎంత అమూర్తమైనదప్పటికీ సామాజిక సంబంధాల స్వభావం గురించి, నిర్మాణం గురించి, అవి పనిచేసే పద్ధతి గురించి ఒక దృక్పథం లేకుండా పని చేయజాలడు. అందువల్ల ఆ సామాజిక నిర్మాణం లోపల ఉన్న దృక్పథాన్ని బహిరంగంగానే ఎదుర్కోక తప్పని స్థితి వస్తుంది. నా పరిమితుల గురించి నాకు స్పష్టమైన అవగాహన ఉన్నప్పటికీ, ఈ తప్పనిస్థితి వల్లనే ఇవాళ ఈ విషయం మీద మాట్లాడడానికి సిద్ధపడుతున్నాను. తాత్విక భాషణ చేయడం కన్నా పైకి బహిరంగంగా ఆలోచిస్తూ కొన్ని ప్రశ్నలు లేవనెత్తడం ముఖ్యమని అనుకుంటున్నాను.

కొన్ని ప్రాతిపదికలమీద ఆధారపడి భావనీకరించడం, ఆ భావనలను ఆచరణలో అన్వయించడం, ఆ ఆచరణ ద్వారా ఆ భావనలను పునర్నిర్మించడం అనే నిరంతర ప్రక్రియ ద్వారా మాత్రమే పరిశోధన ముందుకు సాగుతుంది. అందువల్ల ఏ పరిశోధనలోనైనా దాగి ఉన్న ప్రాతిపదిక అవగాహనలేమిటో వెలికితీసి చూపడం పరిశోధకుల అనివార్య బాధ్యత అవుతుంది. ఈ కర్తవ్యం మన సమాజాలవంటి సమాజాల అధ్యయనంలో మరింత ముఖ్యమైనదీ, అవసరమైనదీ అవుతుంది. ఎందుకంటే మన దగ్గర సైద్ధాంతిక అవగాహన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఇప్పటికీ పూర్తిగా భిన్నమైన చారిత్రక సందర్భాలలో, మరెక్కడో అభివృద్ధి అయిన ప్రాతిపదిక అవగాహనలను అరువు తెచ్చుకుని ఆధారపడే ధోరణే ఎక్కువగా ఉంది.

ఈ మూడు ఉపన్యాసాలలో నా ప్రయత్నమంతా సామాజిక మార్పును విశ్లేషించడంలో ఎదురయ్యే సమస్యల గురించి చర్చించడమే. నా సొంత అధ్యయన శాఖ అయిన అర్థశాస్త్రానికి సంబంధించిన సంవిధాన సమస్యల మీద నా దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఇవాళ చరిత్ర పొడవునా సామాజిక ప్రక్రియలను వ్యాఖ్యానించడానికి సంబంధించిన సాధారణ సమస్యల మీద కేంద్రీకరిస్తాను. ఆ వ్యాఖ్యానాలకూ జ్ఞాన సిద్ధాంతానికీ, ఆ వ్యాఖ్యానాలకూ సామాజిక విధానాలు రూపొందడానికీ ఉన్న సంబంధాన్ని కూడా పరిశీలిస్తాను. ఇక్కడ నేను ప్రధానంగా మార్క్స్, ఆయన సహచరులు అభివృద్ధి చేసిన భౌతిక వాద గతి తార్కిక వ్యాఖ్యానాల మీద ఆధారపడతాను. ఈ వాఖ్యానాలు విభిన్న చారిత్రిక పరిస్థితులలో సామాజిక మార్పును అధ్యయనం చేసేందుకు అర్థవంతమైన అవకాశాలను ఇస్తాయని నాకనిపిస్తుంది...

జ్ఞానానికి ఉండే పరిశీలనా పునాది

తన చుట్టూ ఉన్న భౌతిక వాతావరణం గురించి, తాను కూడా భాగమైన సామాజిక సంబంధాల గురించి జ్ఞానాన్ని మనిషి ఎలా సముపార్జిస్తాడు? అవి ఏదో లోకాతీత శక్తి ఇచ్చే వరప్రసాదం వల్ల అందుతాయా? కేవలం తపస్సు ద్వారా మనుషులు సాధించే నిగూఢ అధ్యాత్మిక శక్తి ద్వారా మాత్రమే ఆ జ్ఞానం అందుతుందా? ప్రాచీన సమాజాలలో అమలులో ఉండిన అధిభౌతిక నిగూఢ సిద్ధాంతాలు జ్ఞానాన్ని ఇటువంటి ఇంద్రియాతీత వనరులకు ఆపాదించాయి. ఆ జ్ఞానం మనిషికి బయట మాత్రమే కాదు, మనిషికీ ప్రకృతికీ అతీతంగా ఉంటుందని కూడా చెప్పాయి. ఇటువంటి మానవాతీత, ప్రకృతి అతీత పాలనా శక్తుల గురించిన నమ్మకాలు బహుశా ఆదిమ సమాజాలలో ప్రకృతి శక్తులను అధిగమించలేమనుకుంటూ, భయపడుతూ వాటిని ఆరాధించడానికి ఏర్పాటు చేసుకున్న మంత్ర తంత్రాల నిగూఢ నిర్మాణాల ఫలితమే అయి ఉంటాయి. మతం ప్రాబల్యం వహించే సమాజాలలో జ్ఞానం అనేది కేవలం తపస్సు వల్ల, ధ్యానం వల్ల మాత్రమే వికసిస్తుందనే నమ్మకం ఉండేది. క్రమంగా ఆ పనులు చేసే మతాచార వర్గానికి సామాజిక అధికారం చేజిక్కడానికి అది ఒక సాధనం అయింది. తద్వారానే ఏర్పడిన ఒక పకడ్బందీ ఆచారపర అంతస్తుల నిర్మాణాన్ని అది సమర్థించింది.

మన సమాజమే చూస్తే, సైనిక శక్తి ఎంతమాత్రమూ లేని, భౌతిక సంపదను పోగు చేసుకోవడంలో భాగం పంచుకోని బ్రాహ్మణులు స్పష్టంగా అత్యల్ప సంఖ్యాకులై ఉండికూడా సమాజాన్ని పాలించారు. సైనిక శక్తి క్షత్రియుల సొంతం. భౌతిక సంపద వైశ్యుల విధి. బ్రాహ్మణుల కర్తవ్యం తామే రాసిన మత గ్రంథాలు చదవడం, వ్యాఖ్యానించడం మాత్రమే. సామాజిక అంతరాల వ్యవస్థలో అగ్రభాగాన ఉన్న తమ స్థానాన్ని కాపాడుకునే ఉద్దేశంతో వారు దైవభీతి అనే ఆలోచన ప్రవేశపెట్టారు. అంతకన్నా ఎక్కువగా అమాయకుల మనసులలో శబ్దం పట్ల భీతిని కూడా ప్రవేశపెట్టారు. ఎన్నో మత గ్రంథాలలో శబ్దమూ, సృష్టీ కలగలసి ఉండడం గమనార్హమైన విషయం. పాశ్చాత్య సమాజాలలో కూడా సరిగ్గా ఈ విధంగానే మతాచార వర్గం జ్ఞాన మూలాలు తమకు మాత్రమే అందుబాటులో ఉన్నాయనే పునాది మీదనే తమ ఆధ్యాత్మిక ఆధిక్యతను చూపుకున్నాయి. కాగా, మానవజాతి ఉత్పాదక శక్తులు పెరిగిన కొద్దీ, భౌతిక పరిస్థితుల గురించి జ్ఞానం పెరిగిన కొద్దీ, ఈ నిగూఢ అధిభౌతిక పునాది క్రమక్రమంగా తరిగిపోతూ వచ్చింది. జ్ఞానేంద్రియాల ద్వారా పరిసరాలను గ్రహించడం మీద ఆధారపడడం పెరిగింది. అంటే, ప్రత్యక్ష అనుభవం ద్వారా గ్రహించిన ఇంద్రియానుభూతులు, అవగాహనలు ముఖ్యమైనవనే అవగాహన పెరిగింది.

ఇంద్రియగ్రహణంలో వ్యక్తి – భౌతికవస్తువుల ద్వంద్వం

అయితే ఇంద్రియ గ్రహణానికి పునాది ఏమిటి అనేదే అనేక రకాలుగా వ్యాఖ్యానానికి గురయింది. కొందరి దృష్టిలో మనిషి స్వీయ మానసిక ప్రపంచానికీ, మనిషికి బయట ఉన్న భౌతిక, వస్తుగత, బాహ్య ప్రపంచానికీ మధ్య కచ్చితమైన విభజన రేఖ ఉంది. మరికొందరి దృష్టిలో ఈ రెండూ ఒకదానికి మరొకటి ప్రతిఫలనం మాత్రమేనని, అందువల్ల ఒకదాన్ని మరొకదానిగా కుదించవచ్చునని ఆలోచన ఉంది. ఫ్రాన్స్‌లో హెల్విషియస్, సిస్మొండీ, గిజో, థెయిరీ, మిగ్నే వంటి వారు అభివృద్ధి చేసిన, లేదా ఇంగ్లండ్‌లో లాక్, మాంటెస్క్యూల అనుచరులు, డేవిడ్ హ్యూం, ఆడమ్ స్మిత్, జాన్ మిల్లర్ వంటి స్కాటిష్ ఆలోచనాపరులు అభివృద్ధి చేసిన పద్దెనిమిదో శతాబ్ది భౌతికవాదం మనుషుల ఆలోచనాపూర్వకమైన కార్యాచరణ అంతా కేవలం 'ఇంద్రియానుభూతుల పరివర్తన రూపమే' అని భావించారు. అంటే, మనిషికి ఉండే అన్ని ఆలోచనలు, భావాలు, అనుభూతులు కూడా అతని మీద పరిసరాలు చూపే ప్రభావపు ఫలితాలే అని అర్థం. అంటే, మనిషి ప్రధానంగా తన పరిసరాల ఉత్పత్తే అని వాళ్లు భావించారు. ఉదాహరణకు, మనిషి తనతో పాటు తన సహజాతమైన 'ఆచరణాత్మక భావాల' నిలువను తీసుకురాడని లాక్ నొక్కి చెప్పాడు. మనిషిలోని సుగుణమనేది ఎందుకు గౌరవించబడుతుందంటే అది ఆ మనిషిలో సహజంగా ఉన్నందువల్ల కాదనీ, ఆ సమాజ మనుగడకు అది ఉపయోగకరంగానూ, అనువుగానూ ఉన్నందువల్లనేననీ లాక్ అన్నాడు.

ఈ భౌతికవాద ఆలోచనా ధోరణికి చెందిన వారు ప్రధానంగానూ, మొత్తంగా ఆ కాలపు చరిత్రకారులందరూ రాజకీయ, చట్టపర నిర్మాణాలూ, ఆస్తి రూపాలూ ఒక సమాజపు అభివృద్ధిలో ఆ ప్రత్యేక దశకు అనుగుణంగానే రూపొందుతాయని వాదించారు. అంటే, ఒక ప్రత్యేక వ్యక్తి భావాలు అతని పరిసరాల వల్ల నిర్ధారితమవుతాయని. అంటే చారిత్రక పరిణామ క్రమంలో మానవ జాతి భావాలన్నీ మారుతున్న సామాజిక వాతావరణానికి అనుగుణంగానే ఉంటాయని అనుకోవలసి వస్తుంది.

అయితే ఇక్కడ ఈ భౌతికవాద ఆలోచనాపరులు ఆ వికాసయుగపు తాత్విక దృక్పథంలోకి జారిపోయినట్టు కనబడుతుంది. ఆ దృక్పథం ఏమంటే పరిసరాలైనా, సామాజిక సంబంధాలైనా 'భావాల' ప్రగతి చేత, అందువల్ల అంతిమంగా 'మానవ ప్రవృత్తి' చేత నిర్ణయమవుతాయని భావించడం. ఇక్కడ వాదన నడిచిన పద్ధతి ఇలా ఉంటుంది: లాక్, హెల్విషియస్ భావించినట్టుగా మానవ సుగుణం అనేది సహజాతం ద్వారానో, శాశ్వత లక్షణాల ద్వారానో నిర్ణయం కానట్టయితే, సామాజిక ఉపయోగపు పునాది పైననే నిర్ణయమైనట్టయితే ప్రతి చారిత్రక పరిస్థితులకు వాటివైన ప్రత్యేక మానవ ప్రవర్తనా, నైతిక నియమాలు ఉంటాయి. అవి మనిషి సామాజిక అస్తిత్వానికి కొనసాగింపుగానో, తగినట్టుగానో ఉంటాయి. అందువల్ల అన్ని విషయాలకూ మనిషే ప్రమాణం అని చెప్పినప్పుడు అతని మారుతున్న సాంఘిక అవసరాలే సమాజ ప్రగతిని నిర్ణయిస్తాయని అర్థం.

మరొకపక్క అతని సామాజిక అవసరాలను నిర్ణయించేది మారుతున్న మానవ ప్రవృత్తే. అంటే, ఎప్పటికప్పుడు రూపొందుతున్న, మారుతున్న నైతికతా చట్రం దానికదే స్వతంత్రంగా ఉండి, ఆ కాలపు స్ఫూర్తి దానికి మార్గదర్శక సూత్రంగా ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే మనిషికీ, ప్రకృతికీ మధ్య సంబంధాన్ని వివరించే క్రమంలో ఈ పద్దెనిమిదో శతాబ్ది తత్వవేత్తలు కచ్చితంగానూ, కొన్ని సందర్భాల్లో రాజీలేకుండానూ భౌతికవాదులుగా ఉన్నారు. కాని, చరిత్ర గతిలో ఆ భౌతిక పరిసరాలు ఎలా మారుతాయి అనే విషయంలో వాళ్ల వివరణ చాలా బలహీనంగా ఉండింది. చరిత్రను విశ్లేషించేటప్పుడు వాళ్లు మానవ ప్రవృత్తి ప్రస్తావనతో ముగించారు. సామాజిక స్థితిని నిలిపి ఉంచడంలో, కొనసాగించడంలో తగిన నైతిక భావనల దగ్గర ముగించారు. వాళ్ల దృష్టిలో అంతిమంగా చరిత్రను మారుతున్న మానవ ప్రవృత్తి దృష్ట్యానే వివరించగలం.

ఇందుకు భిన్నంగా బిషప్ బర్కిలీ వంటివారు ప్రతిపాదించిన స్వీయాత్మక భావవాద దృక్పథం బాహ్య ప్రపంచం మొత్తాన్నీ మన ఇంద్రియానుభూతుల గ్రహణాల సృష్టిగా గుర్తించింది. ఈ తత్వవేత్తల దృష్టిలో మనకు బాహ్యంగా ఉన్న వస్తువులన్నీ మన

ఇంద్రియానుభూతుల, ఆలోచనల సమ్మేళనం మాత్రమే. అలా గుర్తించిన వస్తువులతో మానవ గ్రహణం తాదాత్మ్యం పొందుతుంది. అంటే పరిశీలకుడి చైతన్యానికి అతీతంగా బాహ్య ప్రపంచం అనేది ఉనికిలో లేదు. వస్తుగత భౌతిక ప్రపంచాన్ని ఈ విధంగా వ్యక్తివాదంతో నిరాకరించడమూ, మొత్తం జ్ఞానానికి మూలాన్ని స్వీయాత్మక చైతన్యంలో మాత్రమే గుర్తించడమూ అధిభౌతికవాదానికి దారితీస్తుంది. ఇటువంటి అతివాద స్వీయాత్మకత వల్ల వస్తువుల మధ్య సంబంధాలు కనిపెట్టడంలో విఫలం అవుతాం. లేదా, ఇటువంటి వ్యక్తివాద పునాదుల వల్ల మానవ సమాజాల చరిత్రను శాసించేదేమిటో తెలుసుకోలేక పోతాం.

వస్తుగత భావవాదులు కూడా ఉన్నారు. వారు బాహ్య ప్రపంచపు ఉనికిని గుర్తించారు. దానిలోని మార్పులను కూడా గుర్తించారు. కాని, ఆ మార్పులకు దారితీసే కారణభూతమైన శక్తులను భౌతికేతర, అమూర్త భావనలో చూశారు. వాటికి హేతువు అనో, భావం అనో, కాలధర్మం అనో అటువంటి మరేదో పేరు పెట్టారు. మానవ సమాజాలలో ప్రతి దశను నిర్ణయించేది, స్వభావాన్నిచ్చేది భావం అని వాళ్లు భావించారు. ఆ పాలక భావంలో గెంతులు లేదా గుణాత్మక మార్పులు వచ్చినప్పుడు సమాజం ఒక యుగం నుంచి మరొక యుగానికి పరివర్తన చెందుతుందని వాళ్లు అన్నారు. ఇటువంటి భావాన్ని ప్రతిపాదించిన వాళ్లు చాలామంది ఉన్నారు గాని వారికి ప్రతినిధులుగా ప్లేటో, లీబ్నిజ్, సెయింట్ సైమన్, హెగెల్‌లను చెప్పుకోవచ్చు. మార్పు స్వభావం ఏమిటి అని గుర్తించేటప్పుడూ, సూత్రీకరించేటప్పుడూ హెగెల్ ఉపయోగించిన గతితార్కిక వాదనా పద్ధతి మౌలికంగా కొత్తది. అందువల్ల చారిత్రక పరివర్తన గురించి ఆయన చేసిన వ్యాఖ్యానాలలో అద్భుతమైన ప్రతిపాదనలున్నాయి. ఆ ప్రతిపాదనలలో కొన్నిటిని స్వీయాత్మక–వస్తుగత సంబంధాల విషయంలో మౌలికంగా మార్చి చరిత్ర పట్ల భౌతిక, గతితార్కిక అవగాహనలో వాడుకున్నాడు మార్క్స్. ఈ భావవాదులు చరిత్ర చోదక శక్తిగా భావం మీద పెట్టిన మితిమీరిన శ్రద్ధ ఒక సర్వస్వతంత్ర, అమూర్త భావన మీదనే మొత్తం బాధ్యత పెట్టింది. అందువల్ల సమాజంలో మనిషి సాగించే ఆచరణాత్మక కృషికి, శ్రమకు ఎటువంటి సంబంధం లేకపోయింది. ఇటువంటి సిద్ధాంతాల వల్ల మహామానవుడు, విశ్వమానవుడు, మహానాయకుడు, వీరుడు వంటి భావనలు తలెత్తాయి. ఉత్తమ జాతి, ఉత్తమ రాజ్యం వంటి భావనలు తలెత్తాయి. ఆ మనిషినో, ఆ రాజ్యాన్నో, ఆ జాతినో, ఆ పరమ భావపు వ్యక్తీకరణగా, కాలధర్మపు వ్యక్తీకరణగా చూడడం మొదలైంది. హెగెల్ ఉపయోగించిన విప్లవాత్మకమైన గతితార్కిక పద్ధతి దాని భావవాదం వల్ల ధ్వంసం అయిపోయి ఒక మితవాద నిర్ధారణ మిగిలింది. ఆనాటి ప్రష్యన్ రాజ్యమే అత్యుత్తమ, అత్యున్నత రాజ్యమనే మితవాద జర్మన్ భావజాలం మిగిలింది.

ఆచరణకూ, సిద్ధాంతానికీ మధ్య సంబంధం

ఇక్కడ కీలకమైన అంశం ఒకటుంది. అది ఏ ఆలోచనకయినా ముందు ఇంద్రియానుభూతులుంటాయి అనే నిస్సందేహమైన వాస్తవం కాదు. అంతకన్న ముఖ్యమైన వాస్తవం ఏమంటే మనుషులు తమకు బాహ్యంగా ఉన్న భౌతిక ప్రపంచం మీద పనిచేసే, శ్రమించే, ఆచరణలో పాల్గొనే క్రమంలో పొందే అనుభవాలలో ఇంద్రియానుభూతులు గ్రహిస్తారు. అవే ఆలోచనకు పురిగొల్పుతాయి. అంటే మనిషి జ్ఞానం అతని శారీరక, ఆచరణాత్మక కృషిలో మాత్రమే అభివృద్ధి చెందుతుంది. ఈ క్రమంలో మనిషి భౌతిక శక్తుల మీద పనిచేస్తాడు. భౌతిక శక్తులతో పాటు పనిచేస్తాడు. తన మనుగడ సాగడం కొరకు అంటే జీవితం కొరకు చేసే పోరాట అవసరమే అనివార్యంగా మనిషిపైన ఒక కర్తవ్యాన్ని విధించింది. తన చుట్టూ ఉన్న భౌతిక వస్తువుల మధ్య సంబంధాలను శాసించే శక్తులేవో తెలుసుకొని, తన అదుపులోకి తీసుకొని, తన సౌకర్యం కొరకు వాడుకునేలా చూసుకోవడమే ఆ కర్తవ్యం. మనిషి తన ఆచరణాత్మక కృషిలో ఎల్లప్పుడూ ప్రకృతిని ఎదుర్కోవలసి వస్తుంది. కొన్నిసార్లు దానిమీద పోరాడవలసి వస్తుంది. కొన్నిసార్లు దానితో మైత్రి నెరపవలసి వస్తుంది. ఈ క్రమంలోనే తన ఇంద్రియానుభూతుల మీద ఆధారపడి మనిషి ఇంద్రియ జ్ఞానాన్ని సంపాదిస్తాడు. అందువల్ల జ్ఞాన సిద్ధాంతం అనేది అనివార్యంగా ఈ పోరాట చరిత్రతో ముడిపడినదే. అంటే, ఈ పోరాట చరిత్రే మానవ నాగరికతా చరిత్ర అవుతుంది. భౌతిక సంబంధాల గురించిన మనిషి జ్ఞానం, అతని వ్యాఖ్యానాలు, అతని అవగాహన, భౌతికశక్తులు అతన్ని ప్రభావితం చేసే తీరు క్రమక్రమంగా విస్తరించాయి. ఈ ఉత్పత్తి శక్తుల మీద తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవడం ద్వారా ప్రకృతిని శాసించే భౌతిక సూత్రాల గురించిన జ్ఞానాన్ని సముపార్జించడం ద్వారా, తనకు పరిమితులు విధించే ప్రకృతి ఆవశ్యకతలను గుర్తించడం ద్వారా మనిషి తన ఉత్పాదక సామర్థ్యాన్ని ఇతోధికంగా అభివృద్ధి చేసుకోగల స్వాతంత్ర్యాన్ని పొందాడు.

మొట్టమొదట మనిషికి ఈ ఇంద్రియ జ్ఞానం ఒకదానికొకటి సంబంధంలేని, విడివిడి యాదృచ్ఛిక వాస్తవ అనుభవ శకలాలుగా అందుతుంది. అక్కడి నుంచి రెండో అడుగుగా మనిషి వేరు వేరు అనుభవాల మధ్య ఏకసూత్రతను గుర్తిస్తాడు. వాటిమీద ఆధారపడి ఆ వాస్తవాలను తార్కికంగా, హేతుబద్ధంగా ఒక వరుసలో పెట్టుకుంటాడు. అప్పుడు ఈ ఇంద్రియ జ్ఞానం గుణాత్మకంగా పరివర్తన చెంది, తాత్విక జ్ఞానం అవుతుంది. దానికి హేతుబద్ధ ఆలోచనా, తర్కమూ అనే ప్రక్రియలు తోడవుతాయి. వీటినుంచి సాధారణీకరించి, అమూర్తీకరించి చూసినప్పుడు సిద్ధాంతం తయారవుతుంది. ఇంకా ఇంకా ఎక్కువ అనుభూతులూ, పరిశీలనలూ పోగైనకొద్దీ, వాటిని సంఘటితపరిచే తార్కిక క్రమాలలో సిద్ధాంతాలు కూడా మారిపోతూ ఉంటాయి.

ఆదిమ సమాజాలు జ్ఞాపకం ఉంచుకునే, పదే పదే వల్లించే పద్ధతులమీద ఆధారపడ్డాయి. అందుకే అప్పుడు జ్ఞాపక శక్తి సూత్రాలనూ, ధారణా సూత్రాలనూ కనిపెట్టారు. ఈ జ్ఞాపకాన్ని మరింత అభివృద్ధి చేసి జ్ఞానాన్ని వర్గీకరించే, విడివిడిగా అరలలో పెట్టే పద్ధతి కనిపెట్టారు. తద్వారా వేరు వేరు వాస్తవాలను కొన్ని అమూర్త వర్గాలుగా విభజించడం జరిగింది. కాలక్రమంలో ఆ తర్వాత కొన్ని వస్తువులను చూసి ఒక సూత్రీకరణ చేయడం, ఒక సూత్రీకరణ నుంచి ఆ వస్తువు సరిపోతుందా లేదా చూడడం వంటి పద్ధతుల ద్వారా నిర్మాణాత్మకమైన వాదనా పద్ధతులను అభివృద్ధి చేసే సంక్లిష్ట ప్రక్రియలు మొదలయ్యాయి. జ్ఞాన సముపార్జన పెరుగుతున్న కొద్దీ విశ్లేషణా పరికరాలు కూడా అభివృద్ధి చెందాయి. ఆ క్రమంలోనే ప్రయోగపరికరాలు కూడా అభివృద్ధి చెందాయి. ఈ ప్రయోగ పరికరాలకు మనిషి అదుపులో ఉన్న ఉత్పత్తి శక్తుల స్థాయిని పెంచడంలో ప్రత్యక్ష పాత్ర ఉంది. పరిశీలనా, ప్రయోగ పరికరాలు క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ తమ కచ్చితత్వాన్నీ, మెరుగైన పనితనాన్నీ పెంచుకున్న కొద్దీ సాంకేతిక పరిజ్ఞాన సరిహద్దులు విస్తరించాయి.

అంటే ఆచరణకూ, చరిత్ర క్రమంలో నిర్ధారితమైన సిద్ధాంతానికీ

అత్యంత సన్నిహితమైన, అవిభాజ్యమైన సంబంధం ఉంది. అయితే ఆ సంబంధం అక్కడితో మాత్రమే ఆగిపోలేదు. ఒకసారి తయారైన సిద్ధాంతపు సమంజసత్వం అది మళ్లీ ఆచరణలో పనిచేస్తుందా లేదా అనే పరీక్షలోనే ఉంటుంది. అంటే, ఒక సిద్ధాంతం అనుభవం ద్వారా వెలికి వచ్చిన ఫలితాలనే ఇవ్వగలుగుతుందా లేదా అనే పరీక్ష. భౌతిక శాస్త్రాలలో, ప్రయోగాలలో ఈ పరీక్షను బహిరంగంగా ఎల్లప్పుడూ నిర్వహిస్తూ ఉంటారు. కాని ఈ పరీక్ష సామాజిక శాస్త్రాలకు కూడా అవసరమైనదే. ఒక సిద్ధాంతం ఊహించే, ప్రతిపాదించే ఫలితాలు వాస్తవ ఆచరణ క్రమంలో, వాటిమీద ఆధారపడిన వ్యూహాలు అనుసరించే క్రమంలో విజయవంతం అవుతాయా లేదా అనేదే ఆ పరీక్ష. చరిత్ర మొత్తంలో జ్ఞానం అభివృద్ధి అయిన క్రమాన్ని పరిశీలిస్తే ఈ రకంగా ఆచరణకూ, సిద్ధాంతానికీ మధ్య నిరంతర అన్యోన్య చర్య, ప్రతిచర్య ఉండడం కనబడుతుంది. ఆచరణ లేకుండా కేవలం తపస్సుతో, ఆలోచనతో గ్రహించగలిగిన బాహ్యమైన జ్ఞాన మూలం ఏదీలేదు.

మానవ ఆచరణలో చైతన్యం పాత్ర

అయితే ప్రకృతిలో మనిషి ఆచరణను జంతుజాతుల ఆచరణ నుంచి వేరుచేసి చూపే ఒక ముఖ్యమైన లక్షణం ఉంది. భౌతిక శక్తుల మీద పనిచేసే క్రమంలో భౌతిక ప్రకృతి నియమాల పరిమితుల లోపలే పనిచేస్తూ ఉన్నప్పటికీ మనిషి ప్రకృతిని మార్చడం మాత్రమే కాదు, తనను తాను కూడా మార్చుకుంటాడు. భౌతిక శక్తుల గురించి మనిషి జ్ఞానం అతని చేత వాటిని మార్పించింది. వాటిని అధిగమింపజేసింది. ఆ భౌతిక శక్తులనే తనకు సౌకర్యవంతంగా మార్చుకునేలా చేసింది. అలా తన సామర్థ్యాలను పెంచుకుంటూ మనిషి క్రమక్రమంగా తన పరిసరాలను కూడా మారుస్తాడు. ఇక్కడ ముఖ్యమైనదేమంటే తన చుట్టూ ఉన్న భౌతిక పరిస్థితులను మారుస్తున్న క్రమంలో మనిషి తనంతట తాను కూడా మారడం. మనిషి తన చుట్టూ ఉన్న వాతావరణపు ఫలితమే అయినప్పటికీ అతను ఆ ప్రకృతిలో చైతన్యయుతంగా జోక్యం చేసుకుంటాడు. మిగతా జంతువులన్నీ మౌలికంగా సహజాతం కొద్దీ లేదా అసంకల్పిత ప్రతీకార చర్యగా ప్రకృతి మీద పనిచేస్తాయి. మనిషి చైతన్యయుతంగా ప్రకృతిమీద పనిచేస్తాడు. మనిషంటే పనిముట్లు తయారు చేసే జంతువు అని ఇదివరకే నిర్వచించి ఉన్నారు. ప్రకృతి శక్తులనూ, సామర్థ్యాలనూ మనిషి ఒక ఉద్దేశపూర్వకమైన ప్రణాళిక ద్వారా ఉత్పత్తికి ఉపయోగపడే పనిముట్లుగా మారుస్తాడు. మనిషి కనిపెట్టిన అటువంటి సృజనాత్మకమైన పరికరాలలో అత్యద్భుతమైన ఉదాహరణ భాషాభివృద్ధి. అది ఎంత శక్తివంతమైన పరికరమంటే, దాని ద్వారా ఇంద్రియజ్ఞానాన్ని తార్కిక జ్ఞానంగా సంఘటితం చేయడం మాత్రమే కాదు, పరస్పర సంభాషణా సంబంధాల ద్వారా మనిషి సామాజిక మనుగడకే అది ఉపయోగపడుతుంది. మనిషి ఆచరణలో ఉండే ఈ చైతన్యం అనే లక్షణాన్ని తొలి భౌతికవాదులు గుడ్డిగా విస్మరించారు. మనిషి అనివార్యంగా విధ్యుక్త ధర్మంగా భౌతిక వాతావరణం చేత శాసించబడే వాడే అనుకున్నారు. మనిషి అనే స్వీయాత్మక శక్తి, వస్తువు అనే భౌతిక శక్తులకు లొంగి సంపూర్ణంగా బానిసగా ఉండవలసిందే అనుకున్నారు. కాని మార్క్స్ అన్నట్టుగా 'అత్యంత అసమర్థుడైన వాస్తు శిల్పికీ అత్యద్భుతమైన తేనెటీగకూ తేడా ఏమంటే వాస్తు శిల్పి వాస్తవంగా భవన నిర్మాణం జరగకముందే తన ఊహలోనే భవనాన్ని నిర్మించగలడు. తేనెటీగ మాత్రం ఏ ఊహా లేకుండా సహజాతంగా ఆ నిర్మాణం సాగిస్తుంది.'

ప్రకృతికీ, మనిషికీ ఉన్న సంబంధాన్ని ఈ విధంగా నిర్వచించడం లో అప్పటి వరకూ తత్వశాస్త్రంలో వ్యక్తికీ, వస్తువుకూ - స్వీయాత్మకతకూ, భౌతికతకూ సంబంధం ఏమిటనే ఉన్న సమస్య పరిష్కారం అయింది. అప్పటివరకూ ఉండిన రెండు అతివాద వైఖరులలో ఏ ఒక్కదాన్ని తీసుకోనక్కర్లేదు. శాశ్వతమైన, మారడానికి వీల్లేని సూత్రాలతో నిర్మాణమైన భౌతిక ప్రపంచమే వ్యక్తి మానసిక ప్రపంచాన్ని నిర్ణయిస్తుందనే వైఖరి అక్కర్లేదు. లేదా, మనిషి స్వీయాత్మక అనుభూతుల ప్రతిఫలనంగానే భౌతిక ప్రపంచం ఉన్నదనీ, దానికి స్వతంత్ర అస్తిత్వం లేదనీ భావించే వైఖరీ అక్కర్లేదు. ఇలా రెండు ధృవాల మధ్య వైరుధ్యం లాగా కనబడిన సమస్యను భౌతిక శక్తులకూ, వ్యక్తుల స్వీయ మానసిక అనుభూతుల చైతన్యానికీ మధ్య పరస్పర అన్యోన్య చర్య-ప్రతిచర్యలు ఉంటాయని గుర్తించడం ద్వారా పరిష్కరించడం జరిగింది. ఆలోచన కన్న ముందు ఇంద్రియానుభూతులు ఉంటాయనీ, అప్పటివరకూ చారిత్రకంగా అభివృద్ధి అయిన భౌతిక ఉత్పత్తి శక్తుల పరిమితుల లోపల మాత్రమే ఆచరణ సాధ్యమవుతుందనీ అనుకోవడంలో పాత భౌతిక వాద దృక్పథం కొనసాగినట్టు కనబడుతుంది. కానీ, ఇంకెంత మాత్రమూ అమాయకమైన యాంత్రికమైన ఏకముఖ నియతివాద రూపంలో కాదు. మనిషికీ ప్రకృతికీ మధ్య సంబంధం పూర్తిగా ఏకముఖమూ కాదని, శాశ్వతంగా స్థిరమైనదీ కాదని అంగీకరించిన మరుక్షణమే జ్ఞాన అభివృద్ధి క్రమం మానవాచరణ అనే చారిత్రక ప్రగతితో ముడివడి ఉందని అర్థమవుతుంది. అంటే, చరిత్ర క్రమంలో అంతకంతకూ ఎక్కువగా మనిషి ఉత్పత్తి శక్తులను తన అధీనంలోకి తెచ్చుకున్న చరిత్రకూ, జ్ఞాన అభివృద్ధికీ సంబంధం అర్థమవుతుంది.

బహుశా ఈ కారణం వల్లనేనేమో సామాజిక పరిణామ శాస్త్రవేత్తలందరూ తమకు తవ్వకాలలో దొరికిన పనిముట్లను బట్టీ, ఉత్పత్తి పరికరాలను బట్టీ, ఇతర భౌతిక వస్తువులను బట్టీ, పాత సమాజాల జీవన విధానాన్ని పునర్నిర్మించగలిగారు. వారి ప్రయత్నమంతా అప్పటికి మనుషులు సాధించిన భౌతిక పురోగతి దశను గుర్తించి దాని ఆధారంగా వారి సామాజిక జీవనపు స్వభావాన్ని, బయటి ప్రపంచంతో వారి సంబంధాలను, వారు నిర్మించుకున్న వ్యవస్థలను, ఆచారాలను, మతవిశ్వాసాలను, సామాజిక కట్టుబాట్లను నిర్ధారించడం. ఈ మొత్తానికీ భౌతిక అవశేషాలే పునాది.

ఆచరణకు సామాజిక పునాది

మనం మాట్లాడుకుంటున్న విషయానికి అత్యంత ముఖ్యమైనదే మంటే మనిషి ఒంటరిగా ఏ పనీ చేయలేడనేది. మనిషి కార్యాచరణ ఏదైనా సమాజంలో మాత్రమే జరుగుతుంది. ఒక వ్యక్తిని వ్యక్తిగా మాత్రమే చూస్తే, అతను ఉన్న సామాజిక సందర్భం నుంచి మినహాయిస్తే అతనికి మనుగడే లేదు. 'ఒక మనిషి రాజు ఎందుకవుతాడంటే, మిగిలిన మనుషులందరూ అతనితో పాలితులుగా సంబంధంలో ఉంటారు గనుక. అదే సమయంలో వాళ్లందరూ అతను రాజు గనుక తాము పాలితులమని అనుకుంటూ ఉంటారు' అని మార్క్స్ అన్నాడు. తమ ఆచరణాత్మకమైన శ్రమ క్రమంలో మనుషులు అనివార్యంగా సామాజిక సంబంధాలలో ప్రవేశిస్తారు. అలా అభివృద్ధి చెందే సామాజిక సంబంధాలు కూడా యాదృచ్ఛికంగా, నిరంకుశంగా అభివృద్ధి చెందవు. ఆనాటికి అభివృద్ధి చెంది ఉన్న ఉత్పత్తి శక్తుల స్థితితో చారిత్రక సమన్వయంతో మాత్రమే ఆ సంబంధాలు రూపొందుతాయి. కొన్ని రకాల ఉత్పత్తి సంబంధాలు, వాటితో

కలగలసిన ఆస్తి సంబంధాలు, ఆనాటి ఉత్పత్తి శక్తులను వినియోగించడానికి ఎక్కువ వీలుగా ఉంటాయి. అంటే చారిత్రకంగా సముపార్జించిన జ్ఞానాన్ని అత్యంత ప్రగతిశీలంగా ఉపయోగించడానికి వీలుగా ఉంటాయి. ఈ సంబంధాలు పాత సంబంధాలను రద్దు చేస్తూ నిర్ధారితమవుతాయి.

ఆదిమ సమాజపు తొలి దశలో భౌతిక సంపద సాధించాలంటే దోపిడీ, దాడి, తక్షణ సులభ సాధ్యమైన రూపాలుగా ఉండేవి. అందువల్లనే దోపిడీ చేసి శత్రువును హతమార్చడం భౌతికంగా ఎక్కువ ఉపయోగకరంగా ఉండి ఉంటుంది. కాని, ఉత్పాదక సామర్థ్యం అభివృద్ధి చెందిన తరువాత ఎవరిమీద దాడి చేసి ఓడిస్తున్నారో, వారిని చంపడం కాకుండా బానిసలుగా ఉపయోగించుకోవడం ఎక్కువ భౌతిక ప్రయోజనాన్ని ఇస్తుంది. అందువల్ల బానిసత్వం అనే ఒక కొత్త వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఆ తరువాత ఉత్పత్తి శక్తులు మరింతగా అభివృద్ధి చెందిన తరువాత బానిస శ్రమను దోపిడీ చేయడమనేది, కేవలం ఆ బానిసకు ఉన్న జంతు సామర్థ్యం మీద మాత్రమే ఆధారపడడం, దాన్ని గ్రహించడానికి బలప్రయోగం చేయడం చాలా తక్కువ స్థాయి రూపాలని గ్రహింపు వచ్చి ఉంటుంది. అందుకు బదులుగా శ్రామికుడికి కొంత చొరవ ఇవ్వాలనీ, అతను చేసే పనిలో అతని వ్యక్తిగత భాగస్వామ్యానికి అవకాశం ఇవ్వాలనీ, అలా చేస్తే అతను మరింత హెచ్చు శ్రమ చేయగలడనీ గుర్తింపు వచ్చి ఉంటుంది. అందుకే అర్థబానిస వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఇదే విధంగా మరొక సందర్భం నుంచి ఉదాహరణ ఇవ్వాలంటే సామ్రాజ్యవాదం క్రమక్రమంగా అవలంబిస్తూ వచ్చిన వేరు వేరు రూపాల ఉదాహరణ చూడవచ్చు. మొదట, వ్యాపారం ద్వారా, రాజకీయ ఆధిపత్యం ద్వారా దోపిడీ సాగింది. శ్రమనూ, శ్రామికులనూ దిగుమతి చేసుకోవడం ద్వారా, పారిశ్రామిక పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా దోపిడీ సాగింది. ఆర్థిక సహాయం ఇస్తున్నామనే పేరిట దోపిడీ సాగింది. బహుళ జాతి సంస్థల గొలుసు లావాదేవీలను నడపడం ద్వారా, వ్యాపార ఒప్పందాలు చేసుకోవడం ద్వారా దోపిడీ సాగింది. ఈ వేరు వేరు పని పద్ధతులలో మార్పులు సూచించేదేమంటే ఆనాటికి అటు సామ్రాజ్యవాద దేశంలోనూ, ఇటు వలస దేశంలోనూ ఆర్థిక వ్యవస్థలలో ఉత్పత్తి శక్తులస్థాయిని బట్టి ఆ రెండు దేశాల మధ్య సంబంధం నిర్ణయమవుతుంది. అంటే, ఉత్పత్తి శక్తులలో వచ్చే మార్పులు ఉత్పత్తి సంబంధాలలోనూ, ఆస్తి సంబంధాలలోనూ, దోపిడీ రూపాల లోనూ మార్పులకు దారితీస్తాయి. అయితే వాస్తవ చరిత్రలో చాలా తరచుగా పాత సంబంధాలు, వాటి అవశేషాలు కొనసాగుతూ ఉంటాయి. అవి, పురోగమిస్తున్న ఉత్పత్తి శక్తుల మీద సంకెళ్లుగా మారుతాయి.

తొలిరోజుల్లో అభివృద్ధికి వీలు కల్పించిన పరిస్థితులే, ఇప్పుడు అవరోధాలుగా మారుతాయి. అటువంటి సందర్భాలలో కాలం చెల్లిన సంబంధాలు తోసివేయడం జరుగుతుందనీ, ఈ తోసివేత కొన్ని సందర్భాలలో హింసాత్మక కల్లోలంగా ఉండవచ్చుననీ, లేదా, క్రమానుగత చారిత్రక మార్పుగా ఉండవచ్చుననీ చరిత్ర తెలియజేస్తుంది. అంటే, చారిత్రక క్రమం అనేది నిరంతరాయంగా, మెల్లమెల్లగా జరిగిన మార్పులతో సాగినదీ, గుర్తించడానికి వీలు లేని పరిమాణాత్మక పరివర్తనలతో జరిగినదీ మాత్రమే కాదు. ఒక ఆర్థిక వ్యవస్థ చరిత్రలో యుగాలుగా గుర్తించబడేవి ఆ కాలంలో ప్రాబల్యం వహించిన నిర్దిష్ట ఉత్పత్తి విధానం ద్వారా మాత్రమే గుర్తించబడతాయి. అంటే, దానికే ప్రత్యేకమైన, నిర్దిష్ట స్వభావం గల ఉత్పత్తి సంబంధాలు కూడా ఉంటాయి. ఈ మాట అనేటప్పుడు ఒక ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రత్యేక ఉత్పత్తి విధానం ఏకైకంగా, సార్వత్రికంగా ఉంటుందని నేను సూచించడం లేదు. ఏ సమయంలోనైనా ఒకే ఆర్థిక వ్యవస్థలో వేరు వేరు ఉత్పత్తి విధానాలు ఒకదానిలో ఒకటి కలిసిపోయి సహజీవనం సాగిస్తూ ఉండవచ్చు. అయితే ఒక నిర్దిష్ట విధానం మిగిలిన వాటికన్న తన ప్రాబల్యాన్ని స్థాపించుకోవడం ద్వారా దాని చలనశీలమైన గతి ద్వారా ప్రధానంగా ఉండవచ్చు. అప్పుడు అది తగిన సాధారణ స్థితి అవుతుంది. అప్పుడు మొత్తం ఆర్థిక వ్యవస్థను దాని ద్వారా గుర్తించడమో లేదా ఆ వైపుగా ప్రయాణిస్తున్నదని అనడమో జరుగుతుంది.

ఉత్పత్తి సంబంధాలు – వర్గ విభజనలు

మరికొంచెం ముందుకు వెళితే చారిత్రకంగా అభివృద్ధి చెందిన ఉత్పత్తి సంబంధాలు ఆర్థిక వ్యవస్థను వర్గాలుగా విభజించడంలో వ్యక్తీకరణ పొందుతాయి. ఆ వర్గాలకు తమ సొంత నిర్దిష్ట ప్రయోజనాలుంటాయి. చాలా సందర్భాలలో ఆ ప్రయోజనాలు ఒకదానికొకటి వ్యతిరేకంగా, శత్రు పూరితంగా కూడా ఉంటాయి. ఉత్పత్తి శక్తుల పురోభివృద్ధి వేరు వేరు వర్గాల ప్రయోజనాల మీద వేరు వేరు ప్రభావాలు వేయడం వల్ల వర్గాల మధ్య ఘర్షణలు అనివార్యంగా పెరుగుతుంటాయి. వర్గ చైతన్యం, ఒక వర్గంలోని మనుషులకు తాము ఏ వర్గంలో ఏ ప్రయోజనాల కొరకు ఉన్నాము అనే గుర్తింపు ఈ వర్గ ఘర్షణల ధోరణులకు పదును పెడతాయి. అందువల్లనే చరిత్ర అనివార్యంగా వర్గపోరాటాల చరిత్రగా ఉంటుంది. సాంప్రదాయిక రాజకీయార్థ శాస్త్రంలో తొలి రచనలు కూడా ఈ వర్గ వైరుధ్యాలను గుర్తించాయి. వాటిని బహిరంగంగానే విశ్లేషించాయి. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నప్పుడు వేరు వేరు దశలలో విభిన్న వర్గాలు రూపొందే క్రమం గురించీ, వర్గ పోరాటపు స్వరూపమూ, స్వభావమూ మారడం గురించీ ఆ రచయితలు స్పష్టంగానే ప్రకటించారు, చర్చించారు. ఆ రచయితలలో విడివిడి రచయితలను చూసినప్పుడు, వారు ఒకరితో ఒకరు జరుపుకున్న చర్చలలో తాము ఏ వర్గానికి చెందారో ఆ వర్గపు అభిప్రాయాలను బహిరంగంగానే ప్రకటించారు.

ఆడమ్ స్మిత్ మూడు విస్పష్టమైన వర్గాలున్నాయని గుర్తించాడు. భూస్వామ్య వర్గం, కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గం అనే ఈ మూడు వర్గాలు భిన్నమైన ప్రయోజనాలు కలిగి ఉన్నాయనీ, ఆ ప్రయోజనాలు ఒకదానికొకటి వ్యతిరేకమైనవనీ కూడా గుర్తించాడు. అలాగే తన కాలంలో జరిగిన వివాదాల నుంచి నిర్ధారణలు తీస్తూ డేవిడ్ రికార్డో భూస్వామ్య వర్గం ప్రాబల్య వర్గమనీ, జాతీయ ఉత్పత్తిని పంచుకోవడం ఎలా అనే విషయంలో సంపద పెరిగిన కొద్దీ వర్గ ప్రయోజనాల మధ్య అనివార్యమైన ఘర్షణ వస్తుందనీ గుర్తించాడు. పెట్టుబడికీ శ్రమకూ మధ్య ఉన్న వైరుధ్యం ప్రధానమైనదనీ, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం పెరిగిన కొద్దీ ఇది పెరుగుతుందనీ, పెట్టుబడిదారీ ఉత్పత్తి సాధారణీకరించబడుతుందనీ రికార్డో అన్నాడు. కాని, 19వ శతాబ్దపు రెండో అర్థభాగంలో తొలి దశలో ఆర్థిక శాస్త్ర సిద్ధాంతంలో వచ్చిన పరిణామాలు ఒక కొత్త దారి తీసుకున్నాయి. అప్పుడు రూపొందిన సైద్ధాంతిక చట్రాలలో నుంచి క్రమక్రమంగా వర్గ సంఘర్షణ అనే భావనను తొలగించడం, విస్మరించడం ప్రారంభించారు.

మానవ ప్రవృత్తి – సమాజం – ముందస్తు భావాల నిరాకరణ

మనిషికీ, ప్రకృతికీ మధ్య నిరంతరాయమైన పరస్పర చర్య ప్రతిచర్య

సంబంధం ఉందనీ, ఉత్పత్తి సంబంధాలతో పాటుగా ఈ సంబంధం నిరంతరాయంగా మారుతుందనీ భావించే దృక్పథం మానవ స్వభావం గురించీ, సమాజం గురించీ అవి శాశ్వతమైనవనో, పరమమైనవనో, సహజాతమైనవనో ఉండే భావాలను బలంగా సవాల్ చేస్తుంది. వేరు వేరు సందర్భాలలో చాలామంది ఊహాజనిత సంస్కరణవాదులు, మనిషికి సహజాతమైన ప్రవృత్తి ఒకటి ఉందనీ, దానికి సరిపోయేదిగానో, మానవ ఆకాంక్షలను గ్రహించేదిగానో ఒక న్యాయబద్ధమైన సామాజిక ధర్మం ఉండాలనీ భావించారు. ఆ ధర్మం మనుషుల మధ్య పరస్పర అవగాహన ద్వారా రూపొందించవచ్చునని అనుకున్నారు. 18వ శతాబ్దపు ఫ్రెంచ్ భౌతికవాదులూ, ఊహాజనిత సోషలిస్టులూ ఈ భావనతోనే ఆదర్శ సమాజాల గురించి ఊహించి, తమ సొంత, ఉదాత్త, రాజకీయ, చట్టపర సంస్కరణల నమూనాలను రూపొందించారు. రూసో తయారు చేసిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం అటువంటిదే. సమాజంలోని మనుషులందరి సాధారణ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని, మనుషులందరూ తమ స్వతంత్ర, స్వేచ్ఛాయుత, సంకల్పం ద్వారా ఒక ఏకాభిప్రాయానికి వచ్చి ఒక సామాజిక ఒడంబడికకు సిద్ధపడతారని ఆయన అనుకున్నాడు ఆనాటి బూర్జువా సమాజపు కలకు సైద్ధాంతిక రూపం ఇచ్చాడు. అదే విధంగా ప్లేటో, సెయింట్ సైమన్, కోమ్టే, పారెటో, రాబర్ట్ ఓవెన్, బెంథామ్ వంటి మేధావులు తయారు చేసిన ఆదర్శవాద నిర్మాణాలన్నీ ఇటువంటి విశ్వాసంతో ప్రేరణ పొందినవే. వారు చేసిన కసరత్తులన్నీ మానవ స్వభావం గురించి వారికి ఉండిన ముందస్తు విశ్వాసాల మీద ఆధారపడి నిర్మించిన నమూనాలే. ఆ నమూనాల ద్వారా వారు సమాజాన్ని మళ్లీ కొత్తగా పునర్నిర్మించ దలిచారు. వారి దృష్టిలో అంతవరకు గడచిన చరిత్రకు అర్థం లేదు. లేదా, తమ నిర్మాణంతో పాత చరిత్ర అంతా రద్దయిపోతుంది. అంత దూరం పోనక్కర్లేకుండా మన ఉదాహరణే చూస్తే, రామరాజ్యాన్ని స్థాపిస్తామనే ఒక ఆదర్శ ఊహావాద భావననే చూద్దాం. ఈ భావన సమాజాన్ని అమూర్తంగా చూస్తుంది. చరిత్ర నుంచి వేరు చేసి చూస్తుంది. వర్తమానం నుంచి వేరు చేసి చూస్తుంది. నిజమైన మానవ స్వభావానికి పెడధోరణులుగానో, ఆదర్శ ప్రవర్తన లేకపోవడం వల్లనో వర్గ ఘర్షణలనేవి రూపొందలేదనే వాస్తవాన్ని విస్మరిస్తుంది. వర్గ పునాది మీద సాగే సామాజిక ఉత్పత్తి క్రమంలో వర్గ ఘర్షణలు అనివార్యంగా తలెత్తుతాయనే వాస్తవాన్ని విస్మరిస్తుంది.

మరొక సాధారణ స్థాయి ఉదాహరణ ఇవ్వాలంటే, సొంత ఆస్తి అనేది 'సహజ'మైనదనే భావన ఉంది. అన్ని నాగరిక సమాజాల మనుగడకూ అత్యవసరమైన శాశ్వత విలువగా సొంత ఆస్తిని గుర్తించాలనే, కాపాడాలనే భావన ఉంది. అలాగే సొంత ప్రయోజనం, స్వార్థం అనే ఉపయోగ ఆకాంక్ష మానవ జీవులలోని సహజాతమైన, బలీయమైన ప్రవృత్తి అనే భావన ఉంది. ఈ భావనలు అన్నీ కూడా ముందస్తుగా ఏర్పరచుకున్న భావనలే. నాగరిక సమాజాలంటే ఏమిటి? మానవ స్వభావం అంటే ఏమిటి? అనే ప్రశ్నలు వేసుకోకుండా ఏర్పరచుకున్న భావనలే.

ఇప్పటిదాకా మాట్లాడిన దాన్ని సంక్షిప్తీకరించాలంటే

జ్ఞాన సిద్ధాంతం అనేది చరిత్ర పొడవునా మనిషి సాగిస్తూ వచ్చిన ఆచరణాత్మక శ్రమల నుంచి వేరు చేయగలిగినది కాదు. అలాగే సామాజిక సంబంధాల చరిత్రను అర్థం చేసుకొనే సాధనం ఆ శ్రమ మాత్రమే. మనిషి అనుభవానికి ప్రాథమిక వనరు అయిన ఉత్పాదక శ్రమ ఒక పరిధిలోపల మాత్రమే జరుగుతుంది. ఆ పరిధిని భౌతిక ఉత్పత్తి శక్తులు నిర్ణయిస్తాయి. ఆ పరిధి సామాజిక సంబంధాలు విధించే పరిమితుల లోపలే ఉంటుంది. అయితే ప్రకృతికీ మనిషికీ మధ్య సంబంధం ఉత్పత్తి శక్తుల ద్వారా చిత్రణ పొందుతూ కూడా అతని చైతన్యయుతమైన జోక్యం ద్వారా మారుతూ ఉంటుంది. అలాగే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్ల, వర్గపోరాట స్థితి వల్ల ఉత్పత్తి సంబంధాలు మారుతూ ఉంటాయి. మనిషి ఆచరణలో ప్రతి మార్పూ కొత్త భౌతిక వాస్తవాలను, పరిశీలనలను వెలికితీస్తుంది. ఉత్పత్తి సంబంధాలలో ప్రతి గుణాత్మక మార్పూ కొత్త భావనలకు, కొత్త ఆలోచనలకు దారితీస్తుంది. అంటే, సిద్ధాంతాలన్నీ ఒక సాపేక్షికమైన పద్ధతిలోనే అభివృద్ధి చెందుతూ ఉంటాయి. ఏకైక సిద్ధాంతం, సార్వత్రికంగా వర్తించే సిద్ధాంతం, సర్వకాలాలకూ వర్తించే సిద్ధాంతం అనేదేదీ లేదు. మనిషికి ఉండే సామాజిక అనుభవాన్ని, అతని ప్రవర్తనను ఎల్లకాలానికీ వివరించగల సిద్ధాంతం లేదు. అంటే చరిత్ర అనేది మార్క్స్ అన్నట్టు ఒక మహా యుద్ధ రంగం. అందులో సమాజమూ, ప్రకృతీ కూడా స్థల, కాలబద్ధమై ఉంటాయి.

మార్పును నిర్దేశించే శక్తులు – 'బహుళ కారణాల' వివరణ

మార్పు అనేదే ఒక పరిస్థితి సారాంశం అయినట్టయితే, మార్పులనేవి పూర్తిగా యాదృచ్ఛికం కానట్టయితే, సమాజ చలనాలను ప్రేరేపించే శక్తులు ఏమిటీ? ఇప్పటిదాకా సాగిన చర్చలో మనం ఆచరణ ద్వారా జ్ఞానసముపార్జన గురించి, ఆ జ్ఞానాన్ని సిద్ధాంతాలుగా సాధారణీకరించడం గురించి మాట్లాడుకున్నపుడు అటువంటి శక్తుల గురించి పరోక్షంగా ప్రస్తావించుకున్నాం. మన చర్చకు పునాదిగా ఉన్న సామాజిక చరిత్ర గురించిన గతి తార్కిక భౌతికవాద దృక్పథం ప్రకారం సమాజం గురించి ఏ ఒక్క క్షణపు వర్ణన – అంటే, దాని 'స్థిరత్వం' గురించి వర్ణన – అయినా అదే సమయంలో అది మారడానికి అవకాశం ఇచ్చే పునాదిని కూడా వివరిస్తుంది. ఎందుకంటే, వర్తమానం అనేది గత చరిత్ర నుంచి మాత్రమే పుట్టుకువస్తుంది. అలాగే ఆ వర్తమానం అనేదే భవిష్యత్తు పరిణామాల బీజాలను కలిగి ఉంటుంది. ఇక్కడ ఈ అభిప్రాయాన్ని మనం మరింత వివరంగా పరిశీలిద్దాం.

ప్రపంచాన్ని భావాలే పరిపాలిస్తాయని భావవాదులు నమ్ముతారు. ఒక ప్రత్యేక యుగంలో భౌతిక, సామాజిక పరిస్థితులను ప్రభావితం చేసే ఒక్కొక్క భావం ఉంటుందని వాళ్లు అనుకుంటారు. చాలామంది అంగీకరించే దృక్పథం ఏమంటే మార్పుకు ఏదో ఒక్క కారణభూతమైన శక్తి ఉండకపోవచ్చు. భౌగోళికమైన, జాతిపరమైన, భావజాలపరమైన, మతపరమైన, నైతికమైన కారణాలతో సహా ఒక నెపోలియన్, ఒక హిట్లర్, ఒక గాంధీ, ఒక నెహ్రూ వంటి చారిత్రక వ్యక్తుల ఆవిర్భావం వంటివి యాదృచ్ఛికమని అనిపించే ఘటనలు కూడా కలిసి బహుకారణాలు మార్పుకు దారితీస్తాయని వాళ్లంటారు. నిజమే, భౌగోళికమైన, పర్యావరణపరమైన కారణాలు ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిని ప్రభావితం చేసాయి. అయితే, ఈ కారణాలు ఎంత వరకు, ఏ పద్ధతిలో మానవ కార్యాచరణను నిబద్ధం చేసాయనే అంశం, ఆ కాలపు ఉత్పత్తి శక్తుల అభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది. తొలిసమాజాలలో ప్రకృతి మీద మనిషి అదుపు చాలా పరిమితంగా ఉన్నప్పుడు స్థిరవ్యవసాయమే మనుషుల మనుగడకు వనరయినప్పుడు నదీ తీరాలలోనూ, సారవంతమైన మైదానాలలోనూ ఉన్న జన సమూహాలు మాత్రమే అభివృద్ధి చెందాయి. అవే ఆనాటి నాగరికతా కేంద్రాలయ్యాయి. అయితే ఒకసారి సహజ జలమార్గాల మీద మాత్రమే ఆధారపడి సాగే రవాణా పద్ధతులను అధిగమించిన తరువాత ఈ సహజ అవకాశాల పాత్ర తగ్గిపోయింది. అలాగే కొన్ని మానవ

సమూహాలు మాత్రమే నావికా కార్యకలాపాలలో సాపేక్షికంగా అభివృద్ధి చెందాయనేది స్పష్టంగానే వాళ్లు సముద్ర జలాలమీద ప్రయాణించగల నౌకలనూ, సాధనాలనూ తయారు చేయడంలో ఎంత సాంకేతికాభివృద్ధి సాధించారనే దానితో సంబంధంలో ఉంది. కొన్ని దేశాలు సహజమైన వనరుల లభ్యత వల్ల సాపేక్షిక ఆర్థికాభివృద్ధిని సాధించగలిగాయని చెప్పే 'వనరుల లభ్యత' సిద్ధాంతాలు కూడా ప్రపంచ వాణిజ్య విస్తరణ తరువాత తమ ప్రాబల్యం కోల్పోయాయి. మానవ కార్యాచరణను పర్యావరణ శక్తులు పెద్ద ఎత్తున పరిమితం చేస్తాయని, అవకాశాలు కల్పిస్తాయని అనడంలో సందేహం లేదు. కాని, మనిషికీ ప్రకృతికీ ఉన్న ఈ సంబంధంలో మనిషి ఎల్లప్పుడూ క్రియాశీల వ్యక్తిగా ఉండి ఎప్పటికప్పుడు తన ప్రయోజనం కొరకు ప్రకృతిని మార్చడానికి ప్రయత్నించాడు. గణనీయంగా విజయం సాధించాడు. ఇలా మారిన సంబంధం మళ్లీ మనిషి జీవన పద్ధతి మీద ప్రభావం వేసింది.

ఇక ఒక వివరణగా జాతి కారణాలని చూపెట్టడానికి ఎటువంటి పునాది లేదు. ఉదాహరణకు ఒకప్పుడు మానవ నాగరికతకు అగ్రగామిగా ఉండిన తూర్పు దేశాల ప్రజలు కాలక్రమంలో ఎందుకు వెనుకబడిపోయారో, అదే జాతికి చెందిన ప్రజలు పూర్తిగా భిన్నమైన ఆర్థిక పరిస్థితులలో ఎందుకు ఉన్నారో ఈ జాతి సిద్ధాంతం వివరించ జాలదు. ఏదేమైనా ప్రస్తుత కాలంలో ఈ జాతి సిద్ధాంతం వివరణను తీవ్రంగా పరిగణనలోకి తీసుకునే వారెవరూ లేరు. గతంలో దానికి గుర్తించదగిన ప్రాబల్యం ఉండేది. దాన్ని చాలామంది నమ్మేవారు. ఇవాల్టికి కూడా అది లోలోపల ఉన్న దురభిప్రాయంగా, జాత్యాహం కారంగా కొనసాగుతూ ఉండవచ్చు. కొన్నిసార్లు బహిరంగంగానూ, కొన్నిసార్లు పరోక్షంగానూ బయటపడుతూ ఉండవచ్చు.

అభివృద్ధి స్థాయిలలో భిన్నత్వాలను కొన్నిసార్లు సముచిత రాజకీయ వ్యవస్థల ఏర్పాటుతో అనుబంధించి చూడడం జరుగుతుంది. రాజకీయ వ్యవస్థల గురించి ఇలా మాట్లాడేవాళ్లు, విభిన్న రూపాల ప్రభుత్వాల సాపేక్షిక గుణాలను తులనాత్మకంగా విశ్లేషిస్తుంటారు. ఉదాహరణకు ప్రజాస్వామ్యానికీ, నిరంకుశత్వానికీ మధ్య స్వేచ్ఛా వాణిజ్యానికీ, ప్రభుత్వ నియంత్రణకూ మధ్య ఉన్న తేడాలను బట్టి మాట్లాడుతుంటారు. ప్లేటో, అరిస్టాటిల్ వంటి రాజకీయ తత్వవేత్తలను ఆకర్షించిన అతి ప్రాచీన ఇతివృత్తం ఇది. అలాగే సామాజిక శాస్త్రవేత్తలు మత, నైతిక వైఖరుల మీద కూడా శ్రద్ధ కేంద్రీకరిస్తారు. ఇంకా చెప్పాలంటే మాక్స్ వెబర్ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి కారణంగా క్రైస్తవంలోని ప్రొటెస్టెంట్ ధోరణిని చూపాడు. అలాగే ఆసియా ప్రజానీకపు వెనుకబాటుతనానికి కారణం వారికి ఇహం కన్న పరం మీద ఉన్న శ్రద్ధాసక్తులు, లాభసాటి ఆర్జన మీద ఉన్న అశ్రద్ధ అని వివరించేవారు ఉన్నారు. ఆర్థికాభివృద్ధి మీద ఏ ప్రామాణిక పాఠ్యగ్రంథమైన తీసుకోండి. ఈ కారణాలు తోడుగా మరికొన్ని కారణాలు జోడిస్తారు. విద్య, ద్రవ్య పరపతి సంస్థలు, అన్ని రకాల సామాజిక వ్యయాలు వంటి సంస్థాగత కారణాలను, జనాభా కారణాలను వారు కలుపుతారు.

పునాది – ఉపరితలం

ఇటువంటి వివరణలన్నీ ఒక మౌలికమైన ప్రశ్నను లేవనెత్తుతాయి. ఈ మత భావనలూ, రాజకీయ సంస్థలూ వగైరా కారణాలు సామాజిక కార్యాచరణలోని ఉత్పత్తి సంబంధాల నుంచి, భౌతిక పరిస్థితుల నుంచి ఎంతవరకు విడిగా, స్వతంత్రంగా పనిచేస్తాయి? ఇప్పటికి ఎన్నోసార్లు ఎంతోమంది ఉటంకించిన మార్క్స్ మాటల్లోనే ఆయన అభిప్రాయం చూద్దాం: 'నా పరిశోధనల వల్ల నేను చేరుకొన్న నిర్ధారణ ఏమంటే చట్టపరమైన సంబంధాలను గానీ, రాజకీయ రూపాలను గానీ వాటంతట వాటినే అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. లేదా మానవ మేధ సాధించిన సాధారణ అభివృద్ధి అనబడే దాని పునాది మీద కూడా వాటిని అర్థం చేసుకోలేము. అందుకు భిన్నంగా అవి జీవితపు భౌతిక పరిస్థితులలోనే ఆవిర్భవిస్తాయి. ఆ భౌతిక జీవన పరిస్థితులనే హెగెల్ 18వ శతాబ్దపు ఇంగ్లిష్ ఫ్రెంచ్ తత్వవేత్తల పద్ధతిలో 'పౌరసమాజం' అని పిలిచాడు. అంటే ఈ పౌరసమాజపు అంతస్సారాన్ని గుర్తించడానికి రాజకీయార్థ శాస్త్రంలోకి చూడవలసిందే. తమ మనుగడ కోసం సాగించే సామాజిక ఉత్పత్తిలో మనుషులు అనివార్యంగానే నిర్దిష్ట సంబంధాలలో ప్రవేశిస్తారు. ఆ సంబంధాలు వారి సంకల్పానికి అతీతంగా ఉంటాయి. అవి ఆ నిర్దిష్ట దశలోని భౌతిక ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తగిన ఉత్పత్తి సంబంధాలుగా ఉంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల సమాహారమే సమాజపు ఆర్థిక పునాదిగా ఉంటుంది. ఇదే నిజమైన పునాది. చట్టపరమైన రాజకీయ ఉపరినిర్మాణం అంతా దీనిపైననే లేచి నిలుస్తుంది. నిర్దిష్టమైన సామాజిక చైతన్య రూపాలు ఈ ఉపరినిర్మాణం తో సమన్వయంలో ఉంటాయి. అంటే, భౌతిక జీవన పరిస్థితుల ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, మేధో జీవితపు సాధారణ క్రమాన్ని నిర్దేశిస్తుంది. అంటే, మనుషుల మనుగడను నిర్ణయించేది వారి చైతన్యం కాదు. వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.' బానిసల దోపిడీ మీద ఆధారపడిన అరిస్టాటిల్ నాటి సమాజం ఆనాటి సామాజిక అసమానత గురించి ఎటువంటి నైతిక సందేహానికి లోను కాలేదు. నిజానికి ఆనాటి సమాజంలో సామాజిక గౌరవంగానీ, హోదాగానీ ఒక వ్యక్తి ఎంత మంది బానిసలను కలిగి ఉన్నాడనీ, ఆ బానిసల భుజబలం ఎంత? అనే పునాది మీదనే ఉండేవి. సరిగ్గా అంతకు ముందరి పశుపోషక సమాజాలలో ఒక మనిషి హోదా ఎన్ని పశువులను కలిగి ఉన్నాడనే దాని మీద ఆధారపడి ఉన్నట్టుగానే. మన సమాజమే చూస్తే ఇవాళ కొనసాగుతున్న ఉత్పత్తి సంబంధాలలో కుల అసమానత ఆధిపత్య అగ్రవర్ణాల దోపిడీకి పునాది కల్పిస్తున్నంతవరకూ ఆ కుల అసమానతలను కేవలం రాజకీయ సంస్కరణ ద్వారా నిర్మూలించమనే విషయం స్పష్టమే. భూస్వామ్య యుగంలో దాతృత్వం, వీరత్వం, సాహసం, పోషణ, హోదా, విశ్వాసం వగైరా లక్షణాలను ఉత్తమ లక్షణాలుగా చూపి వాటికి సామాజిక ఆమోదాన్ని, గౌరవాన్ని కల్పించడం జరిగింది. ఇది దేనికి ప్రతిఫలమంటే ఆనాటి భూస్వామ్య సామాజిక సంబంధాలలో వ్యక్తిగత భూస్వామి – అతని దగ్గర కౌలు చేసే రైతు మధ్య సంబంధంలో ఒకే నాణానికి బొమ్మా బొరుసూ లాగ దోపిడీ, పోషణ ఉండేవి. మరొకపక్క భూస్వామ్య సమాజం నుంచి పెట్టుబడిదారీ సమాజానికి మారుతున్నప్పుడు వ్యక్తి స్వేచ్ఛ ఆకాంక్ష, సొంత ప్రయోజనం కొరకు నిరాటంకమైన ప్రయత్నాన్ని ప్రబోధించే ఉపయోగితవాద తాత్విక ధోరణులు, వ్యక్తి చొరవ మీద పూనిక స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం వంటి ఆలోచనలన్ని 18వ శతాబ్దపు ఫ్రాన్స్‌లో, ఇంగ్లండ్‌లో ప్రాధాన్యత వహించాయి. ఇవన్నీ అప్పుడు ఆరోహణ దశలో ఉన్న బూర్జువా వర్గపు ఆకాంక్షల ప్రతిధ్వనులే. పెట్టుబడిదారీ సొంత ఆస్తి విధానంలో ఉత్పత్తి మరింతగా

సామాజికమైన పునాదిమీద సాధారణంగా వ్యాపించిన మారకపు ఆర్థికవ్యవస్థలో మాత్రమే ఈ ఆలోచనలు ప్రాబల్యం పొందగలిగాయి. అక్కడ మాత్రమే వ్యక్తులు స్వతంత్ర వ్యక్తులుగా, స్వేచ్ఛాయుతమైన నిర్ణయాలు తీసుకోగలిగిన వారుగా కనబడ్డారు. ఇటువంటి ఉదాహరణలు ఎన్నైనా ఇవ్వవచ్చు. మొత్తం మీద చెప్పగలిగిందేమంటే ఒక సమాజం తనంతట తానే చైతన్యంలో అభివృద్ధి చేసుకున్నట్టు కనబడే తాత్విక, నైతిక భావనలన్నీ మొత్తానికి మొత్తంగా ఆధిపత్య వర్గాల ప్రవర్తనను, లక్షణాలను సమర్థించడానికి, యథాతథ స్థితిని కొనసాగించడానికి తయారయ్యేవే.

అలాగే మతాల చరిత్రను పరిశీలిస్తే మనం గ్రహించగలిగేది ఏమంటే మనిషి దేవుణ్ని తన ప్రతిబింబంగా ఊహించాడు. తన ఆశలను, ఆకాంక్షలను, భయాలను, సందేహాలను ప్రతిఫలిస్తూ తాను ఎటువంటి భౌతిక, సామాజిక పరిస్థితులలో ఆ భావనలను పొందుతున్నాడో అవే దేవుడికి ఆపాదించాడు. అందుకే తవ్వకాలలో దొరికిన అవశేషాల ఆధారంగా మతాచారాలను, సంప్రదాయాలను బట్టి చరిత్ర పూర్వ సమాజాల స్వభావాన్ని గురించి అంచనా కట్టడానికి చాలామంది సామాజిక శాస్త్రవేత్తలు ప్రయత్నించారు. చాలా సందర్భాలలో అట్టడుగు వర్గాల సామాజిక నిరసనలు మత విశ్వాసాల సవాళ్ల రూపంలో వ్యక్తమయ్యాయి. పాశ్చాత్య ప్రపంచంలో ప్రొటెస్టెంటిజం, కాల్వినిజం వంటి ధోరణులు, మన సమాజంలో బౌద్ధం, జైనం, భక్తి ఉద్యమాలు అభివృద్ధి చెందడంలో ఇది స్పష్టంగా కనబడుతుంది. నైతిక నియమాలలో మార్పులకూ, ఉత్పత్తి సంబంధాలకూ భావజాలానికి మధ్య సంబంధానికీ మరొక ఆసక్తికరమైన ఉదాహరణగా హింస భావనను కూడా చూడవచ్చు. భౌతిక సంపదలో అత్యున్నత స్థాయి సాధించిన రోమన్ సమాజం మల్లయుద్ధాన్ని హింసను ఒక బహిరంగ క్రీడగా ఆనందించింది. కాకపోతే ఆ మల్లయుద్ధం చేసి రోమన్‌లకు ఆనందం కలిగించేవారు బానిసలైనంత కాలం మాత్రమే. అలాగే మానవజాతి మధ్య ప్రేమ గురించి, శాంతి గురించి గొప్ప తాత్విక ఆదర్శాలను ప్రకటించిన చర్చ్ విడిగా వ్యక్తుల మీద హింసకు ఆదేశించింది. భిన్నాభిప్రాయాలు ప్రకటించిన వారి మీద మరణశిక్షతో అంతమయ్యే విచారణలు జరిపింది. పవిత్ర యుద్ధాల పేరుతో మతయుద్ధాలు సాగించింది. మన కాలంలోనే చూస్తే అట్టడుగు ప్రజల మీద, అనాదృత వర్గాల మీద మెల్లగా, పద్ధతి ప్రకారం సాగే దోపిడీని కొన్నిసార్లు బహిరంగ హింసను కూడా సహించడం జరుగుతోంది. కాని ఆస్తికి వ్యతిరేకంగా, ఆస్తి యజమానులకు వ్యతిరేకంగా ఎటువంటి హింస జరిగినా చట్టబద్ధంగా, కఠినంగా శిక్షలు విధించడం జరుగుతోంది. అసలు చట్టమనేదే పాలక వర్గాల చేతిలో సాధనంగా ఉంటుంది. అంటే చాలా సందర్భాలలో సమాజాన్ని శాసించే మతం గానీ, నైతిక సూత్రాలు గానీ అంతిమంగా పాలకవర్గాల మతంగా పాలకవర్గాల నైతిక సూత్రాలుగా ఉంటాయి.

జీవితపు భౌతిక, సామాజిక పరిస్థితికి, చైతన్యానికి మధ్య ఉండే ఈ సమన్వయం ప్రాచీన సమాజాలలో బహుశా అత్యంత సన్నిహితంగా కనబడుతుంది. ఆ సమాజాలలో దృశ్య కళారూపాలు గానీ, సాంప్రదాయిక చిత్రలేఖనంగానీ, లయబద్ధమైన నాట్యాలు, సంగీతం గానీ, అనుకరణ కళలు గానీ, నాటకాలు గానీ ఒక్క మాటలో చెప్పాలంటే సాంస్కృతిక కార్యకలాపాలు గానీ వాటి ఇతివృత్తాలలోనూ, లయలోనూ వారి నిత్యజీవిత ఆచరణలోని క్రమాలతో, స్వభావంతో కలగలసి ఉంటాయి. వారి దేవతా రూపాలుగానీ, వారి ఆధ్యాత్మిక జీవిత క్రమం చిత్రించబడిన పద్ధతి గానీ అలాగే ఉంటాయి. వారి భాషలో మిగిలిపోయిన పదజాలం కూడా వారికి సన్నిహితంగా తెలిసిన వస్తువులనూ, ఇంద్రియానుభూతులను ప్రతిఫలించేదిగానే ఉంటుంది.

రాజకీయ సంస్థలు కూడా ముఖ్యంగా రాజ్యాంగ యంత్రం, ఆస్తి చట్టాలు చారిత్రకంగా పరిణామం పొందిన తీరు చూస్తే అవి సాధారణంగా ఉత్పత్తి సంబంధాలను బట్టే అభివృద్ధి చెందాయి. ఈ రంగాలలో అభివృద్ధిని విశ్లేషించడం, ఆ అభివృద్ధికి జీవన భౌతిక పరిస్థితుల మార్పుకు, సామాజిక అధికార నిర్మాణానికి మధ్య ఉన్న సంబంధాన్ని కనిపెట్టడం 18వ శతాబ్దపు భౌతికవాద చరిత్రకారులకు ఇష్టమైన పనిగా ఉండేది. ఒక ఉదాహరణ చెప్పాలంటే, ఒక వ్యక్తికి సొంతంగా ఆస్తి ఉండే హక్కు అనేది ఇటీవలి కాలపు చారిత్రక పరిణామం మాత్రమే. అంతకుముందు ఆదివాసులలో, వేటాడే సమాజాలలో ఆస్తి అనేది ఉంటే ఉమ్మడిగా మాత్రమే ఉండేది. దాన్ని తొలగించి భూస్వామ్య సమాజంలో ఒక భూస్వామికి ఉండే విశాల క్షేత్రం అనే భావన తలెత్తింది. ఆ తరువాత చేతివృత్తుల పనివాళ్లను వాళ్ల యజమానులను గానీ, వాళ్ల వృత్తులను గానీ నిర్దిష్ట ప్రాంతాలకే పరిమితం చేసే చట్టాలు వచ్చాయి. దాన్ని వ్యాపార యుగం అనవచ్చు. క్రమంగా ఆ చట్టాలను తొలగిస్తూ పారిశ్రామిక పెట్టుబడిదారీ యుగంలో స్వేచ్ఛాయుత శ్రామికుల ఒప్పందాలను సమర్థించే చట్టాలు వచ్చాయి. ఇక్కడ మనం మరొక విషయం కూడా గమనించవలసి ఉంది. రాజ్యాంగయంత్రం అనేది ఒక దేశపు చట్టాలను అమలు చేసే అధికారం పొందిన ఉద్యోగుల వ్యవస్థ మాత్రమే కాదు. అది పాలకవర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ. దాని చట్టాలు, దాని ఆచరణ సాధనాలు, దాని నియంత్రణ పరిధి, ఒక సమాజంలోని ఆధిపత్య వర్గపు ప్రయోజనాలను ప్రతిఫలిస్తుంది. అంతేకాదు, ఇవన్నీ కూడా ఉత్పత్తి సంబంధాలలో వచ్చే మార్పులతో పాటు తప్పనిసరిగా మారుతూ ఉంటాయి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థమీద ఆర్థిక మాంద్యపు నీలినీడలు కమ్ముకోవడం ఇంకా ప్రారంభం కాని 1920లకు ముందు బూర్జువా రాజ్యాంగయంత్రం తన అధికారాలను ప్రధానంగా శాంతి భద్రతల పరిరక్షణకు మాత్రమే పరిమితం చేసుకుంది. ఇతర దేశాలతో పోల్చినప్పుడు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడం దేశం లోపల సొంత ఆస్తిని పరిరక్షించడం మాత్రమే తన పనులు అనుకుంది. కాని, మహాసంక్షోభం తరువాత పాశ్చాత్య పెట్టుబడిదారీ రాజ్యాలన్నీ తమ పెట్టుబడిదారీ ప్రయోజనాలను పరిరక్షించడం కొరకు ఆర్థిక కార్యాచరణలో ఒడిదుడుకులను అదుపు చేసే బలోపేతమైన ద్రవ్య వ్యవస్థ ఉండాలని భావించాయి. పాశ్చాత్య ప్రపంచంలోని పెట్టుబడిదారీ రాజ్యం ఎప్పటికప్పుడు సంక్షేమ చర్యలను చేపట్టడం మొదలుపెట్టింది. ఆస్తిలేని పేదవర్గాలకు సహాయం చేయాలని అనడం మొదలుపెట్టింది. హింసాత్మక ఘర్షణలుగా పరిణమించే తగాదాలను అడ్డుకొనే పని రాజ్యానిదేనని భావించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ ప్రజల నుంచి ప్రతిఘటన తీవ్రంకాగానే అదే రాజ్యం అతి తీవ్రంగా చట్టపరమైన సైనికపరమైన నిర్బంధ చర్యలను చేపట్టడానికి ఎంత మాత్రం సందేహించలేదు.

అలాగే మరొక విషయం కూడా చూస్తే అంతకుముందు వలస ఆర్థికవ్యవస్థలుగా ఉండి స్వాతంత్ర్యం పొందిన దేశాలన్ని స్వాతంత్ర్యం తరువాత ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని చేపట్టాయి. విశ్లేషించి చూస్తే

ఈ రాజ్యాల వర్గ స్వభావం చాలా సంక్లిష్టమైనవి. అవి చేపట్టిన విధానాలు వైవిధ్యపూరితమైనవి. కాని అంతిమంగా వాటి లక్ష్యం ఆయా దేశాలలో పెట్టుబడిదారీ వర్గం వేగవంతంగా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమం చేయడమేననిపిస్తుంది. భిన్న సమ్మేళనంతో కూడిన మధ్యతరగతి వర్గాల పాత్ర పెరిగినకొద్దీ ఈ సమాజాలలో వర్గ ప్రయోజనాల మధ్య సాగే ఘర్షణ అంత స్పష్టంగా కనబడకుండా పోతుంది. మరీ ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాలలో రాజకీయ క్రమాలు చాలా సంక్లిష్టంగా మారిన చోట సార్వత్రిక ఎన్నికలు వగైరాల ద్వారా రాజకీయ క్రమాల వడపోత జరిగే చోట స్వయంగా రాజకీయవేత్తలు ఒక వృత్తిపరమైన బృందంగా తయారై ప్రణాళికావేత్తలతో, సాంకేతిక నిపుణులతో, నిర్వహణా నిపుణులతో, ఉన్నతోద్యోగులతో కలిసి పనిచేసే చోట రాజ్యం స్వభావం ఏమిటని గుర్తించడం అంత సులభం కాదు. రాజ్య విధానాలలో ఉండే వర్గ అనుకూలతను పారదర్శకంగా గుర్తించడం సాధ్యం కాదు. అయినప్పటికీ పోటీ పడుతున్న వర్గాలు రాజకీయ క్రమాలను క్రియాశీలంగా తమ ప్రయోజనాల కొరకు వాడుకుంటా రనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజ్య విధానాలు బహువర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే విచిత్ర సమ్మేళనంగా కనబడినప్పటికీ, వర్గ ప్రయోజనాల ఘర్షణ తీవ్రతరమైన వ్యక్తీకరణ పొందినప్పుడు రాజ్యం ఏ వర్గానికి అనుకూలంగా ఉన్నదో బహిరంగంగానే, బలవత్తరంగానే స్పష్టమవుతుంది. అటువంటి సమయాలలో పాలకవర్గాలు ఎటువంటి రాజీవైఖరులను ప్రదర్శించవు. ప్రజాస్వామిక క్రమాలను పక్కన పెట్టడానికి కూడా వెనుకాడవు.

పునాది – ఉపరితల సంబంధపు చారిత్రక అభివృద్ధి

ఒక్కమాటలో చెప్పాలంటే పౌర సమాజం అనేదాన్ని పునాది గణనీయంగా నిర్దేశిస్తుంది. పునాది అంటే ఉత్పత్తి శక్తుల స్థాయి, అప్పటికి కొనసాగుతున్న ఉత్పత్తి సంబంధాల మొత్తం. అలాగే, పునాదిలోని మార్పులే సాధారణంగా పౌరసమాజంలోని మార్పులకు కారణమవుతాయి. అయితే, ఈ సూత్రాన్ని మొరటుగా అర్థం చేసుకోకూడదు. ఎంతోమంది విమర్శకులు అర్థం చేసుకున్నట్టుగా ఇదేదో యాంత్రిక నియతివాదంగా అర్థంచేసుకోకూడదు.

మొట్టమొదట ఉపరితలంలోని చాలా రూపాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నట్టుగా కనబడుతాయని గుర్తించవలసి ఉంది. చాలా రూపాలు వాటి పుట్టుకకు కారణమైన పాత ఉత్పత్తి సంబంధం అంతమై పోయినప్పటికీ కొనసాగుతూ ఉంటాయి. ఉదాహరణకు, చాలా మతాచారాలు వాటి భౌతిక ఆవశ్యకత రద్దయిపోయినప్పటికీ ఇంకా కర్మకాండల రూపంలో, సంప్రదాయాల రూపంలో కొనసాగుతూ ఉంటాయి. అయితే అవి ఇంకా కొనసాగడానికి అవకాశం ఎక్కడ దొరుకుతుందంటే జీవితంలో ఏ రంగాలలో కొత్త ఉత్పత్తి సంబంధాలు ఇంకా తమ పూర్తి ప్రభావాన్ని చూపలేకపోయాయో అక్కడ మాత్రమే. తమ ఇళ్లలో వ్యక్తిగత ప్రవర్తనలో ఉండే తీరుకు, తమ వృత్తి పరమైన ప్రయోజనాలు సాధించడంలో బయటి సమాజంలో ఉండే తీరుకు అఖాతం కనబడుతుంది. ఉదాహరణకు, అత్యాధునికమైన శాస్త్రవిజ్ఞాన రంగాలలో పరిశోధన చేసే శాస్త్రవేత్త తన కుటుంబ జీవితంలో ఛాందస మూఢాచారాల కర్మకాండలను పాటించడం కనబడుతుంది. మధ్యతరగతి గృహిణులలో ఇంకా కనబడుతూ ఉండే మతాచారాల ప్రవర్తనలు కూడా దీన్నే సూచిస్తాయి. వీటివల్ల తేలేదేమంటే, పాత జీవన విధానం కొనసాగడమనేది హఠాత్తుగా రద్దు కాదు. కొత్త ఉత్పత్తి సంబంధాలు ఇంకా బలపడని జీవన రంగాలలో ఉన్న స్త్రీ పురుషులలో ఈ అవశేషాలు కొనసాగుతాయి. అలాగే పాత సంప్రదాయాలు, మతాచారాలను సాంస్కృతిక జీవనాన్ని పురుద్ధరించాలనే ఆలోచనలో కూడా ఉంటాయి. ఇటువంటి పునరుద్ధరణ వాదానికి సామాజిక కారణాలు పాక్షికంగా 'గతకాలము మేలు వచ్చు కాలము కంటేన్' అనే పాత సమాజ వైభవం గురించిన ఉద్వేగాలలో ఉంటాయి. కాని అంతిమంగా ఈ పునరుద్ధరణ వాదానికి కారణాలను అది చేపట్టే రూపాన్ని ప్రస్తుత సామాజిక అభివృద్ధి దశ నుంచే వివరించవలసి ఉంటుంది. బాహ్య రూపంలో ఇవి పాత వాటిలాగానే కనబడినప్పటికీ ఈ పునరుద్ధరించిన ఆచారాలు కొన్నిసార్లు పూర్తి భిన్నమైన విధిని నిర్వర్తిస్తుంటాయి. అంతేకాదు, కొన్ని అంశాలనే కొత్తగా బలోపేతం చేయడం ఎందుకు జరుగుతుంది? కొన్ని ధోరణులు ఒక ప్రత్యేక చారిత్రక సందర్భంలోనే ఎందుకు తలెత్తుతాయి అనే ప్రశ్నలు కూడా ప్రస్తుతం కొనసాగుతున్న సామాజిక సంబంధాల వెలుగులోనే అర్థం చేసుకోవలసి ఉంటుంది. అమెరికాలో 'హరేరామ' ఉద్యమం ఇటువంటి ఆలోచనకు అవకాశం కల్పిస్తుంది.

రెండవది, భావాలు, నీతి, సత్ప్రవర్తన వగైరా చైతన్యమంతా సామాజిక అస్తిత్వ పద్ధతి వల్లనే ఎక్కువగా నిర్ధారితమవుతుందని అనడం నిజమే అయినప్పటికీ ఈ సంబంధం కూడా చారిత్రకంగా మారుతూనే ఉంది. మనం ఇప్పటికే పరిశీలించినట్టుగా తొలి సమాజాలలో పునాది మీద ఉపరితలం ఆధారపడడం తక్షణమే ప్రత్యక్షంగా కనబడే విధంగా ఉండేది. కాని, సామాజిక కార్యాచరణ పురోగమిస్తున్న కొద్దీ ఈ సంబంధం చాలా సంక్లిష్టంగా మారిపోవడం మాత్రమే కాదు, ఉపరితలం పునాదిలో శక్తిమంతంగా జోక్యం చేసుకోవడం కూడా మొదలైంది. ఉదాహరణకు రాజ్యాంగ యంత్రపు పనులను తీసుకోవచ్చు. రాజ్యాంగ యంత్రపు విధులు విస్తరించడంతో అది కేవలం పాలకవర్గాల ప్రయోజనాలను పరిరక్షించడం మాత్రమే కాదు ఉత్పత్తి పరిస్థితులలో, ఉత్పత్తి సంబంధాలలో మార్పులు ప్రవేశపెట్టడానికి ఉద్దేశించిన విధానాలను భౌతిక, చట్టపరమైన ప్రేరణలద్వారా పునాదిలో జోక్యం చేసుకోవడానికి కూడా ప్రయత్నిస్తుంది. అంతేగాక రాజ్యాంగయంత్రం, చట్ట వ్యవస్థలు ఒక నిర్దిష్ట వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నప్పటికీ సమాజపు 'సాధారణ శ్రేయస్సు' అనే రూపం తీసుకుంటున్నట్టు కనబడతాయి. నిజానికి చట్ట ప్రకారం 'బూర్జువా వర్గం ఒక వర్గంగా పాలిస్తున్నందు వల్లనే అందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు ఒక సాధారణ వ్యక్తీకరణ ఇవ్వవలసి ఉంటుంది' అని మార్క్స్ అన్నాడు. న్యాయశాస్త్రంలో చూస్తే ప్రస్తుతం కొనసాగుతున్న ఆస్తి సంబంధాలను సమాజం మొత్తం కలిసి తీసుకున్న నిర్ణయపు ఫలితంగా చెప్తూ ఉంటారు. 'పాలకవర్గానికి చెందిన వ్యక్తులు తమ ఉమ్మడి ప్రయోజనాలను స్థాపించుకోవడానికి తయారు చేసుకునే రూపమే రాజ్యం కనుక, ఆ రాజ్యంలోనే ఆ యుగపు సమస్త పౌరసమాజం మూర్తీభవించి ఉంటుంది గనుక రాజ్యమనేది అన్ని ఉమ్మడి సంస్థలు రూపొందడానికి మధ్యవర్తిగా పనిచేస్తుంది. ఆ విధంగా ఆ సంస్థలన్నీ రాజకీయ రూపాన్ని పొందుతాయి. అందువల్లనే చట్టాలనేవి ప్రజలందరి ఉమ్మడి సంకల్పం మీద రూపొందినట్టుగా భ్రమ కలుగుతుంది. ఈ ఉమ్మడి సంకల్పం అనేది దాని వాస్తవ

పునాది నుంచి వేరు చేయబడినది. ఆ వాస్తవపునాది స్వేచ్ఛా సంకల్పం. అదే విధంగా న్యాయం అనేది కూడా కొనసాగుతున్న చట్టాలు అనే సంకుచిత అర్థానికి కుదించబడుతుంది' అన్నాడు మార్క్స్. అయితే వాస్తవంలో శ్రమ విభజన మున్ముందుకు సాగిన కొద్దీ రాజ్యాంగ యంత్రంలో వేరువేరు విధులు నిర్వర్తించేవారు, ఉదాహరణకు న్యాయవాదులు, ఉన్నతాధికారులు ఎంతగా సాంకేతిక నైపుణ్యం సాధించిన బృందాలుగా మారిపోతారంటే వాళ్లకు పైకి చూడడానికి స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నట్టు అనిపిస్తుంది. ఇందువల్ల కొన్ని సందర్భాలలో ఈ విధి నిర్వాహక బృందాలకూ ప్రభుత్వానికీ మధ్య ఘర్షణ జరుగుతున్నట్టు కూడా కనబడుతుంది. అంతకన్న ముఖ్యంగా ఇంతకుముందే చెప్పినట్టు ప్రభుత్వ విధానాలు అనబడే వాటిని ఈ స్వతంత్ర ప్రతిపత్తి గల బృందాలే తయారు చేసినట్టు అనిపిస్తుంది. వారు ఆ తయారీలో 'న్యాయం', 'సంక్షేమం', 'ప్రజలకొరకు', 'స్వేచ్ఛ', 'సమర్థత', 'త్వరిత ప్రగతి', 'సమానత్వం' వగైరా అమూర్త ఆదర్శాలతో తయారుచేసినట్టు అనిపిస్తుంది. ఈ విధంగా కాలక్రమంలో రాజ్యాంగయంత్రం చాలా సంక్లిష్టంగా తయారైందనడంలో సందేహం లేదు. ఆ క్రమంలో అది అంతర్గత సమస్యలను కూడా సృష్టించుకుంది. కాని, ఎంతమాత్రమూ మరచిపోకూడని విషయమేమంటే వాళ్లు చట్టాలను రాజ్యాంగాన్ని, సామాజిక విధానాలను, వ్యాఖ్యానించినా, అమలుచేసినా, ఆ క్రమంలో న్యాయాన్ని, సామాజిక అవసరాలను నిక్షిప్తం చేసుకున్నట్టు కనిపించినా అదంతా అంతిమంగా పాలక వర్గాల దృష్టికోణం నుంచి మాత్రమే. అప్పుడప్పుడూ కీలకమైన చారిత్రక సందర్భాలలో ఎత్తుగడల కోసమో, ఇతర కారణాల కోసమో పాలకవర్గాలు రాజీలకు సిద్ధపడినట్టు కనిపించవచ్చు. కాని, శక్తిమంత మైన సవాళ్లు ఎదురైనప్పుడు పాలకవర్గాలు తమ నిజస్వరూపాన్ని స్పష్టంగా ప్రకటిస్తాయి.

అంటే, చారిత్రకంగా రూపొందిన నిర్మాణాత్మక సంబంధాలు అనేక రకాలుగా ముఖ్యమైన నిర్ణాయక అంశాలుగా ఉంటాయి. మొట్టమొదట రాజ్యాంగ యంత్రపు వర్గ స్వభావం విధానాలు ఎంత వరకు సాగవచ్చునో, ఏయే ప్రత్యేక రూపాలు తీసుకోవచ్చునో పరిమితులు విధిస్తుంది. ఆ వర్గ స్వభావం కూడా మళ్లీ అప్పటికి ప్రాబల్యంలో ఉన్న ఉత్పత్తి స్వభావం వల్లనే రూపొందుతుంది. రెండవది, రాజ్యాంగ యంత్రం గనక సమాజ మౌలిక నిర్మాణాన్ని ప్రభావితం చేయకుండానే సంస్కరణ విధాన వాదాలు అవలంబించినట్టయితే చట్టపరమైన రూపాలన్నీ శక్తిహీనమైపోతాయి. ఉండి లేనట్టు మారిపోతాయి. విద్యను, ఆరోగ్యాన్ని అటువంటి రంగాలను మెరుగుపరిచే లక్ష్యంతో తయారయ్యే సంక్షేమ కార్యక్రమాలు, ఉత్పత్తి సంబంధాలలో మౌలికంగా, బలహీనంగా ఉన్న వర్గాల భౌతిక జీవన స్థితిగతులను ఎంతమాత్రం మార్చలేవు. అవి ఎక్కువలో ఎక్కువ వ్యాధికి పైపైన ఉపశమనం ఇచ్చే మందులు మాత్రమే. మూడవది, రాజ్యాంగ యంత్రం చేపట్టే అనేక విధానాల పరిణామాలు ఎలా ఉంటాయనేది అప్పటికి కొనసాగుతున్న ఉత్పత్తి సంబంధాలలో వేరువేరు వర్గాల స్థితి ఏమిటి అనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఆకర్షణీయమైన గిట్టుబాటు ధరలు ఇచ్చే కొత్త వాణిజ్య పంటల ప్రవేశం, కాలువల ద్వారా నీటిపారుదల సౌకర్యాలను విస్తృతంగా పెంచడం, భూ యాజమాన్యంలో వ్యక్తిగత ఆస్తి హక్కులను గుర్తించడం వంటి పైకి చూడడానికి ప్రగతిశీలంగా కనిపించే విధానాలను ఉత్తర్ ప్రదేశ్ ప్రాంతంలో 18వ శతాబ్దంలో వలస ప్రభుత్వమే ప్రారంభించింది. వ్యవసాయాన్ని ఆధునీకీకరించే ఉద్దేశంతో వచ్చిన ఈ విధానాలు రైతాంగంలోని భిన్న బృందాల మీద వేరువేరు ఫలితాలను చూపించడం మనకు తెలిసిందే. చిన్నస్థాయి వ్యవసాయదారులు వంటి కొన్ని బృందాలు తమ తిండి గింజల వ్యవసాయాన్ని ఒదిలి వాణిజ్య పంటలకు వెళ్లినందువల్ల స్వయం సమృద్ధిని కోల్పోయి వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో చిక్కుకుపోయారు. భూముల ధరలు పెరిగిపోయి, భూ బదిలీలు జరిగి చిన్న రైతులు భూములు కోల్పోయారు. భూములన్నీ సంపన్న భూస్వాముల చేతుల్లోకీ, వడ్డీవ్యాపారుల చేతుల్లోకీ వెళ్లాయి. చాలాచోట్ల భూములు ఎప్పటికీ తెగని న్యాయస్థానపు వివాదాలలో చిక్కుకున్నాయి. మరొకవైపు ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని ధనిక రైతులు నిరుపేద రైతుల మీద తమ ఆధిక్యతను పెంచుకున్నారు. అంటే, ఒక రాజ్యాంగయంత్రపు విధానపు పరిణామాలు విభిన్న వర్గాల మీద ఎలా ఉంటాయో అంచనా కట్టడానికి అప్పటికి కొనసాగుతున్న సామాజిక సంబంధాల గురించి మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది. అంటే, రాజ్యాంగ యంత్రమూ, ఇతర రాజకీయ నిర్మాణాలూ చాలా సంక్లిష్ట స్వభావాన్ని సంతరించుకున్నాయి అనడంలో సందేహం లేనప్పటికీ, వాటిని సంపూర్ణంగా స్వయంప్రతిపత్తి కల సంస్థలుగా గుర్తించడానికి వీలులేదు. అలాగే రాజ్యాంగ యంత్రపు చర్యలను ఉత్పత్తి సంబంధాల స్వభావంతో సంబంధంలేని ఏదో సహజాతమైన, అమూర్తమైన న్యాయభావన ఆధారంగానో, సంక్షేమ సూత్రాల ఆధారంగానో అంచనా కట్టడం అసాధ్యం.

చైతన్యం రూపొందించడంలో ఒక అంశంగా ఉపరితలం

మతం, కులం, నైతిక అభిప్రాయాలు, విశ్వాసాలు, ఉద్వేగాలు – ఒక్క మాటలో చెప్పాలంటే భావజాల ప్రపంచం అంతా ఉట్టి మూఢనమ్మకమనీ దానివల్ల పరిణామాలేవి ఉండవనీ భావించే 'హేతువాద' దృక్పథాన్ని తీసుకోవడం చాలా పొరపాటు. మనిషి చైతన్యం ఏ విధంగా రూపొందినప్పటికీ, అతని సామాజిక ప్రవర్తనలోనూ, ఆచరణ లోనూ ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. ప్రత్యేకించి ఈ భావజాల అంశాలు వర్గసంబంధాలను అదుపు చేసే చైతన్యపూరిత సాధనాలు అయినప్పుడు లేదా, వర్గపోరాట అభివృద్ధికి చోదక శక్తిని అందజేసేటప్పుడు చైతన్యం ముఖ్యమైనదవుతుంది. పెట్టుబడిదారీ వర్గం తన నియంత్రణను కొనసాగించడానికి, వర్గఅంతరాలను, ప్రయోజనాలను పరిరక్షించు కోవడానికి విద్యను చాలా నేర్పుగా వాడుకుంది. అంతేకాదు, తమ ఆధిపత్య స్థానాన్ని దోపిడీకి గురౌతున్న వర్గాలు కూడా అంగీకరించేలా చేయడానికి ఆధిపత్య వర్గాలు విద్యను వాడుకుంటాయి. అందువల్లనే తిరుగుబాటుగా వచ్చిన మత ఉద్యమాలన్నీ (ఉదాహరణకు, భారతదేశంలో భక్తి ఉద్యమమైనా, యూరప్‌లో లూథరన్ తిరుగుబాటు అయినా) ఉన్నత వర్గాల ప్రామాణిక భాషగా తయారైన సంస్కృతాన్ని, లాటిన్‌ను వాడడం మీద తమ దాడిని ఎక్కుపెట్టాయి. ఎందుకంటే ఆ భాషలనే మతగ్రంథాలలో వాడారు. సాధారణ ప్రజానీకానికి అవి అంతుపట్టని భాషలైపోయాయి.

మనిషి తన పరిసరాలను మార్చుకోవడంలోనో, తనను తాను మార్చుకోవడంలోనో చైతన్యం ఎటువంటి పాత్ర వహిస్తుందో, వర్గ పోరాటాన్ని కొనసాగించడంలో చైతన్యం ఎంత గణనీయమైన పాత్ర

వహిస్తుందో గుర్తిస్తే చైతన్యపు అభివృద్ధి చాలా ముఖ్యమైనదని స్పష్టమౌతుంది. సామాజిక మార్పు గురించిన చారిత్రక అవగాహనలో ఈ చైతన్యం పాత్ర చాలా కీలకమైన అంశం. చైతన్యం అనేది పూర్తిగానూ, ఏకపక్షంగానూ ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడి ఉంటుందని భావిస్తే అది చారిత్రక భౌతికవాదానికి యాంత్రికమైన అర్థం చెప్పడమే అవుతుంది. చైతన్యానికీ ఉత్పత్తి సంబంధాలకూ ఉన్న సంబంధం ప్రధానంగా పరస్పర చర్యా, ప్రతిచర్యలతో కూడినది. అది క్రమక్రమంగా మారుతూ వస్తోంది.

చరిత్రలో వ్యక్తుల పాత్ర

ఉత్పత్తి సంబంధాలే మార్పుకు ప్రాథమిక చోదకశక్తి అని నొక్కి చెప్పడం వల్ల ఒకరకమైన నియతివాదం ప్రవేశించి వ్యక్తుల పాత్రను చెరిపివేయడానికి దారితీస్తుందా అని ఒక ప్రశ్న తరచుగా తలెత్తుతుంది. సాధారణ చరిత్ర పాఠ్య పుస్తకాలు చదివితే ఎవరికైనా కలిగే అభిప్రాయమేమంటే చరిత్రలోని ముఖ్యమైన ఘటనలన్నీ అసాధారణ శక్తి సామర్థ్యాలు కలిగిన వీరులో, నాయకులో, ప్రతినాయకులో సాధించినవేనని. అలెగ్జాండరుకు ఉండిన అపరిమితమైన ప్రపంచాన్ని జయించాలనే ఆకాంక్ష; శివాజీకి ఉండిన సైనిక, రాజకీయ చతుర, హిట్లర్ కు ఉండిన దురహంకారం, రాస్పుతీన్‌కు ఉండిన దుర్లక్షణాలు వంటి వాటినే చరిత్రలో రాస్తూ ఉంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇ.ఎచ్. కార్ అభివర్ణించినట్టు ఇది చెడ్డ రాజు జాన్ మంచి రాణి బెస్ సిద్ధాంతం. చరిత్రలో అపూర్వమైన స్త్రీ పురుష ఉదాహరణలు నిండి ఉన్నాయనడంలో సందేహం లేదు. అయితే వారు తమ కాలం విధించిన పరిమితుల లోపల మాత్రమే పనిచేసారు. వారి గుణాలైనా, దోషాలైనా వారిని ఆకాశానికెత్తినా, అణగదొక్కినా అందుకు కారణమైనవి ఆనాటి సమాజంలో నైతిక దృక్కోణంలో కొనసాగుతుండిన ప్రమాణాల ఆధారంగా వెలువడిన తీర్పులు మాత్రమే. వారిని ఆ యుగం తలకెత్తుకున్నదన్నా, తిరస్కరించిందన్నా అది ఆ కాలపు రాజకీయ చైతన్యానికి ప్రతిఫలం మాత్రమే. వారి విజయమైనా, అపజయమైనా వారు తమ లక్ష్యాల దిశగా తమ చుట్టూ ఉన్న మనుషుల చైతన్యాన్ని భౌతిక శక్తులను మరల్చగలిగారన్న దానిమీదనే ఆధారపడి ఉంది. వారి సైనిక విజయం వారి సైనిక శక్తి ఆధిక్యత మీద, ఆ కాలపు రాజకీయ ఆవశ్యకతల గురించి వారి అవగాహన మీద ఆధారపడి ఉంది. అదే విధంగా మేధో ప్రపంచపు ఉదాహరణ చూస్తే ఒక న్యూటనో, ఒక ఐన్‌స్టీనో ఆవిర్భవించడానికి కారణాన్ని ఆ కాలానికి అభివృద్ధి చెంది ఉన్న జ్ఞాన సంపదతో సంబంధం లేకుండా అర్థం చేసుకోలేం. ఆ కాలపు జ్ఞాన సంపద అంటే కూడా అది మౌలికంగా అప్పటివరకూ మనుషులు సాధించిన ఆచరణాత్మక కార్యకలాపాల, అనుభవాల స్థాయి మీద మాత్రమే ఆధారపడి ఉంటుంది. అలాగే ఆ శాస్త్రవేత్తలకు పరిశోధన చేయడానికి తమ కాలపు భౌతిక వనరులు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయనేది కూడా ముఖ్యమే. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఏ దృక్పథానికి సాధారణ ఆమోదయోగ్యత వస్తుందనేది కూడా ఆనాటికి అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తుల స్థితిపైనా, ఆనాటికి ప్రాబల్యంలో ఉన్న భావజాలం పైనా ఆధారపడి ఉంటుంది. చరిత్రక్రమంలో ఎంతోమంది మౌలిక ఆలోచనాపరులను తమ కాలానికంటే చాలా ముందుకు చూసిన సాహసం చేసినందుకు దైవదూషణ చేసారనే పేరుతో హింసించడం జరిగింది. బ్రూనో, గెలిలియో లాంటివారిని భౌతికంగా నిర్మూలించారు. మరికొన్ని సాధుసమాజాలలో కాలాన్ని అధిగమించిన భావాలను మౌనంతోనో, వేళాకోళంతోనో చంపేశారు. రాజకీయార్థశాస్త్ర చరిత్రలో ఇది స్పష్టంగా కనబడుతుంది. ఉపాంత ప్రయోజనం అనే భావనలను 19వ శతాబ్దం తొలిరోజుల్లో 1820 నుంచి 1850 మధ్య మొదటిసారి ప్రతిపాదించిన గాసెన్, డుపుయిట్ వంటి వారిని విస్మరించడమో, గేలి చేయడమో జరిగింది. అవే భావాలను 1870ల తరవాత చాలా గంభీరమైనవిగా, మౌలికమైనవిగా, రాజకీయార్థశాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకునేవిగా ప్రతిపాదించడం జరిగింది. అంటే, నిస్సందేహంగా వ్యక్తులు గొప్ప పాత్ర నిర్వహిస్తారు. కాని, చరిత్ర నిర్దేశించిన పరిస్థితుల లోపలే వాళ్లు పనిచేస్తారు. 'మనుషులు తమ చరిత్ర తామే నిర్మిస్తారు. కాని, వారు కూడా ఆ పనిని తమ ఇష్టారాజ్యంగా చేయజాలరు. గతం నుంచి కొనసాగుతూ, తమదాకా ప్రవహించి, తాము నేరుగా ఎదుర్కొనే పరిస్థితుల లోపల మాత్రమే మనుషులు చరిత్రను నిర్మించగలరు' అన్నాడు మార్క్స్. అంటే, అసాధారణ ప్రజ్ఞావంతులైన వ్యక్తులు కూడా చరిత్ర క్రమంలో ఒక ఘటనే.

సామాజిక మార్పు స్వభావం

సామాజిక సంబంధాల చరిత్రను పరిశీలిస్తున్నప్పుడు మార్పు స్వభావం గురించి ఏం చెప్పగలం? సామాజిక శాస్త్రవేత్తలలో వారు అనుసరించే సంవిధాన దృక్కోణాలను బట్టి ఈ మార్పు స్వభావం ఏమిటనేది కూడా విభిన్నంగా ఉంటుంది. న్యూటన్ భావాల వ్యాప్తి పెద్ద ఎత్తున సాగుతున్నప్పుడు అంటే, విశ్వాన్ని నిర్దేశించే యాంత్రిక సూత్రమే అన్ని దృగ్గోచర అంశాలకు, మానవ అంశాలకు, మానవేతర అంశాలకు కూడా వర్తిస్తుందనే భావం ఉన్నప్పుడు సామాజిక సంబంధాలను నిర్దేశించే ఏదో ఒక సూత్రం ఉందనే నమ్మకం ఉండేది. ఆ సూత్రం సహజమైన ధర్మమనీ, ఆడమ్ స్మిత్ ఊహించినట్టుగా విశ్వ సృష్టికర్త దాన్ని లిఖించారనీ, ఆ ధర్మం ఒక సమన్వయపూరిత సమతుల్య స్థితివైపు పయనిస్తున్నదని నమ్మకం ఉండేది. ఆ వ్యవస్థలో ఏవైనా మార్పులు రావాలంటే అవి బయటి నుంచి వచ్చే కల్లోలాల రూపంలో ఉండవలసిందే. నిశ్చల స్థితిలో ఉన్న ఒక వస్తువు మీద బయటి నుంచి బలప్రయోగం జరిగినట్టుగా ఉండవలసిందే. ఆ వ్యవస్థ ఒక క్రమబద్ధమైన పరిణామాత్మకమైన పునరావాసాల ద్వారా మాత్రమే మార్పును గ్రహించగలుగుతుంది. ఈ దృక్పథం గురించి నేను తరవాతి ఉపన్యాసంలో వివరంగా చెపుతాను. కాని, ఇక్కడ గుర్తించవలసిందేమంటే ఈ దృక్పథం మార్పులను ప్రాథమికంగా పరిమాణంలో జరిగే స్థాన చలనాలుగా మాత్రమే చూస్తుంది. మార్పులకు కారణాలను బాహ్య శక్తులలో మాత్రమే వెతుకుతుంది. దీనికి భిన్నంగా పరిణామవాద సిద్ధాంతం మొత్తం సామాజిక వ్యవస్థను ఒక ప్రాణస్పందన ఉన్న జీవిగా పరిగణిస్తుంది. దాని దృష్టిలో మార్పులంటే పరిణామక్రమంలో గ్రహించే పరివర్తనలు మాత్రమే. ఈ పరిణామవాద సిద్ధాంతాన్ని దాని అంచులదాకా తీసుకువెళ్లిన స్పెన్సర్ ఆలోచనా ధోరణి సమాజం మొత్తాన్ని ఒక శరీరంగా చూసి దానిలో ఏయే భాగం ఏయే అవయవంతో సరిపోలుతుందో కూడా వివరించింది. ఈ సిద్ధాంతం కొనసాగుతున్న వ్యవస్థను సమర్థించడానికే ఉపయోగపడింది. వేరు వేరు అవయవాలకు వేరు వేరు పనులు అనే పునాది మీద ఒక వ్యవస్థలో అంతరాలు ఉండడాన్ని సమర్థించింది. సమాజ శరీర ధర్మ శాస్త్రాన్ని అధ్యయనం చేసినట్టుగా అందులో నాడీ కేంద్రాలు ఏమిటనీ, మెదడు ఏదనీ, ఏ అవయవం ఏదనీ అన్వేషించింది. ఇటువంటి విద్యుక్త ధర్మాల సిద్ధాంతానికి దాదాపు సమానంగా సమాంతరంగా వచ్చినది హిందూ ధర్మ శాస్త్ర నమ్మకం.

బ్రహ్మ ఒక మహా పురుషుడనీ, అతని శరీరంలోని వేరు వేరు భాగాలనుంచి వేరు వేరు కులాలు పుట్టుకువచ్చాయనీ ఆ సిద్ధాంతం చెప్పింది. అందువల్ల అనివార్యంగా బ్రాహ్మణులు ఆ మహాపురుషుడి ముఖం నుంచి పుట్టుకువచ్చారు. కింది కులాల వారు అతని పాదాల నుంచే పుట్టుకురావల్సివచ్చింది. ప్రతి అవయవానికి దాని ధర్మం నిర్ణయమైపోయింది. మొత్తం రాజ్యం శరీరమై అందులో అన్ని అవయవాలకూ అంతరాల వ్యవస్థలో స్థానాలు నిర్ణయమైపోయాయి. పరిణామ సిద్ధాంత వాదులు మార్పులనేవి క్రమానుగతంగా జరిగే పరివర్తనలు అని చెప్పడం ద్వారా అన్ని మార్పులూ మెల్లమెల్లగా జరుగుతాయని అంటు యథాస్థితిని సమర్థించేవారయిపోయారు. మార్పులనేవి స్వాభావికంగానే చిన్న చిన్నవిగా ఉండాలని, అవి సవరణల ద్వారా జరగాలి గాని విప్లవాత్మకంగా జరగకూడదని అన్నారు.

అయితే నిజంగా గడిచిన సామాజిక చరిత్ర లోలోపలే జరిగిన పరిణామంలో మాత్రమే జరిగిన సవరణలకు మాత్రమే పరిమితమైనది కాదు. పరిమాణాత్మక విస్తరణలూ ఉన్నాయనడంలో ఏ సందేహమూ లేదు. కాని, మొత్తంగా సామాజిక అస్తిత్వ పద్ధతినే గుణాత్మకంగా మార్చివేసిన ఆకస్మిక గంతులు కూడా ఉన్నాయి. ఈ సంగతిని గుర్తించడం వల్లనే కావచ్చు కొందరు సామాజిక చింతనాపరులు సామాజిక చరిత్రను కొన్ని యుగాలుగా, తరాలుగా, దశలుగా వర్గీకరించారు. ఈ గుణాత్మక మార్పులే కొత్త తరహా సామాజిక సంబంధాలకు కారణమయ్యాయి. అటువంటి ఒక్కొక్క దశ రావడాన్ని మార్క్స్ ఒక కొత్త ఉత్పత్తి విధానం ప్రాబల్యంలోకి రావడమై దానితోపాటు గుర్తించదగిన ఉత్పత్తి సంబంధాలు ఉనికిలోకి రావడమని అన్నాడు. ఇలా రూపొందిన ప్రతి ఒక్క ఉత్పత్తి విధానాన్ని విశ్లేషించాలంటే దానికే సరిపోయే విశ్లేషణా పరికరాలను, భావనలను తయారు చేసుకోవలసి ఉంటుంది. స్వేచ్ఛాయుతమైన వేతన శ్రమ, ఒక ప్రత్యేక వర్గానికి ఆదాయంగా వచ్చే అదనపు విలువకు నిర్దిష్ట రూపంగా లాభాలు, సమాన మారకం వంటి భావనలన్నీ పెట్టుబడిదారీ ఉత్పత్తి సర్వవ్యాపితమైనప్పుడు మాత్రమే పనికివస్తాయి. అలాగే భూస్వామ్య దశలో శ్రమ కౌలు, వ్యక్తిగత సౌఖ్యాలు, నజరానాలు, వెట్టి శ్రమ వంటి భావనలు పనికివస్తాయి.

అయితే చరిత్ర క్రమంలో ఈ గుణాత్మక గెంతులు జరిగినప్పుడు తలెత్తే ప్రశ్న ఏమంటే, ఈ గెంతులకు కారణం బాహ్యశక్తులా, లేక సామాజిక సంబంధాల లోపల సాగే అంతర తర్కం వల్ల ఈ మార్పులు రూపొందాయా. ఉత్పత్తి శక్తుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సంబంధాలలో సవరణలు జరుగుతాయని, ఆ సవరణలు తక్షణంగానో, సాఫీగానో జరగవని మనం ఇదివరకే చూసి ఉన్నాం. అంతేకాదు, నిజానికి ఉత్పత్తి సంబంధాలు కాస్త మందకొడిగా సాగుతూ ఉత్పత్తి శక్తుల పురోగమనాన్ని అడ్డుకునే సంకెలగా కూడా మారవచ్చు. ఉదాహరణకు, తొలుత ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి సహాయపడిన భూస్వామ్య ఆస్తి సంబంధాలే పెట్టుబడిదారీ ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఆటంకంగా పరిణమించి అంతిమంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల చేత తోసివేయబడ్డాయి. మరీ ముఖ్యంగా పురోగమిస్తున్న ఉత్పత్తి శక్తులు భిన్న వర్గాల మీద విభిన్నమైన ప్రభావాన్ని వేస్తాయి గనుక ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వచ్చే ఘర్షణ వర్గ విభేదాలను పెంపొందించే రూపంలో వ్యక్తమవుతుంది. అప్పుడు ఆ ఘర్షణను పరిష్కరించడానికి ఉత్పత్తి సంబంధాలను సంపూర్ణంగా మార్చడమో, లేదా, ఉత్పత్తి శక్తులను తాత్కాలికంగా ఆటంకపర్చడమో అవసరమవుతుంది.

బ్రిటన్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చరిత్రను చూస్తే ఈ పరిణామాలు ఎంత వేగవంతంగా జరిగాయో కనబడుతుంది. అవి కొన్నిసార్లు హింసాత్మకంగా ఉన్నాయి. కొన్నిసార్లు దిగిపోబోతున్న వర్గాలు సమయానుకూలంగా లొంగిపోయాయి. కల్లోలాలు నిర్బంధ శిబిరాలు, కార్ఖానాల చట్టం, నిరుపేదల చట్టం వగైరా ఎన్నో రూపాలలో ఈ చరిత్ర కనబడుతుంది. ఈ వర్గాల మధ్య ఘర్షణ అనేక బహిరంగ ప్రచ్ఛన్న రూపాలుకూడా ధరించవచ్చు. ఒకసారి అది మతఘర్షణల రూపంలో కనబడుతుంది, మరోసారి రాజకీయ ఘర్షణగా కనబడుతుంది. ఇంకొకసారి సిద్ధాంత ఘర్షణగా కనబడుతుంది. ఇంకొకసారి ప్రజా ఉద్యమంగా కనబడుతుంది. ఉదాహరణకు, అప్పుడప్పుడే తలెత్తుతున్న పెట్టుబడిదారీ వర్గానికి మార్గం సుగమం చేయడం కొరకు వెలువడిన స్వేచ్ఛా వాణిజ్య నినాదం వ్యక్తి స్వేచ్ఛ, స్వావలంబన, ప్రజాస్వామిక హక్కులు వగైరా నైతిక సూత్రాల రూపం ధరించింది.

మరొకపక్క గుత్తపెట్టుబడిదారీ విధానం శాస్త్ర విజ్ఞాన ఆరాధన, అత్యున్నత స్థాయి ఉత్పాదకత, సంకేతిక నిపుణుల ఆధిపత్యం వంటి ధోరణులను సమర్థించింది. ఆయా వర్గాలు ఏ సైద్ధాంతిక ఆయుధాలను చేతపట్టి యుద్ధాలు సాగించినప్పటికీ (అయితే ఈ సైద్ధాంతిక ఆయుధాలను వాడడం ఎంత సంక్లిష్టం, ఎంత అమూర్తం అయిపోయిందంటే నిజమైన సమస్యలు కనబడనంతటి కళాత్మక నైపుణ్యంతో ఈ ఆయుధాలను వాడుతుంటారు.) పాత ఉత్పత్తి సంబంధాలు కాలం చెల్లిన తరువాత రద్దయిపోక తప్పదు. వాటి స్థానంలోకి కొత్త ఉత్పత్తి సంబంధాలు రాక తప్పదు. అంటే, ఒక ఉత్పత్తి విధానం రద్దుకు బీజాలు దాని లోలోపలనే ఉంటాయని అర్థం.

ఒక ఉత్పత్తి విధానం ఎంత పురోగమన దిశలో ఉంటే దాని అంతర్గత వైరుధ్యాలు అంతగా పెంపొంది, అంతిమంగా అది ఒక గుణాత్మక మార్పుకు అవసరమైన దశకు చేరుతుంది. యుద్ధాలు, ఆర్థిక జోక్యం వంటి బాహ్య శక్తులు ఈ ధోరణులను త్వరితం చేయగలవు. లేదా, ఆటంకపరచగలవు. అంతే. బాహ్య శక్తులు ఎప్పుడైనా ఒక మార్పుకు తగిన పరిస్థితులను సృష్టించగలవే కాని, మార్పుకు అంతిమ మూలం మాత్రం అంతర్గత శక్తుల నుంచే లభిస్తుంది. 'తగిన ఉష్ణోగ్రత అందినప్పుడు గుడ్డు కోడి పిల్లగా మారుతుంది. కాని ఎంత ఉష్ణోగ్రతను అందించినా ఒక రాయిని కోడిపిల్లగా మార్చలేం. రాయిలో ఉన్న మూలం భిన్నమైనది' అన్నాడు మావో.

చారిత్రక నియతిని గుడ్డిగా అనుసరిస్తున్నామా?

ఇటువంటి దృక్పథం తీసుకోవడమంటే చారిత్రకవాదం పట్ల గుడ్డి నమ్మకం కలిగి ఉండడమా? ఈ సమాజం ఎటువంటి పరిస్థితులలోనైనా అనివార్యంగా తప్పనిసరిగా విధి లిఖితం వంటి మార్గాన పయనిస్తుంది అని నమ్మడమా? అటువంటి వ్యాఖ్యానంలో అమాయకత్వం మాత్రమే కాదు ధూర్తత్వం కూడా కనబడుతుంది. అది మన చేతిలో ఏమీ లేదనే విధి నిర్ణాయక వాదానికి దారితీస్తుంది. భవిష్యత్తు అంతా అనివార్యంగా నిర్ణయమయిపోయి ఉంటే ఇక చైతన్యయుత మానవ ఆచరణకు అవకాశం గాని, ఆచరణ సాధ్యత గాని ఉంటుందా? అంతేకాదు, ఈ సిద్ధాంతం పలాయనవాదానికి కూడా దారితీస్తుంది. అనివార్యంగా ఏదో జరిగిపోతుందని అంగీకరించడం అంటే, మనిషి తనంతట తానే స్వేచ్ఛను వదులుకోవడమే.

ఇందుకు భిన్నంగా క్రమానుగత ఉత్పత్తి విధానాల ద్వారా చరిత్ర పురోగమించిందని, ఆ చరిత్రలో ఆదిమ, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సోషలిస్ట్ దశలు ఉన్నాయని మార్క్స్ చేసిన విశ్లేషణ. ఈ దశల క్రమానికి

ఒక అనివార్యతను ఆపాదించింది. ఈ పునాది మీద కొంతమంది విమర్శకులు మార్క్స్ చేసిన సామాజిక చరిత్ర పట్ల భౌతికవాద వ్యాఖ్యానాన్ని విమర్శించారు. కొన్ని సమాజాలు మధ్యంతర దశలను అధిగమించాయని, అందువల్ల ఆ సిద్ధాంతం చెల్లదని అన్నారు. మరోవైపు ఈ దశలన్నీ ఒకదాని తరవాత ఒకటి వస్తాయనే భావనను మొరటుగా ఉన్నది ఉన్నట్టుగా అర్థం చేసుకున్నారు. మరికొందరు విప్లవాత్మక చర్యలకు వ్యతిరేకంగా మితవాద వైఖరులు తీసుకున్నారు. ఈ రకమైన యాంత్రిక వ్యాఖ్యానం మానవ ఆచరణలో చైతన్యానికి గల పాత్ర గురించి విస్మరించింది. 'మనం అర్థం చేసుకోనంత వరకూ అనివార్యత అనేది గుడ్డిగానే ఉంటుంది' అని హెగెల్ చేసిన సూత్రీకరణను విస్మరించింది.

భౌతిక పరిస్థితులు నిర్దేశించే అనివార్యతను గురించి అవగాహన పెంచుకోవడం ద్వారానే వర్గ చైతన్యం, వర్గ పోరాటం తమ చలనశీల స్వభావాన్ని పొందుతాయి. అంతేకాదు, మనుషులకూ, ప్రకృతికీ, ఉత్పత్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ, పునాదికీ, ఉపరితలానికీ ఉండే సంబంధాలు సర్వకాలానికి ఏ మార్పులూ లేకుండా స్థిరంగా ఉండేవి కావు. చరిత్ర క్రమంలో అవి కూడా మారుతూ వచ్చాయి. సమాజాల చరిత్రను, వర్తమానాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికి ఉత్పత్తి సంబంధాలను, దానితో కలిసి ఉన్న వర్గాల పొందికను అర్థం చేసుకోవాల్సి ఉంటుందని భౌతికవాద గతితర్క దృక్పథం నొక్కిచెపుతుంది. అవి అర్థం చేసుకోవడం ద్వారా ఉత్పత్తి శక్తులలో వస్తున్న మార్పులేవో, అందువల్ల రాజ్యాంగ యంత్రంలోనూ, వర్గపోరాట రూపంలోనూ వస్తున్న మార్పులేవో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వర్తమానాన్ని చరిత్రగా చూసే పునాది పైననే భవిష్యత్తును ఊహించడం సాధ్యమవుతుంది. వర్తమానం సృష్టిస్తున్న అవకాశాల పరిమితులలోనే భవిష్యత్తును రూపొందించడానికి వీలు కలుగుతుంది. 'మానవజాతి తాము పరిష్కరించగలిగిన కర్తవ్యాలను మాత్రమే తన ముందు పెట్టుకుంటుంది' అని మార్క్స్ అన్నాడు. వర్తమానపు సమస్యలన్నిటికీ మూలాలు చరిత్రలో ఉన్నాయి. భవిష్యత్తులో అవి పరిణమించబోయే రూపాలకూ, వాటి పరిష్కారాల అవకాశాలకూ మూలాలు వర్తమానంలో ఉన్నాయి. సామాజిక తత్వవేత్తల కర్తవ్యం ఏమంటే, వర్తమానాన్ని అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, ఆ అవగాహనను ఆచరణలో వినియోగించడం. అందుకే ఫ్యూయర్ బా మీద విమర్శలో మార్క్స్ 'ఇప్పటివరకూ తత్వవేత్తలందరూ ప్రపంచాన్ని విభిన్న పద్ధతులలో వ్యాఖ్యానించడం మాత్రమే చేశారు; కాని చేయవలసిన పని ప్రపంచాన్ని మార్చడం' అన్నాడు.

సామాజిక పునర్నిర్మాణంలో జ్ఞానం వినియోగం

ఇక చివరి అంశానికి వస్తాను. సమాజాన్ని పునర్నిర్మించడంలో జ్ఞానాన్ని ఎలా వాడాలి? మొట్టమొదట కొన్ని మామూలు తప్పుడు అవగాహనలు తొలగించవలసి ఉంది. ఇప్పటిదాకా నేను చర్చించిన దాన్ని బట్టి ఒక విషయం స్పష్టమై ఉంటుందనుకుంటాను. 'సమాజం' అంటే ఒకే రకమైన ప్రయోజనాలు గల కొందరు వ్యక్తుల సమూహం కాదు. అదేదో పిల్లల ఆటలో అటు పావులు ఇటూ, ఇటు పావులు అటూ జరిపి ఉన్న స్థితిలోనే కొత్త నమూనాలో నిర్మించడానికి వీలైన ఆట కాదు సమాజం. సమాజం, ప్రజలు వంటి సామూహిక పదాలన్ని ఒక కీలక వాస్తవాన్ని మరుగుపరుస్తాయి. ఆస్తి మీద ఆధారపడిన సమాజాలన్నీ అనివార్యంగా తప్పించుకోలేని విధంగా వర్గాలుగా విభజించబడి ఉన్నాయి. వాటికి సాధారణంగా పరస్పర వ్యతిరేక ప్రయోజనాలున్నాయి. పౌరచట్టంలో ప్రస్తుత ఆస్తి సంబంధాలను సాధారణ సమాజ సంకల్ప ఫలితంగా రూపొందాయని చెపుతుంటారు. చట్టంలోనే పెట్టుబడిదారీ వర్గం ఒక సాధారణ వ్యక్తీకరణ పొందుతుందంటారు. అంటే, మొత్తంగా ప్రజాసంకల్పం చట్టం రూపంలో, న్యాయవ్యవస్థ రూపంలో, అధికార యంత్రాంగం రూపంలో, రాజ్యాంగ యంత్ర రూపంలో వ్యక్తీకరణ పొందుతుందని చెబుతారు.

అందువల్ల సమాజ పునర్నిర్మాణం అంటే సమాజపు సాధారణ సంకల్ప వ్యవహారమనీ, ప్రజల అందరి కోరికల వ్యవహారమనీ, ప్రజల అందరి శ్రేయస్సు కొరకు జరుగుతుందని భ్రమలు కలుగుతాయి. కాని, ఇటువంటి సార్వత్రిక ఏకీభావం సంపాదించడం వర్గపునాదిగల సమాజాలలో అసాధ్యం. 'సరైన విద్య' అందించడం ద్వారా గాని, 'ఉదాత్త నైతిక ఆదర్శాలను' ప్రచారం చేయడం ద్వారా గాని ఘర్షణ పడుతున్న వర్గ ప్రయోజనాలను చల్లార్చడం సాధ్యం కాదు. ఒక సామాజిక దశలో సమాజం మీద ప్రాబల్యం వహించే భావాలు పాలకవర్గపు భావాలే అయి ఉంటాయి. రాజ్యాంగ యంత్రం అనేది ఆ పాలకవర్గాల రాజకీయ సాధనంగా ఉంటుంది. అంటే, రాజ్యాంగ యంత్రానికి వర్గస్వభావం ఉంటుంది. ఆ వర్గస్వభావం ఎంత సంక్లిష్టంగానైనా ఉండవచ్చు. రాజ్యాంగయంత్రపు విధానాలకు ఒక వర్గ స్వభావం ఉంటుంది. ఆ పాలక వర్గాలు తమ వ్యూహాత్మక తక్షణ అవసరాల కొరకు, మనుగడ కొరకు, విస్తరణ కొరకు ఆ విధానాలలో ఎన్ని రాజీలైనా చేసుకోవచ్చు. అలాగే సామాజిక పునర్నిర్మాణం గురించి ఆలోచించే ఏ ప్రణాళికకైనా తప్పని సరిగా వర్గ దృష్టి ఉంటుంది. దాని లక్ష్యాలలో కావచ్చు, అది అనుసరించే సాధనాలలో కావచ్చు, అది వ్యవహరించే పరిమితులలో కావచ్చు, అది అమలు చేసే విధానాలలో కావచ్చు, ఆ విధానాల వాస్తవ ఫలితాలలో కావచ్చు ఆ వర్గ దృష్టి తప్పనిసరిగా ఉంటుంది.

సామాజిక విధానానికి ఉండే ఈ వర్గ కోణాలను అర్థం చేసుకోవాలంటే మనం తప్పనిసరిగా సామాజిక సంబంధాలను ఉన్నవి ఉన్నట్టుగానూ, చారిత్రకంగా పరిణామం చెందుతూ వచ్చిన క్రమంలోనూ అర్థం చేసుకోవాలి. వర్గాల స్వభావాన్ని, వాటి మధ్య సంబంధాలను అర్థం చేసుకోవాలి. సమాజంలోని వైరుధ్యాలను అర్థం చేసుకోవాలి. వర్తమానంలో ప్రాబల్యం వహిస్తూ ఉన్న ప్రధాన వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలి. వైరుధ్యాలు వ్యక్తీకరణ పొందే రూపాలన్నిటినీ అర్థం చేసుకోవాలి. ఆ వైరుధ్యాలు అభివృద్ధి చెందగల అవకాశాల క్రమాన్ని అర్థం చేసుకోవాలి. రాజ్యాంగ యంత్రపు స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. రాజ్య విధానపు సాధనాలను అర్థం చేసుకోవాలి. వర్గ పోరాటపు ప్రస్తుత స్థితినీ, రూపాన్నీ, భవిష్యత్తులో అది ధరించబోయే రూపాన్నీ అర్థం చేసుకోవాలి. భావజాలం మీద, చైతన్యం మీద ఉపరితల ప్రభావాన్ని, దాని పాత్రను, అది వర్గపోరాటాన్ని రూపొందించే తీరును అర్థం చేసుకోవాలి.

ఇవన్నీ అర్థం చేసుకోవాలంటే నిర్దిష్ట పరిస్థితుల పట్ల నిర్దిష్ట విశ్లేషణ అవసరమవుతుంది. ఆ పని ఈ ఉపన్యాసాల పరిధికి మించినది. నా సొంత అవగాహనకూ, సామర్థ్యానికీ మించినది. ఇక్కడ నేను చేసిన ప్రయత్నమల్లా విశ్లేషణా స్థాయిలో కీలకమైన విషయాలను ప్రస్తావించడం మాత్రమే.

(యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, ప్రసారాంగ ప్రచురించిన కృష్ణా భరద్వాజ్ ఉపన్యాసాల సంకలనం 'ఆన్ సమ్ ఇష్యూస్ ఆఫ్ మెథడ్ ఇన్ ది ఎనాలిసిస్ ఆఫ్ సోషల్ ఛేంజ్' లో మొదటి ఉపన్యాసానికి అనువాదం ఎన్. వేణుగోపాల్) వీ

క్రిప్టో కరెన్సీతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు

నియంత్రణ లేని క్రిప్టో కరెన్సీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు లోనుకావచ్చనీ, హవాలా లాంటి ఘటనలు పునరావృతం కావచ్చనీ అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

ద్రవ్యం ఆవిర్భవించడానికి పూర్వం వస్తువుల విలువ కట్టి అంతకు సమానమైన వస్తువులు పొందే మారక విధానం ఉండేది. దీన్నే బార్టర్ పద్ధతి అంటున్నారు. వినిమయంలో తలెత్తుతున్న సమస్యల దృష్ట్యా కాలక్రమంలో వెండి, రాగి, బంగారు నాణెములు చలామణిలోకి వచ్చాయి. ఆ తర్వాత కాగితపు కరెన్సీ ఉనికిలోకి వచ్చింది. కాలక్రమంలో దేశీయ, అంతర్జాతీయ కరెన్సీలలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. భారతదేశ కరెన్సీ రూపాయి, అమెరికా కరెన్సీ డాలర్, రష్యా కరెన్సీ రూబుల్, బ్రిటన్ కరెన్సీ పౌండ్, చైనా కరెన్సీ యువాన్, జర్మనీ కరెన్సీ మార్క్, జపాన్ కరెన్సీ యెన్, పేరు ఏదైనా ఆయా దేశాల కరెన్సీలను నియంత్రించే కేంద్ర వ్యవస్థలు (మన రిజర్వ్ బ్యాంక్ లాంటివి) ఉన్నాయి. ఇవాళ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న డిజిటల్ కరెన్సీనే క్రిప్టో కరెన్సీ. దీనిపై 1980 నుండి పరిశోధనలు జరుగుతున్నాయి. 2008లో సతోషి నకమోటి అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీ భావనకు ఒక పటిష్టమైన రూపాన్ని ఇవ్వడంతో చలామణిలోకి వచ్చింది. ఆన్‌లైన్‌లో ఉన్న మన డబ్బు (లిక్విడ్ క్యాష్)ను ఎవరో ఒకరు కాజేసే ప్రమాదం ఉంది. లావాదేవీల్లోనూ మోసాలు జరిగే అవకాశాలున్నాయి. అలాంటివేమీ లేకుండా, అసలు ఏ సంస్థ/ మూడో వ్యక్తి అజమాయిషీ/ నియంత్రణ లేకుండా ఇద్దరు వ్యక్తుల మధ్య(పీర్–టు–పీర్) ఆన్‌లైన్‌లో లావాదేవీ జరిగేది క్రిప్టో కరెన్సీ.

క్రిప్టో కరెన్సీ అనే పేరు 'డబ్బు' అనే పదానికి సమానం. డబ్బులో రూపాయలు, డాలర్లు, పౌండ్లు, రూబుళ్లు అనే తేడాలున్నట్టు క్రిప్టో కరెన్సీలో కూడా బిట్ కాయిన్, ఎథేరియం, లైట్‌కాయిన్, రిపుల్, స్టెల్లార్, కార్డానో, టెదర్, సోలానా, పోల్కాడాట్.. ఇలా రకరకాల కరెన్సీలు 1000 రకాలకు పైగానే ఉన్నాయి. మామూలుగా పేపర్ కరెన్సీలో డాలర్లలాగా క్రిప్టో కరెన్సీకి 'బిట్‌కాయిన్' రారాజుగా వెలుగొందుతోంది. ప్రస్తుతం డాలర్ కన్నా బిట్‌కాయిన్ విలువ వేల రెట్లు అధికం. ఒక్క బిట్‌కాయిన్ విలువ ప్రస్తుతం 57 వేల డాలర్లకు పైమాటే. మన కరెన్సీలో అది దాదాపు రు. 42.81 లక్షలు. దాంతో బోలెడన్ని రహస్య లావాదేవీలు జరిపే వీలుండడమే నల్ల కుబేరులను ఆకర్షిస్తున్న అంశం. క్రిప్టో కరెన్సీలో మొట్టమొదటి నాణెం బిట్‌కాయిన్, ఇది 2009లో అవతరించింది. ఆ తర్వాత వివిధ రకాలకు చెందిన మొత్తం 4500 క్రిప్టో కరెన్సీలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు రంగ ప్రవేశం చేశాయి.

అక్షరాలు, అంకెలతో కూడిన సమాచారాన్ని సాఫ్ట్‌వేర్ సాంకేతికతతో గుప్తీకరించడమే క్రిప్టోగ్రఫీ (గూఢ లిపి). క్రిప్టోగ్రఫీ డేటాకు గోప్యత, భద్రత ఉంటుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఈ–కామర్స్ లావాదేవీలు, కంప్యూటర్ పాస్‌వర్డ్‌లు వంటి అనేక అప్లికేషన్‌లలో క్రిప్టోగ్రఫీని ఉపయోగిస్తారు. మెయిల్ ఓపెన్ చేయడానికి పాస్‌వర్డ్‌ను కంపోజ్ చేస్తాం కదా.. ఆ అక్షరాలు చుక్కల్లా కనిపిస్తాయి. అదే క్రిప్టోగ్రఫీ! క్రిప్టో కరెన్సీకి ఇదే ఆధారం. ఈ వ్యవస్థ బ్లాక్ చెయిన్ సాంకేతికతతో నడుస్తుంది. బ్లాక్ చెయిన్‌తో కంప్యూటర్ నెట్‌వర్క్‌లో డిజిటల్ లెడ్జర్‌లో క్రిప్టో కరెన్సీకి సంబంధించిన లావాదేవీలు నమోదు అవుతాయి. నెట్‌వర్క్‌లోకి లాగిన్ అయిపోయి, ప్రతి క్రిప్టో కరెన్సీ కాయిన్‌ను ఉపయోగించి చేసిన లావాదేవీనీ పరిశీలించవచ్చు. దీనికి కారణం క్రిప్టో కరెన్సీకి ప్రాణమైన 'బ్లాక్ చెయిన్ టెక్నాలజీ'. ప్రతీ రికార్డ్ చూపే పట్టికనే బ్లాక్ చెయిన్ లెడ్జర్ అంటారు. ప్రతి చిన్న వివరాన్నీ హాష్ ఎన్‌క్రిప్షన్ పద్ధతిలో భద్రపరచడం వల్ల... ఆ లావాదేవీ ఏ ఖాతాకు చెందినదో చచ్చినా బయటపడదు. అందుకే నల్ల కుబేరులు అంత బేఫికర్‌గా క్రిప్టోలలో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

బ్లాక్ చెయిన్ సాంకేతిక నైపుణ్యం ద్వారా అత్యంత విశిష్టమైన నెట్ సాగర మధనం చేసి ఆన్‌లైన్ మైనింగ్ పద్ధతిలో ఈ బ్లాక్‌లను సృష్టిస్తూ పోతారు. బ్లాక్ అంటే అప్పటికే ఉన్న మొత్తానికి అదనంగా చేరే కరెన్సీ. ఆ క్రమంలో ఏ బ్లాక్ అయితే క్రిప్టో ప్రమాణాలను చేరుకుంటుందో దానిని సృష్టించిన వారికి కొన్ని నాణేలను బహుకరిస్తారు. ఇది సామాన్యుడికి కొరుకుడు పడని వ్యవహారం. అదే సమయంలో అప్పటికే సృష్టించిన క్రిప్టో నాణేలను మామూలు కరెన్సీతో కొనుక్కోవచ్చు. క్రిప్టో కరెన్సీని బ్లాక్ చైన్ విధానం ద్వారా సృష్టించడానికి విద్యుత్తు అమితంగా వ్యయమవుతుంది. ఒక్కో క్రిప్టో నాణెం విలువ సందర్భాన్ని బట్టి అనేక వేల డాలర్లు ఉంటుంది. మొత్తం క్రిప్టో కరెన్సీ ఎంతుందో ప్రతి ఖాతాదారుకీ తెలుస్తుంటుంది. దాని ప్రతి లావాదేవీ అందరి ఖాతాల్లోనూ రికార్డయి ఉంటుంది. ఎవరు ఎక్కడ దానిని కొన్నా, అమ్మినా, వినియోగించినా మొత్తం ఖాతాల్లో అది కనిపిస్తుంది. అయితే వ్యక్తుల పేర్లు మాత్రం గోప్యంగా ఉంటాయి.

ప్రస్తుతం ఎల్‌సాల్వడార్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్‌లు బిట్‌కాయిన్‌లలో లావాదేవీలను చట్టబద్ధం చేశాయి. చైనా పూర్తిగా నిషేధించింది. భారత్ నియంత్రించాలా? నిషేధించాలా? అన్న మీమాంసలో ఉంది. రిజర్వ్ బ్యాంకు నిషేధించాలంటున్నది. వ్యాపార, పారిశ్రామిక వర్గాలు నిషేధించవద్దంటున్నాయి. భారత్‌లో క్రిప్టో కరెన్సీని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2018లో నిషేధించింది. అయితే సుప్రీంకోర్టు ఈ నిర్ణయాన్ని 2020లో తోసిపుచ్చింది. ఈ తీర్పు క్రిప్టో కరెన్సీల వ్యాపారాన్ని సులభతరం చేసింది. దీంతో దేశంలో క్రిప్టో కరెన్సీని ఆమోదించేందుకు కేంద్రం క్రిప్టో కరెన్సీ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ అఫిషియల్ డిజిటల్ కరెన్సీ బిల్లును సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. దేశంలో క్రిప్టో ఇన్వెస్టర్లు పెరుగుతుండడంతో గత మూడేళ్లలోనే 10కి

పైగా ఎక్స్ఛేంజీలు పుట్టుకొచ్చాయి. గత కొన్నేళ్లుగా ఇందులో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తుంది. ఇది కేవలం పెద్ద పెద్ద మెట్రో పాలిటన్ నగరాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. చిన్న చిన్న పట్టణాలు, గ్రామాల్లో సైతం మదుపరులు ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇటీవలే బ్రోకర్ చూస్ అనే సంస్థ అందించిన నివేదికల ప్రకారం మనదేశంలో 10.07 కోట్ల మంది వద్ద క్రిప్టో కరెన్సీ ఉంది. ప్రపంచం మొత్తంలో 2.4 లక్షల కోట్ల డాలర్ల క్రిప్టో కరెన్సీ ఉంది.

క్రిప్టో కరెన్సీ అంటే ఏమిటి?

ఇది కంప్యూటర్ జనరేటెడ్ డిజిటల్ కరెన్సీ. దీనికి ఒక భౌతిక రూపం ఉండదు. దీన్ని భౌతికంగా తాకలేం. కానీ డిజిటల్ రూపంలో దాచుకోవచ్చు. ఇది ఏ దేశానికి చెందిన కరెన్సీ కాదు. దీనికి పాలకులు లేరు, సరిహద్దులు లేవు. ఇది అంతర్జాతీయ వర్చువల్ కరెన్సీ, దీన్నే ప్రైవేట్ కరెన్సీ అని కూడా అంటారు. ఈ డిజిటల్ డబ్బుకు ఒక నియంత్రణ వ్యవస్థ అంటూ లేదు. భద్రతా అంతకన్నా లేదు. ఈ మాయలో పడ్డ కొందరు రాత్రికి రాత్రే సంపన్నులయ్యారు. అత్యధికులు దివాళా తీశారు. అయితే పేటిఎం, గూగుల్ పే లాగానే ఇది కూడ ఓ వాలెట్. దీన్ని క్రిప్టోగ్రఫీ, ఎన్క్రిప్షన్ కరెన్సీ అని కూడ పిలుస్తారు. ప్రపంచంలో ఎవరైనా ఎక్కడి నుంచైనా దీన్ని ఆపరేట్ చేయవచ్చు. ఒరిజినల్ కరెన్సీకి ఎక్స్ఛేంజ్‌గా వాడతారు. ఏ ప్రభుత్వ ఆధీనంలో ఉండదు. ఏ బ్యాంకుకి దీంతో సంబంధం లేదు. కాబట్టి లావాదేవీలపై యూజర్ ఛార్జీలు ఉండవు, ఎంత మొత్తంలోనైనా లావాదేవీలు నిర్వహించవచ్చు. ఇది పూర్తిగా రహస్య కరెన్సీ. ఇది పూర్తిగా వికేంద్రీకృత వ్యవస్థ.

క్రిప్టో కరెన్సీ ఎలా పనిచేస్తుంది?

క్రిప్టో కరెన్సీ 'బ్లాక్ చెయిన్ టెక్నాలజీ' ఆధారంగా పనిచేస్తుంది. లక్షలాది కంప్యూటర్లలో విస్తరించి ఉండే వికేంద్రీకరణ సాంకేతికత ఇది. ఇది వర్చువల్ డీసెంట్రలైజ్డ్ కరెన్సీ. ఇది కంప్యూటర్‌లో దాచుకునే ఒక ఫైల్ లాంటిది. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లలో డిజిటల్ వ్యాలెట్ మాదిరిగా దాచుకోవచ్చు. ఇది పేపాల్ (పేపాల్ అనేది ఒక యాప్. దానికి క్రెడిట్ కార్డ్ సమాచారాన్ని లింక్ చేసి మీరు ఎక్కడి నుంచైనా వస్తువులను కొనే విధానం) వంటి డిజిటల్ ఖాతాల మాదిరిగానే పనిచేస్తుంది. క్రిప్టో కరెన్సీ అధికారికం చేసిన దేశాలలో ఈ కరెన్సీని ఉపయోగించి వస్తుసేవలను కొనుగోలు చేయవచ్చు. భారత్‌లో క్రిప్టో కరెన్సీతో వస్తువులను కొనలేం. కానీ రూపాయిలను క్రిప్టో కరెన్సీ వ్యాలెట్‌కి లోడ్ చేసి ట్రేడ్ చేసే అవకాశం ఉంది. అలాగే ఎవరైనా అనుమతిస్తే, వారి వ్యాలెట్‌కి పంపవచ్చు. లావాదేవీని పూర్తి చేయడానికి మీకు ప్రైవేట్‌కీ మధ్య పాస్‌వర్డ్ అవసరం.

బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ఇతర అవసరాలు నెరవేర్చుకోవచ్చు. ఉదాహరణకు నగదు చెల్లింపులు, స్టాక్ ఎక్స్ఛేంజీ తరహ ఆర్థిక వ్యవహారాలు, ఇన్సూరెన్స్ సేవలు, రియల్ ఎస్టేట్, ఎన్నికల్లో ఓటింగ్ మొదలైనవి. ఒక్క విషయం గుర్తించాలి. వంద రూపాయల నోటు విలువ... ప్రభుత్వం రద్దు చేయనంత వరకూ అంతే ఉంటుంది. కానీ క్రిప్టో కరెన్సీకి ఉండే విలువ మాత్రం.. చెల్లించే వారిపై ఆధారపడి హెచ్చు తగ్గులకు లోనవుతూంటుంది. ఫలానా క్రిప్టో కరెన్సీకి డిమాండ్ బాగా ఉంది. కానీ సరఫరా తక్కువ ఉందీ అంటే విలువ పెరుగుతుంది. కొనేవాళ్లు తగ్గితే డిమాండ్ తగ్గుతుంది. విలువ కూడ తగ్గుతుంది. అలాగే మైనింగ్ పద్ధతి ద్వారా ఒక క్రిప్టో నాణెన్ని ఉత్పత్తి చేసేందుకు ఎంత ఖర్చవుతుందన్న అంశంపై కూడా దాని విలువ ఆధారపడి ఉంటుంది. మార్కెట్‌లో ఉన్న ఇతర క్రిప్టో కరెన్సీలు కూడా ఒక్కో దాని విలువను నిర్ణయిస్తుంటాయి.

క్రిప్టో కరెన్సీని సంపాదించడమెలా?

క్రిప్టో కాయిన్ ఉత్పత్తి విధానమే విలక్షణమైంది. బిట్‌కాయిన్‌లను స్వంతం చేసుకోవడానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి సాధారణ పేపర్ కరెన్సీతో కొనుగోలు చేయడం. రెండవది, మైనింగ్. మైనింగ్ అంటే ఏమిటి? మైనింగ్ ఎలా చేయాలి? అత్యంత శక్తివంతమైన కంప్యూటర్ అల్గారిథమ్(కలన గణితం) ద్వారా సృష్టించిన ఒక గణితశాస్త్రపు చిక్కుముడిని విప్పడం, దీన్నే మైనింగ్ అంటారు. తొలిసారి 2008లో సతోషి నకమోటి 50 బిట్‌కాయిన్‌లు మైనింగ్ చేశాడు. ఆ తర్వాత అవి ఎన్ని చేతులు మారింది రికార్డ్ అయి ఉంటుంది. దీన్నే 'బ్లాక్ చెయిన్' టెక్నాలజీ అంటారు. ఈ చెయిన్‌ను మార్చే శక్తి ఏ హ్యాకర్‌కూ ఉండదు. ప్రతి బిట్‌కాయిన్ లావాదేవీలు బ్లాక్ రూపంలో ముందున్న బ్లాక్‌కు జోడవ్వాలి. ఇలా జోడించాలంటే అత్యంత క్లిష్టమైన గణిత సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అందుకు అత్యంత శక్తివంతమైన, ఖరీదైన కంప్యూటర్లు కావాలి. అత్యంత ఖరీదైన 'అప్లికేషన్–స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఎఎస్ఐసి) అనే హార్డ్‌వేర్ కావాలి. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమయం కూడ చాల అవసరం.

మైనింగ్‌కు కరెంటు విపరీతంగా ఖర్చవుతుంది. పర్యావరణ సమస్య తలెత్తుతుంది. కొత్త లావాదేవీలు తాలూకూ బ్లాక్‌ను ముందున్న బ్లాక్‌తో అనుసంధానించడానికి ప్రపంచవ్యాప్తంగా చాలా మంది కృషి చేస్తుంటారు. వారిలో ఎవరు ముందుగా ఆ బ్లాక్‌కు సంబంధించిన గణిత సమస్యను పరిష్కరిస్తారో వారి పేరిట ఆ రికార్డు నమోదవుతుంది. దానికి నజరానాగా వారికి కొన్ని బిట్‌కాయిన్లు వస్తాయి. దీన్నే మైనింగ్ అంటారు. ఈ లావాదేవీలపై ఏ కేంద్ర బ్యాంకు/ప్రభుత్వ జోక్యం, అజమాయిషీ ఉండవు కాబట్టి అక్రమ సంపాదన పరులు డబ్బును క్రిప్టో కరెన్సీల్లోకి మార్చుకుని భారీ లావాదేవీలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే పన్నులు ఎగ్గొట్టవచ్చు. ఫలితంగా క్రిప్టోకు డిమాండ్ బాగా పెరుగుతోంది. దాంతోపాటే విలువ కూడా పెరుగుతూ వస్తోంది. వర్చువల్ కరెన్సీలో మదుపరులెవరో ఎవరికీ తెలియదు గనుక డ్రగ్స్ మాఫియాలకు, అంతర్జాతీయ హవాలాకు ఇది మంచి వాటంగా ఉంటుంది.

భద్రత, చట్టబద్ధత ఉంటుందా?

క్రిప్టో కరెన్సీ లావాదేవీలు ప్రతీది రికార్డ్ అవుతాయి. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా పబ్లిక్ లెడ్జర్‌లో లావాదేవీలను రికార్డ్ చేస్తారు. వీటిని హైక్ చేయడం కుదరదు. ఎందుకంటే ఇవి క్రిప్టోగ్రఫీ అనే సిస్టమ్‌తో సెక్యూర్ చేస్తారు. ప్రస్తుతం పదివేల రకాల క్రిప్టో కరెన్సీలు అందుబాటులో ఉన్నప్పటికీ బిట్‌కాయిన్‌కి క్రేజ్ ఎక్కువ. దీంతో పాటు ఇథీరియమ్, బిట్‌కాయిన్ క్యాష్, రిపిల్, లైట్ కాయిన్, ఎన్ఇఎమ్, డాష్ వంటి క్రిప్టో కరెన్సీలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వీటిని వాడుతున్నారు. అయినప్పటికీ ఏ దేశం ఇంటర్నెట్‌ను నియంత్రించదు. క్రిప్టో కరెన్సీ

కూడా కొంతవరకు ఇంటర్నెట్ లాంటిదే. ఏ దేశం నియంత్రణలోనూ ఉండదు. ఏ బ్యాంకు నియంత్రణ చేయదు కాబట్టి చట్టబద్ధత ఉండదు. న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశమూ తక్కువే. సాధారణ ప్రజలకు అధిక రాబడి ఆశ చూపించి వారిని మోసం చేసే అవకాశాలు ఉన్నాయి. ఇంతకాలం బ్యాంకులు, బీమాలు, బంగారమంటూ దేశంలోనే పెట్టుబడులుండేవి. ఇప్పుడీ క్రిప్టో పెట్టుబడులతో డబ్బు దేశం దాటే ప్రమాదం ఉంది.

ఎలా కొనాలి... ఎలా అమ్మాలి?

స్టాక్ మార్కెట్‌లో షేర్లు కొన్నట్టే క్రిప్టో కరెన్సీని ఎక్స్ఛేంజీలలో కొనవచ్చు, అమ్మవచ్చు. షేర్ల లావాదేవీలను బ్రోకరేజ్ సంస్థలతో చేసినట్టే... క్రిప్టో ఎక్స్ఛేంజీల ద్వారా చేసుకోవచ్చు. ఏదో ఒక ఎక్స్ఛేంజీని ఎంపిక చేసుకుని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. కెవైసి పత్రాలను అప్‌లోడ్ చేస్తే మీ అకౌంట్ సిద్ధం అవుతుంది. ఆ అకౌంట్ (వాలెట్)లోకి బ్యాంక్ ఖాతా నంబర్ లేదా డెబిట్ కార్డు నంబర్ ద్వారా నగదును బదిలీ చేయవచ్చు. వాలేట్ లోకి డబ్బు వచ్చాక నచ్చిన క్రిప్టో కాయిన్ కొనుగోలు చేయెుచ్చు. 24 గంటలు మీరు లావాదేవీలు జరుపుకోవచ్చు. ఇవాళ ఎక్స్ఛేంజీలు కుప్పలు తెప్పలుగా వచ్చేస్తున్నాయి. అందులో కాయిన్ స్విచ్, కుబేర్, వజీర్ ఎక్స్, యూనో కాయిన్, జెబ్ పే, కాయిన్ డీసీ ఎక్స్ వంటివి ప్రముఖ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజీలు. క్రిప్టో కరెన్సీని స్టాక్ మార్కెట్‌తో పోలుస్తున్నాం కాబట్టి ఈ వాలెట్ అనేది డీమ్యాట్ అకౌంట్ లాంటిదే. రహస్య కోడ్ ద్వారా ఎప్పుడైనా ఎక్కడైనా మన క్రిప్టో కరెన్సీని వాడుకోవచ్చు. లావాదేవీలు చేయెుచ్చు.

ఇన్వెస్టర్లను తప్పుతోవ పట్టిస్తున్న ఎక్స్ఛేంజీలు

నిజానికి క్రిప్టో కరెన్సీ ఇన్వెస్టర్లు ఒక అదృశ్య భూతాన్ని వెంటాడుతున్నారు. లాభార్జన తప్ప మరో ఆలోచన లేని ఇన్వెస్టర్లు క్రిప్టో కరెన్సీతో ట్రేడింగ్ చేస్తున్నారు. క్రిప్టో కరెన్సీలకు ప్రాథమిక విలువ అనేది లేదు. ఎక్స్ఛేంజీలు విలువ కట్టొచ్చు కానీ, క్రిప్టో కరెన్సీ విలువ నిర్ధారించలేం. ఎక్స్ఛేంజీలకు ఎంత ఎక్కువ మంది వస్తే వారికి అంత కమీషన్ వస్తుంది. వాటికి టర్నోవర్ లాభాలు కావాలి. అంతకు మించి వాటికి వేరే ఆసక్తి ఉండదు. క్రిప్టో కాయిన్ ధర తగ్గిందా, పెరిగిందా, ఎవరికి లాభం వచ్చింది, ఎవరు నష్టపోయారు అనేది వాటికి అనవసరం. మరోపక్క ఇన్వెస్టర్లకు క్రిప్టో కాయిన్ కొని, అమ్మితే లాభం వస్తుందనే ఆశ ఉంటుంది. అందువల్ల ఎక్కువ మందిని ఆకర్షించేందుకు వాస్తవ విరుద్ధమైన పరిస్థితులను క్రిప్టో పరిశ్రమ సృష్టిస్తోంది. మీడియాలో బహుళ ప్రచారం, ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ప్రకటనలు, సినిమాతారలు, క్రికెట్ ఆటగాళ్లతో ప్రకటనలు చేయిస్తోంది.

పెట్టుబడులకు గ్యారంటీ ఉంటుందా?

మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్ మాదిరిగానే క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల్లో కూడా రిస్క్ ఉంటుంది. అయితే షేర్ ట్రేడింగ్, మ్యూచువల్ ఫండ్లకు ప్రభుత్వం నియమించిన సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ బోర్డ్ ఇండియా(సెబి) నియంత్రణ ఉంటుంది. కానీ క్రిప్టో కరెన్సీ ఏ నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదు కాబట్టి అధిక రిస్క్ ఉంటుంది. ఇది డిమాండ్ అండ్ సప్లయ్ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది. గిరాకి పెరిగితే కరెన్సీ విలువ అమాంతం పెరిగే అవకాశం ఉంటుంది. అంతే త్వరగా పడిపోయే అవకాశం కూడా ఉంటుంది. ఒక్కోసారి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోవచ్చు. మదుపరులు నష్టపోయినా నిర్వాహకులకు మాత్రం కమీషన్లు వస్తాయి. అందువల్ల ఇది ఒక జూదం లాంటిదే. క్రిప్టో కరెన్సీకి వాడకం పెరగడం వల్ల భవిష్యత్తులో అనేక రకాల స్కాములు వెలుగు చూసే అవకాశం ఉంది. దేశంలో ద్రవ్యవిధానానికి మార్గదర్శనం చేసే కేంద్రీయ బ్యాంకులేవీ వీటిని నియంత్రించలేవు. కాబట్టి, ఈ కరెన్సీ కాని కరెన్సీకి రకరకాల క్రిప్టో కరెన్సీల నిర్వాహకులకీ అడ్డూ అదుపూ ఉండదు.

ఇప్పటికీ భారతదేశంలో సాంప్రదాయిక స్టాక్ మార్కెట్‌లో కన్నా 5 రెట్లు ఎక్కువమంది క్రిప్టోలో పెట్టుబడులు పెట్టారన్నది విస్తుపోయే వాస్తవం. వారిలో 15 శాతం మంది స్త్రీలే. ఎక్కువగా 18 నుంచి 40 లోపు వాళ్లే. లెక్కిస్తే భారతీయ క్రిప్టో యూజర్ సగటు వయసు పట్టుమని పాతికేళ్లే. యువతరం, అందులోనూ ఎక్కువగా దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్నవాసులు క్రిప్టో మోజులో పడుతున్నారు. ప్రస్తుతం దేశంలో 15 క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ఎక్స్ఛేంజీలున్నాయి. వీటి ద్వారా 10 కోట్లకు పైగా మంది క్రిప్టోల్లో పెట్టుబడులు పెట్టారు. 2020 ఏప్రిల్‌లో 90 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న భారతీయుల క్రిప్టో పెట్టుబడులు. ప్రస్తుతం 1,000 కోట్ల డాలర్లు (సుమారు రు. 75,000 కోట్లు) దాటాయని క్రైబాకో తాజా అధ్యయన నివేదిక వెల్లడించింది. ఒకప్పటి స్టాక్ మార్కెట్, డాట్‌కామ్ విజృంభణల ఫక్కీలో ఇప్పుడీ క్రిప్టో బూమ్ వచ్చింది. ఇది నిజంగా బూమా? లేక వట్టి బుడగేనా? ఆర్‌బిఐ నో అంటున్నా, ప్రభుత్వం నిషేధించలేం అంటుంది. అలాగని కొత్త కుంపటిని యథాతథంగా నెత్తికెత్తుకోలే మంటుంది. ఆర్థిక వేత్తలు మాత్రం దేశీయ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు స్థిరత్వానికి ముప్పు తెస్తుందని హెచ్చరిస్తున్నారు.

ముగింపు

క్రిప్టో కరెన్సీ వ్యవహారాలన్నీ ప్రైవేట్ యాజమాన్యం (ఎక్స్ఛేంజీ)లో లేదా వ్యక్తులతో కూడిన నెట్‌వర్క్‌లలోనే జరుగుతుంటాయి. నియంత్రించేందుకు, పర్యవేక్షించేందుకు అధికారిక సంస్థ అంటూ ఏది ఉండదు. లాభాల కంటే నష్టాలే ఎక్కువగా వచ్చే అవకాశముంది. ముందుగా చెప్పుకోవల్సింది డిజిటల్ కరెన్సీ కాయిన్స్ విలువలో హెచ్చు తగ్గుల గురించి బిట్ కాయిన్ కానివ్వండి లేదా మరో కాయిన్ కానివ్వండి నిత్యం హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. ఒకరోజు వేలల్లో పెరిగితే మరుసటి రోజు లక్షల్లో పడిపోతుంది. వందలో తొంభై శాతం నష్టపోయేందుకే అవకాశాలు ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. కట్టుబాట్లు ఉన్న స్టాక్‌మార్కెట్‌లోనూ స్కాములు జరుగుతున్నట్లే క్రిప్టో వాణిజ్య ప్రపంచంలోనూ మోసగాండ్లు తమ స్వార్థ ప్రయోజనాలు నెరవర్చుకునే అవకాశాలు ఉన్నాయి. 2019లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం బిట్‌కాయిన్ వ్యవహారం నడిపే వారిలో 25 శాతం మంది అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. అలాగే 46 శాతం వ్యవహారాలు కుబేరులు, డ్రగ్స్ విక్రయదారులు, ఆయుధాల విక్రయదారుల అక్రమాలు జరుగుతున్నట్లు తెలిపింది. మొత్తంగా క్రిప్టో కరెన్సీతో జాతీయ ఆర్థిక వ్యవస్థకు, స్థిరత్వానికి ముప్పు ఏర్పడుతుంది. ఇలాంటి అవ్యవస్థీకృత మారకాల్ని నిరోధించకపోతే దేశంలో హవాలా లాంటి ఘటనలు తిరిగి పునరావృతం కావచ్చు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

జర్మనీ రాజకీయ పరిణామాలు

ఏంజెలా మెర్కెల్ శకం ముగిసినా, ఓఫెల్ షోల్జ్ జర్మనీ చాన్సెలర్ పీఠం ఎక్కినా ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాలను అమలులోకి తేవడం అంత సులభం కాదంటున్నారు **సంతోష్**

జర్మనీ బుండెస్టాగ్(పార్లమెంటు)కు సెప్టెంబర్ 26న జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి కనీస మెజారిటీ రాలేదు. ఛాన్సెలర్ ఏంజెలా మెర్కెల్‌కు చెందిన సెంటర్ రైట్ క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు) ఆధిక్యత కోల్పోయింది. ఆమె పార్టీ 24.1 శాతం ఓట్లు, 197 సీట్లు పొందింది. గత ఏడున్నర దశాబ్దాల కాలంలో క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీకి ఇంత తక్కువ ఓట్లు ఏ ఎన్నికల్లో రాలేదు. ప్రత్యర్థి సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్‌పిడి) 25.7 శాతం ఓట్లు, 206 సీట్లు పొందింది. ఎస్‌పిడి నిన్నటి దాక సిడియుతో కలిసి అధికారం పంచుకున్న పార్టీయే కావడం గమనించాల్సిన విషయం. ఈసారి జర్మన్ ప్రజాభిప్రాయం సెంటర్ రైట్ నుండి సెంటర్ లెఫ్ట్‌కు మలుపు తిరిగినట్లు స్పష్టమైంది. ఎవరికివారు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతున్న సిడిపి-ఎస్‌డిపిల మధ్య ఆర్థిక రాజకీయ విధానాల్లో తేడా లేదు.

ఈ ఎన్నికల తీర్పులో రెండు మౌలిక అంశాలు వ్యక్తం అవుతున్నాయి. మొదటిది తూర్పు జర్మనీ ప్రాంతంలో వామ పక్షానికి ఓటు బ్యాంక్ పెరిగింది. రెండవది 2017 నాటి ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు సంపాదించిన సిడియు తాజా ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో మాత్రమే ఆధిక్యత నిలుపుకుంది. క్రిస్టియన్ డెమోక్రాట్స్ యూనియన్ పార్టీ పేదలు, సంప్రదాయ క్రిస్టియన్‌లలో, వృద్ధులలో పట్టు కలిగి ఉంది. ప్రోగ్రెసివ్ గ్రీన్స్ విద్యావంతుల్లో పట్టు కలిగి ఉంది. వ్యాపార ఆధారిత ఫ్రీ డెమోక్రటిక్ పార్టీ సంపన్న వ్యాపార, పారిశ్రామిక వర్గాలలో పట్టు కలిగి ఉంది. వామపక్ష పార్టీ డి లింకె శ్రామిక వర్గాలలో పట్టు కోల్పోయింది. హిట్లర్ వారసత్వాన్ని కొనసాగించే జర్మనీ ప్రత్యామ్నాయ పార్టీ క్రమంగా ప్రజాధరణను కోల్పోతోంది. ఈ నేపథ్యంలో జర్మనీలో ప్రత్యామ్నాయం చూపించే లక్ష్యంతో ఎన్నికల తెరమీదికి వచ్చిన గ్రీన్స్ పార్టీ తాను ఎంచుకున్న పరిమిత స్వభావ కారణంగా దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయం కాలేకపోయింది.

2005 నుండి ఛాన్సెలర్ (ప్రధాని)గా పనిచేస్తున్న మెర్కెల్‌కు అత్యంత జనామోదం ఉన్నప్పటికీ ఆమె ఎన్నికల నుండి వైదొలిగింది. అదే పార్టీకి చెందిన కొత్తనాయకుడు ఆర్మిన్ లాస్చెట్ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన స్థానాలు పొందలేకపోయాడు. 2017 ఎన్నికల్లో కూడా ఏ పార్టీకి కనీస మెజారిటీ లభించకపోవడంతో మెర్కెల్ నాయకత్వంలో సిడియు, ఎస్‌పిడి జాతీయ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ఎస్‌పిడి నాయకుడు ఓలాఫ్ షోల్జ్ ఆమె మంత్రివర్గంలో ఆర్థికమంత్రిగా ఉన్నారు. అయినా ఈసారి రెండు పార్టీలు విడిగా కూటమిల ఏర్పాటుకు ప్రయత్నించాయి. సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు ఓలాఫ్ షోల్జ్ కూటమి ఏర్పాటు చేయడంలో ఫలప్రదమయ్యాడు. ఓలాఫ్ షోల్జ్ చాన్సలర్‌గా జర్మనీ ప్రభుత్వం డిసెంబర్ 8న ఏర్పడింది.

జర్మనీ ఎన్నికల విధానం మన దేశ ఎన్నికల విధానానికి భిన్నంగా ఉంటుంది. ప్రతి ఓటరు రెండు ఓట్లు వేస్తాడు. ఒకటి స్థానిక అభ్యర్థికి, రెండవది పార్టీకి వేస్తాడు. దీన్ని మిశ్రమ అభ్యర్థుల దామాష ఎన్నికల విధానం అని అంటారు. అందువల్లనే జర్మనీ ఎన్నికలను ఫెడరల్ ప్రజాస్వామ్య ఎన్నికలంటారు. ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రానందున సంకీర్ణం తప్ప మరోమార్గం లేదు. సంకీర్ణాలు జర్మనీలో కొత్తేమి కాదు. పార్లమెంట్ మొదలు ప్రాథమిక స్థాయి వరకు జరిగే ఎన్నికల్లో ఆయా స్థల, కాల పరిస్థితులను బట్టి వేరు వేరు సంకీర్ణాలు గత ఏడు దశాబ్దాలుగా ఏర్పడుతూ వస్తున్నాయి. నూతన సంకీర్ణ ప్రభుత్వం మితవాద శక్తులకు ప్రాతినిధ్యం లేకుండా ఏర్పడితే జర్మనీ ప్రజల రాజకీయ ఆకాంక్షలు కొంతలో కొంతైనా నెరవేరే అవకాశం ఉంటుంది.

జర్మనీ ఎన్నికల ఫలితాలు

ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు షోల్జ్ మాట్లాడుతూ జర్మనీలో దీర్ఘకాలంగా సంకీర్ణ ప్రభుత్వాలే పనిచేస్తున్నాయని, అందువల్ల ఇయు సుస్థిరతకు భంగం వాటిల్లదని ఆయన యూరప్ దేశాలకు భరోసా ఇచ్చారు. ఆయా పార్టీలకు లభించిన పాపులర్ ఓటును బట్టి 709 సీట్లు గల బుండెస్టాగ్‌లో వివిధ పార్టీల సభ్యుల సంఖ్య- ఎస్‌పిడి 206, సిడియు 196, ఎఫ్‌డిఎ 92, గ్రీన్స్ 118, పచ్చి మితవాద ఎఎఫ్‌డి 83, వామపక్ష పార్టీ డి లింకె 39. గత ఎన్నికలతో పోల్చితే పచ్చి మితవాద ఎఎఫ్‌డి ఓటు 12.6 నుండి 10.3 శాతానికి, డి లింకె ఓటు 9.2 నుండి 4.9 శాతానికి, సిడియు ఓటు 33 నుండి 24.1 శాతానికి తగ్గగా, ఎస్‌పిడి ఓటు 20.5 నుండి 25.7 శాతానికి పెరిగింది. అలాగే గ్రీన్స్ ఓటు 8.9 నుండి 14.8 శాతానికి, ఎఫ్‌డిపి ఓటు 10.7 నుండి 11.5 శాతానికి పెరిగింది. గ్రీన్స్ పార్టీతో వామపక్ష పార్టీకి మధ్య సంబంధాలు సన్నిహితంగా ఉన్నాయి. అయితే పార్లమెంటులో ప్రవేశించడానికి పొందాల్సిన 5 శాతం ఓట్లు వామపక్ష పార్టీ డిలింకే పొందలేక పోయింది. ఇక హిట్లర్ వారసత్వ పార్టీ జర్మనీ ప్రత్యామ్నాయం పార్టీకి 12.6 శాతం నుండి 10.3 శాతానికి ఓట్లు తగ్గాయి. అయినా 83 సీట్లు పొందింది.

మెర్కెల్‌కు తగ్గిన ప్రజాదరణ

16 సంవత్సరాలు జర్మనీకి తొలి మహిళ ఛాన్సలర్‌గా ఎన్నికై రికార్డ్ సృష్టించింది. జర్మనీ ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసింది. ఇయు ఐక్యతను కాపాడడంలో ఆమె పాత్రను అందరు ప్రశంసించారు. ఆమె పాలన కాలంలో ఎదురైన సంక్షోభాలను దీటుగా ఎదుర్కొని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది

మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. పలు దేశాల్లో నిరంకుశవాదం పెచ్చరిల్లుతున్న కాలంలో తద్భిన్నంగా ఆమె జర్మనీలో ఉదారవాద ప్రజాస్వామ్య దివిటీ ఎత్తింది. సిరియా శరణార్థులను దేశంలోకి అనుమతించింది. జర్మనీ, ఇయులను అనేక సంక్షోభాల నుండి గట్టెక్కించింది. ఇలా 16 ఏళ్ల పాటు ఏకదాటిగా చాన్స్‌లర్ పదవిలో కొనసాగిన ఆమె ప్రస్థానం డిసెంబర్ 8తో ముగిసింది. అయితే గత నాలుగేళ్ల పాలనలో మెర్కెల్ ప్రభుత్వం ఇరాక్ మొదలు ఆఫ్ఘనిస్తాన్ వరకు, సిరియా నుంచి జోర్డాన్ వరకు, ఫారిస్ పర్యావరణ సదస్సు మొదలు ప్రపంచ ఆరోగ్య సంస్థ వరకు జరిగిన అనేక పరిణామాలలో అటు జర్మనీ ప్రయోజనాలు గానీ, ఇటు యూరోపియన్ యూనియన్ ప్రయోజనాలను గానీ కాపాడడంలో విఫలమైంది. కరోనా కట్టడి చేయడంలో తగినంత శ్రద్ధ చూపలేదని, నిధులు కేటాయించలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. కరోనా వైరస్‌తో ఒక లక్ష మంది చనిపోయారు. ఈ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి వలసవాదులే జర్మనీ అభివృద్ధికి ఆటంకం అని మెర్కెల్ చేసిన వాదనను జర్మనీ ప్రజలు స్వీకరించలేదని ఈ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. అందువల్ల ఈ ఎన్నికలు జర్మనీ రాజకీయ రంగంలో నెలకొన్న దిశా రాహిత్యానికి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి.

16 సంవత్సరాలు చాన్సెలర్(ప్రధాని)గా పనిచేసిన ఏంజెలా మెర్కెల్ జర్మనీ ప్రజల జీవన ప్రమాణాలను సాపేక్షంగా పెంచడంలో విఫలమైంది. ఇంటర్‌నెట్ యుగంలో జర్మనీలో బ్రాడ్ బ్యాండ్ స్పీడ్ తగినంత లేకపోవడం కూడ ఒక సమస్యగా ముందుకు వచ్చింది. ఏంజెలా మెర్కెల్ తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ప్రజల మధ్య మత వైరుధ్యాలు సృష్టించింది. ఫలితంగా ప్రజల మధ్య శాంతి సామరస్యాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితి ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచింది. ఆర్థికంగా యూరోపియన్ యూనియన్‌కు నాయకత్వం వహించే సత్తా కలిగిన జర్మనీ రాజకీయంగా దిశానిర్దేశం చేయడంలో విఫలమైంది. అంతర్జాతీయ ఆధిపత్య పోరులో జూనియర్ భాగస్వామిగా అమెరికా విధానాలను తు.చ. తప్పకుండా ఆమె అనుసరించింది. అదే సమయంలో రష్యా, చైనా, భారత్‌లతో వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకుంది.

త్రిముఖ సంకీర్ణ కూటమి

736 సీట్లు గల జర్మనీ పార్లమెంటులో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 369 సీట్లు కావాలి. ఏ ఒక్క పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సీట్లు రానందున సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు అనివార్యమైంది. జర్మనీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్న సోషల్ డెమోక్రాట్ నేత ఓలాఫ్ షోల్జ్ సైద్ధాంతిక వైరుధ్యాలున్న గ్రీన్స్, ఫ్రీ డెమొక్రటిక్ పార్టీల మధ్య అక్టోబర్ 21 నుంచి నవంబర్ 24 వరకు పలు దఫాలుగా జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం ఒక అవగాహనకు వచ్చారు. నవంబర్ 24న విలేకరుల సమావేశంలో మూడు పార్టీలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో స్కోల్జ్ చాన్స్‌లర్‌గా కొనసాగేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిపారు. ఇవి మూడు భిన్నమైన భావజాలం కలిగిన పార్టీలు అయినందున చర్చల్లో కనీస ఉమ్మడి ప్రణాళికను ఒప్పుకోళ్లు, రాజీతో నిర్ణయించారు. ఆయా పార్టీలు ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు ఉమ్మడి ప్రణాళికలో చోటు చేసుకోలేదు. కనీస ఉమ్మడి కార్యక్రమ పత్రం 177 పేజీలు ఉంది. ఇందులో ఆయా పార్టీలు ప్రధానమైన అంశాలు, మంత్రిమండలి కూర్పు, ప్రభుత్వం చేపట్టబోయే ముఖ్యమైన కార్యక్రమాలు, నూతన ప్రభుత్వ దేశీయ, విదేశీ విధానాలను వివరించారు. విలేకర్ల సమావేశంలో ఓలాఫ్ షోల్జ్ మాట్లాడుతూ "మేము జర్మనీ పురోగతిపై నమ్మకంతో ఉన్నాం, దేశాన్ని మెరుగుపరచడానికి, ముందుకు సాగడానికి, కలిసి ఉండడానికి ఐక్యంగా ఉన్నాం" అని ప్రకటించాడు.

సంకీర్ణ కూటమిని ఆయా పార్టీల జెండాల రంగులను బట్టి ట్రాఫిక్ సిగ్నల్ కూటమిగా పేర్కొన్నారు. (సోషల్ డెమోక్రాట్స్(ఎరుపు), గీన్స్(పచ్చ), ఫ్రీ డెమోక్రాట్ (పసుపు). ఇక మంత్రి మండలిలో ఎస్‌డిపి నుంచి చాన్స్‌లర్ కాక మరో ఆరుగురికి, గ్రీన్స్ నుంచి ఐదుగురికి, ఫ్రీ డెమొక్రాటిక్ నుంచి నలుగురికి మంత్రి మండలిలో చోటు దక్కింది. ఎస్‌పిడి రక్షణ శాఖ, దేశీయ భద్రత, హౌసింగ్, కార్మిక-సామాజిక వ్యవహారాలు, అభివృద్ధి శాఖలు. గ్రీన్స్‌కి పర్యావరణ, విదేశీ వ్యవహారాలు, ఆరోగ్యం, ఇంధనం- వాతావరణం రక్షణ, కుటుంబ సంక్షేమం వ్యవసాయం. ఫ్రీ డెమోక్రాట్స్‌కి ఆర్థికశాఖ, విద్య-పరిశోధన, రవాణా, న్యాయశాఖలు నిర్వహిస్తారు. ఎఫ్‌డిపి నాయకుడు క్రిస్టియన్ లిండ్నర్ ఆర్థిక మంత్రిగా, గ్రీన్స్ పార్టీ నేత అన్నా లీస్ బేర్ బాక్ మొదటి మహిళ విదేశీ వ్యవహారాలు, ఎస్‌పిడికి చెందిన ప్రముఖ డా. లౌటన్ బాచ్ ఆరోగ్య మంత్రిగా, రక్షణ మంత్రిగా క్రిష్టన్ లాంబ్రేచ్ట్ వ్యవహరిస్తారు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1949 నుండి ఇప్పటివరకూ నాలుగు సంవత్సరాల కొకసారి జరిగే ఫెడరల్ పార్లమెంటు ఎన్నికల్లో 20 సార్లు క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగాయి. పాలనా విధానానికి పరిణతి చెందిన రాజకీయ పార్టీలు సుస్థిరతను అభివృద్ధిని అందించాయి. ప్రపంచ ఇంజనీరింగు రంగంలో ఇప్పటికీ అగ్రగామిగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. యూనివర్సిటీ వరకూ ఉచిత విద్య, ప్రజలందరికీ ఉచిత వైద్య బీమా జర్మనీ ప్రత్యేకత. క్రీడా-సాంస్కృతిక రంగాల్లో కీలక పాత్ర నిర్వహిస్తోంది. ఆర్థిక రాజకీయ రంగాలలో ముందుండి ఐరోపా యూనియన్(ఇయు)లో ప్రథమ స్థానంతో నాయకత్వం వహిస్తోంది. సుస్థిరతతో కూడిన సంకీర్ణ ప్రభుత్వాలకు జర్మనీ పెట్టింది పేరు. ఎన్నికల సమయంలో పార్టీలు భిన్న స్వరాలు వినిపించినా, పాలనా సమయాల్లో ప్రజల మేలు కోసం కలిసి పని చేయటం జర్మనీ రాజకీయ పార్టీల సంప్రదాయం. ప్రపంచ అగ్రగామిగా ఇకముందు కూడా ఉండటానికి ముఖ్యంగా ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవడంలో అక్కడి రాజకీయ పార్టీలు, పార్లమెంటు ఆదర్శనీయంగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు.

కూటమి ఉమ్మడి ప్రణాళిక

సంకీర్ణ కూటమి ప్రజలకిచ్చిన ప్రధాన హామీలు... కనీస వేతనం గంటకు 10 యూరోల నుంచి 12 యూరోలకు పెంపు, 4 లక్షల గృహాల నిర్మాణం, ఆస్తి పన్ను పెంపు వాయిదా, 2030 నాటికి శిలాజ ఇంధనాల వాడకం తగ్గించి 80 శాతం ఇంధన అవసరాలను పునరుత్పాదక వనరులతో తీర్చుకోవడం, గంజాయి వాణిజ్యాన్ని చట్టబద్ధం చేయడం, ఆర్థిక స్థిరత్వాన్ని ద్రవ్యలోటును తగ్గించుకోవాలి. యూరోపియన్ యూనియన్‌ను బలోపేతం చేయడం వంటి ప్రధాన అంశాలుగా ఉన్నాయి. ఇక విదేశీ విధానంలో రష్యా, చైనా దేశాల్లో మానవ హక్కుల రక్షణ గురించి మాట్లాడకూడదు. ఎందుకంటే మానవ హక్కుల రక్షణ అంటే చైనా, రష్యాలకు ఇబ్బందికరంగా ఉంటుందట. ఇక ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికాతో కలిసి నడవడమే. ఫ్రాన్స్‌తో

దృఢమైన స్నేహాన్ని కొనసాగించాలి. ఇటలీ, స్పెయిన్ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో ఉన్నాయి. ఆ దేశాలకు సహకరించాలి. చైనా, రష్యాలతో వాణిజ్యాన్ని కొనసాగించాలి. ప్రధానంగా నూతన ట్రాఫిక్ సిగ్నల్ కూటమి పౌరసత్వం, వలసల పట్ల సరళమైన చట్టాలు తేవాలని భావిస్తోంది. శరణార్థుల పట్ల మానవీయతతో వ్యవహరించాలి. ఓటింగ్ వయో పరిమితిని 16 సంవత్సరాలకు తగ్గించాలి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో ఏర్పడిన అతిపెద్ద సంక్షోభం కొవిడ్ విపత్తుగా నూతన ప్రభుత్వం గుర్తించింది. కరోనా పరిస్థితిని ప్రతిరోజు సమీక్షించడానికి జాతీయ, ప్రాంతీయ నాయకులతో పాటు వైరాలజిస్టులు, ఎపిడెమియాలజిస్టులు, సామాజిక శాస్త్రవేత్తలు, మనస్తత్వ వేత్తలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడానికి వేతనాల సవరణ ఆకర్షణీయంగా చేయాలన్న సంకల్పాన్ని ప్రకటించింది. రష్యా నుండి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత బ్యూరోక్రాటిక్ అడ్డంకులను తొలగించడం లక్ష్యంగా, జర్మనీని డిజిటల్‌గా మార్చాలన్న సంకల్పం నూతన ప్రభుత్వం కలిగి ఉంది. కొత్త రుణాలపై తాత్కాలిక నిషేధం ప్రకటించింది. భవిష్యత్తులో విద్య ఒక కీలక పెట్టుబడిగా కూటమికి ఏకాభిప్రాయం ఉంది. సంకీర్ణ ఒప్పందం ప్రకారం జర్మనీ "ప్రతి ఒక్కరికి వారి మూలంతో సంబంధం లేకుండా అత్యుత్తమ విద్యావకాశాలను అందించాలని, సమ్మిళిత విద్య ద్వారా భాగస్వామ్యం, సామాజిక చలనశీలతను ప్రారంభించడానికి, నిర్ధారించడానికి ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలలకు మద్దతు ఇవ్వాలని మూడు పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొత్త డిజిటల్ టెక్నాలజీ ద్వారా పాఠశాల వ్యవస్థను ఆధునికీకరించడానికి ప్రాధాన్యత ఇస్తారు. "సమకాలీన అభ్యాసన వాతావరణాలు, సృజనాత్మక ప్రయోగశాలలు" సృష్టించడం లక్ష్యంగా ప్రకటించింది.

మారని విదేశీ విధానం

జర్మనీ ఒక సామ్రాజ్యవాద దేశమే. ఆ దేశ వాణిజ్య, బహుళజాతి సంస్థల ప్రయోజనాల కనుకూలంగానే దాని విదేశీ విధానాలుంటాయి. జర్మనీ విదేశాంగ విధానానికి ఇయు ఇంటిగ్రేషన్ కేంద్రంగా ఉంటుంది. ఇయు ఉమ్మడి భద్రత, సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా దాని విధానాలు ఉంటాయి. యూరప్ బయట జర్మనీకి అమెరికా అత్యంత మిత్రదేశం. జర్మనీ భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. కొన్నేళ్లుగా ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బాగా బలపడ్డాయి. ప్రస్తుతం ఇండియాలో జర్మనీ కంపెనీలు 1,700కు పైగా ఉన్నాయి. జర్మనీలోనూ ఫార్మా, సమాచార, సాంకేతికత, ఆటోమోటివ్ తదితర రంగాల్లో వేల కోట్ల రూపాయల భారత పెట్టుబడులు ఉన్నాయి. 2009లో జర్మనీలో భారతీయుల సంఖ్య 46 వేలు. 2020 నాటికి అది దాదాపు లక్షకు చేరుకుంది. 2019-20 విద్యా సంవత్సరంలో ఆ దేశ విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య 25 వేలు దాటింది.

ఇయూ-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) ఇంకా కుదరలేదు. దీనికి సహకరిస్తామని గతంలో జర్మనీ హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా సరైన చొరవ చూపలేదు. 2013లో నిలిచిపోయిన ఎఫ్‌టిఏ చర్చల్లో మళ్లీ ఈ ఏడాది మేలో కాస్త కదలిక వచ్చింది. భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టిఏ) అమలులోకి వస్తే దాదాపు రు. 75 వేల కోట్ల మేర వ్యాపార ప్రయోజనాలు ఉంటాయని 2020లో యురోపియన్ పార్లమెంటు నిర్వహించిన ఓ అధ్యయనంలో తేలింది. ఈ పరిస్థితుల్లో జర్మనీ గట్టిగా మద్దతిస్తే ఒప్పందం సులభతరమవుతుంది. బ్రస్సెల్స్ కేంద్రంగా ఇయు కార్యకలాపాలు సాగిస్తున్న జర్మనీ, ఫ్రాన్స్‌లే ప్రధానంగా అందులో చక్రం తిప్పుతున్నాయి. ఆ సమాఖ్యలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జర్మనీ నిలుస్తోంది. దీనివల్ల కొత్త ఛాన్సెలర్ ఓలాఫ్ షోల్జ్ భారత్‌కు కీలకంగా మారనున్నారు. అయితే జర్మనీ ఏకపక్షంగా భారత్‌కు అండగా నిలిచే అవకాశాలు తక్కువే.

ఇయుకు డ్రాగన్ (చైనా) అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. జర్మనీతోనూ దానికి భారీస్థాయిలో వ్యాపార సంబంధాలున్నాయి. అందుకే మెర్కెల్ ఎప్పుడూ చైనాకు ఎదురుచెప్పలేదు. షోల్జ్ అధికార పీఠమెక్కినా డ్రాగన్ అభీష్టాలకు వ్యతిరేకంగా నడుచుకొనే అవకాశాలు దాదాపు ఉండకపోవచ్చు. అయినా, నల్లేరుపై నడకలా ఉండదు. ఎందుకంటే దూకుడుకు పెట్టింది పేరైన గ్రీన్ పార్టీకి చెందిన బేర్బాక్ మాత్రం అందుకు మినహాయింపు. చైనాకు వ్యతిరేకంగా ఇప్పటికే పలు వేదికలపై ఆమె గళం విప్పారు. చైనాతో వాణిజ్య విధానాలను కఠినతరం చేయాలని జర్మనీ, ఇయులకు గతంలో పిలుపిచ్చారు. జర్మనీలో 5జి నెట్‌వర్క్ విస్తరణ పనులకు చైనా కంపెనీ హువావై టెక్నాలజీని దూరం పెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇండో-పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి గతేడాది సెప్టెంబర్‌లో జర్మనీ నూతన వ్యూహాన్ని ఆమోదించింది. ఈ వ్యూహాన్ని కొనసాగిస్తూనే నూతన ప్రభుత్వం అంతర్జాతీయ భద్రత, పర్యావరణ మార్పులు, మానవ హక్కులు వంటి అంశాల్లో ఇండో-పసిఫిక్ దేశాలతో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించింది.

ముగింపు

జర్మనీలో ఏర్పడిన నూతన ట్రాఫిక్ సిగ్నల్ కూటమి ప్రభుత్వం తమ విభేదాలను విస్మరించి కొవిడ్ విపత్తును అరికట్టడానికి, కనీస వేతనాన్ని పెంచడానికి, పర్యావరణ రక్షణకు బొగ్గు వాడకాన్ని తగ్గించడానికి, ఆర్థిక వ్యవస్థను డిజిటలైజ్ చేయడానికి చర్యలు చేపట్టడం వంటి విధానాలతో ముందుకు సాగడానికి దృఢ నిశ్చయంతో ఉంది. ఇయు నుంచి బ్రిటన్ నిష్క్రమణతో ఐరోపా ఇంకా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. మరోవైపు ఉక్రేయిన్, బెలారస్ సరిహద్దు సమస్య పరిష్కారం షోల్జ్ ప్రభుత్వానికి సవాలుగా ఉంది. నూతన మంత్రివర్గం 16 మందిలో 8 మంది మహిళలు కావడం ఆహ్వానించదగింది. నూతన ప్రభుత్వానికి నిరుద్యోగ సమస్య కార్మిక వేతనాల పెంపు సవాలుగానే ఉంటుంది. ఏకకాలంలో అనేక దీర్ఘకాలిక, స్వల్పకాలిక సవాళ్లను ఎదుర్కోవడం నూతన ప్రభుత్వానికి సులభమేమి కాదు. ఎస్‌పిడి, గ్రీన్స్ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో సంపన్నులపై పన్నులు పెంచుతామన్నారు. వ్యాపార ఆధారిత ఫ్రీ డెమోక్రాట్స్ పన్నుల పెంపుకు వ్యతిరేకం, ఉమ్మడి ప్రణాళికలో పన్నులు పెంచబోమని తెలిపారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకోకుండా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం సాధ్యం కాదు. ఇక విధానపరమైన మార్పులు చేపట్టడానికి అవరోధంగా ఎగువసభలో క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ ఆధిక్యతలో ఉంది. అంతేకాదు 16 రాష్ట్రాలలో పదింట సిడియు బలంగా ఉన్నందున నూతన ప్రభుత్వం చట్టాలను మార్చడం లేదా నూతన చట్టాలు చేయడం అంత సులభం కాకపోవచ్చు. షోల్జ్‌కు పాలన పూల పాన్పుకాదు, కత్తిమీద సాము లానే ఉంటుంది. వీ

(రచయిత ఉపాధ్యాయులు)

బెంగాల్ వామపక్ష సంఘటన - సాంస్కృతిక రంగం

బూర్జువా - భూస్వామ్య సంస్కృతి స్థానంలో ప్రజాతంత్ర సంస్కృతి, కళలను కమ్యూనిస్టులు విస్తృతిలోకి తేనందువల్లే మతోన్మాద శక్తులు నేడు ఫాసిజాన్ని అమలుచేయడానికి అవకాశమేర్పడిందంటున్నారు **కొండూరి వీరయ్య**

కార్మికవర్గం నాయకత్వంలో విప్లవం సాధించాలనుకునే ఏ కమ్యూనిస్టు పార్టీ అయినా సాంస్కృతిక రంగంలో దాని కర్తవ్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలి. అంతకన్నా ఎక్కువ జాగ్రత్తగా కర్తవ్యాలనుగుణమైన కార్యాచరణను రూపొందించుకోవాలి. సాంస్కృతిక రంగంలో అంటే కేవలం మహా సభలు, బహిరంగ సభల్లో జనం పోగవటానికి ముందు సమయాన్ని సద్వినియోగం చేయటం కోసం పని చేయటం కాదు. కార్మికోద్యమ చైతన్యాన్ని, కమ్యూనిస్టు చైతన్యాన్ని, అవగాహనను ప్రజలకందించటంలో సాంస్కృతిక రంగం కీలక సాధనం. మావో సేటుంగ్ మాటల్లో "కళలు, సాంస్కృతిక రంగం ప్రాధాన్యతను అతిగా అంచనా వేసుకోవాల్సిన అవసరం లేదు. అలా అని తీసేయాల్సినదీ కాదు. కళలు, సంస్కృతిక రాజకీయాలకు లోబడే ఉంటాయి. కానీ రాజకీయాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపిస్తాయి. విప్లవ సాహిత్యం, కళా రూపాలు విప్లవ సాధన కోసం జరిగే ప్రయత్నాల్లో ఓ కీలకమైన భాగంగా ఉంటాయి. విప్లవ ప్రచారంలో కళలు, సంస్కృతి ఇరుసులాంటివి. విప్లవోద్యమంలో అనేక ఇతర అంశాలతో పోల్చినప్పుడు ఈ రంగం అంత ప్రాధాన్యత కలిగినదిగా కనిపించకపోవచ్చు. తక్షణమే సాగించాల్సిన కృషిగా కూడా అనిపించకపోవచ్చు. ముందుకొస్తున్న వేర్వేరు పనుల్లో ఈ రంగంలో కృషి వెనకపట్టు పట్టొచ్చు. కానీ విప్లవోద్యమం అన్న యంత్రం సాఫీగా నడవాలంటే ఈ ఇరుసు శక్తివంతంగా ఉండాలి. అందుకే సాంస్కృతిక రంగం యావత్ విప్లవోద్యమంలో కీలకమైన, విడదీయలేని భాగం.". పౌర సమాజాన్ని ప్రభావితం చేయటమే కాక కార్యోన్ముఖులను చేయటంలో సాంస్కృతిక రంగం కృషిని తిరస్కరించిన ఏ వామపక్ష ఉద్యమమూ ప్రజలను ఆకట్టుకున్న దాఖలాలు లేవు.

ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యానంతర భారతానికే మన పరిశీలన పరిమితం చేసుకున్నా దేశంలో ప్రత్యామ్నాయ సాంస్కృతికోద్యమ గమనం గురించి పరిశీలించినప్పుడు కొన్ని నిర్ధారణలకు మనం రావచ్చు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వలసవాదానికి వ్యతిరేకంగా సాగించిన సాంస్కృతిక పోరాటంతో పోల్చినప్పుడు స్వాతంత్ర్యానంతర భారతంలో బూర్జువా-భూస్వామ్య ఆధిపత్య సంస్కృతి స్థానంలో ప్రజాతంత్ర సంస్కృతి, కళలు, అవగాహన పెంపొందించేందుకు దీర్ఘకాల ప్రణాళికలను రూపొందించుకోవటంలో అన్ని స్రవంతులకు చెందిన వామపక్ష శక్తులు విఫలమయ్యాయి. ఈ ఆధిపత్య బూర్జువా భూస్వామ్య సంస్కృతే ప్రజలను ఏమార్చటంలో మత్తుమందులాగా పని చేస్తోంది. మతం, మత విశ్వాసాలు, మతోన్మాదం కూడా ఇందులో భాగమే. ప్రత్యేకించి గత శతాబ్ద కాలంలో మతోన్మాద శక్తులు, సంఘపరివారం సాంస్కృతిక రంగంలో సాగిస్తున్న దాడిని గుర్తించటం లోనూ, నిలువరించే ప్రయత్నం చేయటంలోనూ వామపక్ష ఉద్యమాలు, దేశంలో వామపక్ష ఉద్యమాలకు నాయకత్వ స్థానంలో ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ల వైఫల్యమే నేడు సాంస్కృతికోద్యమం రూపంలో విరుచుకుపడుతున్న భారతీయ తరహా నయా ఫాసిజానికి రెక్కలు తెచ్చింది. ప్రజా సంఘాల స్వతంత్ర పని విధానానికి తావులేని సాంప్రదాయక నిర్మాణం కూడా ఈ ప్రమాదం మరింత పెచ్చరిల్లటానికి దారితీసింది. ఇప్పటికైనా ఈ లోపాలను అధిగమించనిదే ప్రజల భాషలో ప్రజా కళా సాంస్కృతిక రంగాన్ని నిర్మించనిదే ఆచరణలో ప్రజలకు సాంస్కృతిక ప్రత్యామ్నాయాన్ని అందించలేస్త్ర. ఈ వైఫల్యం విప్లవ చైతన్యం, అవగాహన పెంపొందించుకునే అవకాశాలను ప్రజలకు మరికొంతకాలం దూరం చేసే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వామపక్ష సంఘటన బెంగాల్‌లో అధికారానికి రావటంలో సాంస్కృతిక రంగం పోషించిన పాత్రను కూడా మదింపు వేసుకోవటం అవసరం.

ఫాసిజం 1930 దశకంలో యావత్ ప్రపంచాన్ని సవాలు చేసింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవటంలో సోషలిస్టులే కాక మానవతావాదులు, ప్రజాతంత్రవాదులంతా చేతులు కలిపాలని 1935లో జార్జి డిమిట్రోవ్ పిలుపునిచ్చారు. వలస పాలన నాటి భారతదేశంలో సైతం ఈ పిలుపు స్ఫూర్తినందుకుని భిన్న స్రవంతులకు చెందిన పౌర మేధావులు ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా గళం విప్పారు. కలం పట్టారు. ఈ పిలుపులో భాగంగానే 1938లో నాటి అవిభక్త బెంగాల్‌లో విద్యార్థి సమాఖ్య ప్రారంభించిన ఉద్యమం 1940 నాటికి యువ సాంస్కృతిక వేదిక రూపం తీసుకుంది. ఈ వేదిక ద్వారా రాష్ట్రమంతటా ఫాసిస్టు వ్యతిరేక సాంస్కృతిక రూపాల నిర్మాణం, ప్రదర్శనలు జరిగాయి. అప్పటికే వలసవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనం దిశగా సాగిన అనేక మహోద్యమాలకు బెంగాల్ క్షేత్రంగా ఉన్నది. ఆయా ఉద్యమాలు అందించిన ఆధునిక సామాజిక విలువలు, మానవతా విలువలను పుణికి పుచ్చుకున్న తరం నవ బెంగాల్ నిర్మాణానికి అంకితమైంది. ఈ తరుణంలోనే నాజీ జర్మనీ సోవియట్ యూనియన్‌పై దాడి చేయటం, మరోవైపున ముంచుకొస్తున్న జపాన్ ఆక్రమణ ప్రమాదం కళ్లముందు కనిపించటంతో నిద్రాణంగా ఉన్న దేశభక్తి భావన కట్టలు తెంచుకుంది. అనేక వినూత్న సాంస్కృతిక రూపాల ఆవిష్కరణకు అవకాశం, అవసరం కల్పించింది. దేశమంతా విదేశాల నుండి తలెత్తే ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ ఉంటే ఆ కాలంలోనే హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రూపంలో దేశవాళీ ఫాసిజానికి పునాదులు పడ్డాయి. స్వాతంత్రోద్యమంలో భాగంగా ఉన్న పౌర మేధావులపై ఈ సంస్థలు దాడులకు పురిగొల్పాయి. ఇటువంటి పరిస్థితుల్లో అన్ని రకాల ఫాసిజాలకు వ్యతిరేకంగా మేధావులు ఏకమైన ఫాసిస్టు వ్యతిరేక రచయితల సంఘాన్ని 1941లో ప్రారంభించారు. ఈ కర్తవ్యాన్ని ప్రజలకు మరింత సన్నిహితం చేసే ప్రయత్నంలో నాటి ఉమ్మడి

కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకత్వంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ సంఘం ఆవిర్భవించింది.

బెంగాల్ రాజకీయాల్లో 1940 దశకం అత్యంత కీలకమైనది. ఓ వైపున సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా సాగే పోరాటాలు ఊపందుకుంటుంటే మరోవైపు బెంగాల్‌ను 1943లో కరువు కబళించింది. ఇటువంటి విషమ పరిస్థితుల్లోనే ప్రజా కళలు సాంప్రదాయక సాంస్కృతిక స్వభావాన్ని విడనాడి సరికొత్త రూపాన్ని, సారాన్ని అందిపుచ్చుకున్నాయి. చిత్త ప్రసాద్ చిత్రలేఖనం మొదలు భిభూతి భూషన్ బంధోపాధ్యాయ నవలల వరకూ భారతదేశాన్ని కుదిపిన అనేక సాంస్కృతిక సృజనలకు ఈ దశాబ్దం పునాదులు వేసింది. తొలిసారిగా సమాజంపై పెత్తనం చేస్తున్న వర్గం జీవన శైలి చిత్రణను పక్కకు నెట్టి రైతు, కౌలు రైతు, సాధారణ ప్రజా జీవనమే వస్తువుగా సాహితీ సృజన జరిగింది. సుకాంత, మాణిక్ బంధోపాధ్యాయ, సుభాష్ ముఖోపాధ్యాయ, సమరేష్ బసు, నారాయణ్ గంగూలి వంటి వందల మంది రచయితలు ఆవిర్భవించారు. సలిల్ చౌదరి, బినోయ్ రాయ్, హేమాంగ బిశ్వాస్ వంటి పలువురు సంగీత విద్వాంసులు ప్రజా కళలకు కృతులు సమకూర్చారు. ఈ పరిణామాలకు తలమానికం ఇండియన్ పీపుల్స్ థియేటర్ కృషి. నాబన్న వంటి కళారూపాలతో ప్రజా సాంస్కృతికోద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించింది. సాంస్కృతిక రంగంలో కమ్యూనిస్టు ఉద్యమం సాగించిన కృషి ప్రభావం ఎంత స్థాయికి చేరిందంటే చివరకు అప్పుడే మొగ్గతొడుగుతున్న ఆధునిక భారత చలన చిత్ర పరిశ్రమ సైతం సాధారణ ప్రజల జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించాల్సి వచ్చింది. భారతీయ ఆధునికతకు, వాస్తవికతవాదానికి అంకురార్పణ జరిగింది ఈ కాలంలోనే. బిమల్ రాయ్ దో భిగా జమీన్ సినిమాను ఈ చారిత్రక నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాతి కాలంలో బెంగాల్ సినీ రంగాన్ని శాసించిన రిట్విక్ ఘటక్, మృణాల్ సేన్ వంటి వారు ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఉద్యమం సమాజానికి అందించిన ఆణిముత్యాలే. దక్షిణ భారతదేశంలో సైతం ప్రత్యేకించి మద్రాసు కేంద్రంగా ఉన్న తెలుగు సినీ రంగంలో కూడా ఇటువంటి కొన్ని ఆణిముత్యాలను మనం గమనించవచ్చు.

స్వాతంత్ర్య సాధన తర్వాత ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ సంఘంలో రెండు స్వరాలు ప్రధానంగా వినిపించాయి. ఓ స్వరం సాంస్కృతిక రంగం సృజనాత్మకమైనది కనుక పార్టీ ప్రమాణాలు, నిర్దేశాల ప్రకారం నడవటం సాధ్యం కాదని వాదించింది. రెండో స్రవంతి ఇండియన్ పీపుల్స్ థియేటర్ సంస్థ ప్రజా కళల రంగాన్ని విస్తరించాలని, కళలు, సాహిత్యం ద్వారా ప్రజా విముక్తి పోరాటాలను బలోపేతం చేయాలని వాదించింది. ఈ రెండు స్వరాలు, స్రవంతుల మధ్య సాంస్కృతిక సిద్ధాంతాలు, సమకాలీన సమాజంలో సాంస్కృతిక రంగం పాత్ర విషయంలో తలెత్తిన విబేధాలు 1960 దశకం వచ్చే నాటికి కళ కళ కోసం కాదు, ప్రజల కోసం అన్న నినాదంతో ముగింపుకు వచ్చాయి. దురదృష్టవశాత్తూ 1960 దశకం నాటికి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో పరాకాష్టకు చేరిన సైద్ధాంతిక విబేధాలు ఇండియన్ పీపుల్స్ థియేటర్ సంస్థను తీవ్ర గందరగోళంలోకి నెట్టాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సమకాలీన సమాజంలో విప్లవ దశ జనతా ప్రజాతంత్ర విప్లవ దశగా నిర్ధారించటంతో ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఉద్యమం చరిత్రలో మూడో దశ మొదలైంది.

ఈ దశలో బెంగాల్‌లో సాగిన ప్రజా ఉద్యమాలతో ప్రజా సాంస్కృతికోద్యమం గొంతు కలిపింది. కదం తొక్కింది. గ్రామ గ్రామాన సాంస్కృతిక దళాలు తయారయ్యాయి. మొత్తం విజయదశమి ఉత్సవాలు ప్రత్యామ్నాయ సాంస్కృతికోత్సవాల రూపం తీసుకున్నాయి. బెంగాల్‌లో వామపక్ష భావాల వ్యాప్తికి దోహదం చేసిన మరో సాంస్కృతికోద్యమం అభ్యుదయ రచయితల సంఘం. దీనికి కూడా పునాదులు స్వాతంత్ర్యోద్యమం చివరి దశాబ్దంలోనే పడ్డాయి. అభ్యుదయ రచయితల సంఘం విడుదల చేసిన ప్రణాళికలో "భారతదేశపు నవ్య సాహిత్యం వర్తమాన సమస్యలైన ఆకలి, పేదరికం, సామాజిక వెనకబాటుతనం, రాజకీయ పరాధీనత వంటి వాటిపై దృష్టి సారించాలి. నిస్తేజం, నిష్క్రియాపరత్వం, నిర్హేతుకత, ప్రతీఘాత వైఖరి మనలను అడుగు ముందుకేయనీయటం లేదు. మనకు స్ఫూర్తినిచ్చేది విమర్శనాత్మక దృక్పథం. ఆచారాలు, వ్యవహారాలు, అలవాట్లు అన్నింటినీ హేతుబద్ధత ప్రమాణంగా పరిశీలిస్తుంది. మనలను మనం సంఘటితం చేసుకోవాల్సిన అవసరాన్ని మనముందుంచుతుంది. దీన్నే మనం ప్రగతిశీలతగా గుర్తిస్తాము" అని స్పష్టంగా పేర్కొంది. ఈ ప్రణాళిక ప్రకారం ప్రజలను వలసవాదం నుండి విముక్తి చేయటం, సామాజిక మార్పు సాధించటం, భూస్వామ్య పీడనను అంతమొందించటం మితవాద అవగాహన స్థానంలో చైతన్యవంతమైన అవగాహనను పెంపొందించటం అభివృద్ధి. అంటే అభివృద్ధి భావన నిర్దిష్ట స్థల కాల పరిమితులకు లోబడి ఉండే భావన అన్న వాస్తవాన్ని అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళిక స్పష్టం చేస్తుంది.

ఈ రెండు ఉద్యమాలు, స్రవంతులూ 1980 దశకం నాటికి వామపక్ష ఉద్యమ అనుబంధ సంస్థలుగా మిగిలిపోవటంతో సృజనాత్మకత కలిగిన అనేక మంది సాంస్కృతిక కార్యకర్తలు, సృజనకారులు ఉద్యమానికి దూరమయ్యారు. ఫలితంగా 1940 దశకం తరహాలో సార్వత్రిక ప్రజా సమస్యలపై ప్రజాకర్షక కళారూపాలు, రచనలు ఈ కాలంలో మందగించాయి. అప్పటి వరకూ సమగ్ర ప్రత్యామ్నాయ సాంస్కృతిక రూపాలు అందించగలిగిన ఈ ఉద్యమాలు మారుతున్న ఆర్థిక వ్యవస్థ దశ, దిశలకు అనుగుణంగా తెరమీదకు వస్తున్న నూతన సాంస్కృతిక ధోరణులను మదింపు వేయటంలోనూ, విశ్లేషించి వాటికి తగిన ప్రత్యామ్నాయాన్ని సృష్టించటంలోనూ వెనకపట్టు పట్టాయి. నూతన తరం మేధావులను ఇముడ్చుకున్న కేరళ, బెంగాల్‌లలో మాత్రమే 1980 దశకంలో ఈ ప్రజా సాంస్కృతిక రంగం మిగిలిన రాష్ట్రాల కంటే మెరుగైన రీతిలో ప్రజాదరణ పొందింది. ఈ సాంస్కృతికోద్యమాలన్నీ ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంతోనూ, తర్వాతి కాలంలో బెంగాల్‌లో విజృంభించిన ప్రజా ఉద్యమాలతోనూ పునరుజ్జీవం పొందాయి. ఈ విధంగా పునరుజ్జీవం పొందిన ప్రజా సాంస్కృతికోద్యమం తిరిగి ప్రజా ఉద్యమాన్ని కూడా ముందుకు తీసుకెళ్లటానికి శక్తివంతమైన సాధనంగా ఉపకరించింది.

కాలక్రమంలో ఈ ప్రజా సాంస్కృతికోద్యమం, ప్రజా ఉద్యమాల మధ్య ఉన్న గతితార్కిక సంబంధం బలహీనపడింది. ఇదే తరుణంలో దోపిడీని ఉధృతం చేసే ప్రపంచీకరణ విధానాలతో విజృంభించిన వినిమయ సంస్కృతి, వ్యక్తి ఆధిపత్య సంస్కృతి ప్రజా సాంస్కృతిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అందువల్లనే ఈ కాలంలో దేశంలో కీలకమైన సామాజిక రాజకీయ సమస్యలుగా ఆవిర్భవించిన దళితులపై దౌర్జన్యాలు, కుల పీడన, మహిళ వివక్ష, గిరిజన సమస్యల గురించి ప్రజా సాంస్కృతికోద్యమం తనదైన వ్యాఖ్యానాన్ని అందించలేక పోయింది. ఆయా వర్గాలు, తరగుతులు ఎదుర్కొంటున్న సమస్యలపై

సరికొత్త సాంస్కృతిక రూపాలు సృష్టించలేకపోయింది. ఈ పరిస్థితిని అధిగమించటానికి కావల్సిన రీతిలో మేధో సమృద్ధతను సమకూర్చుకోవటంలో వామపక్ష శక్తులు విఫలం కావటం, ఉదారవాద ప్రజాతంత్ర శక్తులను కూడా కలుపుకుపోగలిగేలా ప్రత్యామ్నాయ సాంస్కృతిక రంగ నిర్మాణాన్ని మల్చుకోవటంలో విఫలం కావటమే సాంస్కృతిక, భావజాల రంగంలో వామపక్షాల జోక్యాన్ని, పాత్రను మరింత కుదించేశాయని ప్రముఖ చరిత్రకారుడు కె.ఎన్. ఫణిక్కర్ నిర్ధారించారు.

వామపక్ష సాంస్కృతిక సంస్థలు స్వాతంత్ర్యోద్యమంలోనూ, అనంతర కాలంలోనూ సాగించిన కృషి, సాధించిన విజయాల గురించి పదేపదే ప్రస్తావించుకోవటం ద్వారా వర్తమాన తరానికి స్ఫూర్తినిచ్చేందుకు ప్రయత్నించాయి. అయితే నాటి పరిస్థితులు, నేటి పరిస్థితుల మధ్య ఉన్న గుణాత్మకమైన మార్పు కారణంగా ఆ స్ఫూర్తిదాయకమైన చరిత్ర నేటి తరాన్ని నిర్లిప్తత నుండి బయటకు తీసుకురాలేకపోయింది. వాస్తవిక సామాజిక రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన పెనుమార్పులకు ఆయా చారిత్రక ఉపమానాలు పొసగని పరిస్థితులు వచ్చాయి. ప్రజా సాంస్కృతికోద్యమం 1960-70 దశకాల్లో చర్చకు పెట్టిన అంశాలు, ఎంచుకున్న కర్తవ్యాల కంటే 1990 దశకంలో తెరమీదకు వచ్చిన అంశాలు, ఎంచుకోవాల్సిన కర్తవ్యాలు ఎంతో భిన్నమైనవిగా ఉన్నాయి. అప్పటి గుణాత్మకమైన మార్పు మాత్రమే అభివృద్ధి అన్న అవగాహన పరిధి దాటి ప్రజల కళ్లముందు ఆవిష్కృతమవుతున్న పరిణామాత్మక మార్పులను ఎలా అర్థం చేసుకోవాలి, దానికున్న పరిమితుల గురించి ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి అన్న విషయంలో అటు వామపక్ష ఉద్యమం, ఇటు ప్రజా సాంస్కృతికోద్యమం మార్గాంతరాన్ని చూపించలేకపోయిందని చెప్పటం సందర్భరాహిత్యం కాబోదు.

ఈ కోణంలోనే బెంగాల్‌లో సైతం నయా ఉదారవాద ఆర్థిక జీవితం సామాజిక జీవితాన్ని, విలువలను ప్రభావితం చేయనారంభించింది. అప్పటికే వామపక్ష సంఘటన అమలు చేసిన భూసంస్కరణల ద్వారా అంది వచ్చిన చిన్న చిన్న కమతాలతో మెరుగైన జీవన విధానాన్ని అలవాటు చేసుకున్న ఓ కొత్త తరం ముందుకొచ్చింది. ఈ తరానికి సమాజం అందించిన సాంస్కృతిక విలువలు, దృక్కోణం 1940 దశకంలో ఎదిగిన తరానికి అందించిన సాంస్కృతిక విలువలు, దృక్కోణం కంటే పూర్తి భిన్నమైనవి. 1940 దశకంలో ఉమ్మడితనం, సంఘీభావం గ్రామీణ జీవితంలో మౌలిక లక్షణాలుగా ఉంటే 1980-90 దశకాల్లో వ్యక్తిగత తత్వం, ఒంటరిగా అభివృద్ధి కాగలమన్న నమ్మకం మౌలిక లక్షణాలుగా మారాయి. ఈ భావనలకున్న పరిమితులను సమాజం దృష్టికి తీసుకురావటానికి జరగాల్సిన కృషి నవ్యతలోనూ, స్పష్టతలోనూ, నాణ్యతలోనూ మందగించింది. దీంతో అప్పటివరకూ మూడు, నాలుగు దశాబ్దాల పాటు ఉద్యమ ఉమ్మడి సంస్కృతితో మమేకమైన బెంగాల్ పల్లె పట్లు ఈ ఉమ్మడి సంస్కృతి నుండి విడగొట్టుకోవటం ప్రారంభించింది. ఈ పరిణామాన్ని వేగవంతం చేసిన మరో కీలకమైన సందర్భం దేశంలో టెలివిజన్ వినియోగం అందుబాటులోకి రావటం. టెలివిజన్ రాకమునుపు సాంస్కృతిక జీవితం అది సినిమా అయినా, నాటకం అయినా, వీధి నాటకం అయినా, జాతర అయినా సామూహికమే. ఉమ్మడితనం, సంఘీభావం, సమిష్టితత్వం కొట్టొచ్చినట్లు కనిపించే వేదికగా సాంస్కృతిక జీవితం ఉండేది. కానీ టెలివిజన్ అందుబాటులోకి రావటంతో ఈ లక్షణాలు క్రమేణా కనుమరుగవుతూ వచ్చాయి. ఉమ్మడి వినోద సాధనంగా ఉన్న సంస్కృతి రానురాను స్వీయ, వయుక్తిక వినోద సాధనంగా మారింది. ప్రజా సాంస్కృతికోద్యమానికి ఎదురైన భారీ ప్రతిఘటనగా దీన్ని చెప్పవచ్చు.

ఈ విధంగా మనిషిని సంఘం నుండి ఒంటరిపాలు చేసిన తర్వాత ప్రభావితం చేయటం మితవాద విలువలకు మరింత తేలిక. బూర్జువా మితవాదమైనా, మతతత్వంతో కూడిన మితవాదమైనా ఇలాంటి ఒంటరి మనిషి, సమాజ అభివృద్ధి క్రమం నుండి పరాయీకరించబడిన మనిషి కోసం చూస్తుంది. మార్కెట్ మితవాదానికి, మతతత్వ మితవాదానికి మధ్య బాదరాయణ సంబంధాన్ని, ప్రగతిశీల సంఘీభావ జీవనానికి వీటికి మధ్య ఉన్న మౌలిక వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవటానికి ఓ చిన్న ఉదాహరణను మనం ప్రస్తావించుకోవచ్చు. మార్కెట్ మితవాదం మనిషిని వినిమయదారుడిగా మారుస్తుంది. తనకు ఏమి కావాలో, తాను ఏమి కొనాలో చూపిస్తుంది. అదే విధంగా గుడిలో వంద మందిలో కూర్చుని భజన చేసినా భజన చేసేవాళ్లు అక్కడున్న అందరికీ మంచి జరగాలని లేదా అందరి కోరికలు తీర్చమని దేవుడి విగ్రహానికి పూజ చేయరు. తన అవసరాలు తీర్చమని మాత్రమే పూజ చేస్తారు. సరళీకరణ తెరమీదకు వచ్చిన తర్వాత ఈ పరాయీకరణ మరింత ఉధృతమైంది. దాంతో కుటుంబంలో భాగస్వామిగా ఉన్న వ్యక్తి కూడా తన అవసరం వరకే ఆలోచించే దుస్థితికి మార్కెట్ మితవాదం మనలను నెట్టేసింది. ఇలా మార్కెట్ మితవాదానికి బలైపరాయీకరించబడిన ఒంటరి మనుషులను మతతత్వం తనదైన మితవాదంతో శాశ్వతంగా కట్టి పడేస్తుంది. ఇదంతా సాంస్కృతిక రంగంలో వివిధ రూపాల్లో జరుగుతుంది. దీనికి భిన్నంగా ఉద్యమ సంస్కృతి, ఉమ్మడి సంస్కృతి, సంఘీభావం ఏ ఉద్యమంలోనైనా పాల్గొనే అందరికీ ప్రయోజనం కలిగించాలని ఆశిస్తుంది.

అభ్యుదయ సంస్కృతికి 1936లో ప్రముఖ హిందీ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం తొలితరం నాయకుడు ప్రేంచంద్ ఇచ్చిన నిర్వచనాన్ని ఓ సారి మననం చేసుకోవాల్సిన అవసరం ఉంది. "ఆలోచనలు రేకెత్తించేది, స్వేచ్ఛా భావనలకు రెక్కలు తెచ్చేది, సౌందర్యానికి భాషను కూర్చేది, సృజనాత్మకమైనదీ, జీవన వాస్తవికతతో మేళవించినదీ, మనలను కదిలించేదీ, మేధో తృష్ణను రగిలించేదీ అభ్యుదయకరమైనదే" అని నిర్వచించారు. వర్తమాన వామపక్ష సాంస్కృతికోద్యమం ఈ నిర్వచనం వెలుగులో కార్యోన్ముఖులు కావల్సిన అవసరం ఉంది. ఈ పని చేపట్టాలంటే సృజనాత్మక రంగంపై సాంప్రదాయవాదం, మితవాదం ఆధిపత్యాన్ని, దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. అంచనా వేయాలి. అయితే ఇటువంటి వర్తమానాన్ని అర్థం చేసుకోవటంలో మితవాదం, సాంప్రదాయం మధ్య ఉన్న సన్నని విభజన రేఖను గుర్తించటంలో విఫలమైతే ఈ రెండింటినీ ఒకే గాటన కట్టేస్తాము. ఉదాహరణకు మితవాదం ఆధిపత్య వర్గాలు భావజాల రంగంలో దాడి చేయటానికి ఉపయోగించే ప్రధానమైన సాధనంగా ఉంటుంది. కానీ సాంప్రదాయవాదం దీనికి భిన్నమైనది. సాంప్రదాయం కాలంతో ముడిపడి ఉంటుంది. కాలంతో పాటు సాంప్రదాయం కొత్త రూపాలు తీసుకుంటుంది. సాంప్రదాయాన్ని పాటించే వారిని సైతం మితవాదులుగా ముద్ర వేసి దూరం చేయటం బెంగాల్‌తో సహా దేశమంతటా ప్రజా సాంస్కృతికోద్యమాలు బలహీనం కావటానికి దోహదం చేసిన కారణాల్లో ఓ కీలకమైనది. అలా దూరమైన వారిని ఆకట్టుకోవటానికి, అదుపు చేయటానికి పాలకవర్గ సాంస్కృతిక వ్యవస్థలు పెద్దగా శ్రమపడాల్సిన అవసరం ఉండదు.

బెంగాల్‌లో వామపక్ష సంఘటనను అధికారానికి తేవటంలో సాంస్కృతిక రంగం పోషించిన పాత్రకు మరో కారణం సంస్కృతి, రాజకీయాల మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకున్న తీరు. ప్రజా సాంస్కృతికోద్యమం సంస్కృతి రాజకీయాల్లో అంతర్భాగమని గుర్తించింది. ప్రజాతంత్ర రాజకీయాలు విజయం సాధించనిదే ప్రజాతంత్ర సంస్కృతి, ప్రజా సాంస్కృతిక రూపాలు మనుగడ సాగించటం సాధ్యం కాదన్న అవగాహనను ప్రజలకు చేరవేయగలిగింది. మొదట్లోనే చెప్పుకున్నట్లు ఫాసిస్టు రాజకీయాలను ప్రతిఘటించే రాజకీయాల్లో భాగంగానే ప్రజా సాంస్కృతిక ఉద్యమం తెరమీదకు వచ్చింది. మారుతున్న ఆర్థిక వ్యవస్థ దశ, దిశలు సృష్టించిన ఒత్తిడికి గురైన ప్రజా సాంస్కృతికోద్యమం సంస్కృతి రాజకీయాలకు భిన్నమైనదన్న పాలకవర్గ భావన వ్యాప్తిని అడ్డుకోవటంలో విఫలమైంది. ఈ పరిస్థితిని అధిగమించటానికి కె ఎన్ ఫణిక్కర్ రెండు మార్గాలు ప్రతిపాదించారు. మొదటిది పీడితుల జీవితంలోకి ప్రవేశించటం, రెండోది విచక్షణాత్మక ప్రజా చైతన్యాన్ని పెంపొందించటానికి అవసరమైన రీతిలో నిరంతరం సాంస్కృతిక రంగంలో జోక్యం చేసుకోవటం. ఈ రెండు కర్తవ్యాలను చేపట్టడంలో ప్రజా సాంస్కృతికోద్యమం, దానికి నాయకత్వం వహిస్తున్న వామపక్ష ఉద్యమం వైఫల్యం నేడు దేశవ్యాప్తంగా వామపక్ష శ్రేణుల్లో గూడుకట్టుకుంటున్న నిరాశ నిస్పృహల్లో ప్రతిఫలిస్తోంది.

ఈ నిరాశ నిస్పృహలు మరోవైపున వామపక్ష రాజకీయాల్లో సాంస్కృతిక కోణాన్ని మరింత బలహీన స్థితికి నెట్టేస్తున్నాయి. సాంస్కృతిక రంగంలో కృషి అంటే భావజాల రంగంలో సాగే సైద్ధాంతిక పోరాటంలో భాగమే తప్ప పార్టీ అనుబంధ సాంస్కృతిక సంస్థల కృషికి దీన్ని కుదించటం కాదు. దురదృష్టవశాత్తూ ఇది అన్ని కమ్యూనిస్టు, వామపక్ష స్రవంతులకు వర్తించే దురవస్థ. నిర్మాణాల సూత్రాల పేరుతో సాంస్కృతిక రంగంలో ఉన్న శ్రేణులపై పెత్తనం చేయటానికి చూపించే ఆసక్తి వామపక్ష స్రవంతుల నాయకత్వం విశాలమైన సాంస్కృతిక రంగంలో నికరమైన సైద్ధాంతిక కృషి చేయటానికి కావల్సిన నిర్మాణాలను నమూనాలను రూపొందించుకోవటంలో చూపించటం లేదు. ఇటువంటి గాడితప్పిన అవగాహనలు దేశమంతటా వామపక్ష ఉద్యమంలో కనిపిస్తూ ఉన్నాయి. సమకాలీన ఆచరణ, ఆలోచనలతో సంపూర్ణంగా ఈ ఉద్యమాలు తమను తాము విడగొట్టుకోకపోతే పైన ప్రస్తావించిన జమిలి కర్తవ్యాలను నెరవేర్చటం సాధ్యం కాదు. ఈ కర్తవ్యాలను చేపట్టాలంటే గత ఏడున్నర దశాబ్దాలుగా భారత ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక జీవనంలో వస్తున్న మార్పులను, వాటి గుణాత్మక స్వభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మదింపు చేయాలి. బెంగాల్‌లో కోల్పోయిన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవాలన్నా దేశవ్యాప్తంగా విజృంభిస్తున్న దేశవాళీ ఫాసిజాన్ని ఎదుర్కోవాలన్నా మితవాదానికి, సాంప్రదాయానికీ మధ్య ఉన్న కీలకమైన వ్యత్యాసాన్ని గుర్తించాలి. రెండింటిపై సాగించే పోరాటం ఒకే రీతిలో ఉండదన్న వాస్తవాన్ని గుర్తెరగాలి. పాలకవర్గం అనుసరించే విలక్షణ అభివృద్ధి పంథా కారణంగా సాంప్రదాయం క్రమంగా మారుతున్న సామాజిక వాస్తవికతలకు అనుగుణంగా తనను తాను తాజా పర్చుకుంటుంది. పాలకవర్గం అనుసరిస్తున్న అభివృద్ధి పంథా ఆర్థిక అంతరాలను తీవ్రతరం చేస్తుందన్న వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారు. ఈ విధంగా సృష్టించే ఆర్థిక అంతరాలే సమిష్టి సామాజిక జీవితంలో వేర్వేరు అస్తిత్వాల ఆవిర్భావానికి దారి తీస్తాయి. ఈ అస్తిత్వాలు తమకు జన్మనిచ్చింది పాలకవర్గ విధానమే అన్న విషయాన్ని మర్చిపోయి ఒకదానితో ఒకటి పోటీపడుతూ కొన్ని సందర్భాల్లో తమ మధ్య ఉండాల్సిన సంబంధాలను శతృపూరిత సంబంధాలుగా పరిగణించుకుంటూ ఉంటాయి. అటువంటి తరుణంలో రంగప్రవేశం చేసే అన్ని అస్తిత్వాలను తనతో ఇముడ్చుకునేది మితవాదం. ఈ రాజకీయ ఆర్థిక మితవాదానికి మతోన్మాదం తోడైతే అది విశృంఖల విధ్వంసానికి దారితీస్తుంది. విధ్వంసమే సామాజిక విలువగా మారుతుంది. గత రెండు దశాబ్దాలుగా దేశంలో ఈ పరిణామం విస్తరించుకోవటం, వేళ్లూనుకోవటం గమనిస్తూనే ఉన్నాము. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజా సంస్కృతి, సాంస్కృతికోద్యమం ముందు పెను సవాళ్లున్నాయి. పాలకవర్గం అనుసరించే అభివృద్ధి పంథా స్థిరమైన వర్గాలను చంచలమైనవిగా మారుస్తుంది. (స్టేట్ ఆఫ్ ఫ్లక్స్) మతోన్మాదం కొత్త కొత్త సామాజిక వ్యక్తీకరణలను ముందుకు తెస్తోంది. ప్రత్యేకించి బెంగాల్ నేపథ్యంలో పరిశీలిస్తే మార్కెట్ మితవాదం, మతోన్మాదం భావజాల రంగంలో సాగిస్తున్న ప్రచారం, సృష్టిస్తున్న కొత్తకొత్త తరగతులు, రాజకీయ సమీకరణల్లో అవి పోషించేపాత్ర కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అందువల్ల వాడుకలో కనిపించే ప్రతి కొత్త తరగతిని, కేటగిరీనీ, భావనను లోతుగా పరీక్షించి పరిశీలించి ఆయా నూతన పదజాలాల మాటున ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో వెలికి తీయగలగాలి.

అటువంటి ప్రయత్నం చేయటంలో జరిగిన వైఫల్యమే బెంగాల్‌లో భారీ నష్టానికి దారితీసింది. వామపక్ష ఉద్యమంలోనూ, ప్రగతిశీల శక్తుల్లోనూ నేడు నెలకొన్న స్తబ్దతను అధిగమించాలంటే మితవాదాన్ని ఆధిపత్య భావజాలంగా మారుతున్న సంస్థలు, వాటి నిర్మాణాలు, ఆచరణను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మరో కీలకమైన విషయాన్ని కూడా గుర్తెరగాలి. ప్రజా సాంస్కృతికోద్యమం విశాలమైన సంకీర్ణ కూటమి అన్నదే ఆ వాస్తవం. ముల్క్‌రాజ్ ఆనంద్ మాటల్లో "మనమంతా ఐక్యం కావాలి. వర్గ, జాతి, హోదాల్లో ఉన్న తేడాలు, మౌలిక సమస్యల పట్ల మనకున్న భిన్నాభిప్రాయాలు పక్కన పెట్టి ఏకం కావాలి.". అటువంటి అవగాహనతోనే స్వాతంత్ర్యోద్యమం చివరి దశాబ్దంలో ఆవిర్భవించిన ప్రజా సాంస్కృతికోద్యమం 1970 దశకం వరకూ ప్రత్యామ్నాయ సాంస్కృతిక విలువలు, ప్రజాతంత్ర ఉద్యమాల విస్తరణలో శక్తివంతమైన పాత్ర పోషించింది. అటువంటి ఉమ్మడి కార్యాచరణ, సంకీర్ణ కూటమి కృషి, ఒంటెత్తుపోకడలకు, ఒంటెత్తువాదానికి తావివ్వని ఆచరణలు తమతమ వంతు పాత్రలు పోషించినందునే 80 దశకంలో బెంగాల్‌లో వామపక్ష సంఘటన అధికారాన్ని చేజిక్కించుకోగలిగింది. తర్వాతి కాలంలో అవగాహన, ఆచరణలో వచ్చిన అనేక మార్పులు, అవి తెచ్చిన సమస్యలతో పాటు మౌలికంగా దేశీయ పాలకవర్గం అనుసరించిన అభివృద్ధి పంథా సృష్టించిన సమస్యలను సరిగ్గా అంచనా వేయటం, పౌర సమాజంలో ప్రత్యాధిపత్య నిర్మాణానికి ఉన్న అవకాశాలు, వెసులుబాట్ల పట్ల ఏమరుపాటు ప్రదర్శించటంతో పౌరసమాజం మితవాదం ఆధిపత్యంలోకి జారిపోయింది. అటువంటి పొరపాటు మళ్లీ జరక్కుండా ఉండాలంటే ప్రత్యాధిపత్య నిర్మాణానికి శక్తివంతమైన సాధనంగా ఉన్న ప్రజా సాంస్కృతికోద్యమ నిర్మాణం, నిర్వహణలో బెంగాల్‌లో జరిగిన పొరపాట్లు జరక్కుండా చూసుకోవటమొక్కటే మార్గం. బెంగాల్‌లో వాపమక్ష కూటమి ఓటమి దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాతంత్ర ప్రగతిశీల అభ్యుదయ వామపక్ష శక్తులకు నేర్పుతున్న పాఠం ఇదే.

(రచయిత జర్నలిస్టు)

వీ

స్వీడన్ పరిణామాలు

మితవాద, మతవాద అభ్యుదయ నిరోధక రాజకీయాలను అధికార పీఠానికి దూరంగా ఉంచడంతో స్వీడన్ పార్టీలు ప్రపంచ దేశాలకు ఒక సందేశాన్ని ఇచ్చాయని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

యూరప్ ఖండంలో ఉన్న స్వీడన్, నార్వే, ఫిన్‌ల్యాండ్, ఐస్‌ల్యాండ్, డెన్మార్క్ దేశాలను 'నార్డిక్' దేశాలని పిలుస్తారు. యూరప్ ఖండం ఉత్తర ప్రాంతంలో ఉన్న దేశాలు కాబట్టి వాటికా పేరు వచ్చింది. విద్య, పౌరహక్కుల పరిరక్షణ, గుణాత్మకమయిన జీవనశైలి, సామాజిక రంగంలో మానవ అభివృద్ధి వంటి విషయాలలో చెప్పుకోదగిన ప్రగతి సాధించిన దేశాలుగా ఇవి ప్రసిద్ధి గాంచినవి. వీటన్నింటిలో స్వీడన్‌కు మరొక ప్రత్యేకత ఉంది. అది జెండర్ సమానత్వాన్ని పాటించడం. కుటుంబంలో గాని, సామాజిక రంగం దేనిలో అయినా లింగభేదానికి తావివ్వకపోవడంలో స్వీడన్ దేశానిదే పెద్ద పీట. అట్లాంటి స్వీడన్‌లో మహిళలకు ఓటు హక్కు రాజ్యాంగ బద్ధంగా అవతరించి వంద ఏళ్లయినప్పటికీ మొన్నమొన్నటి వరకు ఒక్క మహిళ కూడా దేశాధినేతగా ప్రధాన మంత్రి పదవి నధిష్టించక పోవడం ఆశ్చర్యకరం. ఆ లోటు ఈ సంవత్సరం నవంబర్ మాసంలో తీరింది.

స్వీడన్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉంది. ప్రజలు పార్లమెంట్‌ను ఎన్నుకుంటే, పార్లమెంట్ ప్రధాన మంత్రిని ఎన్నుకుంటుంది. 349 మంది సభ్యులు గల స్వీడన్ పార్లమెంట్‌ను స్వీడిష్ భాషలో రిక్స్ డాగ్ అంటారు. ఇప్పుడు ఉనికిలో ఉన్న పార్లమెంట్‌లో సోషల్ డెమోక్రటిక్ పార్టీకి 100 సీట్లు ఉన్నాయి. సోషల్ డెమోక్రటిక్స్‌కు సిద్ధాంత పరంగా పూర్తిగా వ్యతిరేకమయిన స్వీడన్ డెమోక్రటిక్ పార్టీకి 62 సీట్లు ఉన్నాయి. ఈ పార్టీ మితవాదుల్లోనే అతి తీవ్ర మితవాదుల పార్టీ. అందుచేత ఆ పార్టీతో చేయీ చేయీ కలపడానికి ఎవరూ ఇష్టపడరు. 'మాడరేట్ పార్టీ', 'క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ'లతో కలిసి "సాంప్రదాయవాద ఐక్య సంఘటన" ఏర్పాటు చేయడానికి ఎంతో ప్రయత్నం చేశారు కానీ, అది సాధ్యపడలేదు. స్వీడన్ పార్లమెంట్‌లో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రావడం చాలా అరుదుగా సంభవిస్తుంది. గతంలో యాభైయేళ్ల క్రితం అంటే 1968లో సోషల్ డెమోక్రట్స్ మొత్తం పోలయిన ఓట్లలో 50.1 శాతం ఓట్లు సాధించి పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అన్నీ సంకీర్ణ ప్రభుత్వాలే.

ఆసక్తి కలిగించే మరొక విషయం ఏమిటంటే, సాధారణ ఎన్నికలలో 4 శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉండదు. ఆ కారణంగా ప్రస్తుత పార్లమెంట్‌లో ప్రాతినిధ్యంలేని పార్టీలు కూడా కొన్ని ఉన్నాయి. అందులో చెప్పుకోదగ్గవి ఫెమినిస్ట్ ఇనీషియేటివ్, ఆల్టర్నేటివ్ ఫర్ స్వీడన్ అన్న పార్టీలు. యూరప్ ఖండంలోని మిగతా దేశాలతో పోల్చుకుంటే స్వీడన్‌లో సాధారణ ఎన్నికలలో వోటింగ్ శాతం ఎక్కువే ఉంటుంది. 2018 ఎన్నికలలో 87.1 శాతం మంది ప్రజలు పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1950 నుండి ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లోను 80 శాతం కంటే వోటింగ్ శాతం తగ్గలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థల పై విశ్వాసం ఉండడం, ఎన్నికలలో అక్రమాలకు తావుండదని, ఎన్నికలు సక్రమంగా నిర్వహించబడతాయని ప్రజలలో బలమయిన నమ్మకం ఉండడం, వీటికి తోడు స్థానిక సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలతో పాటే పార్లమెంట్‌కు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల్లో ఎక్కువ శాతం ప్రజలు పాల్గొనడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

స్వీడన్ రాజ్యాంగం ప్రకారం కనీసం 35 మంది పార్లమెంట్ సభ్యులు ఒక మంత్రిని అభిశంసిస్తూ అవిశ్వాస తీర్మానం సభలో ప్రవేశపెడితే ఆ మంత్రి రాజీనామా సమర్పించవలసిందే. కాబట్టి మంత్రులు బహు జాగ్రత్తగా వ్యవహరిస్తారు. అదే 175 మంది సభ్యుల విశ్వాసం కోల్పోతే ప్రధాన మంత్రి పదవి కోల్పోతారు. 2018 ఎన్నికల తర్వాత ఏర్పడిన పార్లమెంట్‌లో 188 మంది సభ్యులు పురుషులైతే, 161 మంది స్త్రీలు. మంత్రిమండలిలో మొత్తం మంత్రుల సంఖ్య 23 అయితే అందులో మహిళలు 12 మంది. ఇందులో చెప్పుకోదగిన అంశం ఏమిటంటే పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో మహిళలు ఎంత శాతం ఉన్నారో ఎన్నికయిన సభ్యులు, మంత్రిమండలిలో మహిళా మంత్రుల సంఖ్య కూడా అంతే ఉంది.

2014 నుంచి స్వీడన్ ప్రధాని పదవిలో కొనసాగుతున్న స్టీఫన్ లోఫ్వెన్ నవంబర్ 10న రాజీనామా చేయడంతో ఆయన మంత్రివర్గంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న మాగ్డలినా ఆండర్సన్ నవంబర్ నెల చివరి వారంలో ప్రధాన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసింది. అయితే ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది గంటలలోనే రాజీనామా చెయ్యాల్సి రావడం, ఆ తర్వాత ఒకటి రెండు రోజులు గడవక ముందే నాటకీయ పరిణామాల మధ్య మళ్లీ ప్రధాన మంత్రిగా ప్రమాణం చెయ్యడం జరిగింది.

ఇది మధ్యంతర ఏర్పాటు మాత్రమే. స్వీడన్‌లో నాలుగేళ్ల కొకసారి జరిగే సాధారణ ఎన్నికలు 2022 సెప్టెంబర్‌లో జరుగనున్నాయి. అంటే రాబోయే పది నెలల కాలంలో తానేమిటో, తన పరిపాలన ఎలా ఉంటుందో రుజువు చేసుకోవాలన్నమాట. తాను ప్రధాన మంత్రి అయిన తర్వాత ఒక మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉండగా ఓ విలేకరి "మీ పది నెలల పాలనకు ఇది ప్రారంభం" అని అలవోకగా వ్యాఖ్యానించగా చాలా ధీమాగా ఆండర్సన్ "మీకు పది నెలలే కనిపిస్తున్నాయి. కానీ నాకు పది సంవత్సరాలు కనిపిస్తున్నాయి. నా రాబోయే పది సంవత్సరాల పాలనకు ఇది నాంది'' అని ఆత్మవిశ్వాసంతో జవాబిచ్చారు.

యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్

- రవీంద్రనాథ్ సూరి



కేంద్ర సాహిత్య అకాడెమీ శశిథరూర్ రాసిన 'యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్' అనే పుస్తకానికి కాల్పనికేతర సృజనాత్మక రచనల తరగతిలో బాహుమతినిచ్చింది. ఇది నిజంగా ఇంగ్లిష్ చదివే వారందరు చదవాల్సిన పుస్తకం. శశిథరూర్ 'వై ఐ యామ్ హిందు' అనే పుస్తకం కూడా రాశాడు. ఇవే కాకుండా పదమూడు పుస్తకాలు, చాలా రాజకీయ, సాహిత్య వ్యాసాలు రాశాడు. చెప్పదల్చుకున్న విషయమేమిటంటే అతను రాజకీయ, సాహిత్యాలలో ప్రముఖుడు. తిరువనంతపురం నుండి లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు. ఈ పుస్తకం రాయడానికి పూర్వరంగం పీఠికలో థరూర్ వివరించాడు. 2015లో ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ఉపన్యాస చర్చ నిర్వహించింది. భారతదేశములో దుష్పరిపాలనకు బ్రిటిష్ వారు నష్టపరిహారం చెల్లించాలన్నది చర్చ. నష్టపరిహారం చెల్లించాలన్న ఆలోచనకు థరూర్ అనుకూలుడు కాడు. ఆ దుష్పరిపాలనకు నైతిక బాధ్యత వహిస్తూ సంవత్సరానికి ఒక పౌండ్ చెల్లించినా చాలు అన్నది థరూర్ భావన. ఈ చర్చలో థరూర్‌కు ప్రథమ స్థానం ఇవ్వబడింది. అనర్గళమైన ఆంగ్ల భాష వైదుష్యంతో, విషయ పరిజ్ఞానంతో, వాదనా పటిమతో థరూర్ న్యాయనిర్ణేతలను, ప్రేక్షకులను మెప్పించాడు. ఈ పరిచయకర్త కూడా సామాజిక మాధ్యమంలో ఆ ఉపన్యాసం విని ప్రభావితుడయ్యాడు. నాలాగే ఆ ఉపన్యాసం విన్నవారు దానిని పుస్తకరూపంలో తెస్తే బాగుంటుందని థరూర్‌కు సలహా ఇచ్చారట. 2016లో అలెఫ్ ప్రచురణ కర్తలు పుస్తకంగా మన ముందుకు తెచ్చారు. అమెరికన్ తత్త్వవేత్త విల్ దూరంట్ ప్రస్తావనతో, ఆయన వాక్యాలతో ప్రారంభించిన థరూర్ ఈ పుస్తకంలో ఆర్థిక దోపిడితో సహ భారతదేశం అన్ని రంగాలలో ఎలా దోపిడి చేయబడిందో సోదాహరణంగా వివరించాడు. బ్రిటిష్ లైబ్రరీలలో, ఆర్కైవ్‌లలో, పార్లమెంట్ గ్రంథాలయంలో శోధించి, పరిశోధించి చాలా చెమటోడ్చాడు. ఒకటొకటిగా వాస్తవాలను ముందుకు తెస్తూ, తిరుగులేని విధంగా తన వాదనను అల్లుకుంటూ వచ్చాడు. బ్రిటిష్ వారి దోపిడీ పీడనలను దుష్పరిపాలనను బహిర్గతం చేస్తూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు దాదాభాయి నౌరోజీ మొదలుకొని చాలామంది రచనలు చేశారు. అలాంటి రచనలలో పేర్కొనదగినది బ్రిటిష్ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడైన రజనీపామి దత్ రాసిన ఇండియా టుడే. ఆ పుస్తకాన్ని 80ల ప్రారంభంలో చదివాను. అది నాలో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు ఈ 'యాన్ ఎరా ఆఫ్ డార్క్‌నెస్' ఆ జ్ఞాపకాలను తట్టిలేపింది. 1930లో భారతదేశంలో పర్యటించిన విల్ దూరంట్ భారతదేశం పై బ్రిటిష్ విజయం గురించి చెప్పిన మాటలను మననం చేసుకుందాం. "భారత దేశం పై బ్రిటిష్ విజయం, ఒక వర్తక కంపెనీ ఉన్నత నాగరికతపై చేసిన దురాక్రమణ, విధ్వంసం, ఎలాంటి నైతిక విలువలు నీతి సూత్రాలు లేనట్టిది, కళల పట్ల నిర్లక్ష్యం, లాభం కోసం కక్కుర్తి, తాత్కాలికంగా అరాచకంలో మునిగి నిస్సహాయంగా వున్న దేశాన్ని నిప్పు పెట్టి జయించడం, అవినీతితోను, హత్యాలతోనూ రాజ్యాలను దిగమింగడం, దొంగిలించడం, చట్టవ్యతిరేక చట్టబద్ధ దోపిడీలను ప్రారంభించడం. అది ఇప్పటికీ 130 ఏళ్లుగా (1930లో) సాగుతూనే ఉంది." క్రీ. శ 1600లో మొదటి ఎలిజబెత్ రాణి రాయల్ ఛార్టర్ ద్వారా నమోదైన ఈస్ట్ ఇండియా కంపెనీకి ప్రతినిధిగా సర్ థామస్ రో 1615లో

ప్రధాన మంత్రి అయిన కొద్ది గంటలలోనే రాజీనామా, వెనువెంటనే తిరిగి ఎన్నికకావడం లాంటి పరిణామాలన్నీ నాటకీయంగా జరిగాయని అనిపించినా ఇందులో ఒక చారిత్రిక స్పృహ దాగి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రాజీకీయ రంగంలో మితవాదులు, మతవాదులు, అభ్యుదయ వ్యతిరేకులు అధికారం చేజిక్కించుకునే పనిలో కృతకృత్యులవుతున్న ఈ రోజుల్లో, మతవాదుల, మితవాదుల చేతుల్లోకి అధికార పగ్గాలు పోనివ్వకుండా అంతవరకూ విడివిడిగా ఉన్న కొన్ని రాజకీయ పార్టీలు ఏకమై మితవాద పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉండకూడదన్న దృఢ నిశ్చయంతో ఆండర్సన్‌ను తిరిగి ప్రధాన మంత్రిని చేశాయి. ఆండర్సన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు.

ఏడేళ్లనుంచి ప్రభుత్వంలో ఆర్థిక శాఖా మంత్రిగా ప్రజలకు సుపరిచితం. గ్రీన్ పార్టీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ రెండూ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆండర్సన్‌ను ప్రధాన మంత్రిగా ఎన్నుకున్నాయి. ఆండర్సన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతిపక్ష పార్టీ అయిన స్వీడన్ డెమోక్రాట్స్ పార్టీ తన బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టింది. ఆ ప్రతిపాదనలను పార్లమెంట్ ఆమోదించింది కూడా. స్వీడన్ డెమోక్రటిక్ పార్టీ మిత వాద పార్టీ. ఆ పార్టీ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వంలో ఉండి అమలు పరచడం ఇష్టంలేని గ్రీన్ పార్టీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకత్వంలో ఉన్న ఐక్య సంఘటన నుండి తప్పుకుంది. ఐక్య సంఘటనా ప్రభుత్వం నుండి ఒక పార్టీ తప్పుకున్నప్పుడు ప్రజాస్వామ్య సాంప్రదాయాల ననుసరించి ఆండర్సన్ ప్రభుత్వం రాజీనామా సమర్పించింది. (వ్యవసాయ బిల్లులను నిరసిస్తూ అకాలీ దళ్ పార్టీ కేంద్ర ప్రభుత్వం నుండి తప్పుకున్నప్పుడు మన దేశంలో ఎవ్వరికీ ప్రజాస్వామ్య సాంప్రదాయం గుర్తుకు రాలేదు. అది భారత్ తరహా ప్రజాస్వామ్యం!).

సాధారణ ఎన్నికలు జరగడానికి కొన్ని నెలల సమయం ఉంది కాబట్టి, ప్రభుత్వం నడపడానికి ప్రధాన మంత్రిని ఎన్నుకోవడం తప్పనిసరి అయ్యింది. స్వీడన్ రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి పదవి కి పోటీ చేసిన అభ్యర్థి ని 175 మంది సభ్యులు సమర్థించాలి. చివరికి ఒక పార్టీ వోటింగ్‌లో పాల్గొనని ప్రకటించింది; వామపక్ష పార్టీ పెన్షన్ చెల్లింపుల విషయంలో ఆండర్సన్ పార్టీతో షరతులు విధించి హామీ పొంది ఆండర్సన్‌ను సమర్థించడానికి ఒప్పుకోవడంతో ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఆండర్సన్ 175 ఓట్లతో ప్రధాన మంత్రి కాగలిగారు. మితవాద రాజకీయాలను, మతవాద రాజకీయాలను, అభ్యుదయ నిరోధక రాజకీయాలను అధికారానికి దూరంగా ఉంచడానికి స్వీడన్ దేశ రాజకీయ పార్టీలు ఒక సందేశాన్ని ప్రపంచ దేశాలకిచ్చాయి. అందుకు వాటిని అభినందించాలి.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

జహాంగీర్ చక్రవర్తికి తన నియామక పత్రాలు సమర్పించాడు. భారతదేశంలో తయారయ్యే సరకులను ఎగుమతి చేసే వ్యాపారం కోసం మహాజర్ దాఖలు చేశాడు. ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రయాణం అలా మొదలయింది. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ 1707లో మరణించే నాటికి ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా 27 శాతం. మిగతా ప్రపంచ దేశాలన్నీ కలసి 73 శాతం వాణిజ్యాన్ని నెరపేవి. కానీ అది 1947 నాటికి 1.3 శాతంకి పడిపోయింది. ఈనాటికీ ఆ పరిస్థితిలో మార్పు లేదు. ఎగమతి వర్తకంతో ప్రారంభించిన ఈస్ట్ ఇండియా కంపని కోటలు కట్టుకుంటూ, సాయుధ శక్తిని పెంచుకుంటూ పోయింది. రాజ్యం కోసం కలహించుకునే నవాబుల జుట్లు ముడివేసి, ఒకప్పుడు ఒకరికి ఇంకోకప్పుడు ఇంకొకరి పక్షం వహించి, 1757లో బెంగాల్‌లో పన్నులు వసూలు చేసే దివానీ అధికారం చేజిక్కించుకున్నది. ఇంకొక అడుగు ముందుకు వేసి బలహీనులైన రాజులు, రాజ కుటుంబంలోని తగాదాలు, అంతఃపుర కుట్రలు, అధికార దాహాలను ఉపయోగించుకొని మొగల్ చక్రవర్తిని సైతం పెన్షనర్‌గా మార్చి వేసింది. మన భారత వ్యవస్థలోని బలహీన సామాజిక, సైనిక రంగాలు కంపనీ దూకుడుకు దోహదం చేశాయి. వందలాది సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న ఏసియాటిక్ గ్రామీణ వ్యవస్థను బ్రిటిష్ వారు కూలదోసి వేశారు.. పేరెన్నికగన్న వస్త్ర పరిశ్రమను, లోహ పరిశ్రమను నాశనం చేశారు. రైతాంగం పైన రకరకాల దళారులను రుద్ది తమకు తాబేదారులుగా ఉండే వర్గాన్ని సృష్టించారు. విపరీతమైన పన్నులతో రైతాంగం నడ్డి విరిచారు. చేతి వృత్తులను దెబ్బతీసి గ్రామీణ నిరుద్యోగం పెంచివేశారు. రైతాంగం నుండి వసూలు చేసిన పన్నులు దేశాభివృద్ధికి వినియోగించకుండా, ఇంగ్లాండ్‌కు తరలించి తమ పారిశ్రామిక విస్తరణకు పెట్టుబడి సమకూర్చుకున్నారు. బ్రిటిష్ వారి దోపిడి విధానాల ఫలితంగా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకొని పోగా, 1947 తరువాత పాలకుల అసమర్థ విధానాల వలన ఆ సంక్షోభం ఇప్పటికీ కొనసాగుతూనే వస్తున్నది. 1757 నుండి 1901 వరకు పన్నుల రూపేణ 4 బిలియన్ల పౌండ్ల రొక్కం తరలిపోయిందని థరూర్ పేర్కొన్నాడు. ఇది పన్నుల రూపేణ వసూలు చేసినది మాత్రమే. యుద్ధాలలో ఓడిపోయిన రాజుల ఖజానాల నుండి సైనికాధికారులు, గవర్నర్లు, గవర్నర్‌జనరళ్లు కొల్లగొట్టిన సొమ్ము, లంచాలు తదితర అవినీతి సంపాదన ఎంతో లెక్కగట్టలేమనంటాడు థరూర్. అనాగరిక భారతవ్యవస్థను సమూలంగా నాశనం చేసి కొత్త నాగరిక వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత బ్రిటిష్ సామ్రాజ్యం పైన ఉన్నదని చెప్పుకున్నారు. అందుకు అనుగుణంగానే ఒకటొకటిగా, అనాదిగా కొనసాగుతూ వస్తున్న వ్యవస్థలను నాశనం చేశారు.

భారతదేశపు వాస్తవికతలతో సంబంధంలేని న్యాయవ్యవస్థను బలవంతంగా రుద్దారు. న్యాయాధికారులుగా వచ్చే బ్రిటిష్ వారికి స్థానిక భాషలు వచ్చేవి కావు. ప్రజలకు ఇంగ్లిష్ వచ్చేది కాదు. మధ్యవర్తులుగా వ్యవహరించేందుకు ఇంగ్లిష్ నేర్చిన వకీళ్లు అవసరమయ్యారు. వకీళ్లకు ఫీజులు, వాయిదాలు, సంవత్సరాలుగ సాగే వ్యాజ్యాలు, న్యాయాన్ని సామాన్యునికి దూరం చేశాయి.

బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన కోర్టులు అంతవరకు అమలులో ఉన్న గ్రామసభ లేక గ్రామ పంచాయతి కంటే ఏమి మెరుగైనవి కావు. అలాగే విద్యా విధానాన్ని మార్చివేశారు. అప్పటివరకు సంస్కృతం, పార్శీ, అరబ్బీ, స్థానిక భాష మాధ్యమంగా ఉన్న విద్యావిధానాన్ని నాశనం చేసి ఇంగ్లిష్ మాధ్యమంతో, గుమస్తాలను తయారు చేసే విద్యావిధానాన్ని ప్రవేశ పెట్టారు. "మనకు మనం పాలించే కోట్లాది మంది ప్రజలకు మధ్య, రంగులోనూ, రక్తంలోనూ భారతీయులుగా, అభిరుచులు అభిప్రాయాలు, విలువలు, మేధస్సులో ఇంగ్లిష్ వారిగా పనిచేసే దుబాసీల వర్గాన్ని రూపొందించేందుకు మనం చేయవలసినదంత చేయాలి." అని లార్డ్ మెకాలే తన సుప్రసిద్ధ "నోట్ ఆన్ ఎడ్యుకేషన్(1835) "లో పేర్కొన్నాడు. అందుకు అనుగుణంగానే విద్యా వ్యవస్థను రూపొందించి, మనపైన రుద్దారు. ఆ విద్య కూడా అట్టడుగు వర్గాలకు అందలేదు. ఉన్నత మధ్య తరగతి వర్గాలు, పైకులాలవారే ఆ విద్యా విధానాన్ని అందిపుచ్చు కొని లబ్దిపొందారు. నిమ్నకులాలు వర్గాలవారు అరుదు. నేటికీ అదే పరిస్థితి. పట్టభద్రుడైనా, ఇంజనీరైనా స్వతంత్రంగా బతకాలంటే భయమే.


బ్రిటిష్ పరిశ్రమలకు ముడి సరకులు అందించి, బ్రిటిష్ పాలకులకు కోట్లాది రూపాయల పన్నులు కట్టిన వ్యవసాయరంగం అభివృద్ధికి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చేసిందేమి లేదు. జీవనదులెన్నివున్న వాటి జలాలు వృధాగా సముద్రం పాలయ్యేవి. ఆంధ్రప్రదేశ్‌లోని కాటన్ బ్యారేజి లాంటివి తప్పితే నీటిపారుదల సౌకర్యం కల్పించలేదు. వానదేవుడు కరుణించకపోతే భీకర కరువులు తాండవం చేసేవి. బెంగాల్ కరువు(1770), మద్రాసు కరువు(1782), చాలీసా కరువు(1783), దవజిబారా కరువు(1792), ఆగ్రా కరువు (1837), ఒరిస్సా కరువు (1866), బిహార్ కరువు (1873), దక్షిణ భారత కరువు (1876), బొంబాయ్ కరువు(1905), ప్రఖ్యాత బెంగాల్ కరువు (1943), అలాంటి కారువుల్లో ముఖ్యమైనవి. ఈ కరువుల కారణంగా 1770 నుండి 1900 వరకు రెండున్నర కోట్ల భారతీయులు మరణించారు. 1943 బెంగాల్ కరువు సందర్భంగా అప్పటి బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ చాలా అమానుషమైన వ్యాఖ్యలు చేశాడు. కుందేళ్ల లాగా పిల్లలు కని భారతీయులు కరువును కొనితెచ్చుకున్నారని వ్యాఖ్యానించాడు. కరువు దెబ్బకు గాంధీ ఇంకా చావలేదేందుకని పైశాచిక వ్యంగ్యం ప్రయోగించాడు. బెంగాల్‌లో కోట్లాది మంది చనిపోతుంటే, ఆదుకొనకుండా, భారతదేశంలో పండిన గోధుమలు, బియ్యం ఇతర ఆహార ధాన్యాలను యూరోప్‌లో యుద్ధరంగానికి తరలించారు. బెంగాల్ కరువులో కనీసం 30 లక్షల మంది చనిపోయారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తాము జరిపిన దురాక్రమణ యుద్ధాలలోకి భారతీయులను ఈడ్చారు. అన్నీ యుద్ధాలలోకి భారతీయ సైనికులను తరలించడమే కాకుండా, ఆ యుద్ధాలకైన ఖర్చులన్నీటిని బ్రిటిష్ ఇండియా పైననే రుద్దేవారు. అలా జరిగిన యుద్ధాలలో 11 లక్షల భారతీయ సైనికులు పాల్గొనగా లక్ష మంది చనిపోయారు, 3 లక్షల మంది గాయపడ్డారు. ఈ యుద్ధాలలో భారతదేశానికి ఒరిగింది ఏమీలేదు. ఆఖరుగా వెళ్తు వెళ్తూ భారతదేశాన్ని రెండు ముక్కలుగా చీల్చి, అన్నదమ్ముల మధ్య ఆరని చిచ్చు రగిలించి వెళ్లారు.

1757 నుండి 1947 వరకు అమలయింది నిజంగా అంధకార యుగం. అది భరతమాత కార్చిన కన్నీటి కాసారం. ఆ యుగపు అన్యాయాలను ప్రతి భారతీయుడు తెలుసుకొని తీరాలి. ఇంతటి దుఃఖ భరితమైన చరిత్రను మన కళ్ల ముందుకు తెచ్చిన డా. శశిథరూర్, 47 నుండి ఇప్పటిదాకా 45 సంవత్సరాలు దారుణంగా పరిపాలించిన, 91లో భారత ఆర్థిక వ్యవస్థను విడదీయరాని విధంగా ప్రపంచ దోపిడీ వ్యవస్థకు కట్టి పడవేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రముఖ నాయకుడు. ఆయన పాండిత్యం ఆయనకు బహుమతులు సంపాదించి పెట్టేదే కానీ సమరోన్ముఖులను చేసేది కాదు. వీ

'ద గ్రేట్ మొఘల్స్'

డా. షేఖ్ మహబూబ్ బాషా



భారతదేశ చరిత్రలో తీవ్రంగా వివాదాస్పదం చేయబడుతున్న భాగాల్లో మొఘులుల చరిత్ర ప్రధానమైనది. ఎంత తీవ్రంగా వీరి చరిత్ర వివాదాస్పద మవుతుందో అంతే పెద్ద ఎత్తున వీరి చరిత్రపై పుస్తకాలూ వెలువడుతున్నాయి. అలా ఇటీవల వెలువడ్డ ఒక ముఖ్యమైన పుస్తకం ప్రొఫెసర్ ఫర్హత్ నస్రీన్ రచించిన 'ద గ్రేట్ మొఘల్స్'. చాలా వరకు ప్రాథమిక ఆధారాల మీద ఆధారపడి రాసిన ఈ పుస్తకంలో మొఘుల్ సామ్రాజ్య స్థాపకుడైన బాబర్ మొదలుకొని ఔరంగ జేబు వరకూ, చిట్ట చివరి మొఘులు చక్రవర్తి అయిన బహదూర్ షా జఫర్‌పైన ఒక అధ్యాయమూ మొత్తం ఎనిమిది అధ్యాయాలున్నాయి. ప్రధానంగా మొఘులుల రాజకీయ చరిత్రే అయినప్పటికీ వారి కాలం నాటి సాంఘిక, సాంస్కృతిక, మత, ఆర్థిక కోణాలను కూడా చరిత్రకారిణి ఫర్హత్ నస్రీన్ రాజకీయాల్లో అంతర్భాగంగానే ఎంతో అద్భుతంగా స్పృశించారు. అంతేకాకుండా వీరి వ్యక్తిగత చరిత్రనూ, వారిలోని న్యాయ దృష్టినీ, మానవీయ కోణాల్నీ వెలికి తెచ్చారు.

ఫర్ఘానా, సమర్ఖండ్‌లను గెలుస్తూ కోల్పోతూ చివరికి కాబూల్ చేరుకున్న జహీరుద్దీన్ ముహమ్మద్ బాబర్‌కు (జననం 1483 ఫిబ్రవరి 14) అక్కడ ఏర్పడిన తీవ్రమైన రాజకీయ అనిశ్చితి కారణంగా అనివార్యంగా భారతదేశం వైపు చూడాల్సి వచ్చింది. 1526 ఏప్రిల్ 20న జరిగిన మొదటి పానిపట్టు యుద్ధంతో భారతదేశ రాజకీయాలూ, సమాజగతీ మారాయి. ఆటోమన్ టర్కిష్ యుద్ధ విధానాన్ని (సాధారణ సైనికులూ, యుద్ధ కమాండర్లూ ఒకేసారి శత్రువుపై విరుచుకుపడడం, పరిగెడుతున్న గుర్రాలపై నుండే బాణాలను వర్షించడం మొదలైనవి) అవలంబించడం కారణంగా కేవలం 12 వేల సైన్యాన్ని కలిగిన బాబర్ ఒక లక్ష సైన్యాన్ని కల్గిన ఢిల్లీ సుల్తాన్ ఇబ్రహీం లోడీపై సులభంగా విజయం సాధించాడు. విజయమైతే లభించింది గానీ, స్థానికుల నుండి సామాజిక ఒప్పుదల కష్టమైపోయింది. ఆగ్రాలో నివసించిన తొలినాళ్లలో బాబర్ మనుషులకు స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యేది. వాళ్లు కనిపిస్తే చాలు స్థానికులు పారిపోవడమో, దుకాణాలు మూసివేయడమో చేసేవారు. ఇలా తొలుత బాబర్ మనుషులు 'పరాయి తనాన్ని' ఎదుర్కొన్నారు. బాబర్ సైనికాధికారులు కాబూల్‌కు తిరిగి వెళ్లాలని భావించారు; భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి ఢిల్లీ సుల్తానుల కాలంలో రాయబడిన చరిత్ర గ్రంథం 'తబాకత్ అల్ నాసిదీ'ని బాబర్ చదివారు. అంతేకాకుండా భారతదేశాన్ని చాలా జాగ్రత్తగా, దగ్గరగా గమనించాడు. అందులో భాగంగా పవిత్రంగా భావించబడిన జంతువుల్నీ, పక్షుల్నీ చంపకూడదనీ, గాయపరచగూడదనీ నిర్ణయించుకున్నారు.

1527 మార్చి 17న జరిగిన ఖానువా యుద్ధంలో చిత్తోర్ రాజు రాణా సంగ్రామ సింహ్‌ను బాబర్ ఓడిస్తాడు. బాబర్ ఒకసారి హీరట్ నుండి కాబూల్‌కు వచ్చేటప్పుడు మంచు తుఫాను లేచింది. దాని నుండి కాపాడుకోవడానికి ఒక గుహలో ఉండమని బాబర్‌కు సలహా ఇచ్చారు అధికారులు. కానీ గుహ అందరికీ సరిపోయేదిగా లేకపోవడంతో బాబర్ దానికి నిరాకరించాడు. తర్వాత అందరికీ సరిపోయే గుహ దొరికింది. తన స్వీయ చరిత్ర 'బాబర్ నామా'లో క్షమతత్వపు గొప్పదనం గూర్చి రాయడమే కాకుండా వాస్తవంగా తనకు ద్రోహం తలపెట్టిన ఎందరినో క్షమించి వదిలేశాడు. ఉదాహరణకు 1506-07లో తనని రాజ్య భ్రష్టున్ని చేయడంలో కుట్రపన్నిన ముహమ్మద్ హుసేన్ మీర్జా దుఘ్లత్ కుమారుడైన ఎనిమిదేళ్ల మీర్జా హైదర్ దుఘ్లత్‌కు 1508 నుండి 1512 వరకు ఆశ్రయం ఇచ్చి సొంత కొడుకులా చూసుకున్నాడని మీర్జా హైదర్ తన పుస్తకం 'తారీఖ్-ఇ-రషీదీ'లో రాశాడు. అలాగే తనని విష ప్రయోగం ద్వారా చంపించాలని చూసిన ఇబ్రహీం లోడీ తల్లి బువాను కూడా క్షమించి ప్రాణాలతో వదిలేశాడు.

సాధారణంగా ముస్లిం రాజుల్ని క్రూరులుగానూ, నిర్దయులుగానూ చిత్రీకరిస్తుంటారు. కానీ వారిలోనూ మానవత్వముందనీ, వారూ సాధారణ మానవుల్లా ప్రవర్తించేవారనీ పలు ఉదాహరణలిచ్చారు చరిత్రకారిణి ఫర్హత్ నస్రీన్. తన స్వీయ చరిత్ర 'తుజెక్-ఇ-బాబరి'/ 'బాబర్ నామా'ను రచించాడు. ఖురానును రాసి మక్కాకు పంపించాడు. 'ముబయ్యిన్' అనే మత గ్రంథాన్నీ, మధ్య ఆసియా సూఫీ గురువు రచన అయిన 'రిసాలా-ఇ-వలీదియ'ను పద్య రూపంలోనూ రచించాడు. బాబర్ మంచి సాహిత్య విమర్శకుడు కూడా. బాబర్ స్నేహశీలి. 'మిత్రుతో మరణం పండుగే' అని భావించాడు. పిసినిగొట్టుల్నీ, పొగిడేవాళ్లనీ ఇష్టపడలేదు. మాటలు జాగ్రత్తగా వాడాలనేవాడు. మత ప్రాతిపదికన అతను ఎవరి పట్లా వివక్ష చూపలేదు. రాజకీయంగా ముస్లింలైన ఆఫ్ఘన్లూ, ఉజ్బెక్లూ అతనికేలా శత్రువులో హిందువులైన రాజపుత్రులు కూడా అలాగే శత్రువులు. అంతే! భారతదేశాన్ని హృదయపూర్వకంగా ప్రేమించిన బాబర్‌కు చనిపోయేటప్పటికి 48 సంవత్సరాల వయస్సు. మొత్తం 36 సంవత్సరాలు పాలించాడు. బాబర్, మహమ్ బేగంల పెద్ద కుమారుడు నాసిరుద్దీన్ ముహమ్మద్ హుమయూన్ (1508-1556) బాల్యం కాబూల్‌లో గడిచింది.

హుమయూన్ పరిపాలనలో న్యాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చాడు. తన అంతఃపురం వెలుపల న్యాయగంట ('తబ్ల్-ఇ-అదల్')ను ఏర్పాటు చేశాడు. న్యాయం కోరుకునేవారు తమకు జరిగిన అన్యాయం తీవ్రతను బట్టి ఒకసారో, రెండుసార్లో, మూడు సార్లో ఈ గంటను మోగించేవారు. రాజ్యాన్ని నిలుపుకోవడానికి ఎంతలా అష్ట కష్టాలు పడ్డప్పటికీ సామాన్య ప్రజలకు న్యాయాన్నందించే విషయంలో హుమయూన్ కాంప్రమైజ్ అవలేదు. హుమయూన్ చేసిన వాగ్దానాన్ని నిలుపుకొనే మనిషి. పెళ్లికి ముందు హుమయూన్‌కూ, అతని భార్య హమిదా బానూ బేగంకూ మధ్య జరిగిన ఆసక్తిదాయకమైన చర్చను ఈ పుస్తకం తెలియజేస్తుంది. మొదట హమీదా అతన్ని పెళ్లాడదలచుకోదు; సుమారు 40 రోజులు వివిధ వ్యక్తులు మధ్యవర్తిత్వం నెరిపిన తర్వాత పెళ్లికి ఒప్పుకుంటుంది! వీరి కుమారుడే ప్రఖ్యాతి వహించిన అక్బర్.

1556 ఫిబ్రవరిలో పట్టాభిషిక్తుడయ్యేటప్పటికి జలాలుద్దీన్ ముహమ్మద్ అక్బర్ (1556-1605) వయస్సు కేవలం 14

సంవత్సరాలు. బైరాంఖాన్ సంరక్షణలో పెరిగాడు. తనకిష్టంలేని వారందరినీ అక్బర్‌కు దూరం చేసి బైరాంఖాన్ సర్వశక్తివంతుడుగా ఎదగడమే కాకుండా వాస్తవంలో చక్రవర్తిగా మెలిగేవాడు. అయితే ఎంత శక్తివంతుడుగా ఎదిగాడో అంతే తీవ్ర వ్యతిరేకతనూ ఎదుర్కొన్నాడు. బైరాంఖాన్ పట్టునుండి బయట పడదల్చుకున్న అక్బర్ 'వకీల్' పదవిని రద్దుచేస్తూ ఫర్మానా జారీచేసి బైరాంఖాన్ వెన్నువిరిచాడు. తిరగబడ్డ బైరాంఖాన్‌ను 1560 ఆగస్టు 23న సయ్యద్ మొహమ్మద్ అట్కా ఓడించాడు. బైరాంఖాన్ మక్కా వెళ్లాలనుకుంటాడు; కానీ మార్గమధ్యంలోనే 1561లో చంపివేయబడతాడు. దర్బారులోని వివిధ వర్గాల మధ్య రాజుకుంటున్న అంతర్గత వైషమ్యాలను అత్యంత నిపుణతతో పరిష్కరించిన అక్బర్ రాజ్య నిర్వహణను సరైన మార్గంలోకి తేవడానికి అనేక మంచి చర్యలను చేపట్టాడు.

అక్బర్ చేపట్టిన అనేక అభ్యుదయకరమైన పనులను వివరించి అతన్ని ఉదారుడిగా నిరూపించారు ఫర్హత్ నస్రీన్. తన ప్రజల నిజమైన సమస్యల్ని తెలుసుకోవడానికి 1561లో మారు వేషంలో ఆగ్రా వీధుల్లో తిరిగేవాడు అక్బర్. 1562లో యుద్ధంలో పట్టుబడిన సైనికులను బానిసలుగా మార్చే విధానాన్ని నిషేధించాడు. 1564లో జిజియా పన్నును తొలగించాడు. 1565లో పలు హిందూ దేవాలయాలకు భూముల్ని దానం చేశాడు. గోరక్షణ కోసం ఫర్మానాలను జారీ చేశాడు. భూమి శిస్తు విధానాన్ని చక్కగా సంస్కరించి సాధ్యమైనంత వరకు జమీందారులు రైతుల్ని చిదిమేయకుండా చూశాడు. సైనిక వ్యవస్థను చక్కబెట్టడానికి గుర్రాలకు ముద్రవేసి సైనికుల వివరాలను నమోదు చేసే 'దాహో చెహరాల్ దాఘో మహల్' అనే వ్యవస్థను ప్రవేశపెట్టి అవినీతి అధికారులను శిక్షించేవాడు.

రాజపుత్ర స్త్రీలతో వివాహం అక్బరు వ్యక్తిగత జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. అబుల్ ఫజల్ ప్రకారం ఇంట్లో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా అక్బర్ హిందువులు పవిత్రంగా భావించే గంగా జలాన్నే తాగేవాడు (పు. 81). యుమునా లేదా చీనాబ్ నీళ్లతో వంట చేసినప్పటికీ అందులో కొంచెం గంగా జలాన్ని కలిపేవారు (పు. 81-82). మొదట్లో ఛాందసవాద ఉలేమాల ప్రభావంలో ఉండి షియాలు మొదలైన వారిపట్ల అన్యాయంగా ప్రవర్తించినప్పటికీ క్రమక్రమంగా ఉదారవాదం వైపు మొగ్గారు అక్బర్. అతనికి ఉదారవాద దృష్టికోణం అలవడ్డంలో ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ, షేక్ సలీం చిష్తీ మొదలైన సూఫీ గురువుల ప్రభావం కూడా ఎంతో ఉంది. షేక్ ముబారక్, అబుల్ ఫజల్, ఫైజీలు కూడా అతన్ని ప్రభావితం చేశారు. హిందూమతం పట్ల సానుకూల దృక్పథం కనబరిచిన అక్బర్ దాన్ని అర్థం చేసుకోవడానికీ, పర్షియన్ ప్రపంచంలో ప్రచారం చేయడానికీ 'మక్తబ్ ఖానా' అనే అనువాద విభాగాన్ని 1573లో ఏర్పాటు చేసి అనేక సంస్కృత గ్రంథాలను పర్షియన్‌లోకి అనువదింపజేశాడు. అలా అధర్వణ వేదం (అధర్బణ్), మహా భారతం (రజ్మ్‌నామ), రామాయణం, హరివంశ పురాణం (హరిబన్స్), లీలావతి, రాజతరంగిణి, పంచతంత్రం మొదలైనవి సంస్కృతం నుండి పర్షియన్‌లోకి అనువదించబడ్డాయి. సంకుచితత్వం కారణంగా ముస్లింలు భారతీయ సంస్కృతిని అధ్యయనం చేయడం లేదనీ, సంకుచితత్వం నుండి ముస్లింలు బయట పడాలనీ అబుల్ ఫజల్ అభిప్రాయ పడ్డాడు. అతని 'ఐన్-ఇ-అక్బరీ'లో ఒక అధ్యాయం హిందూ మతం, సంస్కృతి, ఆలోచనా విధానం, ఆచార వ్యవహారాలకు సంబంధించిన విషయాలను చర్చిస్తుంది. ఈ అధ్యాయం భారతీయ సంస్కృతిలో హిందువులు, జైన, బౌద్ధుల్లాగే ముస్లింలు కూడా విడదీయరాని భాగమని నొక్కి వక్కాణిస్తుంది. ఆ విధంగా భారత ఉమ్మడి సంస్కృతిని స్పష్టంగా విశదం చేస్తుంది.

1575లో 'ఇబాదత్ ఖానా'ను ఏర్పాటు చేయడం ద్వారా మత విషయంలో ఒక కొత్త ప్రయోగాన్ని చేశాడు అక్బర్. ఇందులో మత విషయాలను తీవ్రంగా చర్చించేవారు. మొదట్లో కేవలం ముస్లింలకే పరిమితమైనప్పటికీ తర్వాత ముస్లిమేతరులను కూడా ఆహ్వానించారు. ముస్లింలలోనే ఉన్న అంతర్వైరుధ్యాలను చక్కగా గ్రహించిన అక్బర్ ఛాందసత్వానికి బాగా దూరంగా జరిగాడు. ఛాందసవాద ఉలేమాలతో వాదించడానికి ఉదారవాదులను ఎగదోసేవాడు. ముల్లా అబ్దుల్ కాదిర్ బదౌని ప్రకారం క్రైస్తవ మతంలో విశ్వసించిన అక్బర్ రాజకుమారుడైన మురాద్‌ను క్రైస్తవ ధర్మం నేర్చుకోమని చెప్పాడు. హిందువులు పవిత్రంగా భావిస్తారు కాబట్టి గోవధను నిషేధించాడు. అర్ధరాత్రీ, తెల్లవారు జామునా హిందువులు ఉచ్చరించే మంత్రాలను ఉచ్చరించేవారు. తన హిందూ రాణుల అంతఃపురాల్లో హోమాన్ని చేసేవారు. పండుగ సమయాల్లో నుదుట కుంకుమ అద్దుకునేవారు. బ్రాహ్మణులు అతని మణికట్టుకు పవిత్ర దారాలు కట్టేవారు. 'సుల్హ్-ఇ-కుల్' ('అందరికీ శాంతి') అనేది అక్బర్ ఆధ్యాత్మిక సూత్రం. అందులో సంకుచితత్వానికి తావు లేదు. హిందూస్తాన్‌లో సమైక్యతను సాధించడానికి ఈ సూత్రం అత్యంత ఆవశ్యకమైనదని అక్బర్ గుర్తించారు. అందరినీ కలుపుకుపోవడం ద్వారా లౌకికవాదం వైపు అడుగులు వేశాడు. సాధారణంగా అందరూ భావిస్తున్నట్లుగా అక్బర్ ఏ కొత్త మతాన్నీ స్థాపించలేదనీ, 'దీన్-ఇ-ఇలాహీ'నీ ఏ అధికారిక రికార్డూ నమోదు చేయలేదనీ తెలుపుతున్నారు ఫర్హత్ నస్రీన్ (పు. 89). హిందూ ఆచారాలైన 'ఝరోకా దర్శన్', 'తులాదాన్'లను అక్బర్ కొనసాగించారు.

వేల సంఖ్యలో ఉండిన తన సొంత బానిసలను బానిసత్వం నుండి విముక్తి కలిగించాడు అక్బర్. తన ప్రజల శ్రేయస్సు కోసం తన దగ్గరి అధికారులూ, అనధికారుల నుండి 1582లో సలహాలూ, సూచనలూ ఆహ్వానించాడు. నేరస్థులకు శిక్షలు కఠినతరంగా ఉండకుండా చేశాడు. 1582లో క్యాపిటల్ పనిష్మెంట్‌ను పూర్తిగా నిషేధించాడు. స్త్రీల సమస్యల పట్ల సున్నితత్వాన్ని ప్రదర్శించాడు అక్బర్. బాల్య వివాహాలు దేవునికి ప్రీతికరమైనవి కావన్నాడు. (రాజకుమారుడైన సలీం/జహాంగీర్ బాల బాలికల కనీస వివాహ వయస్సు 12 సంవత్సరాలు ఉండాలన్నాడు) ఏకపత్నీవ్రతాన్ని ప్రోత్సహించాడు. వితంతు వివాహాలను సమ్మతించాడు. ఇంకా గర్భాధానం జరగని స్త్రీలు సతీ సహగమనాన్ని పాటించడాన్ని నిరసించాడు. 1853లో స్వయంగా ఒక వితంతువు 'సతి' నుండి కాపాడాడు. సెక్స్ వర్కర్స్ కోసం రాజధానిలో ఒక ప్రత్యేక ప్రాంతాన్ని కేటాయించడంతో పాటుగా, అందులోని స్త్రీల సంరక్షనార్థం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. అక్బర్ మేనమామ ఖ్వాజా ముఅజ్జమ్ పట్టరాని ఆవేశంలో తన భార్యను చంపేస్తే అక్బర్ అతన్ని కట్టెలతో కొట్టించి తన్నించి ఖైదు చేయించాడు. 1594లో బానిస వ్యాపారంపై ఆంక్షలు విధించాడు. తన సొంత రాజ ప్రసాదపు రక్షకభట సిబ్బంది అధికారి ఒక 'అంటరాని' కులానికి చెందినవాడు. అక్బర్ అతన్ని "ఖిద్మత్ రాయ్" అనే బిరుదుతో సన్మానించాడు. 1598లో సిక్కు గురువు అర్జున్ సింగ్‌ను సందర్శించాడు. 1578 తర్వాత వేటాడడం మానుకోవడమే కాకుండా రాజ్యంలో ఎక్కడే గాని జంతువుల్నీ, పక్షుల్నీ వేటాడకూడదని ఆజ్ఞాపించాడు. 1580 నుండి శుద్ధ శాకాహార భోజనాన్ని అలవాటు చేసుకున్నాడు. శాకాహార భోజనాన్ని "సూఫియానా" అన్నాడు. అక్బర్

ప్రకారం మన పొట్ట జంతువుల పాలిట సమాధి కాకూడదు.

అక్బర్ కళలను పోషించాడు. బులంద్ దర్వాజా లాంటి బృహత్ నిర్మాణాలను చేపట్టాడు. 1584లో ఇలాహి శకాన్ని ప్రారంభించాడు. 1586లో తన జీవితం, కాలాలకు సంబంధించిన చరిత్ర రాయమని ఆ పనిని అబుల్ ఫజల్‌కు అప్పగించాడు. అది 'అక్బర్ నామా'గా ప్రసిద్ధమైంది. బదౌనీ ప్రకారం అక్బర్ కాలంలో సూఫీతత్వం, శాస్త్రీయ చర్చలు, తత్వశాస్త్ర శోధనలు పరిఢవిల్లాయి. గుడ్డి అనుకరణపై హేతువు పైచేయి సాధించింది. దేవున్ని ప్రేమతో ఆరాధించాలే గానీ, ఏవో భౌతిక ప్రతిఫలాపేక్షలతో కాదన్నాడు అక్బర్. 'మంచి'గా ఉండడం మంచిది కాబట్టి మనం మంచిగుండాలన్నాడు. యుక్త వయసులో ఉన్నప్పుడు బాగా తాగేవాడైనప్పటికీ వయసు పెరిగేకొద్దీ తగ్గించాడు. తను నిరక్షరాస్యుడైనప్పటికీ, జ్ఞానం పట్లా, పుస్తకాల పట్లా, జ్ఞానుల పట్లా ఎంతో భక్తి, గౌరవాలుండేవి అక్బర్‌కు. ఇంత 'గొప్ప' మనిషి 1605 అక్టోబర్ 17న చనిపోయాడు.

అక్బర్ చనిపోయిన వారానికి 1605 అక్టోబర్ 24న పట్టాభిషిక్తుడయ్యాడు నూరుద్దీన్ ముహమ్మద్ జహాంగీర్ బాద్‌షా ఘాజీ. జహాంగీర్ (1605-1627) తల్లి రాజపుత్ర స్త్రీ. భాషల పట్ల జహాంగీర్‌కు ప్రత్యేక ఆసక్తి ఉండేది. అతని ఆత్మకథ 'దుజుక్-ఇ-జహాంగీరీ'లో శరీర ధర్మశాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, భూగోళ శాస్త్రం, వైద్యం, చరిత్ర మొదలైన విషయాల్లో అతనికున్న జిజ్ఞాస మనకు కనిపిస్తుంది. తన తండ్రి అక్బర్ 'సుల్హ్-ఇ-కుల్' సిద్ధాంతాన్ని జాగ్రత్తగా కాపాడి కొనసాగించడమే కాకుండా, దానికి 'న్యాయం' అనే కొత్త అంశాన్ని జోడించాడు. జహాంగీర్ అనేక ప్రజోపయోగకరమైన చట్టాలను చేశాడు. జాగీర్దారులు, ప్రభుత్వాధికారుల కబంధ హస్తాల నుండి సామాన్య ప్రజలకు రక్షణ కల్పించేవి వీటిలో ప్రధానమైనవి. బెంగాలులోని సిల్హెట్‌లో తల్లిదండ్రులు తమ కుమారులను నపుంసకులుగా మార్చి అమ్మడమో, తాము చెల్లించాల్సిన పన్నులకు బదులుగానో ఇచ్చివేయడమో చేసేవారు. జహాంగీర్ ఈ క్రూర పద్ధతిని మానించడమే కాకుండా అలాంటి తల్లిదండ్రులు దండనార్హులని ఆజ్ఞాపించాడు. జహాంగీర్ సాద్‌ఖాన్‌ను న్యాయం అందరికీ ఒకటేననీ, తన నపుంసకులను నియంత్రించమనీ లేదా శిక్షకు సిద్ధంగా ఉండమనీ హెచ్చరించాడు. ఇలా న్యాయం పట్ల జహాంగీర్‌కున్న అంకిత భావాన్ని నిరూపించడానికి పలు ఉదాహరణలనిచ్చారు ఫర్హత్ నస్రీన్.

జహాంగీర్ కుమారుడైన ఖుస్రో రాజ్య కాంక్షతో తండ్రి మీద తిరగబడతాడు. దీని ఒక చేదు పర్యవసానం సిక్కుల ఐదవ గురువైన గురు అర్జున్ సింగ్‌ను జహాంగీర్ చంపించడం. తండ్రి మీద తిరగబడినప్పుడు తనవద్దకు వచ్చిన ఖుస్రోని అర్జున్ సింగ్ నుదుట తిలకం దిద్ది ఆశీర్వదిస్తాడు. దీన్ని తన మీద తిరుగుబాటుగా భావించిన జహాంగీర్ అర్జున్ సింగ్‌ని చంపివేయమని ఆజ్ఞాపిస్తాడు. అర్జున్ సింగ్‌ని చంపివేయించడంలో రాజకీయ కారణమే తప్ప మతానికి ఎలాంటి ప్రమేయమూ లేదని వ్యాఖ్యానించారు ఫర్హత్ నస్రీన్. అయినా ఈ సంఘటన మొఘలు-సిక్కు సంబంధాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపించింది. వితంతులైన అర్జుమంద్ బానో బేగం (తర్వాత నూర్జహాన్)ను 1611 జూన్ 11న పెండ్లాడాడు. ఆమె పరిపాలనలో ఎక్కువ ప్రభావాన్ని చూపించింది.

జహాంగీర్ తీవ్రంగా తాగేవాడు. ఎంతగా తాగేవాడంటే తాగుడు మానేయకపోతే మరణం తప్పదని రాజ వైద్యుడు హకీం హుమాన్ హెచ్చరించవలసి వచ్చింది. 1601 నాటికి తాగుడును 6 కప్పులకు తగ్గించాడు; అయినా నల్ల మందును మాత్రం సేవించేవాడు. దీంతో నానాటికీ ఆరోగ్యం క్షీణించనారంభించింది; ఎంతగా అంటే కనీసం తన దినచర్యను స్వయంగా రాయలేకపోయేవాడు. మొఘలు సామ్రాజ్య పతనంలో రాజులు తాగుబోతు తనం, మత్తు పదార్థాలకు బానిసలవడం కూడా ఒక కారణమన్నారు చరిత్రకారిణి ఫర్హత్ నస్రీన్ (పు. 119). జహాంగీర్ కుమారుడు పర్వేజ్ తీవ్రంగా తాగడం కారణంగా 36 సంవత్సరాల వయసులోనే చనిపోతాడు.

జహాంగీర్ మత విశ్వాసాలు సమ్మిళితమైనవి. అతను కూడా తన తండ్రి లాగే అన్ని మతాలనూ సమానంగా గౌరవించి మతపరంగా ఉదారవాద విధానాన్ని అవలంబించాడు. ఇస్లామిక్ పండుగలతో పాటు పర్షియన్ నౌరోజ్‌నూ, హిందూ పండుగలైన హోళీ, దసరా, దీపావళి, రక్షాబంధన్, శివరాత్రి మొదలైన వాటిని జరిపేవాడు. శివరాత్రి రోజున హిందూ యోగులతో సంభాషించేవాడు. ఎవర్నే గాని ఇస్లాంలోకి బలవంతంగా మతాంతీకరించ కూడదని తన అధికారులను ఆజ్ఞాపించాడు. దనియాల్ కుమారులకు క్రైస్తవ ధర్మాన్ని బోధింపజేశాడు. క్రైస్తవులను 'అహ్ల్-ఇ-కితాబ్' (ప్యీపుల్ ఆఫ్ ద బుక్)గా భావించాడు. (వేదాల కారణంగా హిందువులను కూడా 'అహ్ల్-ఇ-కితాబ్'గా భావించాడు అక్బర్). జద్రూప్ - గోసాయిన్ అనే హిందూ యోగితో ఆధ్యాత్మిక విషయాల మీద సంభాషించేవాడు. ఆయనను తన దగ్గరకు పిలవడం కాకుండా తనే ఆయన దగ్గరికి వెళ్లేవాడు; ఆయన్ని కలవడం తన అదృష్టంగా భావించాడు. ఈ విధంగా తండ్రికి దగ్గ కుమారుడైన జహాంగీర్ 1627 అక్టోబర్ 28/ 29న తన 58వ ఏట మరణించాడు; మొత్తం 22 సంవత్సరాలు భారతదేశాన్ని పాలించాడు.

జహాంగీరుకూ, రాజపుత్ర వంశానికి చెందిన రాణి మన్మతి జగతి గోసాయిన్ (మార్వార్ రాజు ఉదయ్ సింగ్ మోటారాజా కుమార్తె)కూ 1592 జనవరి 5న లాహోర్‌లో జన్మించాడు షాజహాన్. ఈ సందర్భంలో ఫర్హత్ నస్రీన్ ఒక ముఖ్యమైన, అత్యంత ఆసక్తికరమైన పరిశీలన చేశారు. ఏ విధంగా అయితే బాబర్ సైన్యం భారతదేశంలో ఉండాలనుకోలేదో అదే విధంగా షాజహాన్ సైన్యం భారతదేశానికి వెలుపల ఉండదలుచుకోలేదు (పు. 157). అంత పెద్ద ఎత్తున మొఘలులు అప్పటికి భారతీయీకరణ చెందిపోయారు. షాజహాన్ నలుగురు కుమారుల్లో ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రాంతానికి రాజ ప్రతినిధులుగా నియమించబడ్డారు. పెద్దవాడైన దారా షుకోహ్ అలహాబాద్, పంజాబ్‌లనూ, షాషుజా బెంగాల్‌నూ, ఔరంగజేబ్ దక్కన్‌నూ, మురాద్ బక్ష్ గుజరాత్‌నూ చూసుకునేవారు. పెద్ద కుమారుడైన దారానే తన వారసుడిగా భావించాడు షాజహాన్. దారా పట్ల షాజహాన్ చూపించే పక్షపాతం వల్ల అతని వల్ల అతని పట్ల మిగిలిన సోదరులు అసూయ గ్రస్తులయ్యారు. తనకున్న మతపరమైన ఉదారవాద నమ్మకాల దృష్ట్యా దారా ప్రత్యేకంగా పేర్కొనదగ్గవాడు. అందరినీ కలుపుకొని పోయే సూఫీ తత్వాన్ని పాటించిన దారా ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే 'సఫీనతుల్ ఔలియా', 'సకీనతుల్ ఔలియా', 'రిసాలా-ఇ-హక్నుమ', 'హసనాత్-ఉల్-ఆరిఫిన్', 'మజ్మ్-ఉల్-బహ్రైన్', 'సిర్ర్-ఇ-అక్బర్' మొదలైన గ్రంథాలను రచించారు. 'సిర్ర్-ఇ-అక్బర్' ఉపనిషత్తుల అనువాద గ్రంథం. దారా హిందూ మతాన్ని స్వయంగా అధ్యయనం చేశాడు. అతని ప్రకారం హిందూ మతంలో కూడా ఏకేశ్వరోపాసన ఉంది. దారా భగవద్గీతను కూడా పర్షియన్ భాషలోకి అనువదించాడు. మత, భాషా, సంస్కృతుల పరంగా వైవిధ్యభరితమైన భారతదేశానికి దారా లాంటి ఉదారమైన

మత విశ్వాసాలున్నవాడు షాజహాన్ తర్వాత చక్రవర్తి అయిఉండివుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు ఫర్హత్ నస్రీన్ (పు. 167).

షాజహాన్ అనారోగ్యాన్ని ఆసరాగా చేసుకొని అతని కొడుకులు ఒక్కొక్కరే స్వతంత్రం ప్రకటించుకోనారంభిస్తారు. 1657 డిసెంబర్ 5న మురాద్ స్వతంత్రం ప్రకటించుకున్నాడు. షుజా కూడా స్వతంత్రం ప్రకటించుకున్నాడు. షాజహాన్ కూతుళ్లు ఒక్కొక్కరు ఒక్కొక్క సోదరునితో జతకట్టారు. జహాన్ ఆరా దారాను, రోషన్ ఆరా ఔరంగజేబును, గౌహర్ ఆరా మురాద్‌ను సమర్థించారు. 1658 జూన్ 8న సామూగఢ్ వద్ద జరిగిన యుద్ధంలో ఔరంగజేబు దారాను ఓడిస్తాడు. తనను కలవమని ఎంతగా వేడుకున్నా ఔరంగజేబు షాజహానును కలుసుకోడు. చివరికి 1658 జూన్ 19న తన తండ్రిని పదవీభ్రష్టున్ని చేశాడు ఔరంగజేబు.

ఔరంగజేబు తన రాజకీయాల కోసం ఖురాన్‌ను వాడుకున్నాడు. రాజును చేస్తాననడంతో తనని నమ్మిన సోదరుడు మురాద్‌ను మోసగించడానికి ఖురాన్ మీద తప్పుడు ప్రమాణాలు చేశాడు; కానీ జీవితాంతం ఖురాన్ చదవడం, ఖురాన్ ప్రతులను రాయడం చేశాడు! ఔరంగజేబు రాజ్యాన్ని హస్తగతం చేసుకున్న విధానాన్ని మక్కా మతపెద్ద గానీ, పర్షియా చక్రవర్తి గానీ సమ్మతించలేదు. తన అన్న దారాషుకోని తీవ్రంగా అవమానపరచి చంపిన విధానాన్ని సామాన్య ప్రజలే కాకుండా దారా శతృవులు కూడా హర్షించలేకపోయారు. దారా విషయంలో కూడా ఔరంగజేబు మతాన్ని తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నాడు. మతం పట్ల దారాకున్న ఉదారవాద విశ్వాసాల వల్ల అతన్ని కాఫిర్ అనీ, ఇస్లాం మత భ్రష్టుడనీ చిత్రీకరించి అతని పట్ల వ్యతిరేకతను సృష్టింపజేశారు. (దారా తన పుస్తకం 'మజ్మ్-ఉల్-బహ్‌రైన్'లో హిందూ-ఇస్లాం మతాల మధ్య పదజాలాల ప్రయోగం తప్ప సారాంశంలో తేడా లేదన్నారు. అతను ధరించే ఉంగరంపై దేవనాగరి లిపిలో 'ప్రభు' అని రాసి ఉండేది). అయితే దారా కూడా ఏం తక్కువ తినలేదు. ఒకవేళ నేను నీ చేత చిక్కి ఉంటే నీవేం చేసి ఉండేవాడివని ఔరంగజేబు దారానడిగినప్పుడు ఔరంగజేబును నాలుగు ముక్కలు చేసి ఢిల్లీ నాలుగు వైపులా వేలాడగట్టి ఉండేవాడినని సమాధానమిచ్చారు దారా! ఔరంగజేబు దారాను శిరచ్ఛేదనం చేయించి ఖండిత శిరస్సును షాజహానుకు 'బహుమతి'గా పంపించాడు. దాన్ని చూసిన షాజహాన్ మూర్ఛపోయాడు.

ఔరంగజేబును సాధారణంగా హిందూ ద్వేషిగా భావిస్తారు. కానీ అత్యంత క్రూరత్వంతో అతను నాశనం చేసినవారు ముస్లింలే; ఒక్క వారసత్వ యుద్ధాల సమయంలోనే అనేక మంది రాజపుత్ర రాజులు ఔరంగజేబు పక్షం వహించారు. 1663లో ఈశ్వర్ దాస్ అనే హిందూ జ్యోతిష్కుడు సంస్కృతంలో రాసిన పుస్తకంలో ఔరంగజేబు అవలంబించిన విధానాలను 'ధర్మబద్ధమైనవి' గానూ, 'న్యాయపూరిత మైనవి' గానూ వర్ణించాడు (పు. 206). ఔరంగజేబు కాలంలో పశ్చిమోత్తర భారతదేశంలో మొఘలులు తీవ్రమైన తిరుగుబాట్ల నెదుర్కోవాల్సి వచ్చింది. అలాగే 1668-69లో జాట్లు తిరగబడ్డారు. వీళ్లెంతగా తిరగబడ్డారంటే సికంద్రాలోని అక్బర్ సమాధిని ఎముకలు సహా తవ్వి తీసి దోచుకున్నారు. డిసెంబర్ 1675లో సిక్కుల గురులైన గురు తేజ్‌బహదూర్‌ను చంపించడంతో అతని కుమారుడు గురు గోవింద్‌సింగ్ నేతృత్వంలో సిక్కులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. శివాజీకీ, ఔరంగజేబుకూ మధ్య జరిగిన ఎడతెగని ఘర్షణ మనందరికీ తెలిసిందే! కానీ చాలా మంది దీన్ని మతం కోణంలో చూస్తుంటారు. ఔరంగజేబుతో శివాజీ 'సంఘర్షణ పూర్తిగా రాజకీయ పరమైనదనీ, ఇరువైపుల నుండీ అది మత యుద్ధం ఎంతమాత్రం కానే కాదనీ' కచ్చితంగా అన్నారు ఫర్హత్ నస్రీన్ (పు. 212).

1679లో జిజియా పన్నును పునర్విధించాడు. ఔరంగజేబు కొన్ని అభ్యుదయకరమైన పనులను చేపట్టాడు. ముహమ్మద్ హాషీంకు ఇచ్చిన ఫర్మానాల ప్రకారం పన్నులు వసూలు చేసే అధికారులు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించాలి; అప్పుడే రైతులు పంటలు అభివృద్ధి పరచడంలో శ్రద్ధ చూపించగలరు. అధికారులలోని అవినీతిని అంతమొందించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాడు. అత్యంత నిరుపేదలైనప్పటికీ రైతుల విన్నపాలను విని పరిష్కరించాలని అధికారులను ఆజ్ఞాపించాడు. అనేక చట్ట వ్యతిరేక పన్నులను నిషేధించాడు. అవినీతిపరులైన అధికారులను దండించడంతో పాటు నిజాయితీపరులు, కష్టపడి పనిచేసేవారిని పదోన్నతులతో ప్రోత్సహించాడు. ఔరంగజేబు 1707 ఫిబ్రవరి 20న చనిపోయాడు.

సాధారణంగా మొఘలులపై రాసిన చరిత్ర పుస్తకాల్లో నూర్జహాన్, ముంతాజ్ మహల్‌ల గూర్చి తప్ప మిగిలిన మొఘలు స్త్రీల గూర్చిన ప్రస్తావన కనిపించనే కనిపించదు. ఫర్హత్ నస్రీన్ పుస్తకం ఈ విషయంలో ప్రత్యేకమైనది. ఇందులో మనకు అనేకమంది మొఘలు స్త్రీలు తారసపడతారు. నస్రీన్ గారి ప్రకారం మొఘలులు ఎల్లప్పుడూ తమ స్త్రీలను గౌరవించారు; వారి అభిప్రాయాలను జాగ్రత్తగా పరిశీలించారు (పు. 126). బాబర్ అమ్మమ్మ ఎహ్‌సాన్ దౌలత్ తెలివైన, మిక్కిలి ధైర్యస్తురాలైన స్త్రీ. రాజకీయ, సైనిక వ్యవహారాల్లో ఆమె సలహాలు తీసుకోబడ్డాయి. ఫక్రున్నిసా (బాబర్ కూతురు), ఖానాజాదా బేగం (బాబర్ అక్క), సలీమా సుల్తాన్ బేగం (బాబర్ మనుమరాలు), మహ్‌ఛుచక్ బేగం (హుమయూన్ సోదరుడు కమ్రాన్ భార్య), మిహమ్ అనగా (అక్బర్ దాయి), ఫాతిమా బానూ బేగం (అక్బర్ కూతురు), షాహ్‌జాదా ఖానం, ఫకృన్నిసా బేగం, ఆరాం బానూ బేగం (అక్బర్ కుమార్తెలు), మాన్‌బాయి - షాహ్‌బేగం (జహాంగీర్ భార్య), మెహర్ ఉన్ నిసా (జహాంగీర్ భార్య), అర్జుమంద్ బానోబేగం (షాహజాన్ భార్య), ఇజ్జల్ నిసాబేగం, కాంధరీ బేగం (షాజహాన్ భార్యలు), పుర్‌హునర్ బాను, హూరున్నిసా, జహనారా, రోషనారా, గౌహర్ ఆరా (షాజహాన్ కుమార్తెలు), బిల్కిస్‌మకానీ (షాజహాన్ తల్లి), మర్యం ఉజ్ జమానీ (జహాంగీర్ తల్లి), దిల్‌రస్ బానూబేగం (ఔరంగజేబు భార్య), నాదిరాబాను (దారాషుకో భార్య) మొదలైన స్త్రీలు ఈ పుస్తకంలో మనకు కన్పిస్తారు. మొఘలులు భారతదేశాన్ని హృదయపూర్వకంగా ప్రేమించిన తీరుకు ఆమె చివరి కోరిక అద్దం పడుతుంది.

మొఘలుల కాలం నాటి కొందరు అరుదైన వైద్యుల సమాచారం కూడా ఈ పుస్తకంలో దొరుకుతుంది. అతీకా బక్షి (మంగోల్) గొప్ప శస్త్ర చికిత్స నిపుణుడు. గాయపడ్డ బాబర్‌కు నయం చేశాడు. ఛిద్రమైన మెదళ్లను సైతం బాగుచేయగల సామర్థ్యం ఉన్నవాడతడు. ఇతను సాధించిన విజయాల పట్ల బాబర్ అమితాశ్చర్యం చెందాడు. హకీ అలీ జిలానీ (అక్బర్‌కు వైద్యం చేశాడు), హకీం హుమమ్ (రాజ వైద్యుడు), హకీం రుహుల్లా (నూర్జహాన్‌కు వైద్యం చేశాడు), అలీముద్దీన్ వజీర్ ఖాన్ (ముంతాజ్ మహల్ వ్యక్తిగత వైద్యుడు) మొదలైన వారి గూర్చి ఈ పుస్తకం ప్రస్తావిస్తుంది. 230 పుటల ఈ పుస్తకాన్ని రూపా 2021లో ప్రచురించింది. మొఘలులను భారతీయ సంస్కృతిలో విడదీయరాని భాగంగా అత్యంత శక్తివంతంగా నిరూపించిన పుస్తక రచయిత, చరిత్ర కారిణి, ప్రొఫెసర్ ఫర్హత్ నస్రీన్ న్యూ ఢిల్లీలోని జామియా మీలియా ఇస్లామియాలో చరిత్ర బోధిస్తున్నారు.

తత్వశాస్త్ర ప్రపంచంలో విప్లవం

యు.ఎ. ఖారిన్ *రచించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ డయలెక్టిక్స్' పుస్తకంలోని రెండవ అధ్యాయంలోని మూడవ ఉపశీర్షిక: అనువాదం - రాజేంద్రబాబు అర్విణి*

మార్క్స్, ఎంగెల్స్‌ల యావత్ జీవితకాల అధ్యయనం, కృషితో తయారయింది మార్క్సిస్టు తత్వశాస్త్రం. ఇది వారిద్దరూ కలిసి రాసిన ద హోలి ఫామిలీ (1845), ద జర్మన్ ఐడియాలజీ (1845-1846), మేనిఫెస్టో ఆఫ్ ద కమ్యూనిస్టు పార్టీ (1848); మార్క్స్ రాసిన థీసిస్ ఆన్ ఫ్యూయర్ బాచ్ (1849), ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ (1847), కాపిటల్ (1867), క్రిటిక్ ఆఫ్ ది గోథా ప్రోగ్రామ్ (1875); ఎంగెల్స్ రాసిన యాంటీ డూరింగ్ (1877-1878), డయలెక్టిక్స్ ఆఫ్ నేచర్ (1873-1886),లుడ్విగ్ ఫ్యూయర్ బాచ్ అండ్ ద ఎండ్ ఆఫ్ క్లాసికల్ జర్మన్ ఫిలాసఫీ (1888), ద ఒరిజిన్ ఆఫ్ ద ఫామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ ద స్టేట్ (1884) ఇంకా ఇతర గ్రంధాలలో విశదీకరించబడ్డది.

తత్వశాస్త్రంలో మార్క్సిస్టు విప్లవం అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు కచ్చితమయిన సమాధానం మన ముందుంది. గతితార్కిక భౌతికవాద ప్రాపంచిక దృక్పథం అంతకు ముందున్న తత్వశాస్త్ర సిద్ధాంతాలను తిరస్కరించి, అదే సమయంలో వాటిల్లో విలువైనవాటిని, అలాగే మానవ సంస్కృతిలోని అభ్యుదయకర అంశాలను స్వీకరించి కొత్త ఒరవడిని సృష్టించింది అన్నదే ఆ సమాధానం.

గతితార్కిక, చారిత్రక భౌతికవాద ప్రాథమికమయిన విశిష్టత ఏమిటంటే అది అన్నింటికీ మించి శ్రామిక వర్గానికి చెందిన తత్వశాస్త్రం; అది సమాజపరంగా, జాతి పరంగా జరుగుతున్న అణిచివేతకు, దోపిడికి వ్యతిరేకంగా విశాల శ్రామిక వర్గ శ్రేణులు నిర్వహిస్తున్న ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న ఆధునిక సమాజంలో పురోగమన శక్తుల, సదా విప్లవానికంకితమయిన వారి ప్రాపంచిక దృక్పథానికి సిద్ధాంత పునాది. గతంలోని తత్వశాస్త్ర సిద్ధాంతాలు (యుటోపియన్, రష్యన్ విప్లవ డెమొక్రాట్స్‌వి తప్ప మిగతా భావ, భౌతికవాద సిద్ధాంతాలు రెండూ కూడా) దోపిడి వర్గాల ప్రాపంచిక దృక్పథాలుగా, ప్రపంచాన్ని విశ్లేషించే వాటి దృష్టిగా దోపిడీ వర్గాలకు ఉపయోగపడ్డాయి. తాత్విక ఆలోచనలు సాధారణ ప్రజలకు సంబంధం లేని పాలకవర్గంలోని ఒక చిన్న "ఆత్మను గురించి ఆలోచించే ఉత్తమ జాతి" సమూహానికి చెందిన ఆస్తిగా పరిగణించేవారు. ఈ భావాలు తేలికగా అర్థం అయ్యేవి కానివిగా, కోట్లాది సాధారణ ప్రజల ఆసక్తులకు భిన్నంగా ఉండేవి. సామాజిక పరిభాషలో చెప్పాలంటే, దోపిడీ వర్గాలకు చెందిన గత కాలంలోని ఈ తత్వవేత్తలు, సిద్ధాంతకర్తలు అన్ని రకాలయిన పీడనను అంతమొందించే విధంగా కాకుండా ఒక కొత్త రకమయిన ఆర్థిక రాజకీయ అణిచివేతను స్థాపించడానికే ఎప్పుడూ ప్రయత్నించేవారు. అంతకు ముందు, తాత్వికత అంటే కొందరు ఆలోచనాపరుల వ్యక్తిగత విషయంగా భావించే వారు. ఆ తదుపరి ప్రభవించిన గతితార్కిక భౌతికవాదం ఆ అభిప్రాయాన్ని బద్దలుకొట్టి అది తప్పని ప్రకటించింది. "ఏ విధంగా నైతే తత్వశాస్త్రం భౌతిక వాదానికి అవసరమయిన ఆయుధాలను శ్రామిక వర్గం నుండి సమకూర్చుకుంటుందో, అదే రీతిలో శ్రామిక వర్గం కూడా తన పార లౌకిక చైతన్యానికి సంబంధించిన ఆయుధాలను తత్వశాస్త్రంలో వెతుక్కుంటుంది".

ప్రారంభ దశలోని భౌతికవాద బోధనల వలె కాకుండా మార్క్సిస్టు ఆలోచన విప్లవాత్మక గతితార్కికం పద్ధతిలో కొనసాగుతుంది. మార్క్సిజానికి ముందున్న భౌతికవాదం ముఖ్యంగా ఆదిభౌతిక సిద్ధాంతం పైన ఆధార పడింది. ఆదిభౌతికం వెలుగులో ప్రకృతి గురించి, మానవ చరిత్ర గురించి శాస్త్రీయమయిన అవగాహనకు రావడం అసాధ్యం. మానవ సమాజాన్ని సోషలిస్టు సమాజంగా మార్చే ఉద్యమంలో శ్రామిక వర్గానికి ఆధిభౌతిక భౌతికవాదం తాత్విక ఆయుధంగా ఉపయోగపడలేక పోయింది. మార్క్సిస్టు తత్వశాస్త్రం ఆవిర్భావంతో ఆధిభౌతిక ప్రాపంచిక దృక్పథం కుప్పకూలి పోయింది, అదే రీతిలో చరిత్రను గురించిన భావవాద దృక్పథాన్ని మార్క్సిస్టు ఆలోచన వ్యతిరేకించింది. ఉదాహరణకు హెగెల్ ప్రత్యేకంగా ఆలోచన, సిద్ధాంతానికి సంబంధించిన గతితార్కకం పైనే దృష్టి కేంద్రీకరించాడు. ఆయన ఉద్దేశ్యంలో అభివృద్ధి అంటే భౌతిక ప్రపంచంలోని విషయాలలో పరివర్తన సాధించే నిజమయిన ప్రక్రియ అని కాకుండా ఒకరి మేధో సారాంశాన్ని మరొకరు తప్పని నిరూపించాలని ప్రయత్నించడం మాత్రమే. సరి అయిన రీతిలో చెప్పాలంటే, హెగెల్ గతితార్కికం భ్రమాపూరితమయిన అభివృద్ధిని సూచించింది కానీ, నిజానికి ఆ కాలంలో ఉనికిలో ఉన్నదాన్నే సమర్థించింది, దానినే మళ్లీ కొనసాగించే విధంగా ఆయన తత్వంతోద్భడింది. మార్క్స్, ఎంగెల్స్ ప్రతిపాదించిన భౌతికవాద గతితార్కికం మాత్రమే శాస్త్రీయమయిన ప్రాపంచిక దృక్పథం; ప్రపంచాన్ని అధ్యయనం చెయ్యడానికి, అర్థం చేసుకోవడానికి దానిని మార్చడానికి సరిఅయిన పరికరం ఇదే. భౌతికవాద గతితార్కికం ప్రాకృతిక, సామాజిక ప్రక్రియలలో ఉండే అంతర్గత వైరుధ్యాలను, అవి ఒక్కసారిగా అభివృద్ధి దిశలో మార్పు చెందడం, వాటి నిరాకరణలను గురించి విశద పరుస్తుంది. కాబట్టి, సారాంశంలో అది సంక్లిష్టమయినది; విప్లవాత్మకమయినది కూడా. మార్క్సిజం కారణంగా తత్వశాస్త్రంలో వచ్చిన తిరుగుబాటు ఫలితంగా తత్వశాస్త్రానికి సంబంధించిన ప్రాథమికమయిన ప్రశ్నకు జవాబు ప్రకృతికి సంబంధించి మాత్రమే కాకుండా (గతంలో కూడా భౌతికవాదులలో ఈ విశిష్ట గుణం ఉండింది) సమాజానికి సంబంధించి (సమాజానికి సంబంధించి గతంలో ఆలోచనాపరులు, భౌతికవాదులు, ఇతరులు అందరూ భావవాద కోణంలోనే ఆలోచించారు) కూడా భౌతికవాద కోణంలో లభించింది. మార్క్స్, ఎంగెల్స్‌లు భౌతికవాదం వెలుగులో సామాజిక జీవనం అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆ రకంగా వారు చారిత్రిక భౌతికవాదాన్ని ఆవిష్కరించారు. ఇది మానవ సమాజ చరిత్రకు గతితార్కిక

భౌతికవాదాన్ని వర్తింపజేయడమే కాదు. సమాజ అభివృద్ధిని నియంత్రించే సూత్రాలను భౌతికంగా వివరించకుండా గతి తార్కిక భౌతికవాదం రూపుదిద్దుకునే అవకాశం లేదు. అదే సమయంలో ఈ సూత్రాలను గతితార్కిక భౌతికవాద విధానంలో కాకుండా మరేవిధంగా విశ్లేషించడానికి వీలు లేదు కూడా. కాబట్టి, గతితార్కిక, చారిత్రిక భౌతికవాదం ఏకైక మార్క్సిస్టు బోధనగా అవతరించి అభివృద్ధి చెందుతున్నది. సమాజంలో ఒకరికొకరు సహకరించుకోవడము, ఘర్షణ, పోటీ తత్వము, సర్దుబాటు లాంటివి ఎన్నో విషయాలు మిళితమయి ఉంటాయి, వీటన్నింటితో కూడినదే సామాజిక ప్రక్రియ. అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, కార్మికులు, ప్రజల సామూహిక కార్యాచరణ లాంటి అంశాలు సామాజిక ప్రక్రియలో నిర్వహించే నిర్ణయాత్మక పాత్రను ఖచ్చితంగా నిర్ధారించడంలోనే సమాజం పట్ల భౌతికవాద దృక్పథం వెల్లడవుతుంది. మానవ చరిత్ర అంటే చట్ట బద్దమయిన అభివృద్ధి క్రమం అని, ఆర్థిక సామాజిక వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించడము అని చారిత్రిక భౌతికవాదం వల్లనే అవగతమవడం ప్రారంభమయింది. అంతే కాదు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అస్థిరంగా ఉంటుందని తేటతెల్ల పరుస్తూ, కార్మిక వర్గం బూర్జువాల పాలిట కాటికాపరులని, వారే కొత్త సోషలిస్టు సామాజిక వ్యవస్థ రూపకర్తలని చారిత్రిక భౌతికవాదం చాటిచెప్పింది.


తత్వశాస్త్రంలో విప్లవం అంటే క్లుప్తంగా, స్వచ్ఛమయిన సిద్ధాంతంగా తత్వశాస్త్రానికి, శ్రామిక వర్గ ఆచరణాత్మక కార్యాచరణకు మధ్య ఉండే భేదాన్ని మార్క్సిజం చరమ గీతం పాడింది. అలాగే వాస్తవాన్ని గుర్తించడంలో తొలుత వచ్చిన భౌతికవాద ఆలోచనా ప్రక్రియను పూర్తి చేసింది. ఆర్థికంగా రాజకీయంగా ఆధిపత్యం చెలాయిస్తున్న వర్గాల ప్రయోజనాలకు అంకితమయిన తత్వశాస్త్ర సిద్ధాంతాలను దృష్టిలో ఉంచుకొని మార్క్స్ తన లక్ష్యాన్ని ఈ విధంగా నిర్దేశించు కున్నాడు: “తత్వవేత్తలు ప్రపంచం గురించి వివరించి చెప్పడానికి మాత్రమే ప్రయత్నించారు; కానీ ఇప్పుడు అసలు సమస్య దానిని మార్చడం”. ప్రపంచానికి సరి అయిన నిర్వచనం ఇవ్వడం కూడా గతితార్కిక భౌతిక వాదానికి సంబంధించిన విషయమే. మార్క్స్‌కు సంబంధించి ఆ సూత్రాలు ప్రత్యేకమయినవి. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ప్రపంచాన్ని గురించి సిద్ధాంతపరంగా వివరించి చెప్పుకొని మాత్రమే మనం సంతృప్తిపడితే సరిపోదు. ఎందుచేతనంటే ఇప్పటి ఈ వ్యవస్థ అణిచివేతకు గురి అయిన పీడిత ప్రజానీకానికి హాని కరమయినది. సిద్ధాంతం మాత్రం చెప్పుకొంటే అది ఈ వ్యవస్థను సమర్థించినట్టవుతుంది. దోపిడీ వర్గాలకు చెందిన సిద్ధాంతకర్తలు శతాబ్దాల తరబడి భారత దేశంతో సహా పలు దేశాలలో తత్వశాస్త్రం అంటే సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న కఠిన తక్షణ సమస్యలతో సంబంధం లేనిదిగా చిత్రిస్తూ వచ్చారు. భావవాద సిద్ధాంతమయిన వేదాంతాన్ని ప్రతిపాదించిన ప్రముఖుడు శంకరాచార్య ఈ విధంగా వ్రాసాడు: “వేదాంతి లేదా తత్వవేత్త జీవితం ఆవల నిలుచుండి జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి”. ఆలోచనకు మాత్రమే ప్రాముఖ్యత నిచ్చే ఇలాంటి ఉపదేశాలను, ప్రపంచాన్ని శాస్త్రీయంగా పరిశీలించే సిద్ధాంతం సహాయంతో, ప్రపంచంలో సంభవించే మార్పులను సరిగా అర్థం చేసుకొని వాటికి స్పష్టమయిన రూపం ఇచ్చే సిద్ధాంతం సహాయంతో వ్యతిరేకించాలని మార్క్స్ బోధిస్తాడు. క్లుప్తంగా చెప్పాలంటే గతితార్కిక భౌతిక వాదం ఈ రకమయిన సిద్ధాంతము. ప్రజల ఆచరణాత్మకమయిన విప్లవ కార్యాచరణతో మాత్రమే ప్రపంచంలో మార్పు సంభవిస్తుంది. ఆ విధంగా సిద్ధాంతానికి, కార్యాచరణను అనుసంధానం చేస్తుంది (సిద్ధాంతం అంటే గతితార్కిక భౌతిక వాదము, కార్యాచరణ అంటే శ్రామికుల వర్గ పోరాటం, సోషలిస్టు కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడానికి శ్రామికులు చేసే ప్రయత్నాలు).

ఇవీ గతితార్కిక, చారిత్రిక భౌతిక వాదము యొక్క గుణాత్మక లక్షణాలు. వీటికి సంపూర్ణంగా రూపు రేఖలు దిద్దితే అవే తత్వశాస్త్రంలో మార్క్సిస్టు విప్లవాన్ని సూచిస్తాయి.

మార్క్సిస్టు, హెగెలియాన్ సిద్ధాంతాలలో మౌలిక వ్యత్యాసం.

ప్రశ్నలు	హెగెలియన్ తత్వశాస్త్రం	మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఏ ఏ ముఖ్యమయిన సిద్ధాంత పరమయిన అంశాలకు తరువాతి కాలంలో మరిన్ని అధ్యయనాలు తోడయ్యాయి?	వస్తుగత భావవాదం గతితార్కిక వాదానికి సూత్రాలు, శాఖలు.	భౌతికవాదం గతితార్కిక, చారిత్రిక భౌతికవాదం.
ఏ రకమయిన ఆలోచనా పద్ధతి ఆచరించబడ్డది, అది ఎంత వరకు స్థిరంగా ఉండింది?	గతితార్కిక పద్ధతి, కాని చాలా అస్థిరంగా ఉండింది.	గతితార్కిక భౌతిక వాద పద్ధతి. స్థిరంగా అన్వయించబడ్డది.
పరిపూర్ణమయిన తత్వశాస్త్రం సాధ్యమా?	సాధ్యమే	అస్సలు సాధ్యం కాదు, ఎందుచేతనంటే ప్రపంచం సతతము మారుతూ ఉంటుంది, గుణాత్మకంగా, పరిమాణాత్మకంగా తరగని వృద్ధి పొందుతూవుంటుంది
ఇతర శాస్త్రాలతో ఏ విధమయిన సంబంధం ఉంటుంది	వాస్తవానికి విరుద్ధంగా ముక్తాయింపు నిస్తుంది.	ఇతర శాస్త్రాల పై ఆధారపడుతుంది, అవి వృద్ధి పొందడానికి తన వంతుగా సహాయపడుతుంది
ఏ వర్గపు ప్రాపంచిక దృక్పథాన్ని ఇది ప్రాతినిధ్యం వహిస్తుంది?	జర్మన్ బూర్జువాజీ	కార్మిక వర్గం
ఈ సిద్ధాంతం సామాజిక లక్ష్యం ఏమిటి?	ప్రపంచం న్యాయంగానే నడుస్తుందని, దీనికి ఎదురు తిరగాల్సిన అవసరం లేదని భావిస్తుంది	విప్లవాత్మక మార్పు అవసరం

ప్రాథమికమైన మార్పులు



దొంగరి సోమయ్య మృతి

కుల నిర్మూలన పోరాట సమితి కార్యకర్త దొంగరి సోమయ్య మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతూ చికిత్సకోసం రంగారెడ్డి జిల్లాలోని ఎంఎన్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో డిసెంబర్ 10న మృతిచెందారు. ఆయన గత పది సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రత్యేక సమస్య అయిన కులాన్ని నిర్మూలించాలన్న ఉద్దేశంతో 'కుల నిర్మూలన పోరాట సమితి'లో పనిచేస్తూ తమ పిల్లలకు కులాంతర వివాహాలు చేసి కుల నిర్మూలనను తన కుటుంబం నుంచే ప్రారంభించి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు.

రాజ్ కిశోర్ మృతి

విప్లవ సాహిత్య, సాంస్కృతికోద్యమ నాయకులు రాజ్ కిశోర్(89) అనారోగ్యంతో డిసెంబర్ 23న మరణించారు. బీహార్ తొలితరం సాహిత్య, సాంస్కృతికోద్యమ నాయకులు. బీహార్‌లో క్రాంతికారి నవజన్ వాది సాంస్కృతిక్ సంఘ్ నాయకులుగా రాజ్ కిశోర్ అనేక సభల్లో పాల్గొన్నారు. ఎఐఎల్ఆర్‌సి కార్యవర్గ సభ్యులయిన నాటి నుంచి గడిచిన నాలుగు దశాబ్దాలలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎన్నో సభల్లో, సమావేశాల్లో పాల్గొన్నారు. 2002 జనవరి 13,14ల్లో హైదరాబాద్‌లో జరిగిన ఎఐఎల్ఆర్‌సి మహా సభల్లో పాల్గొన్నారు. బీహార్ విప్లవ సాహిత్య, సాంస్కృతికోద్యమానికి మార్గదర్శక నాయకులుగా ఉన్నారు. ఎఐఎల్ఆర్‌సి అధ్యక్షులుగా, ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం, రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ నాయకులుగా దేశమంతా పర్యటించారు. గత కొంత కాలంగా పక్షవాతం వల్ల కదలలేని స్థితిలోఉన్నారు.

తెలంగాణ రైతుల మహా ధర్నా

నూతన సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో రైతుల ఆందోళన చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నవంబర్ 25న అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ తెలంగాణ శాఖ మహాధర్నా నిర్వహించింది. ఈ ఆందోళనలో భారతీయ కిసాన్ యూనియన్ నేత తికాయత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి టిఆర్ఎస్ పార్టీనే ఎక్కువగా మద్దతు ఇస్తోందని ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. బిజెపి ప్రభుత్వానికి అన్ని విషయాల్లో మద్దతు ఇచ్చిన సిఎం కెసిఆర్ సాగు చట్టాలకు వ్యతిరేకమని చెబితే నమ్మలేమన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడుపుతోందని.. అంబానీ, అదానీ ఆదేశాలతో అది పనిచేస్తుందని విమర్శించారు. బిజెపికి కిసాన్ మోర్చా మద్దతిచ్చే ప్రసక్తే లేదని దేశం కోసమే మోర్చా పనిచేస్తుందన్నారు. ఢిల్లీ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రు. 3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియాను చెల్లిస్తామని టిఆర్ఎస్ ఇచ్చిన హామీని ప్రస్తావిస్తూ తెలంగాణలో కూడా మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వ అప్పులు

కాంగ్రెస్ ఎం.పి. రేవంత్ రెడ్డి అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ లోక్‌సభలో నవంబర్ 30 నాటికి తెలంగాణ ప్రభుత్వం రు. 2,37,747 కోట్లకు చేరిందని వెల్లడించారు. ఇందులో స్వదేశీ అప్పు రు. 2,34,912 కోట్లు, విదేశీ అప్పు రు. 2,835 కోట్లుగా ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఈ రుణాలను ఆర్‌బిఐ, రీఫైనాన్సింగ్ సంస్థలు, విదేశీ ఆర్థిక సంస్థల నుండి తీసుకుందన్నారు.

భవన నిర్మాణ ముడిసరకుల ధరలను నియంత్రించాలి

భవన నిర్మాణ ముడిసరకుల ధరలను నియంత్రించాలని కోరుతూ దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా డిసెంబర్ 3న కరీంనగర్‌లోని కలెక్టరేట్ ముందు తెలంగాణ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన సంక్షేమ పథకాలు రాకుండా పోతాయన్నారు. సెస్ రూపంలో వసూలు చేసిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర సం క్షేమ పథకాలకు, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు వెచ్చిస్తున్నాయని ఆరోపించారు.

ఆర్‌టిఐ సర్క్యులర్‌పై సర్కార్ వెనక్కి

ప్రభుత్వ సంస్థల, శాఖల అవినీతిపై యుద్ధంలో ప్రజల చేతికి అస్త్రంలా అందివచ్చిన సమాచార హక్కుకు విఘాతం కలిగించేలా తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జారీచేసిన సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ పలువురు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. సమాచార హక్కుకు తూట్లు పొడిచే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్‌పై సర్కారు వెనక్కితగ్గింది. ఈ మేరకు హైకోర్టుకు డిసెంబర్ 14న తెలియజేసింది. ప్రజా వ్యతిరేక ఉత్తర్వులు జారీచేయడం ఆ తరువాత నాలుక కర్చుకొని ఉపసంహరించుకోవడం కె.సి.ఆర్. ప్రభుత్వానికి పరిపాటిగా మారింది.

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ ఎంఆర్‌పిఎస్ ధర్నా

సుప్రీంకోర్టు సూచనలు గౌరవించి రాష్ట్రాలే ఎస్‌సి వర్గీకరణ చేసుకునేలా పార్లమెంట్లో చట్టం తీసుకురావాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎమ్ఆర్‌పిఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్‌లో డిసెంబర్ 9న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ సిఫార్సుల ఆధారంగా జనాభా దామాషా ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఎస్‌సి వర్గీకరణ చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. వర్గీకరణ విషయంలో తెలుగు రాష్ట్రాల ఎంపిలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఊపా రద్దు చేయాలని నిరసనలు

ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాల రద్దుకోసం ఉద్యమించాలని ఊపా రద్దు పోరాట కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో డిసెంబర్ 8న నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌరహక్కుల సంఘం నాయకులు మాట్లాడారు. డిసెంబర్ 10న మానవ హక్కుల దినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం పాలన చేస్తున్నామని చెపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రజలకిచ్చిన హక్కులపై దాడి చేస్తున్నాయి ఊపా రద్దు పోరాట కమిటీ కన్వీనర్ చిలుకా చంద్రశేఖర్ అన్నారు. ప్రశ్నించే వారిని దేశ ద్రోహులుగా ముద్రవేసి ఏళ్ల తరబడి జైలుపాలు చేస్తున్నారన్నారు. ఊపా రద్దు పోరాట కమిటీ డిసెంబర్ 18న గుంటూరులోని బ్రాడిపేట కొరటాల భవన్‌లో నిర్వహించిన సభలో చంద్రశేఖర్ బహుళజాతి కంపెనీలు దేశ అటవీ సంపదను, ఖనిజాలను దోచుకుపోతున్నారన్నారు. ఆదివాసులు పోరాడి సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కి లక్షల కోట్ల విలువైన సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు నిరసనగా కార్మికుల సమ్మె

సింగరేణి బొగ్గు బావుల్లో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, బిఎంఎస్‌తో పాటు సింగరేణి గుర్తింపు సంఘం టిబిజికెఎస్ డిసెంబర్ 9 నుండి 11 వరకు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆరు జిల్లాల్లోని 25 భూగర్భ, 20 ఉపరితల బొగ్గు గనులతో పాటు, వాటి విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో మొత్తం ఉత్పత్తి నిలిచిపోయింది. అత్యవసర సేవల సిబ్బంది మినహా కార్మికులెవ్వరు విధులకు హాజరుకాలేదు. మంచిర్యాల జిల్లాలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులు, భూగర్భ గనులు, కార్యాలయాల్లో పనిచేస్తున్న దాదాపు 16 వేల మంది కార్మికులు; రామగుండం రీజియన్‌లోని మూడు ఒపిసి గనులు, ఏడు భూగర్భ గనుల్లో 12 వేల మంది కార్మికులు; భూపాలపల్లి ఏరియాలోని నాలుగు భూగర్భ, రెండు ఓపెన్‌కాస్ట్ గనుల్లోని 5,500 మంది కార్మికులంతా విధులకు హాజరుకాలేదు.

ముగిసిన అమరావతి రైతుల పాదయాత్ర

అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలన్న డిమాండ్‌తో అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గత 44 రోజులుగా అనేక అడ్డంకుల్ని అధిగమించి తుళ్లూరు నుంచి ప్రారంభించి తిరుపతిలోని అలిపిరి వద్ద ముగించారు. ఆఖరి రోజైన డిసెంబర్ 14న యాత్రకు మద్దతుగా తరలివచ్చిన వేలాదిజనంతో కలిసి అమరావతి రైతులు డిసెంబర్ 17న భారీ బహిరంగ సభను నిర్వహించారు.

భూ నిర్వాసితులపై పోలీసుల లాఠీ చార్జి

నష్టపరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టు పనులు చేయరాదంటూ పనుల్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులపై పోలీసులు లాఠీ చార్జి చేశారు. ఈ లాఠీ చార్జిలో నలుగురు భూ నిర్వాసితులకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్ట్ వద్ద ఘటన జరిగింది. ప్రాజెక్ట్ కట్ట పనులను కంట్రాక్టర్ పోలీసు బందోబస్తుతో డింసెంబర్ 23న ప్రారంభించగా నిర్వాసితులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. నిర్వాసితులను పంపించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో తమకు నష్టపరిహారం అందించాకే ప్రాజెక్ట్ పనులు కొనసాగించాలని అక్కడే నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు లాఠీ చార్జి చేశారు. వీ

పార్లమెంటులో ప్రవేశంపై ఆంక్షలు ఎత్తివేయాలి

పార్లమెంట్‌లో ప్రవేశంపై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని డిమాండు చేస్తూ డిసెంబర్ 2న పాత్రికేయులు ఢిల్లీలోని ప్రెస్ క్లబ్ వద్ద ఆందోళన చేశారు. పార్లమెంట్ సమావేశాల వార్తలను రాయనీయకుండా పూర్తిగా నిషేధించాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి నిబంధనలు పెట్టారని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం లాటరీ విధానంలో కొద్ది మందిని మాత్రమే ఎంపిక చేసి, అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. కరోనా పేరుతో ఈ ఆంక్షలు పెట్టారని, కానీ అది పాత్రికేయులను దూరంపెట్టే పరిస్థితికి దారితీసిందన్నారు. వివిధ శాఖల కార్యాలయాలకు కూడా వెళ్లనీయడం లేదన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాలులోకి వెళ్లడాన్ని పూర్తిగా నిషేధించారన్నారు. సినిమా హాళ్లు, మాల్స్ ప్రారంభానికి అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం పాత్రికేయులు పార్లమెంట్ భవనంలోకి వెళ్లడానికి ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు.

జంతర్ మంతర్ వద్ద మెహబూబా ముఫ్తీ ధర్నా

జమ్మూ కశ్మీర్ సమస్యలను దేశం దృష్టికి తేవాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ డిసెంబర్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేశారు. కశ్మీర్‌లో తనకు నిరసన తెలపడానికి కూడా అవకాశం ఇవ్వకపోవడంతో ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. “కశ్మీర్ మొత్తం జైలులా మారింది. అభిప్రాయాలు వెల్లడించడానికి ఎవరికీ అవకాశం ఇవ్వడం లేదు. అణచివేత విధానాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మాత్రం అంతా బాగుందంటూ ప్రచారం చేస్తోంది” అని విమర్శించారు. నాగాలాండ్‌లో సైన్యం అమాయకులను కాల్చిచంపితే బాధ్యులపై కేసులు పెట్టారని, కశ్మీర్‌లోనూ అలాంటివి చోటు చేసుకుంటున్నా పట్టించుకునేవారే లేరని అన్నారు. ఈ ‘దేశ ప్రజలంతా ఇప్పటికైనా మేల్కోకపోతే గాంధీ, అంబేద్కర్ భారతదేశం గాడ్సే దేశంగా మారిపోతుంది. అప్పుడు అందరం నిస్సహాయులుగా మిగిలి పోతాం” అని అన్నారు.

సైనిక బలగాల కాల్పుల్లో 14 మంది పౌరుల మృతి

ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌లో తిరుగుబాటుదారులుగా భావించి సామాన్య గని కూలీలపై భద్రత బలగాలు డిసెంబర్ 5న ఎటువంటి హెచ్చరికలు చేయకుండా కాల్పులు జరపడంతో ఆరుగురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. మరో 11 మంది గాయపడ్డారు. కూలీలు ఇళ్లకు చేరుకోక పోవడంతో వందల మంది గ్రామస్తులు వారిని వెతుకుతూ వెళ్లారు. కాల్పుల విషయం తెలవడంతో బలగాల చర్యకు ఆగ్రహించిన స్థానికులు బలగాలపై దాడి చేసి వాహనాలకు నిప్పుపెట్టారు. బలగాలు స్థానికులపై మళ్లీ కాల్పులు జరపడంతో ఏడుగురు స్థానికులు మృతిచెందారు. దాడిలో ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోగా మరికొంతమంది సిబ్బంది గాయపడ్డారు. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నాగాలాండ్ వ్యాప్తంగా పలు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనల్లో పాల్గొంటున్నారు. అమాయకులను కాల్చి చంపిన ఘటనలో న్యాయం జరిగే వరకు పోరాడతామని కోన్యాక్ గిరిజన తెగకు చెందిన సంఘాలు డిసెంబర్ 16న బంద్ పాటించాయి.

మతం మారితే కులాంతర వివాహ సర్టిఫికెట్‌కు అనర్హులు

మతం మారిన వారు కులాంతర వివాహ సర్టిఫికెట్లు పొందేందుకు అనర్హులని మద్రాసు హైకోర్టు తీర్పునిచ్చింది. ఇలా సర్టిఫికెట్లు జారీ చేస్తే అవి దుర్వినియోగమయ్యే అవకాశముందని స్పష్టం చేసింది. సేలం జిల్లా మేట్టూరు వ్యక్తి క్రైస్తవ ఆదిద్రావిడ వర్గానికి చెందిన పాల్‌రాజ్ గతంలో బిసి సర్టిఫికెట్ పొందారు. అయితే తాను అరుంధతీయ వర్గానికి చెందిన ఆముద యువతిని వివాహం చేసుకున్నందున తనకు కులాంతర వివాహ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ తహసీల్దార్ వద్ద దరఖాస్తు చేసుకోగా ఆయన తిరస్కరించారు. దీనిపై పాల్‌రాజ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సమ్మె

దేశంలోని రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రతిపాదనకు నిరసనగా డిసెంబర్ 16,17 దేశ వ్యాప్త సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపునిచ్చాయి. అందులో భాగంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు రెండు రోజులు బంద్‌లో పాల్గొనడంతో బ్యాంకులు మూతపడ్డాయి. దేశ వ్యాప్తంగా పది లక్షల మంది ఉద్యోగులు, అధికారులు సమ్మెలో పాల్గొన్నారు. ‘బ్యాంక్ బచావో, దేశ్ బచావో’ ‘ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపాలి’ అన్న నినాదాలు నిరసనల్లో మారుమోగాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బ్యాంకు ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. సమ్మె కారణంగా బ్యాంకు లావాదేవీలన్నీ స్థంబించాయి. ముంబై, గుజరాత్‌లలో భారీ ర్యాలీ నిర్వహించారు.

తమిళనాడులో కార్మికుల సమ్మె

తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ స్పెషల్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఫాక్స్‌కాన్, ఐఫోన్ తయారీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఎనిమిది మంది మహిళలు డిసెంబర్ 17న ప్లాంట్‌లోని క్యాంటీన్‌లో ఆహారం తిన్న తర్వాత ఫుడ్ పాయిజనింగ్‌తో మరణించారు. కంపెనీ యాజమాన్యం ఈ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించింది. దీంతో ఆగ్రహించిన వేలాది మంది కార్మికులు అదేరోజు అర్ధరాత్రి నుంచి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. కార్మికులు 2–3 చోట్ల నిరసనలు వ్యక్తంచేశారు. ఫాక్స్‌కాన్ మహిళా కార్మికుల్లో ఒకరు ఫుడ్ పాయిజనింగ్ కారణంగా చనిపోయారని పుకారు వ్యాపించిందని ది హిందూ నివేదించింది, దీనితో మహిళా కార్మికులు నిరసనకు దారితీసింది, జాతీయ రహదారిపై స్క్వాడ్ చేసి శ్రీపెరంబుదూర్‌లో ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు.

కశ్మీర్‌లో కార్మికుల సమ్మె

జమ్మూ కశ్మీర్‌లో ఉద్యోగులు గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. పవర్ గ్రిడ్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సమ్మెలో సుమారు 27000 మంది కార్మికులు పాల్గొన్నారు. మైనస్ డిగ్రీల టెంపరేచర్‌లో కశ్మీర్ ఉన్నప్పటికి ప్రజల మద్దతు ఈ సమ్మెకు పూర్తిగా ఉంది. భారత ప్రభుత్వం ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి సైన్యాన్ని దించింది. ఆర్మీ చేత ఎలక్ట్రిసిటీని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తోంది. సరిహద్దులను కాపాడాల్సిన సైన్యం కశ్మీర్‌లో పౌర జీవితంలోకి ఎలా చొచ్చుకొని పోతుందో చెప్పటానికి ఇంతకంటే ఉదాహరణ లేదు.

‘చట్టబద్ధంగా న్యాయం జరగదనే బాబ్రీ మసీదు కూల్చివేత’

అయోధ్య రామాలయ నిర్మాణం విషయంలో న్యాయ ప్రక్రియ ద్వారా వంచనకు గురవుతామని హిందూ సమాజం భావించడమే 1992లో బాబ్రీ మసీదు కూల్చివేతకు దారితీసిందని ఆర్ఎస్ఎస్ నేత అరుణ్‌కుమార్ అన్నారు. ఢిల్లీలో డిసెంబర్ 12న జరిగిన ‘సబ్‌కే రామ్’ పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. న్యాయ, చట్టపరమైన ప్రక్రియల్లో మోసపోతామని భావించడంతో 1992లో మేల్కొని తమ మనోభావాలను విస్మరించడం సాధ్యకాదని నిరూపించిందన్నారు. కాని సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్యలో రామాలయ నిర్మాణం జరుగుతోందన్నారు.

‘లఖింపూర్ ఖేరీ ఘటన ప్రణాళికాబద్ధ కుట్ర’

అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీలో జరిగిన హింసాకాండ ప్రణాళికా బద్ధమైన కుట్ర అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిగ్గుతేల్చింది. నిందితులపై చేసిన అభియోగాల్లో పేర్కొన్న కొన్ని ఐపిసి సెక్షన్‌లను మార్చాలని సిట్ సిఫారస్ చేసింది. ఈ మేరకు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌కు 14 డిసెంబర్‌న నివేదికను అందజేసింది. ఈ కేసు ధర్యాప్తులో పోలీసుల తీరును తప్పుపట్టింది. గతంలోనే సుప్రీంకోర్టు ప్రభుత్వ నిర్లిప్తతను నవంబర్ 8న ఎత్తిచూపింది. వీ

మయన్మార్‌లో ఆగని హత్యలు, ఆంగ్ సాన్ సూకీ జైలుశిక్ష

దేశం కోసం పదిహేనేళ్లు సైనిక నిర్బంధంలోనే గడిపిన మయన్మార్ సీనియర్ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీపై మయన్మార్ సైనిక ప్రభుత్వం మరోసారి ఆమెకు నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ సైన్యం ఆదీనంలోని ప్రత్యేక కోర్టు డిసెంబర్ 6న తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై విమర్శలు రావడంతో శిక్షను రెండేళ్లకు తగ్గిస్తున్నట్లు సైన్యం ప్రకటించింది. మయన్మార్ సైనిక ప్రభుత్వం తన ప్రజలను ఎంత క్రూరంగా అణచివేస్తోందో చాటి చెప్పే వీడియో తాజాగా వెలుగుచూసింది! డిసెంబర్ 7న సాంగేంగ్ ప్రాంతంలోని డన్ టావ్ గ్రామంపై సుమారు 50 మంది సైనికులు దాడిచేసి 11 మందిని పట్టుకుని, చేతులను వెనక్కు కట్టి, వారిని సజీవంగా దహనం చేశారు.

గణతంత్ర రాజ్యంగా బార్బడోస్

కరీబియన్ దీవుల్లో సంపన్న ద్వీప దేశమైన బార్బడోస్ వలస పాలన నుండి విముక్తి పొంది గణతంత్ర రాజ్యం (రిపబ్లిక్)గా అవతరించింది. మూడు లక్షల జనాభా కలిగిన ఈ చిన్న దేశం 1966లోనే బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటికీ కామన్వెల్త్ సభ్య దేశంగానే ఉంటూ బ్రిటన్ రాణి పట్ల విధేయతను ప్రకటిస్తూ వస్తోంది. గణతంత్ర రాజ్యంగా మారే క్రమం మూడు దశాబ్దాల క్రితమే ప్రారంభమైంది. డిసెంబర్ 7న 55వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంపూర్ణ గణతంత్ర రాజ్యంగా ప్రకటించుకుంది. బ్రిటన్ రాణికి విధేయత ప్రకటించడాన్ని అధికారికంగా నిలిపివేసింది. ప్రభుత్వ విభాగాల పేర్లలో ఉన్న రాయల్, క్రౌన్ వంటి పదాలను తొలగించింది.

బుర్కినా ఫాసో ప్రధాని క్రిస్టోఫ్ జోసెఫ్‌కు ఉద్వాసన

పశ్చిమాఫ్రికా దేశం బుర్కినా ఫాసో ప్రధానమంత్రి క్రిస్టోఫె జోసెఫ్ మారీ డబైర్ పదవీచ్యుతులయ్యారు. దేశంలో అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల దాడులను అడ్డుకోవడంలో విఫలమవుతున్నందుకు గాను ప్రధాని పదవి నుంచి ఆయన్ను దేశాధ్యక్షుడు రోచ్ మార్క్ క్రిస్టియన్ కబోర్ తొలగించారు. 2019లో జోసెఫ్ ప్రధానిగా ఎన్నికయ్యారు.

అమెరికాకు అసాంజే అప్పగింత

వికీలీక్స్ మీడియా వెబ్ సైట్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజే (50)ను బ్రిటన్ అమెరికాకు అప్పగించవచ్చని లండన్ హైకోర్టు డిసెంబర్ 11న తీర్పునిచ్చింది. మానసిక స్థితి సరిగాలేని అసాంజేను అమెరికాకు అప్పగించరాదని కింది కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును – ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 2010–11 మధ్యకాలంలో తమ సైన్యానికి, ప్రభుత్వ ప్రతినిధులకు చెందిన వేలాది దస్తావేజులను తన వెబ్ సైట్ ద్వారా బహిర్గతం చేసిన అసాంజేను అప్పగించాలని అమెరికా ఎప్పటినుంచో కోరుతోంది. ఒకవేళ అమెరికాకు అప్పగిస్తే.. ఆ దేశంలో 17 గూఢచర్య అభియోగాలు, కంప్యూటర్ దుర్వినియోగం చేశారన్న మరో అభియోగం ఎదుర్కొంటున్న అసాంజేకు జైలుశిక్ష విధించే అవకాశముంది.

రష్యాకు జి7 దేశాల హెచ్చరిక

ఉక్రెయిన్ సరిహద్దులో మోహరించిన సైన్య బలగాలను ఉపసంహరించుకోవాలని, అలా చేయకపోతే మాస్కోపై తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధిస్తామంటూ జి–7 దేశాల కూటమి రష్యాను హెచ్చరించింది. అమెరికా, బ్రిటన్‌తో పాటు మిగతా గ్రూప్ ఆఫ్ సెవెన్ దేశాల విదేశాంగ శాఖ మంత్రులు యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల చీఫ్‌తో కలిసి డిసెంబర్ 12న ఈ ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ దిశగా రష్యా మిలటరీ బలగాల దుందుడుకు చర్యలను తామంతా ఖండిస్తున్నామన్నారు. రష్యా ఉక్రెయిన్‌పై దాడులు మానుకొని దౌత్యపరమైన మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సైనిక చర్యల విషయంలో పారదర్శకత పాటించేలా అంతర్జాతీయంగా చేసుకున్న కట్టుబాట్లకు కట్టుబడి ఉండాలని కోరారు.

చైనా పై అమెరికా ఆంక్షలు

యుగుర్ ముస్లింలపై చైనా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతుందని అమెరికా ఆరోపించింది. చైనాకు చెందిన బయోటెక్, నిఘా కంపెనీలు, ప్రభుత్వ సంస్థలపై తాజాగా ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో ఆ సంస్థలకు లైసెన్స్ లేకుండా ఎలాంటి వస్తువులను అమెరికా కంపెనీలు అమ్మకూడదు. చైనా సైన్యానికి మద్దతుగా బయోటెక్నాలజీని ఉపయోగిస్తున్న చైనా అకాడమీ ఆఫ్ మిలిటరీ మెడికల్, సైన్సెస్ దానికి సంబంధించిన 11 పరిశోధన సంస్థలను అమెరికా వాణిజ్య శాఖ లక్ష్యంగా చేసుకుంటోంది. 'బయోటెక్ వైద్య ఆవిష్కరణలను ప్రజలపై నియంత్రణ, మతపరమైన మైనారిటీల అణచివేతకు చైనా ఉపయోగిస్తోంది' అని అమెరికా వాణిజ్య శాక సెక్రెటరీ గినా రైమాండో ఒక ప్రకటనలో తెలిపారు. షింజియాంగ్ ప్రాంతంలోని ప్రజలతో చైనా బలవంతంగా పనిచేయించుకుంటుందనే కారణంతో అమెరికా షింజియా నుంచి తమ దేశానికి దిగుమతులను నిషేధిస్తూ తీసుకొచ్చిన బిల్లుకు సెనేట్ డిసెంబర్ 15న ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది.

చిలే నూతన అధ్యక్షుడిగా గాబ్రియెల్ బొరిక్

చిలే అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి గాబ్రియెల్ బొరిక్(35) గెలుపొందారు. లాటిన్ అమెరికాలో చిన్న వయస్సులోనే దేశ అత్యున్నత బాధ్యతల్లోకి వచ్చిన రెండవ వ్యక్తిగా నిలిచారు. మొత్తం 56 శాతం ఓట్లు పోలవగా, గాబ్రియెల్ తన ప్రత్యర్థి జోస్ ఆంటానియో కాస్ట్ కన్నా 10 పాయింట్లు ఎక్కువ తేడాతో విజయం సాధించారు. యువకుడు, అనుభవం లేని వ్యక్తిని ఎన్నుకుంటే ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని ప్రత్యర్థులు ఎంతగా ప్రచారం చేసినా ఫలితం లేకపోయింది. చిలే నియంత పినోషెట్ అమలు చేసిన ప్రైవేట్ పెన్షన్ వ్యవస్థను రద్దు చేస్తానని హామీ ఇచ్చారు. మన హక్కులు, హక్కులుగానే గౌరవింపబడాలి కానీ వినిమయ వస్తువుల్లా లేదా వ్యాపారంలా చూడరాదని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి కృషి చేస్తానని చెప్పారు. న్యాయం, సమానత్వంతో కూడినదిగా తన పాలన ఉంటుందని హామీ ఇచ్చారు. కనీస వేతనాలు పెంచడం, విద్య, ఆరోగ్య సంరక్షణకు అయ్యే వ్యయాన్ని తగ్గించడం, సామాజిక భద్రతా వ్యవస్థను విస్తరించడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా అసమానతలను తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఆఫ్ఘనిస్తాన్ మహిళల పోరుబాట

విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆఫ్ఘనిస్తాన్ మహిళలు రాజధాని కాబూల్‌లో డిసెంబర్ 16న భారీ ప్రదర్శన నిర్వహించారు. బహిరంగంగా నిరసనలు తెలియజేయడాన్ని తాలిబాన్లు నిషేధించినప్పటికీ ప్రదర్శనకు అధికారులు అనుమతి ఇచ్చారు. 'ఆహారం, కేరీర్, స్వేచ్ఛ' కావాలంటూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. రాజకీయ ప్రాతినిధ్యం కూడా కావాలంటూ మహిళలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా తాలిబాన్లపై వస్తున్న ఫిర్యాదుల్ని కూడా కొంతమంది ప్లకార్డులపై ప్రదర్శించారు.

160 మంది వలసదారుల జలసమాధి

లిబియాలోని మధ్యధరా సముద్రంలో రెండు పడవలు ప్రమాదవశాత్తు మునిగిపోవడంతో 160 మంది చనిపోయారని ఐక్యరాజ్యసమితిలోని వలసదారుల విభాగం అధికార ప్రతినిధి సఫా సెహ్లి పేర్కొన్నారు. ఈ రెండు ప్రమాదాలు గత వారం రోజుల్లోనే జరిగాయన్నారు. మృతులు ఐరోపాకు అక్రమంగా వలసపోతున్నవారని తెలిపారు. చెక్క, రబ్బర్ పడవల్లో ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురయిన వారు ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 1500 మంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు 12 వేల మందిని భద్రతా సిబ్బంది లిబియాకు తీసుకొచ్చారని చెప్పారు. ఆఫ్రికా, మధ్య ప్రాశ్చంలో యుద్ధాలు, పేదరికం వల్ల వలసపోతున్న వారికి లిబియా ప్రధాన కేంద్రంగా మారిందన్నారు.

వీ

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 242 - January 2022 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/12/2021 • Postal Regn. No. HD/1100/2020-22

If undelivered please return to:

VEEKSHANAM

Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 73307 95849

To:
Mr./Mrs.______________________________

____

____

____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at NAVYA PRINTERS, 2-3-655/C/16/B, Durga Nagar, Amberpet, Hyderabad -500013 (New Declaration filed) for Charitha Impressions (as per RNI records) and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao